cp03 ఖ 107

హాస్యతోరణము

సంపాదకులు

శ్రీ పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

4C
8278
4C



894.8274
S 45

ప్రచురణ

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
కళాభవన్ - సైఫాబాదు,
హైదరాబాదు-4

BLANK PAGE

CP03Q107

A

హాస్యకథలు

సంపాదకులు

శ్రీ పోలాప్రగడ సత్యనారాయణమూర్తి



ప్రచురణ

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
కళాభవన్ - సైఫాబాదు,
హైదరాబాదు-4

B

HASYA THORANAMU - 41 Telugu Humorous essays collected and edited by Sri Polapragada Satyanarayana Murthy, Lecturer, College of Arts and Sciences, Bapatla, Guntur Dist., A.P.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

హైదరాబాదు-500 004

ప్రచురణ : 328

ప్రథమ ముద్రణ : 1982

ప్రతులు : 2,000

వెల : 6-00

ప్రతులకు :

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

కళాభవన్, సైఫాబాద్, హైదరాబాదు-500 004

ముద్రణ :

వేద్ధ్రావతీ ఆర్ట్ ప్రింటర్స్,

హైదర్‌గూడ, హైదరాబాదు.

Paper used for the Printing of this book was made available by the Government of India at Concessional rate.

తొలిపలుకు

మనిషి ద్రనందిన జీవితంలో హాస్యం ఏదైనా ఒక సమస్యకు పరిష్కారం చూపిస్తుందని చెప్పలేము. కాని అది నిర్వహించే భూమిక మనిషి మనస్సును తేలికగాను, తేటగాను ఉంచడంలో ఆలంబనం అవుతుంది. ప్రాజ్ఞుణి, సంస్కృత మనస్కుణ్ణి సంతోషపెట్టగలిగే హాస్యం ఉత్తమమైన హాస్యం అనిపించుకుంటుంది. "A Smile is the perfection of the laughter" అన్నాడొక మనీషి. మందహాసానికీ, అపహాస్యానికీ భేదం తెలుసుకున్నవాడు హాస్యం రూపు రేఖల అంచనా కట్టగలుగుతాడు. అందుకే మనకు మహా కావ్యాలలో హాస్యం అరుదుగా కనిపిస్తుంది. అచ్చమైన కవిత్వం వంటిదే అచ్చమైన హాస్యం. ఈ రెండూ అరుదే. ఎంతో గుండె నిబ్బరం ఉన్నవాడు, ఎంతో ప్రపంచ జ్ఞానం ఉన్నవాడు, మానవ జీవితసాగరంలోని లోతులు చూడగలిగినవాడు, రసస్వరూపంతో తలస్పర్శి పరిచయం ఉన్నవాడు హాస్యరసాన్ని సృష్టించగలుగుతాడు. బ్రతుకుల తీరుతెన్నుల్లో లేని హాస్యం సాహిత్యంలోకి ఎలా పస్తుంది? తెలుగు సాహిత్యంలో హాస్యం అరుదు అనుకున్నవాళ్ళు తెలుగుల జీవితంలో ఎంతపర. కుందో కొంత పరామర్శిస్తే బాగుంటుంది. వికటార్థాలు, వికారచేష్టలు. ఇతరుల మనస్సులు నొచ్చే మాటలు తీసేస్తే ఇక నవ్వు ఎక్కడ నుంచి వస్తుంది? అని హాస్యాన్ని అపార్థం చేసుకున్నవాళ్ళ మనస్సు గుబుర్లలోని చీకటి ప్రశ్నలకు సమాధానం ఈ "హాస్య తోరణం". ఇంతకుముందు శ్రీ పోలాప్రగడ సత్యనారాయణమూర్తిగారే "వ్యాస తోరణం" అనే హాస్యరసభరిత వ్యాసాలను ఏర్చికూర్చి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో ప్రచురించినప్పు, తెలుగుదేశం హర్షోత్ఫుల్ల హృదయంతో ఆ 'వ్యాస తోరణా'న్ని అందుకొన్నది. అకాడమీ వేసిన ప్రతులన్నీ తెలుగు లోగిళ్ళలో నవ్వులు పంచిపెడుతున్నాయి. తెలుగుదేశం ఇచ్చిన ఈ ప్రోత్సాహాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్

సాహిత్య అకాడమి మరికొన్ని హాస్య రసాత్మకమైన వ్యాసాలను ప్రచురించాలని, శ్రీ పోలాప్రగడ సత్యనారాయణమూర్తిగారే సంపాదకత్వం వహించి నవ్వులను అందించే మరికొన్ని వ్యాసాలను సేకరించాలని నిర్ణయించింది. శ్రీ సత్యనారాయణ మూర్తిగారు చాలా శ్రద్ధతో ఈ 41 హాస్య వ్యాసాలను "హాస్య తోరణము"గా మలచి అందించినారు. ఇందులో నిన్నటి నేటి తరాల రచయితల వ్యాసాలు చోటు చేసుకొన్నవి. ఆయా వ్యాసాలు ఏ పత్రికల నుంచి, ఏ పుస్తకాలనుంచి తాము ఉద్ధరించినారో శ్రీ పోలాప్రగడవారు గ్రంథాంతంలో తెలిపినారు. ఈ వ్యాస రచయితలలో కొందరు ఇప్పుడు మన మధ్య లేరు. కొందరింకా ఆనంద సరిత్తులను ప్రవహింపజేస్తూనే ఉన్నారు. ఆయా రచయితలకు, ఆయా ప్రచురణ కర్తలకు మా అభివందనాలు. వారి సౌజన్యానికి మా కృతజ్ఞతలు.

హైదరాబాదు నగరంలోని అతిప్రాచీనమైన వేమనాంధ్ర భాషా నిలయం వాటి సహకారం, కొన్ని వ్యాసాలను సేకరించడంలో మాకు లభించింది. ఆ గ్రంథాలయ నిర్వాహకులకు మా కృతజ్ఞతలు.

తెలుగు దేశంలోని అన్ని ప్రాంతాల వ్యాసాలకు ప్రాతినిధ్యం ఈ సంకలనంలో ఉండాలని శ్రీ దేవులపల్లి రామానుజరావు గారు సంపాదకులకు సముచితమైన సలహాలను అందించినారు. వారికి నమస్సులు.

వేమనాంధ్ర భాషానిలయంలోని పాతపత్రికలలోని వ్యాసాలను ఉద్ధరించడంలో శ్రీ డి. రామలింగం గారు చాలా శ్రద్ధ వహించినారు. ఆయనకు మా కృతజ్ఞతలు.

శ్రీ పోలాప్రగడ సత్యనారాయణమూర్తిగారికి అకాడమి పక్షాన ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

హైదరాబాదు
తేదీ: 17-3-1983

ఇరివెంటి కృష్ణమూర్తి
కార్యదర్శి

విషయసూచిక

నవ్వుల మెట్లు (సంపాదకుని మున్ముది) ... i

1. పశువుల సంత – స్వప్నము

శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావు ... 1

2. భామనే సత్యభామనే :

శ్రీ దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి : ... 9

3. సినిండ్రీ పత్రిక

శ్రీ నందివాడ చిదంబరము ... 15

4. రంగస్థలంపై సమయస్ఫూర్తి

శ్రీ స్థానం నరసింహారావు ... 24

5. బలరామయ్యగారి ఇంగ్లీషు తమ్ముడు

శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు ... 29

6. ప్రౌఢ సరస్వతి - కుమారస్వామి

శ్రీ సురవరము ప్రతాపరెడ్డి ... 35

7. వారాంగనా వీరాంగణము

శ్రీ చిదిరెమఠము వీరభద్ర శర్మ ... 40

8. యశో విమానం

శ్రీ 'విశ్వామిత్రుడు' ... 46

9. నాకా షష్టిపూర్తి :

శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య ... 62

10. పన్నిండు జల్లు

? ? ? ... 67

11. ధనార్జనకి దగ్గర మార్గం
శ్రీ మొక్కపాటి నరసింహ శాస్త్రి ... 73

12. సాహిత్య రచన
శ్రీ కె. కె. రాజు ... 79

13. హాస్య రచనలో సాధక బాధకాలు
శ్రీ నిరంజన్ ... 86

14. యాత్రా స్పెషల్స్
శ్రీ శిల్పశ్రీ ... 93

15. ఉపాధ్యాయ ఉవాచ
శ్రీ మునిమాణిక్యం నరసింహారావు ... 97

16. బ్రహ్మచారి లిమిటెడ్
శ్రీ బృహస్పతి ... 115

17. కృష్ణాపత్రికా దర్బార్
శ్రీ చెఱుకువాడ వెంకట నరసింహం ... 119

18. న్యూ సిలబస్
శ్రీ దేవరకొండ బాలగంగాధర తిలక్ ... 133

19. తుమ్మెదా ఒకసారి ...
శ్రీ తురగా కృష్ణమోహనరావు ... 136

20. నడీజలములు
శ్రీ అనంతం ... 146

21. అమ్మకడుపు చల్లగా అత్తకడుపు చల్లగా
శ్రీమతి పురాణం సీత ... 154

22. అచ్చు కందూతి
శ్రీ గో(పా)ల చక్రవర్తి ... 159

23. పతిదేవుడూ - పనిమనిషి
శ్రీ పోలాప్రగడ సత్యనారాయణమూర్తి ... 163

24. ఓటు దండకము

గోల్కొండ పత్రిక సంపాదకులు ... 172

25. ఇదీ ఒక కథే - పేరులు దారులు గుర్తుంచుకోటం

శ్రీమతి నందగిరి ఇందిరాదేవి ... 174

26. పనిలేని న్యాయవాది

శ్రీ ఓ. సీతారామచంద్రరావు ... 182

27. వదలవలసిన తెలుగుతనం

శ్రీ సోమంచి యజ్ఞన్న శాస్త్రి ... 195

28. కాబోయ్ ! వైజాగ్ సిటీబస్సులు –

శ్రీ వీరాజీ ... 201

29. వింతలూ ! వికారాలూ !

శ్రీ రావి కొండలరావు ... 204

30 హలో ఓ ఫైవుందా ?

శ్రీ ముళ్లపూడి వెంకటరమణ ... 211

31. ఎక్కడ ? నటరాజెక్కడ ?

శ్రీ ఆదివిష్ణు ... 216

32. వాపూ ఒక బలుపే !

డాక్టర్ పోరంకి దక్షిణామూర్తి ... 220

33. ముడిపడని పేర్లు

శ్రీ నీలా జంగయ్య ... 224

34. పాపం ... మగవాళ్లు !

శ్రీమతి పోలాప్రగడ రాజ్యలక్ష్మి ... 227

35. బడ్జెట్ ప్రతిపాదన

శ్రీ గొల్లపూడి మారుతీరావు ... 231

36. ప్రముఖుల ప్రేమలేఖలు :
శ్రీ శ్రీరమణ ... 235

37. చలవ మిఠియాలు
రేడియో ... 242

38. కొత్త నాటకం
శ్రీ తంబు ... 243

39. చిల్లర దేవుళ్ల సభ
శ్రీ పన్నాల సుబ్రహ్మణ్యా భట్టు ... 248

40. వార్ధక్యానికి సాధకం
శ్రీ పుచ్చా పూర్ణానందం ... 253

41. హాస్యరసం
డా. నండూరి రామకృష్ణమాచార్య ... 260

సూచిక 261

1

నవ్వుల పొట్లు....

'హాసము' అనే పదానికి 'నవ్వు' అని అర్థం. హాసాన్ని కలిగించేది కనుక హాస్యం. మేలము, చతురు, చమత్కారము, వాచికము, పరిహాసము, ఎక సక్కెము వంటి పర్యాయ పదాలెన్ని ఉన్నా హాసము అనే మాటనే తరుచు వాడుతూ ఉంటాము. ధనంజయుడు తన ఆలంకారిక గ్రంథంలో–

స్మిత మిహ వికసిత నయనం
కించి ల్లక్ష్య ద్విజంతు హసితం
స్యాత్ మధురస్వరం విహసితం
సశిరః కంప మిద ముపహసితం
అపహసితం సాశ్రాక్షం
విక్షిప్తాంగం భవత్యతి హసితం-

అంటూ హాసము ఆరు రకాలంటూ పేర్కొన్నాడు. వీటిలో స్మితం, హసితం మాత్రమే ఉత్తమమైనవనీ, తక్కినవి ఉత్తరోత్తరం పరిహరణీయాలనీ సూచించాడు.

'సహృదయుడూ, విజ్ఞుడూ, దయామయుడూ, నాగరికుడూ అయిన వ్యక్తిని నవ్వించేదే ఉత్తమమైన హాస్యం' అని పాశ్చాత్య పండితుడు 'బర్గ్‌సన్' అన్నాడు. అంటే, తద్భిన్నమైనది ఉత్తమ హాస్యం కానేరదు అని అర్థం. అనగా అపహేళన చేసేదీ, ఇతరుల మనస్సుల్ని నొప్పించేదీ. కొంచరికైనా ఇబ్బందినీ మానసిక క్లేశాన్నీ కలిగించేదీ, నీచ హేయ విషయ సంబంధీ అయిన హాస్యం ఉత్తమశ్రేణిది కాదు అని తాత్పర్యం. నవ్వడం అయిపోయిన తర్వాత అది చేసిన గాయం కానీ, దాని తాలూకు మచ్చ కానీ ఏమీ ఉండకూడదని రస

జ్ఞుల మతం. ఒక వ్యక్తిని ఉద్దేశించి నవ్వకూడదు. ఒకవేళ నవ్వినా, ఆ వ్యక్తి కూడా మనతో కలిసి కడుపారా నవ్వితే, స్వపర భేదం లేకుండా సలుగురూ తలుచుకు తలుచుకుని నవ్వగలిగితే, అది ఆరోగ్యకరమైన హాస్యం అన్నమాట!

అసలు మనిషి ఎందుకు, ఏ పరిస్థితిలో నవ్వుతాడు? సహజత్వానికి భిన్నమైన వికారము కాని, వైపరీత్యము కాని నవ్వు పుట్టిస్తుంది. అలాగే విపరీతాలంకారము, వికృతాచార అభిదానవేషములు, అంగవికారములు- వీటివలన కూడా నవ్వు వస్తుంది. ఓ సందర్భంలో అనుకరణ వలన హాస్యం ఉద్భవిస్తే, మరో సందర్భంలో విరుద్ధమైన పలుకుబడీ, ఉచ్చరించే విధానమూ కూడా హాస్యానికి కారణాలవుతాయి.

వైరుధ్యాభావ అస్వాభావిక ఆకస్మిక సంభవాలు, హాస్యరసోత్పత్తి కారకములు అని ఆలంకారికుల మతం.

లాక్షణికులు శబ్ద భావ అర్థముల ననుసరించి హాస్యాన్ని మూడు భాగాలుగా విభజించారు.

శబ్దగతమైన హాస్యం, అసభ్య సపద ప్రయోగం వలనా, (ఉ॥ నిన్ను చచ్చిన గుఱ్ఱం ఇవాళ పచ్చింది), నిరర్థక పదప్రయోగ మూలకంగానూ (ఉ॥ ఆటవెలది ద్విపదక తగారు), ఆడంబర పదరచన వలనా (ఉ॥ పాదరక్షా పరీక్షా పాండిత్యం), అనర్థకమైన మాటల్ని ఉపయోగించడం ద్వారాను (ఉ॥ ఆయన ఉపన్యాసం భారవేరంగా ఉంది), అసంబద్ధ ప్రలాపం కారణంగానూ (ఉ॥ ఓ పిచ్చివాడు 'దేవుడు నన్ను చేతులతో సృష్టించాడు' అంటే, వెంటనే మరో పిచ్చివాడు నేనెప్పుడన్నాను రా ఆ మాట అని అరవడం) జనిస్తుంది. అయితే ఈ రకమైన హాస్యంలో కాంతీ, వికాసమూ తక్కువ.

భావాశ్రయమైన హాస్యం దీనికంటె రమణీయమైంది. రసాభాస (ఉ॥ ఉత్తరకుమార ప్రజ్ఞలు), హేత్వాభాస (ఉ॥ ఇట్లు చెలగవే అన్న ప్రశ్నకి,

ఎండాకాలం గదండీ అని జవాబియ్యడం) భావా భాస (ఉ॥ ఇంతకీ నువ్వేనువ్వా, మీ అన్నయ్యేనా?) మొదలైన ఆభాసలని ఆశ్రయించి ఉంటుంది ఈ రకమైన హాస్యం.

అర్థ సంబంధి అయిన హాస్యం ఈ రెండింటి కంటే ఉత్తమమైంది. అది మళ్ళీ శక్తి మూలమనీ, యుక్తి మూలమనీ రెండు రకాలు. ఎత్తిపొడుపు (Irony), అధిక్షేపము (Satire), అపహాస్యము (Mockery) అనే మార్గాల్లో మొదటిరకం హాస్యం కనిపిస్తే, సరసోక్తి, ఛలోక్తి, నర్మోక్తి, వక్రోక్తి వంటి యుక్తులను ఆధారంగా చేసికొని రెండోరకమైన అర్థగత హాస్యం లాస్యం చేస్తుంది.

ఇలా త్రిమూర్త్యాత్మక రూపంలో కనిపించే అనింద్యరమణీయమైన హాస్యాన్ని సృష్టించడం ఎలా కొందరికి మాత్రమే సాధ్యమో, దాన్ని ఆస్వాదించడం కూడా అలాగే కొద్దిమందికి మాత్రమే తెలుస్తుంది. లలితమైన హాస్యాన్ని సృష్టించడానికీ, దాన్ని అర్థం చేసుకుని ఆనందించడానికీ, కర్తకీ భోక్తకీ ఇద్దరికీ కూడా నిశితదృష్టీ, భావయిత్రీ, సంస్కారమూ ఎంతో అవసరము. ఇద్దరూ ప్రతిభావంతులే అయి ఉండాలి. మానవ స్వభావంపట్లా, విపరీత మానవ ప్రకృతి పట్లా సానుభూతి ఉండాలి ఇద్దరికీ. అన్నింటికంటే ముఖ్యం, హాస్యరసానుగుణమైన మనః ప్రవృత్తి ఉండాలి.

ఆత్మ వికాసం కలిగించే హాస్యాన్ని సృష్టించాలంటే, రచయితకి ప్రతిభా పాండిత్యం ఉంటే చాలదు. ఒక విలక్షణమైన వికృతి దర్శనం కూడా అవసరం. హాస్యశీలుడైన వ్యక్తి ఒక చక్కని హాస్యకల్పన చెయ్యాలంటే వక్ర దృష్టి ముఖ్యం. అందరి కంటే భిన్నంగా తను మరో కోణంనుంచి చూడగలిగే నేర్పరి కావాలి. సిద్ధహస్తుడైతే తప్ప హాస్యరస పోషణ చెయ్యలేడు. హాస్యరసం అన్ని రసాల లాంటిది కాదు. బహుసున్నితమైంది. కత్తిమీద సాములా నడపాలి హాస్యరసాన్ని. మోతాదు తగ్గితే నవ్వురాదు. హెచ్చితే వెగటు పుట్టించి అపహాస్యం అయి ఊరుకుంటుంది. వీటన్నింటికి తోడు భాషలో ఉండే ఒడుపూ, ఊపూ, పలుకుబడీ, క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలి.

నందస్వరూపుడైన ఈశ్వరుడు, తన చిద్విలాసానికి మరో రూపంగా ఈ సృష్టిని చేసి, అందులో నవ్వగలిగిన ఒకే ఒక ప్రాణిని సృష్టించాడు. సర్వ చరాచర ప్రపంచంలోనూ నవ్వగలిగిన జీవి ఒక్క మానవుడే! నవ్వడం తమ దర్జాకి ఎక్కడ లోపమో అని కొందరు మానేస్తే, పాపం వారు అపురూపమైన ఆ వరాన్ని వదులుకుంటున్నారన్నమాట. 'అతడు నవ్వడు' అంటే అతనికేదో జబ్బు ఉందని అర్థం.

హాస్యాన్ని ఆస్వాదించలేని మనిషి బతుకు దుర్భరం, హాస్యప్రియత్వం మృగ్యం అయిన జాతి జీవనం భయంకరమూను.

ఒక వ్యక్తి జీవితంలో కాని, ఒక జాతి చరిత్రలో కాని ఎన్నో ఒడిదుడుకులు రావచ్చు. ఆశ నిరాశల చెలగాటంలో చిక్కుకుపోవడం, అదృష్టం వచ్చినప్పుడు పొంగిపోవడం, దురదృష్టం ఎదురైనప్పుడు క్రుంగిపోవడం జరగవచ్చు. దీనికితోడు ఒక్కొక్కప్పుడు అజ్ఞానం వల్లో అహంకారం వల్లో ఆత్మవినాశకరమైన అపమార్గానబడి వర్తమానాన్ని నాశనం చేసుకుని భవిష్యత్తుని భయభ్రాంత మొనర్చుకొనే ప్రమాదం ఉంది. అలాంటి సమయాల్లో హితోపదేశాలూ, హితబోధలూ, ఆంక్షలూ ఆరళ్ళూ, హెచ్చరికలూ శాసనాలూ ఇవేవీ పని చెయ్యవు. అవన్నీ నిరర్థకాలూ, నిరుపయోగాలూ అవుతాయి. ఒక్క మనిషేకాదు, మొత్తం జాతినే పతనావస్థ నుంచి తప్పించి మంచి మార్గానికి మరలించ గలిగేదీ, ప్రమాదం నుంచి రక్షించి ఆనందాన్ని ఆరోగ్యాన్ని అందించి జవాన్ని జీవాన్ని ఇవ్వగలిగేది హాస్యం మాత్రమే. స్వెట్టేటర్, పేట్రర్ వ్యాసాల ద్వారా ఎడిసన్, స్టీలువంటి హాస్య రచయితలు, దయనీయమైన స్థితిలో ఉన్న ఆంగ్లేయ సమాజాన్ని అలాగే సముద్ధరించారు- సంస్కరించారు- చక్కదిద్దారు.

హాస్యంలో మనస్సుకి వికాసం కలిగించే జీవశక్తి ఉంది. హాస్యం వల్ల మానసికమైన పరిణతులు తగ్గి, మనుగడ సుఖప్రదం అవుతుంది. తనలోని

లోపాల్ని గమనించి నవ్వుకుని ఎప్పటికప్పుడు క్షాళితం చేసుకుంటూ ఉన్నతంగానూ నవనవోన్మేషంగానూ ఎదగాలంటే, హాస్యాన్ని మించిన టానిక్ లేదు. నవ్వే మనఃప్రవృత్తి ఉండి, తనలోని లోపాల్ని అవహేళన చేసుకోగల సత్తా ఉంటే, ఆ జాతికి చ్యుతి లేదు. హాస్యప్రియత్వం ఉన్న వ్యక్తి తాను హాయిగా జీవించి తన చుట్టూ ఉన్న మనుష్యులకి హాస్య పరిమళాలు పంచి వారి బ్రతుకుల్ని నందన వనాల్ని చేస్తాడు.

ప్రపంచంలో హాస్యప్రియత్వం ఉన్న ప్రజల్లో ముఖ్యంగా పేర్కొనదగిన వారు ఫ్రెంచివారూ, ఆంగ్లేయులూ, అమెరికన్‌లూను. వారి సాహిత్యాల్లో హాస్యానికి సముచితస్థానం ఉంది. జెరూం, జేకబ్, కేసిన్, హౌపర్డ్, వుడ్ హౌస్, క్రేఫోర్డ్, ఎన్ ఇు సే, మోలియర్, డికెన్స్, మార్క్-ట్వెయిన్, లీకాక్ పంచి హాస్య రచయితలు తమ తమ వాజ్మయాల్ని అత్యుత్తమ హాస్యరచనలతో సుసంపన్నం చేశారు.

ఎందువల్లనో ప్రాచ్యపండితుల దృష్టిలో మొదటి నుంచీ హాస్యరసం పట్ల చులకన భావన ఉంటూవచ్చింది. 'సగం చచ్చి సంగీతం, అంతా చచ్చి హాస్యం' అనే నానుడి ప్రచలితంగా ఉండేదేమో, తక్కిన ఎనిమిది రసాలకీ ఇచ్చిన ప్రాధాన్యతని సంస్కృత కవులు గాని, ఆలంకారికులు కాని హాస్యరసానికి ఇవ్వ లేదు. ''హాస్యరసంలో ఏం ఉంది, సిల్లీ విషయాన్ని సీరియస్‌గా చెప్పడమే కదా'' అనుకున్నారో ఏమో. మృచ్ఛకటికం లాంటి ఏ ఒకటి రెండు గ్రంథాల్లోనో తప్ప మరి యే యితర సంస్కృత రచనలోనూ హాస్యం కనిపించదు. అక్కడక్కడ తటిల్లతలా హాస్యం ఛాయ గోచరించినా, అది కేవలం నాసి రక మైన హాస్యమే. వెకిలితనంతో కూడినదీ, తిండిపోతు అయిన విదూషకుని వంటి పాత్రను ఆశ్రయించుకొని పర్ధిల్లినదీను. ఆ హాస్యం కేవలం వికృత వేషం, వికారపు చేష్ట, విరుద్ధమైన భాష- వీనిపలన జనించేదే. ఇలా ఆరోగ్యకరమైన హాస్యం సంస్కృతంలో లేకపోయేసరికి భారతీయ భాషలన్నింటిలోనూ అదే పరిస్థితి తయారయింది.

తెలుగు వారి రచనల్లోనూ, వారి కావ్యాల్లోనూ కూడా హాస్యం కొరవడ్డానికి అదే కారణం- సాంప్రదాయ దాస్యం. మొన్న మొన్నటి వరకూ తెలుగు కవికి సంస్కృత కావ్యాలూ, తద్రచనా మార్గాలూ- ఇవే కదా అవశ్య శిరోధార్యాలు!

సగటు తెలుగు మనిషికి హాస్యప్రియత్వం లేదనలేము. అనాదిగా బావా మరదళ్ళ సంభాషణల్లోనూ, మేనత్త మేనమామ పిల్లలు మేలమాడుకోవడంలోనూ, వియ్యాలవారి ఒయ్యారాల్లోనూ, పదినా మరదళ్ళు పాడుకొనే పాటల్లోనూ, పెళ్ళి పేరంటాలలోను, పల్లెటూళ్ళల్లో పళ్ళు విరుచుకొనే పండుగ పబ్బాల్లోనూ, పంట చేలల్లో పనిచేసే పడుచు కత్తెల పరువంపు పాటల్లోనూ హాస్యం లాస్యం చేస్తూనే ఉంది. శతాబ్దాల నుంచి తెలుగు వారిని అలరిస్తూన్న తెనాలి రామలింగని కథలూ, పరమానందయ్య శిష్యుల కథలూ తెలుగు వాడి హాస్యప్రియత్వానికి జయపతాకలు.

ఇంతటి హాస్య సమృద్ధి, తెలుగువాని జీవితంలోనే కాని, సాహిత్యంలోనూ కావ్యాల్లోనూ మచ్చునకేనా కనిపించదు. నవ్వు నాలుగందాల చేటు అనే మాటే మనస్సులో నాటిందో, హాస్యం రాస్తే మరీ తేలికయి పోతాం అని అర్థం లేని అనుమానమే బయలుదేరిందో, మాతృక అయిన సంస్కృతంలో లేనిది మనకెందుకు అనే ఉదాసీన భావమే ప్రబలిందో, 'శరదిందు వికాస మందహాసాం' అంటూ ఆంధ్ర సరస్వతిని హాసమూర్తిగా దర్శించిన ఆంధ్రకవి, ఆ మందహాస లోచనుల్ని మాత్రం తన రచనల్లోకి రానివ్వకుండా దూరంగా ఉంచాడు.

ఈ వాదానికి అపవాదగా పాల్కురికి సోమన, పింగళి సూరన, చేమకూర వెంకటలు, కొంతలో కొంత మనస్సుని ఆహ్లాదపరచి రసజ్ఞుల పెదవులపై చిరునవ్వులు వెలిగించే హాస్యాన్ని తమ కావ్యాల్లో పన్నిపి జల్లుగా కొద్దిగా చిలకరించారు. అంతేకాదు, పూర్వ సాహిత్యంలో ఇంకా హాస్య రచనలు కొన్ని ఉన్నాయి అని వాదించే వారున్నారు. తమ వాదానికి బలంగా శ్రీనాథుని క్రీడాభి

రామాన్ని, కూచిమంచి జగ్గకవి చంద్రరేఖా విలాపాన్ని, పరిహాసధోరణిలో సాగిన శతకాల్ని, కొన్ని ప్రహసనాల్ని వారుదహరించడం కద్దు. కాని వాటిలో అవహేళనా, అశ్లీలార్థ స్ఫురణా అధికం. ఆరోగ్యప్రదమైన హాస్యం లవలేశం.

స్వీకరణ యోగ్యమైన హాస్యానికి తెలుగు సాహిత్యంలో శ్రీకారం చుట్టింది ఇరవయ్యో శతాబ్ది ఆరంభంలోనే. ఆ గౌరవం, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, వేదం వేంకటరాయ శాస్త్రులు గార్లకు మొదట, చిలకమర్తి లక్ష్మీనరసింహం, పానుగంటి లక్ష్మీనరసింహారావు గార్లకు పిదప, దక్కుతుంది. చిలకమర్తి గణపతి, కందుకూరి ప్రహసనాలు, వేదంవారి ప్రతాపరుద్రీయం-వీటి యందలి హాస్యం, పూర్వం విదూషక సంబంధి అయిన హాస్యం నుంచి ఎంతో ఎత్తుకు ఎదిగింది కాని, ఇంకా కొంత మొరటుతనం, కొంత వెకిలితనం మిగుల్చుకొంది. సంస్కరణ లక్ష్యంగా అపహేళన చెయ్యడంకోసం కందుకూరి పంటి వారు హాస్యాన్ని ఆయుధంగా చేపట్టారేమో, ఆ హాస్యంలో వ్యంగ్యం అధికం అయింది. దయారహితంగా సాగే హాస్యం ఆదరణీయం కావడం కష్టం. "తన్వి నిజంబుగ దూలగుండయే" వంటి పద్యాలతో పాఠకుల్ని నవ్వించిన సెట్టి లక్ష్మీనరసింహంగారు, సభ్యహాస్య స్రష్టలుగా గుర్తింపు పొందలేదు. అక్కడక్కడ లయ తప్పినా పానుగంటి వారి హాస్యం తేజోమయమైంది. రచనలో జిగిబిగి, నిర్మాణ కౌశలం, కళా సంపద ఆయన హాస్య రచనకి వెలలేని సొమ్ములు.

అయినా, ఈ అయిదారుగురికోసం సంస్కారయుతమైన హాస్యాన్ని సృష్టించిందీ, లలితమైన హాస్యాన్ని తెలుగు పాఠకుడికి అందించిందీ గురజాడ వారే! ఆయన రచనల్లో- ముఖ్యంగా కన్యాశుల్కంలో- కమనీయమైన హాస్యం పాఠకుల్ని చక్కిలిగిలి పెడుతుంది. సరసమైన హాస్యం సార్వజనీనమైన పాత్రల ద్వారా లభించడం కన్యాశుల్కంలో విశేషం. కన్యాశుల్కంలో హాస్యాన్ని చదివి ఆనందించడానికి పాఠకుడికి భాషలో ఉండే ఒడుపూ, ఊపూ, కాకువులో ఉండే అందం క్షుణ్ణంగా తెలిసి ఉండాలి.

నలుగురూ చదువుకుని నవ్వుకునే పరిశుద్ధమైన హాస్యం తెలుగు వారికి లభించడానికి మరో పాతిక ముప్పయి ఏళ్ళు పట్టింది. మోలియర్ రచనలు చదివి ప్రభావితుడైన భమిడిపాటి కామేశ్వరరావుగారూ, అమాయకపు పనులు చేసి ఆవస్థలు కొని తెచ్చుకునే బారిష్టర్‌ని సృష్టించి మొక్కపాటి నరసింహశాస్త్రి గారూ, ఇంట్లోనే కావలసినంత మేలు రకమైన హాస్యం లభిస్తుంది సుమా అని చెప్పి, కాంతం సాక్షిగా అక్షరాలా నిరూపించిన మునిమాణిక్యం నరసింహారావు గారూ, కాంతివంతమైన హాస్య కవాటాల్ని తెరచి నవ్వుల ప్రపంచంలోకి నడిపించుకొని వెళ్ళారు ఆంధ్ర పాఠకుల్ని.

1

పాత్రగత, భాషాగత, శబ్దగతమైన హాస్యాన్ని శ్రీ భమిడిపాటి ఆవిష్కరిస్తే, భావాశయమైన హాస్యాన్ని శ్రీ 2 మొక్కపాటి అందించారు. ఇక శ్రీ ముని మాణిక్యం వారిది ప్రాయికంగా సన్నివేశగతమైన హాస్యం. ఇలా స్థూల విభజన చేసినా, నిజానికి ప్రతి ఒక్కరిలోనూ తక్కిన ఇరువురి మార్గాలూ సమవాహిని గానో అంతర్వాహినిగానో ఉంటూనే ఉంటాయి. పొత్తుకుదరని మాటల్ని చేర్చి, ఒక్కొక్కచోట వాక్యాల్ని సాగదీసి, విలక్షణమైన అర్థాల్ని విపరీతమైన భావాల్ని స్ఫురింపజేసి హాస్యాన్ని సృష్టించడం శ్రీ భమిడిపాటి మార్గం. సామాన్యమైన సంఘటనల్ని అతి సహజంగానూ నిరలంకారంగానూ విపరిస్తూనే మాటల మాటున నవ్వుల తళుకుల్ని అద్దడం శ్రీ మొక్కపాటి పద్ధతి. సంఘటనల్ని అలా అలా అనుకోని నవ్వుల కోనల్లోకి తీసుకుపోయి చతురమైన సంభాషణల ద్వారా హాస్యాన్ని ఇబ్బడి ముబ్బడిగా అందించడం శ్రీ ముని మాణిక్యం విధానం.

3

తెలుగువారికి వికాస శీలమైన హాస్యాన్ని అందించిన మరో ప్రముఖ రచయిత శ్రీ ముళ్ళపూడి వేంకటరమణ. పరమ రమణీయమైన శాబ్దిక హాస్యాన్ని సృష్టించి ఉన్న మాటలకి క్రొత్త అర్థాల్ని కల్పించి, ఆంధ్ర భాషా భాండాగారానికి క్రొత్త పదరత్నాల్ని చేర్చి, ఆ శబ్దాలచేతా మాటలచేతా పాఠకులకి గిలిగింతలు పెట్టడం ముళ్ళపూడి మార్గం.

4

తెలుగు హాస్యానికి ఈ నలుగురూ నాలుగు స్తంభాలు. స్వాపలంబనం మీద మరెన్నో హాస్య రచనా వల్లరులు ఆంధ్ర సాహితీ నందనోద్యానంలో తీగలు సాగాయి. రంగురంగుల నవ్వు పువ్వుల్ని వెలార్చాయి.

ఆ హాస్య ప్రసూనాల్లో కొన్నిటిని ఏరి ఈ హాస్యతోరణంగా కైసేసి ఆంధ్ర రసజ్ఞుల మనో మందిరాల్ని అలంకరించాలనే ప్రయత్నం ఇది.

వాటిలో ప్రప్రథమంగా పానుగంటి రచనా ప్రసూన పరిమళం. సిల్లీ విషయాన్ని సీరియస్‌గా చెప్పడం ద్వారాను, అవసరం లేనిచోట గంభీరమైన భాష వాడడం ద్వారాను, శర పరంపరగా ఉదాహరణల వర్షం కురిపించడం ద్వారాను, పానుగంటి వారు హాస్య రసాన్ని సృష్టిస్తారు. చారుడు లేని రాజ తంత్రము, సంధాసకర్త లేని సాని సరసము, పౌరోహితుడు లేని పెండ్లి, న్యాయవాది లేని వ్యాజ్యము, వైద్యుడు లేని మరణము. పొసుగుడువాడు లేని పశువుల సంత లేక- అంటూ ఊపిరి సలపని ఉదాహరణల జోరు వచ్చి వచ్చి పశువుల సంత దగ్గర ఆగడంతో, రచయిత ఆగడం, కొంచెతనం, హాస్య దృష్టి అపగతం అయి పాఠకుడు నవ్వుకుంటాడు.

దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రిగారు జగమెరిగిన భావ కవులు. అచ్చమైన కవిత్వం రాస్తారు. సరే స్వచ్ఛమైన హాస్యం కూడా ఆయనఅంత సమర్థంగానూ వ్రాయగలరు. ఆయన 'బహుకాల దర్శనం'లోని 'అబ్బ తప్పిపోయింది', 'అవ్వ బస్సు ప్రయాణం' ఈ రెండూ చదివి తీరాలి కడుపుబ్బ నవ్వుకోడానికి. ఈ సంపుటి వ్యాసాలకే పరిమితం చేయడం పల్ల కాని, లేకపోతే అంసులో ఏదో ఒక కథ ఈ సంకలనంలో చోటు చేసుకొనేది. అలా అయితే శాస్త్రిగారి అవ్వ ఒక్కత్తే అన్న మాటేమిటి, గురజాడ వారి గిరీశం, కొడవటిగంటి వారి అల్లుడూ, భానుమతిగారి అతగారూ, ముళ్ళపూడి వారి బుడుగూ (బుడుగు అసాధ్యుడు, శ్రీ రమణగారి చొక్కా లాగూ తొడుక్కుని వచ్చేశాడు), ఆరుద్ర గారి అమ్మమ్మ, ఇలా ఎందరో విచ్చేసి పాఠకుల్ని ఈ సంకలనంలో పలకరించి

సవ్వించి పారేసి ఉందురు - ఎప్పుడైనా హాస్య కథల సంకలనం ఒహటి వెయ్యి పలసి పస్తే అప్పుడు చాళ్ళని పిలుద్దాం లెండి - ప్రస్తుతం శ్రీ దేవులపల్లి వారు ప్రాసినట్లు చెప్పబడుతూన్న (ఇది ఇంకెవరో శాస్త్రిగారు రాశారని అనుమానం లేకపోలేదు, అందుకే ప్రశ్నార్థకం) 'భామనే సత్యభామనే'లో సత్యభామ పెట్టుకున్న రోలకుల తళతళలతో, కట్టుకున్న వెంకటగిరి జరీ తెల్లచీర మిల మిలలతో, ధరించిన ముప్పాత పట్టాల గంగలలతో, పాఠకుల నవ్వుల కిలకిలలు కూడా నిరాక్షేపణీయంగా ప్రభలి కలుపుకోవచ్చు - అభ్యంతరం లేదు.

చిదంబరరావు గారి పత్రిక అక్షరాలా సిసింద్రీయే ! పదార్థాలకి చచ్చినా అసలు రుచి రానియ్యని హోటళ్ళనీ, దుస్తులు కుట్టి మనుష్యుల రూపాల్ని మార్చేయగలిగిన దర్జీలనీ, పుట్టని పిల్లకీ పుస్తె ముడేసే శారదా భయంకరుల్నీ మనకి పరిచయం చేస్తుంది.

రంగస్థలం సంగతేవిటి మరి? నాటక ప్రపర్శన తెరముందు సాగుతూంటే, అంతర్నాటకంగా హాస్య సంఘటనలు తెర వెనుక నడుస్తూ ఉంటాయా? ఏమో మరి! ప్రసిద్ధ నటులు శ్రీ స్థానం నరసింహారావు గారు చెప్పాలి ఆ విషయం పసందుగా.

అయ్యా! ఇంక భమిడిపాటి వారి ఇంగ్లీషు తమ్ముడు! వచ్చాడు! అతనో పరీక్షా పహిల్వాన్! అతి సుకుమారం, ఆనపకాయ కూడా లేతది కొనలేని అమాయకత్వం అతని సొత్తు-ఇంగ్లీషు చదువులొచ్చి ఇంగిత జ్ఞానాన్ని ఎంత వరకూ ఇగిరింప జేశాయో తెలిసికోవాలంటే భలేగా పరికివస్తాడు బుజరామయ్య గాడి ఇంగ్లీషు తమ్ముడు. సరే-భమిడిపాటి వారి రచనా శిల్పం సంగతి మళ్ళీ చెప్పడం ఎందుకు? ప్రతిపద రసభీయమూ ఆపాత మధురమూను.

శ్రీ సుకవరము ప్రతాపరెడ్డి. రచనా ప్రతాపమూ పచో వాగ్వైభవమూ ఒక్క తెలంగాణా ప్రాంతము వారికే అన్న మాటేమిటి, యావదాంధ్రులకూ చిరపరిచితమే ! సుచిరమైన సుకవరము బాణీ వాణీ వరప్రసాదము. ఆయన

రచనలు ప్రౌఢపులు, నిత్య నవోఢలు. 'ప్రౌఢ సరస్వతి కుమారస్వామి' రచన గంభీరమయ్యా అక్కడక్కడ చక్కని హాస్య రసానికి ఆకరమైంది. ప్రౌఢ సరస్వతి గండరగోళమైన మది గల్గిన వాడుట! బ్రహ్మచారి కనుకనే ముకోర్కపి యయ్యెనట! చెలరేగినవో తిట్టినతిట్లు తిట్టుడట! వారికి నానా భాషలు వచ్చునట!...ఇలా వ్యాస మంచంతయు ప్రౌఢ సరస్వతి కుమారస్వామిని పొగుడుతూనే మధ్యమధ్య చురుక్కు మనిపించే చురుకైన హాస్యాన్ని అందించ గల ప్రజ్ఞాధురీణుడు ప్రతాపరెడ్డిగారు.

శ్రీ చిదిరెమఠము వీరభద్ర శర్మగారి హాస్యము, అదియొక రకమైనది. వీరి రచనలో పాముగంటి ఛాయలు కనిపించడం ఒక విశేషం. సంస్కరణాభిలాష ధ్యేయంగా సాగిన చిదిరెమఠము వారి రచన 'వారాంగనా వీరాంగణము'లో వ్యంగ్యం, హాస్యం ప్రక్కన్ని చోటు చేసుకుంది. కాశీ, గయా వంటి దివ్య క్షేత్రాల్లో కూడా వారాంగనా వీరాంగణం సాగడం, రాజకీయాల మాటున, మత సంప్రదాయాల చాటున వీర విహారం చేస్తూన్న వారాంగనా వ్యాపారాన్ని బట్టబయలు చేయడమే వీరభద్ర శర్మగారి ధ్యేయం. పండిత ప్రకాండులు కనుక శ్రీ శర్మగారు వ్యాసాన్ని చిక్కని భాషలో రచించారు. ముఖోల్లేఖం సంస్కరణ కావడం వలన హాస్యం గొణమైంది.

కీర్తి కండూతి ఎవరికి ఉండదు? అందరూ యశో విమానం అందుకోవాలని ఆశించేవారే - అయితే ఆ కీర్తి పీఠత సన్నిధిని చేరుకోడానికి ఎన్ని తాపత్రయాలు? ఎన్ని అవస్థలు? అవన్నీ హాస్యరసం చిప్పిలేవిధంగా వర్ణిస్తూ, సర్వజన మిత్రుడైన 'విశ్వామిత్రుడు యశో విమానయానాన్ని మన ముంచుంచారు. ఇది చదివాక కూడా, కీర్తికోసం ఆర్తి చెందడం ఎంత అవివేకమో చెప్పనక్కర్లేదు.

భోగరాజు పట్టాభి సీతారామయ్య గారేవిటి, హాస్య వ్యాసం రాయడమేమిటి? కాని రాశారు - రాయడం సరే, దొరకడం చిత్రం కదూ? "నీవు

బతికి ఉన్నావా" అని ఆయనకే సెల్ఫిగా రాపడం, సమాధానం ఇయ్యక పోయేసరికి 'ఛ్చ...పాపం...పట్టాభి' అంటూ అవతలివాళ్ళు ఖర్చు రాసెయ్యడం- ఈ సంగతంతా చెప్తూ తనమీద తనే జోక్ వేసుకున్నారంటే ఎంత హాస్య ప్రియత్వం ఉంటే!

పన్నీటిజల్లు కురిపించింది ఎవరైతేనేం? కురిసింది మాత్రం సిజర్స్ శిరోమణి జరుక్ శాస్త్రి (జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి) మీద. ఆత్మస్తుతీ పరనిందా రాజకీయాలతో నడుస్తూన్న ఈ ప్రపంచ దర్బారులో ఎవరు విజ్ఞులు, ఎవరు అజ్ఞులు?

మొక్కపాటి వారు ధనార్జనకి సూచించిన మార్గం మనం రోజూ చూస్తున్నదే - ఎంతమంది ఈజీ మనీతో లేజీగా బతకడం లేదూ? అర్థం చేతిలో ఉన్నవాడో, అధికారం తన చేతిలో పెట్టుకున్నవాడో, ప్రతాపాలూ ప్రలాపాలూ పలుకుతూంటే, ఆ పలుకుల్లో అర్థం పర్థం ఏంలేదని తెలిసినా మనం రోజూ పళ్ళు ఇకిలించడం లేదూ? మరింకేం? చమత్కార జన్యమైన హాస్యానికి మొక్కపాటి రచన చక్కటి ఉదాహరణ. మనస్సుకి వికాసం కలిగించి జీవశక్తి ఇయ్యగల శక్తి ఆయన హాస్యంలో ఉంది.

సాహిత్య రచన అనే హాస్య రచన చేసింది కె. కె. రాపు అని ఉన్నా, ఆ రాపుగారు కొచవటిగంటి కుటుంబరావు గారేనని నా గట్టి నమ్మకం. లేకపోతే ఎర్ర కాగితం మీద ఎర్ర సిరాతో రాసిన రచనని చదవడం ఎవరితరం? లోకాన్ని ఉద్ధరిస్తుందో లేదో సాహిత్యం! బళ్ళకొద్దీ ఉత్పత్తి అవుతోంది కనుక బండివాడిని ఉద్ధరించవచ్చు, బడివాడి మాట ఏలా ఉన్నా.

హాస్య రచనలు చెయ్యకండి బాబోయ్! కొంపలు ముంచుతాయి. దిక్కుమాలిన అర్థాలకి దారి తీస్తాయి. కొండొకచో తన్నులు తిన్నా తినొచ్చు. బ్రతికుంటే బలుసాకు తినొచ్చు. హాస్య రచనలు చేసి (హాస్యం అర్థంకాని) అడ్డమైన వాళ్ళచేతా తన్నులెందుకు తినడం? నిజమే నిరంజన్‌గారూ!

లాడ్జింగ్, బోడ్జింగ్ (బోర్డింగుకి వికృతి) ఫ్రీగా దొరికితే ప్రయాణం అంత ఉత్తమం లేదు. రోజూ ఇల్లాలిని మేకపిల్లలాగ ఇంచక్కా వెనకాల నడిపించుకుంటూ, కన్యాకుమారి కాశ్మీరులమధ్య షటిల్ సర్వీస్ కొట్టొచ్చు- అయితే శిల్పశ్రీ గారు చెప్పింది పూర్వపురోజుల సంగతి-ఇవాళ ఆ పప్పులేం ఉడకవు. కాలుకదిపితే కాసులు ఖర్చవుతాయి- పారాహుషార్! గత కాలము మేలు, వచ్చు కాలము కంపెన్-

'లలితమైన హాస్యం ప్రియురాలి దంతక్షతం లాంటిది' అని ఏ మహాను భావుడు అన్నాడో కాని, ఆది మునిమాణిక్యం వారి రచనపట్ల అక్షరాలా నిజం! కాంతం ప్రసక్తి లేకుండా మునిమాణిక్యం రచన చెయ్యడమే ! కాని ఉపాధ్యా యుడు అని ఆయన రాసిన గ్రంథంలో మాత్రం, బాగుండదని కాబోలు భార్య ప్రసక్తి తేలేదు. అయినా రసవత్తరంగానే సాగింది ఉపాధ్యాయ ఉపాఖ్యానం. పస్తువుపట్ల గల గౌరవంతో ఆ గ్రంథాన్ని పీఠికృతం చేసి ఈ వ్యాసాన్ని తయారు చెయ్యడం జరిగింది.

బ్రహ్మచారులంతా షేర్లు తీసుకుని ఓ లిమిటెడ్ కంపెనీగా ఏర్పడితేనో! అసలే బ్రహ్మచారులికి మార్కెట్‌లో బోలెడు డిమాండ్. ఇంక అటువంటప్పుడు కావలసినంత కట్నం డిమాండ్ చెయ్యవచ్చు. బృహస్పతికి మాత్రమే తట్టే ఆలోచన- నేటి కట్నాలమీద దూసిన కత్తి ఈ వ్యాసం.

చెఱుకువాడ వారి రచన అంటేనే చెఱుకుపానకం. కృష్ణాపత్రికా పాఠ కులికి ఈ సంగతి చెప్పనవసరంలేదు. ఈ వ్యాసంలో హాస్యం తళుకు దిద్దినట్లు అక్కడక్కడ మెరుస్తుంది. ఈవ్యాసాన్ని ఈసంకలనంలో చేర్చడానికి హాస్యంతో బాటు మరో బలమైన కారణం ఉంది. ఒక అర్ధ శతాబ్ది కాలం తెలుగువారి ఆలోచనలమీదా, జీవితంమీదా, నడవడిమీదా విశేషప్రభావం నెఱపిన కృష్ణా పత్రిక, ఆ మార్గంలోనే ఎందుకు నడిచింది ? సాంస్కృతిక పునరుద్ధరణ (Cultural Renaissance) ఆంధ్ర దేశంలో రావడానికి ప్రోద్బలం చేసిం

దెవరు ? ఒక మహత్తరమైన యుగాన్నీ, ఉద్యమాన్నీ, దానితోబాటు కొందరు మహనీయుల్నీ కూడా దేశానికి అందించిందెవరు? ఈ ప్రశ్నల కన్నింటికీ సమాధానం శ్రీ ముట్నూరి కృష్ణారావుగారూ, ఆయన నిత్యమూ కొలువు తీర్చి కూర్చునే కృష్ణాపత్రిక దర్బారూను. చరిత్రని సృష్టించిన కృష్ణారావుగారి దర్బార్ గురించి ముందుతరాలవారికి తెలియపరచిన అపసరం ఉంది. ఆ దర్బార్‌ని సవ్వాల వెలుగులతో నింపి మన మనో నయనాల ముందుంచారు శ్రీ నరసింహం గారు. అందుకే ఈ సంకలనంతో ఈ వ్యాసానికి సముచిత స్థానం ఇవ్వడం జరిగింది.

పేరడీలూ, లిమరిక్కులూ కూడా హాస్యంలో భాగాలే ! అందుకే శ్రీ శ్రీరమణ 'ప్రముఖుల పేమ లేఖలూ,' శ్రీ దేవరకొండ బాలగంగాధర తిలక్ 'న్యూ సిలబస్' స్వీకరించడం జరిగింది. అలాగే చంద మిరియాలూను. ఆయా రచనల్లోని చమత్కారం పాఠకులని అలరిస్తుందని నమ్మకం.

''హేతువుపై నిజమైన హాస్యం ఆధారపడి ఉంటుంది. హేతువు సున్నితమైనకొద్దీ హాస్యానికి లాలిత్యం వస్తుంది'' అనడానికి 'తుమ్మెదా ఒకసారి' సమర్థమైన ఉదాహరణ. ఆంధ్ర దేశం దురదృష్టం కాకపోతే శ్రీ తురగా కృష్ణమోహనరావు అంత చిన్న వయస్సులోనే (అందులో ప్రమాదానికి గురిఅయి) గతించడం ఏమిటి? అతనే కనక బ్రతికుండి మరి కొన్ని రచనలు చేస్తే, తెలుగు హాస్య రచయితలు ముగ్గురు నలుగురు సరసనీ స్థానాన్నే సంపాదించేవాడో, లేక, తెలుగులో హాస్యానికి తానే ఏకైక ప్రతినిధిగా నిలిచేవాడో : ఆరోగ్యవంతమైన హాస్యం కృష్ణమోహనరావు సొత్తు. దర్జాకి లోపం అని నవ్వకుండా బ్రిర బిగుసుకుని కూర్చున్న 'స్టేటస్ జెంటిల్‌మాన్' కూడా నవ్వి తీరపలసిందే, 'తుమ్మెదా' అంటూ 'తురగా' తన భావతురంగాన్ని అదలించేసరికి.

తెలుగువాడికి ప్రబల విరోధి ఎవడు అంటే తెలుగువాడే. ఈ నగ్నసత్యం నదీ జలాల్లాగ అందరికీ అనుభవైక వేద్యమే ! హాస్యరస సింధువుల్ని, పాసు

గంటి మార్క్ కుల్బల వ్వారా అందించి, అనంతమైన ఆనందానికీ ఏతాము లెత్తారు ఏలూరిపాటి అనంతరామయ్యగారు నదీజలముల వ్యాసములో.

పనిమనిషి అందంగా ఉండకూడదు. అది తోమే అంట్లగిన్నెలు మాత్రం అందంగా ఉండాలి. భర్తకి కోపంవచ్చి పప్పులో పచ్చిమిర పకాయలు కొరక్కపోతే కొరక్కపోగాక! మంచి పిల్లవాడిలా తలంటుకి మాత్రం వప్పుకోవలసిందే... నెత్తిమీద నూనెగిన్నో, పులుసు (కుంకుడుకాయ, లేక, సీకాయ తాలూకు పులుసు లెండి!) గిన్నో పెట్టేసి తను షికార్లకి చెక్కేసినా, భర్త అన్నవాడు నోరెత్తకూడదుట. మీ అమ్మకడుపు చల్లగా అత్తకడుపు చల్లగా, పురాణం సీత గారూ, మొత్తానికి ఆర్ద్రతా అభిమానం ప్రేమా అంతర్వాహినిగా నడిపి, ఇల్లాలు భోజ్యేషు మాతే గాను, అభ్యంజనేషు కూడా మాతే, అని అందరిచేతా అనిపించారు. భేష్!

నా పేరు అచ్చులో పడాలో అని ఆక్రోశించే నాయనలు నానా పాట్లూపడే విధానమెట్టిదో శ్రీ గో(పా)ం శాస్త్రిగారు సున్నితమైన హాస్యంద్వారా అందిస్తే, మారుతూన్న సామాజిక ఆర్థిక పరిస్థితులికి అడ్జస్ట్ కాలేక, మధ్య తరగతి మహిళలు, పూర్వపు పూబాతల్ వ్యవస్థకి చిహ్నంగా మాత్రమే మిగిలిన పని మనిషికి ఎలా పరాధీనలై బ్రతుకు వెళ్ళమారుస్తున్నారో, పనిమనిషి లేకపోతే బ్రతుకలేం అని ఎలా గజ గజ లాడే భయపడిపోతున్నారో చురుక్కుమనిపించే మార్గంలో చూపించడం జరిగింది, కథలా సాగిన 'పతి దేవుడూ, పనిమనిషీ' వ్యాసంలో.

పనిలేని న్యాయవాది పడేపాట్లు చూస్తే నవ్వు ఎంత వస్తుందో జాలికూడా అంతే వేస్తుంది. న్యాయవాది నటనలు, దావాల వాసనలు, అభియోగపు చర్చలు మృదువైన హాస్యఛురికలతో మిళాయించి అనుభవ యోగ్యాలు చేశారు శ్రీ ఒ. సీతారామచంద్రరావుగారు.

ఓటి పంతకం పండకమే-వ్యాసం కాదు. అయినా ఈ హాస్య వ్యాస సంపుటిలో చేర్చడం జరిగింది. ఇలా చేర్చడానికి కారణం, ప్రక్రియా ప్రాము

ఖ్యాన్ని కాకుంచా, అందులో ఓట్లకోసం అభ్యర్థిపడే అగచాట్లు హాస్య ప్రధానంగా ఉండడమే ! ఎన్నికకి నిలబడితే ఓట్ల ముష్టి తప్పదు. ఇంకప్పుడు సిగ్గూ లజ్జా ప్రసక్తి ఎందుకు ? కాస్తో కూస్తో మనందరికీ ఈ ప్రహసనం నిత్యైకానుభవమే. అంచుకే అందరినీ అలరిస్తుందని చేర్చడం జరిగింది.

శ్రీమతి నండగిరి ఇండిరాదేవి గారు తెలుగులో ఉన్న కొద్ది మంది ఉత్తమ హాస్యరస ప్రష్టలలో ఒకరు. సున్నితమైన హాస్యానికి ఆమె రచన 'పేరులు - దారులు' ఒక చక్కని ఉదాహరణ ! ఇందిరాదేవి గారి హాస్యం, మునిమాణిక్యంగారి హాస్యంవలె సాంసారిక సంబంధి. మునిమాణిక్యంగారి కాంతం, ఇందిరాదేవిగారి శ్రీవారు, తెలుగువాడికిచక్కిలిగిలిపెట్టే చక్కని పాత్రలు. మర్యాద కోసంమనం ఎంత అవస్థ పడతాం? అయ్యా, మీరెవరో నాకు జ్ఞాపకంలేదు. క్షమించండి. మీ పేరేవిటో చెప్పండి, అని ఒక్కనాటికి అడుగుతామా? జ్ఞాపకం ఉన్నట్లు ఎంత నటన, ఎంత హంగామా? ఎన్ని తత్తరపాట్లు, ఎన్ని బిత్తర చూపులు? అన్నీ అద్దంలోలా చూసుకోవచ్చు - నవ్వుకోవచ్చు - నందగిరి రచన మందస్మిత తుందిలం.

ముగ్గురు తెలుగు వాళ్ళుంటే నాలుగు అభిప్రాయాలుంటాయి. సగటు తెలుగువాడు వట్టి ముక్కోపి. ఆ మాటకొస్తే బోళా శంకరుడు కూడా. నాకు ఒక కన్నుపోతే పోయింది, పక్కవాడికి రెండు కళ్ళు పోయాయా లేదా అని సరిజూసుకుని సంతృప్తిపడే స్వపక్ష పరపక్ష నిర్ధూమధాముడు. పగ వచ్చినా పట్టలేం, పగ వచ్చినా పట్టలేం అన్న యజ్ఞన్న శాస్త్రిగారి మాట ఎంత నిజం !

వీరాజీగారి వ్యాసం చదివితే చాలు, వైతరణిని దాట దలుచుకున్నవాడు తప్పవె జాగ్ సిటీ బస్సులు ఎక్కడు. అమ్మో... అవేం శ్మశానపు పరుగులో! సహజమైన సత్యాన్ని హృద్యంగానూ, సహృదయ సంవేద్యంగానూ చెప్పడం వీరాజీ ప్రత్యేకత.

మనల్ని మనం విమర్శనాత్మకంగా చూసుకోంగాని, నిత్యం మనలో ఎన్ని వింతలూ ఎన్ని వికారాలు ! అవన్నీ రావి కొండలరావుగారి దృష్టిలోకి వచ్చేసరికి, ప్రతీవాడూ ఉలిక్కిపడతాడు, మనకేం వికారం వుందోనని. మనిషిలో లోపాల్ని సరిదిద్దుకోడానికి బదులే పంచదారమాత్ర ఆయన హాస్య సంభరితమైన రచన.

కథలూ, మినీ నవల్సే కాని శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ వ్యాసాలు ఎంత ప్రయత్నం చేసినా లభించలేదు. మిత్రులు శ్రీ నండూరి రామమోహన రావు 'ముళ్ళపూడి ఫలానా పత్రికలో ఫలానా వ్యాసం రాశారు. బాగుంటుంది. అది వెయ్యండి' అన్నారు. ఎంత ప్రయత్నం చేసినా, చివరకి ఆ పత్రిక ఆఫీసుకి వెళ్ళి వెతికినా, ఆ సంచిక మాత్రం దొరకలేదు. అయినా, ముళ్ళపూడి రచన లేకుండా హాస్య సంకలనం వెయ్యడం అసంగతం అని నిర్ణయించి, ఆయన ఇతర రచనల్ని పరిశీలించాను. 'ముత్తానందలహరి'లోంచి కొన్ని ఘట్టాల్ని ఏరి మాల కట్టే సరికి 'హలో ఓ ఫై వుందా' అయింది. ముళ్ళపూడి హాస్యరచనా మార్గం గురించి మళ్ళీ చెప్పడం చర్విత చర్వణం.

నాటకాల్ని ఫ్రీగా చూడ్డం సరే - తనకి చెందని పూలహారాల్ని, గౌరవాల్ని, మర్యాదల్ని కూడా ఫ్రీగా కొట్టెయ్యాలంటే ఎలా ? అలాంటి సఫ్రీ మేళం బయలుదేరి నాటక రంగాన్ని కప్పేస్తే ఇంక నటరాజుకి స్థానం ఏదీ? నిజమే.... ఏ హిమాలయానికో పారిపోయి అక్కడ చిందులు తొక్కవలసిందే. ఆదివిష్ణు నవ్వుతాలుగా చెప్పినా, కళాద్రోహులకి అది కొరడా దెబ్బే !

వాపు వాపే - బలుపు బలుపే. కానీ వాపూ ఒక బలుపే అంటే ఎలా ? ఎలాగేవిటి? శ్రీ పోరంకి దక్షిణామూర్తి సహేతుకంగా ఉదాహరణలతో సహా ఢంకా బజాయించి చెబుతున్నారు వినండి. హెవీవెయిట్ ఛాంపియన్లలాగే ఫెదర్ వెయిట్ ఛాంపియన్లు కూడా ఉంటారు. అవునా ? ఛాంపియన్ల గురించి చెప్పి నప్పుడు ఫెదర్ వెయిట్ ఛాంపియన్ గురించి కూడా చెప్పాలా వద్దా చచ్చి

నట్టు? మరి అప్పుడు గుంపులో గోవిందా అని అతని పేరు కూడా వచ్చినట్టే కదా - మరి అదే - వాపు బలుపంటే –

జంట పదాలు లాగే జంట కవులు కూడాను. ఒకరిని స్మరిస్తే వెంటనే రెండో వారు స్ఫురించి తీరుతారు. అలాగని ప్రతివారూ జంట కవులవుదామని ఉబలాటపడితే లాభంలేదు. కొందరి కొందరి పేర్లు ఇనపమేకూ బంకమన్నూలాగ విడివిడిగా ఉండిపోతాయి. చచ్చినా కలవ్వు. బోడిగుండుకీ బొటనవేలుకీ ముడి పెట్టగలమా? గచ్చకాయకీ బూడిదకీ ఎంత అన్యోన్యతో, అంతే అన్యోన్యత. ఆ పేర్లు ముడిపడవు - పేట ముడిమాట దేముడెరుగు. జారుముడి కూడా లాభం లేదు. ఆ మాటే అంటారు నీలా జంగయ్యగారు.

పైకి డబాయింపే కాని నిజంగా పురుషులు గడసరులు కాదు. మగాడు వట్టి అమాయకుడు. చిన్నప్పుడు తల్లో, తర్వాత చెల్లెలో, ఆ తర్వాత భార్యో, ఎవరో ఒకళ్ళు అతణ్ణి ఆదుకోవాలి. ఎప్పుడూ ఎవరో ఒక స్త్రీ కేరాఫ్‌లో ఉండవలసిన ప్రాణే, పాపం మగాడు. ఇది పాపం మగాళ్ళకి రుచించని సత్యం. ఈ సత్యాన్ని ఈ పచ్చి నిజాన్ని హాస్యరస సమ్మిశ్రితాలైన ఉదాహరణలతో హృద్యంగా అందించారు శ్రీమతి రాజ్యలక్ష్మి. ''నిజమే సుమా ! మనం అందరం కాస్తోకూస్తో శరత్ నవలల్లో హీరోలం. మనం జీవితంలో విజయం సాధిస్తున్నాం అంటే ఆ పుణ్యం అంతా ఆడవాళ్ళదే'' అనుకున్నామో ఈ వ్యాసం చదివాక, ఇంకేం ఉంది గోవిందా !

ఏటేటా ఆర్థిక మంత్రులు చేసే బడ్జెట్ ప్రతిపాదన మాటేంగాని, గొల్లపూడి మారుతీరావు గారి బడ్జెట్ చూడండి. కలలకీ, కన్నీళ్ళకీ పన్నులేదట - ప్రజలు ఎక్కడ అనవసరంగా సుఖపడిపోతున్నారో, అనే ఆందోళనేట పాపం ఆర్థిక మంత్రికి. సగటు భారతీయుడి అభిప్రాయాలకీ సరియైన దర్పణం ఈ వ్యాసం.

పేరడీలకి అలనాడు జరుక్ శాస్త్రి, ఈనాడు శ్రీ శ్రీరమణ పెట్టిందిపేరు. విశ్వనాథ సత్యనారాయణగారేవిటి ప్రేమలేఖ వ్రాయడం ఏమిటి ? ముళ్ళపూడి

బుడుగుకూడా ప్రేమలేఖ వ్రాయడమే! ఆశ్చర్యంగా ఉందా ?... ప్రేమలేఖలో కూడా "అలఘు స్వాదురసావతార ధిషణాహంకార సంభార మోహల బ్రాహ్మీ మయమూర్తిని" అని విశ్వనాథ ఘీంకరిస్తారా? అలాగే బుడుగు 'ప్రేమలేఖ రాసే సరికి పలక రెండువైపులా నిండిపోయిందోచ్చి' అంటూ కిసుక్కున నవ్వుతాడా ? ఏమో, ఏమంటారో - నేనెందుకు చెప్పడం? మీరే చదవండి.

ఆహా ! ఈ జగన్నాటకంలో మనం ఎన్ని అంతర్నాటకాలాడుతున్నాం ? ఎప్పటి కప్పుడే కొత్తనాటకం ! కప్పల తక్కెడాను ... రంగస్థలంగానీ, రాజకీయ రంగస్థలంకానీ, మనం వేసే వేషాలూ, గెంతే కప్పగెంతులూ, జనానికి అర్థం కావడంలేదంటారా, అందుకు వాళ్ళు అసహ్యించుకోవడం లేదంటారా ? ఏ పార్టీ ట్రాసులోకి గెంతినా, కప్ప అదే ! స్వగతంబు అంటూ రాసినా, తంబు భావం, బహిర్గతంబే - బహుమాన్యయుతంబు కూడా.

"గుత్త వ్యాపారం మనుష్యులే కాదండోయ్, దేవుళ్ళుకూడా సాగిస్తున్నారు- నా మాట నమ్మకపోతే అటోమాటు తిరపతికేసి చూడండి - చిల్లరదేవుళ్ళ నిష్ఠూరాలూ నినాదాలూ చెవినబడతాయి" అంటున్నారు, మధురమైన దరహాసాన్ని మన అధరాలపై వెలిగించాలనే సదుద్దేశంతో శ్రీపన్నాల సుబ్రహ్మణ్య భట్టు.

రచనా సామర్థ్యమే ఉండాలికాని, ఏ విషయంలోంచి పిండితే హాస్యరసం చిప్పిలదు ? వార్తక్యమే కదా అనుభవాల బోసినవ్వులు ఎంత మధురంగా పలుకరిస్తాయి ? భమిడిపాటి వారు పానుగంటివారు కలిసి పుచ్చావారయ్యారా ? ఉహూ - ఆ రెండు మార్గాలకీ తనదైన మరో మార్గంచేర్చి తన హాస్య వాహినిని త్రివేణిని చేస్తేనే పుచ్చా పూర్ణానందంగారయ్యారు. ఋషితుల్యుడై గుండెల్లో అమృతాన్ని నింపుకొని, సమస్త చరాచర ప్రపంచాన్ని సానుభూతితో చూడగలిగితేతప్ప హాస్య రచయిత కాలేడు అనడానికి పూర్ణానందంగారు జీవదుదాహరణం. హాస్యరస స్వరూపాన్ని నిర్ధారించిన డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యుల వారి పద్యాలు చివర చేర్చడం ఎంతో ఔచిత్యమనే నా అభిప్రాయం.

నిజానికి ఈ సంకలనంలో చేర్చిన రచయితలంతరూ కొంచెం హెచ్చు తగ్గులుగా అటువంటివారే ! అయ్యో మనిషీ, మనిషి చుట్టూఉన్న వాతావరణం ఇలా అయిపోయిందే అని బాధపడి బాధపడి, గుండెల్లోంచి లేచిన అసంతృప్తి జ్వాలల తాలూకు వేడిని తనలోనే దాచుకుని, వాటిల్లోంచి వెలువడిన వెలుగునీ కాంతినీ మాత్రం రసజ్ఞ పాఠకులకి పంచిపెట్టే ఉదారహృదయుడు ప్రతి హాస్యరచయితాను.

ఇందులోని ప్రతి రచనని చదివేటప్పుడూ 'వెక్కిరింత వెనుకనున్న వేడి కన్నీటినికూడా' గమనించవలసిందిగా పాఠకులకు మనవి.

ఇంక ఈ సంకలనంగురించి ఒక్కమాట.

వ్యాసతోరణానికి వచ్చిన ప్రోత్సాహాన్ని పురస్కరించుకొని (వేసిన కాపీలు త్వర త్వరగా ఖర్చయి పోవడం, ఎందరో మెచ్చుకోవడం, ఆంధ్ర విశ్వ విద్యాలయంలో, M. A. తెలుగు మోడరన్ లిటరేచర్ పేపరుకి పాఠ్యగ్రంథంగా నిర్ణయించడం వగైరా) ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అధ్యక్షులు మాన్యశ్రీ బెజవాడ గోపాల రెడ్డిగారు, 1976 నుంచీ హాస్య వ్యాస సంకలనంకూడా ఒకటి తయారు చెయ్యండి అంటూ వచ్చి, చివరకి 1979లో తీర్మాన రూపంలో సుహృదనుశాసనం చేశారు.

తదాది నేటివరకూ, సుమారు 700 రోజులూ, నిత్యమూ నాకు ఇది ఒక తపస్సు అయిపోయింది. 1910 నుండి 1980 వరకు ప్రచురణ అయిన ఆంధ్ర పత్రిక, భారతి, కృష్ణాపత్రిక, ప్రతిభ, శిల్పి, ఆంధ్రి, మహతి. సాహితి, కిన్నెర, ప్రబుద్ధాంధ్ర, తెలుగు స్వతంత్ర, ఆంధ్రజ్యోతి మాసపత్రిక తదుపరి వచ్చిన వారపత్రిక, ఇతర వారపత్రికలు, దినపత్రికలు, ఆనందవాణి, వినోదిని, జ్యోతి పత్రికల వేగాది సంచికలూ, నవ్యాంధ్ర సాహిత్య పరిషత్తు, సాహితీ సమితి, తరుణ సాహితి, కళాసాగర్ వంటి సంస్థలు ప్రచురించిన సుమారు నూరు నూట ఏభయి ప్రత్యేక సంచికలూ, మరికొన్ని ఉపయుక్త గ్రంథములూ పరిశీలించవలసి వచ్చింది. వీటిలో కొన్ని అటు రాజమండ్రి గౌతమీ గ్రంథాలయంలో దొరికితే,

మరికొన్ని ఇటు వేటపాలెం సారస్వత నికేతనంలో లభించాయి. కొన్ని ఎక్కడా లభించనే లేదు.

ఇందులో ఇంకో ఇబ్బంది.

వారం పదిరోజులు కూర్చుని ఏ పంద సంచికలో తిరగేశామనుకోండి, ఒక్క హాస్యవ్యాసం దొరికేది కాదు. కాలమూ, శ్రమా పూర్తిగా వృధా అయ్యేవి.

వ్యాసాలే కావాలి-కథలు కాని, తదితర సాహిత్య రూపాలు ఏవీ కాని అవసరంలేదు ;

ఆ వ్యాసం హాస్య ధోరణిలో సాగాలి ;

ఆ హాస్యం లలితంగానూ, సున్నితంగానూ, చమత్కారయుతంగానూ ఉండాలేకాని, మొరటుగానూ, సభ్యతారహితంగానూ ఉండకూడదు ;

ఎవరి మనస్సునీ నొప్పించేదీ, ఏ సంస్థనో రాజకీయ పార్టీనో అవహేళన చేసేదీ కాకూడదు ;

రచనలో నిర్మాణ కౌశలం, కళాసంపదా ఉండాలి ;

దీప్తిమంతమైన హాస్యమే అయిఉండాలి ;

తత్కాల ప్రయోజన మాత్రం కాకుండా తరతరాలు ఆనందించేలా, వస్తువు పీలైనంత వరకు సార్వకాలికం సార్వజనీనంఅయి ఉండాలి ;

ఆ రచన వ్యక్తికో, సమాజానికో ప్రయోజనం కలిగించేది అయి ఉండాలి.

ఇలా ఎన్నో నియమ నిబంధనలని ఏర్పాటు చేసుకోవడం పల్ల. ఈ తూకపురాళ్ళకి తూగే వ్యాసాల్ని ఏరడం చుక్కట అయిపోయింది. అయితే మంచి వ్యాసాలు దొరికాయి అన్న సంతృప్తి మిగిలింది. ప్రాథమిక పరిశీలన వరకూ నిలచినవి 150. తిరిగి తిరిగి చదవగా గీటుకి నిలబడ్డవి ఈ ముప్పై ఒక టీను.

పైన పేర్కొన్న నియమాల వల్ల కొందరు ప్రసిద్ధ రచయితలనీ, వారి రచనల్నీ ఇందు చేర్చడం పడలేదు.

''తెలుగులో హాస్యం'' అన్నప్పుడు ఈ సంకలనంలో పేర్కొన్న పాతిక ముప్ఫయి మందే కాక, మరెందరో పెద్దలు గుర్తు కొస్తారు కదా-

కందుకూరి, చిలకమర్తి, విశ్వనాధ కవిరాజు, మాధవపెద్ది బుచ్చిసుందర రామ శాస్త్రి, వ్యాసక్రీడల శ్రీ. శ్రీ., చక్రపాణి పనిలేని మంగలి, వడగళ్ళు, వినాయకుడి వీణ, పాస్ సుపారి శీర్షికలు, హాస్యరచయితలు శ్రీమతి భానుమతి, శ్రీ సోమంచి యజ్ఞన్నశాస్త్రి, శ్రీ గజ్జెల మల్లారెడ్డి, శ్రీ యర్రంశెట్టి శాయి - ఇంకా ఇలా ఇలా మరికొందరు.

కాని వారి రచనలు ఏవీ ఈ సంకలనంలో లేవు. అంటే, ఈ సంకలనం తయారు చెయ్యడంలో విధించుకొన్న కొన్ని లక్ష్యాలలో, ఏదో ఒక లక్ష్యానికి, వారి రచనలు విరుద్ధమయ్యాయి అన్నమాట. లేకపోతే నిరాక్షేపణీయంగా పైన పేర్కొన్న వారి రచనలన్నీ ఇందులో చేర్చి ఉండేవాడిని.

అయితే ఇంకో ముఖ్యమైన సంగతి. సమయానికి సముచితమైన సలహా యిచ్చి శ్రీ దేవులపల్లి రామానుజారావుగారు, దీని కొక సమగ్రమైన రూపం రావడానికి సహకరించారు.

వారి సలహా మేరకు 1951 నవంబరు ఆఖరివారంలో సుమారు పది రోజులు హైదరాబాదులో ఉండిపోయాను. ఆ పదిరోజులూ అహోరాత్రాలు తెనుగు పత్రిక, నీలగిరి పత్రిక, గోలకొండ పత్రిక, సుజాత, శోభ, తెలుగుతల్లి, ఆంధ్రకేసరి, మీజాన్, దివ్యవాణి, తెలంగాణా, ఆంధ్రాభ్యుదయం, దేశబంధు, విభూతి మొదలైన ఎన్నో పత్రికల తాలూకు అసంఖ్యాకమైన సంచికలని తిరగవేశాను. ఆంధ్ర సారస్వత పరిషత్తు, శ్రీకృష్ణదేవరాయ గ్రంథాలయము, వేమన గ్రంథాలయము, జిల్లా గ్రంథాలయ సంస్థ వంటి ప్రసిద్ధ గ్రంథాలయాల్లో,

1925 నుండి తెలంగాణా ప్రాంతంలో వెలువడి, తెలంగాణేతర ప్రాంతంలో లభ్యంకాని పై పత్రికల పురాతన సంచికలు, చాలవరకు పరిశీలించాను.

శ్రీ పి. ఎస్. శర్మ (సుజాత పత్రిక వ్యవస్థాపక సంపాదకులు), శ్రీ నందగిరి వెంకట్రావు, శ్రీ డి. రామలింగం, శ్రీ వెల్దుర్తి మాణిక్యరావు, శ్రీమతి ఇల్లిందల సరస్వతిదేవి, శ్రీమతి నందగిరి ఇందిరాదేవి వంటి పెద్దలను కలుసుకున్నాను. వారంతా 1925, 1930 నుండి పైన పేర్కొన్న పత్రికలతో ప్రత్యక్ష సంబంధముగల విజ్ఞాన వేత్తలు, వయోవృద్ధులూను. నాడు తెలంగాణాలో వెల్లి విరిసిన జాతీయోద్యమచాయల్లో అక్కడక్కడ తటిల్లు మని మెరిసిన హాస్యరచనల్ని గమనించి జ్ఞాపక ముంచుకొన్న విజ్ఞాన పేటికలు. తెలంగాణా ప్రాంత మందలి హాస్యవ్యాసాల్ని ఎన్నుకొనడంలో వీరి సలహాలు ఎంతో ఉపకరించాయి. అందరిలో శ్రీ వెల్దుర్తి మాణిక్యరావు, శ్రీ డి. రామలింగంగారు చేసిన సహాయం మరువలేనిది. ఈ పత్రికలు చూడమనీ, ఈ గ్రంథాలయాలకి వెళ్ళమనీ, వీరిని వీరిని కలుసుకోమని చెప్పి, ఒక ప్రణాళికని ఏర్పరచినవారు ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమీ ఉపాధ్యక్షులు శ్రీదేవులపల్లి రామానుజ రావుగారు. వారు చేసిన సహాయమూ మరుపలేనిది.

మరో సంగతి -

నేను చేసినప్రయత్నాలు సఫలం కాలేదు కాని, సఫలం అయి దొరికి ఉంటే, శ్రీ రావూరు, శ్రీ జరుక్‌శాస్త్రి, శ్రీ ఆరుద్ర, శ్రీ నండూరి రామమోహన రావు, శ్రీ నండూరి పార్థసారధి వంటి మరికొందరి హాస్యరచనలు ఈ సంకలనంలో చేరిఉండేవి.

పాఠకు లెవరేనా అంచనా వేసిన రచయితకానీ, రచనకానీ, ఈ సంకలనంలో కనిపించకపోతే, అందుకు కారణం ; ఈ సంకలనం యొక్క లక్ష్యం భిన్నంగా ఉండటం, లేదా ఆ రచన లభ్యం కాకపోవటం ; ఈ రెండిటిలో ఏదో ఒకటి అయి ఉంటుంది

ఇంక—

ఈ హాస్య సంకలనాన్ని తయారు చేయవలసిందిగా ఆదేశించి ప్రోత్సహించిన మాన్యశ్రీ గోపాలరెడ్డిగారికీ, సలహాలనిచ్చిన శ్రీ దేవులపల్లి రామానుజరావుగారికీ, త్వరగా పూర్తిచేయవలసిందిగా పలుమారు హెచ్చరించి దీనినింత త్వరగా పూర్తి చేయించిన డా. ఇరివెంటి కృష్ణమూర్తిగారికీ కృతజ్ఞతలు.

అవసరమైన సలహాలూ సూచనలూ ఇచ్చిన ప్రొఫెసర్ S. V. జోగారావు గారికీ, శ్రీ వావిలాల సోమయాజులు గారికీ, శ్రీ గోపాలశాస్త్రి గారికీ, శ్రీ రావూరు వెంకట సత్యనారాయణరావుగారికీ, శ్రీ నండూరి రామమోహనరావు గారు, శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ గార్లకు కృతజ్ఞతలు.

ప్రాతప్రతిని తయారు చేయడంలోనేకాక, వ్యాససేకరణ, స్వీకరణ వంటి ముఖ్యమైన నిర్ణయాల్లోనాకు సాహాయ్యము చేసిన శ్రీమతి రాజ్యలక్ష్మి సహకారం పేర్కొనదగినది.

గత డెబ్భై సంవత్సరాలుగా వివిధ పత్రికలలోనూ గ్రంథాలలోనూ ప్రచురితమైన హాస్య వ్యాసాలను ఒక సంకలనంగా తీసుకురావాలని ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీవారు సంకల్పించడం, ఆ పనికి నన్ను నియోగించడం, నాకొక అపూర్వమైన అవకాశాన్ని కల్పించడమే !

ప్రయత్నలోపం లేకుండా ఈ సంకలనాన్ని రూపొందించాను. ఇది రసజ్ఞ పాఠకుల మన్ననలకి పాత్రమౌతుంది అనీ, ముందు ముందు హాస్యరసానికి ఆంధ్ర సాహితీ జగత్తులో ఇప్పటికంటే ఇతోధికమైన ప్రాచుర్య ప్రాభవాలు లభించడానికి తొలిమెట్టుగా ఉపకరిస్తుందనీ ఆశిస్తూ,

26-8-1981
6, మ్యునిసిపల్ వీధి
బాపట్ల.

పోలా ప్రగడ సత్యనారాయణమూర్తి.

పశువుల సంత - స్వప్నము

శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావు

సాక్షికి-

జంఘాలుడు నమస్కారములు. నేనీ గ్రామము నుండి వేఱొక గ్రామము నకు నడచి పోవుచుండగా దారిలో నొక్క పట్టణము తగిలినది. దానిలో నొక పశువుల సంత జరుగుచుండెను. ఆది ప్రసిద్ధి కెక్కిన పశు విపణి స్థలములలో నొక్కటి. ఏమి పశువులు ! ఎట్టి పశువులు ! ఎంతెంత పశువులు ! నేల యీని నట్లు సంత భూమినే కాక, చుట్టు పట్టుల గూడ నాక్రమించి యున్నవి ! కాటుక కొండలవంటి దున్నపోతుల జతలు లంకెలు వేయబడిన వెన్ని వందలున్నవో ! పొట్టి కొమ్మలవి, కోరకొమ్మలవి, దుంప కొమ్మలవి, బార కొమ్మలవి, బొంత రోమములవి, పరకపాటు వెండ్రుకలు గలవి, కుచ్చు తోకలవి, మొండి తోకలవి, మట్టసపు దోకలవి, గవ్వ కన్నులవి, బెదఱు కన్నులవి, వ్రేలు బొడ్డులవి, యెగువ బొడ్డులవి, చిత్ర చిత్రములగు మన్న లెన్నో యటు లాగికొనుచు, నిటు లాగికొనుచు, వానిని బొడుచు బోవుచు వీనిని మూకొన్న బోవుచు, మంద రాను మందర ధ్వనులతో, యథేష్ట మల మూత్ర విసర్జన విరాజమానములై శోభించు చున్నవి.

ఎట్టి గేదెలు, నల్ల గేదెలు, గొడి గేదెలు, కంద పొదుగు గలవి, గుల్ల పొదుగు గలవి, మోర పొదుగు గలవి, తోపలి పొదుగు గలవి...క్రొత్త పురిటి గేదెలు పాలసలుపుచే బండ్లికిలించుచు, తోచక యిటు నటు దిరుగబోయి ఎ ఎ యనుచు చూచిన భ్రాంతిచే మతియును, పరిపరి విధముల బ్రకాశించు చున్నవి.

తెలుపు, నలుపు, పుల్ల, బట్ట మొదలగు పన్నెండు గంగిత్తలు, నెద్దులు, లంకెలు వేయబడి, పిపణి స్థల మంతెల్ల వ్యాపించి యుండెను. గోపులు కాముక కన్యలవి, రొంగ మొగములవి, బట్ట మొగములవి, యనేక వర్ణములతో, నసేత కృత్తులతో గంగగోలు సింగారములతో నొప్పుచుండెను. చూచితిరా! పోతునకు లంకె - ఎద్దునకు ఎద్దునకు లంకె - పోతునకు గేదెకుగాని, ఎద్దునకు ఆవుకుగాని లంకె లేనేలేదు. ఇవి లక్షణముగనే యున్నవి. మనుష్యలోక విరుద్ధముగనే యున్నది. స్త్రీ పురుష బంధమే ప్రబలతము బంధము. అదియే లోకము నందలి కలహములకు, కష్టములకు, అపాయములకు, అపకీర్తికి, ఆపాదములకు, మోసములకు, బలాత్కార మరణములకు ముఖ్య కారణము యున్నది...

ఇన్ని గిత్తల నడుము, ఇన్ని పోతుల నడుము, ఇన్ని ఆవులు ఇన్ని గేదెలు తిన్నవి గదా! పోతు, గేదపై కరుణ చేయుట గాని, గేదె కొంచెము సిగ్గు పడి మూసి మూసి నవ్వులు నవ్వుకొనుట గాని, ఎట్టి గోప్యపు రసగీటుట కాని ఏమైన నున్నదా? ఆహా! ఏమి నిష్కాపట్యము! ఏమి యమాయకత్వము! ఏమి వ్యామోహ శూన్యత! నరులలో స్త్రీ పురుషు లింత రొక్కుచో గలిసి నప్పుడు కలసి మెలగుట కింత యవకాశ మున్నప్పుడు- నవ్వులతో -ముప్పులతో - కన్నుల గీటులతో - గోటి పోటులతో - ముద్దులతో - నుదులతో - ఇగిలింతలతో - తకిలింతలతో - త్రాగుటలతో - పేట లాగుటలతో - అచ్చటి పంచ భూతములు గూడ శృంగార రసమయములగు నట్లు చేయుట యూహకుందెచరా? నరులంత వ్యర్థ సన సంకటులు - మోహపాశాబద్ధులు - రాగరస నిర్మగ్నులు - దుష్ట కామాధీనులు - నంతత కాంక్షా చింతా క్రాంతులు - జ్ఞానశూన్యులు - మజీ యే జీవులు గూడ, జగతి యందెంత నీచములైనవి గూడ లేనట్లు కనబడు చున్నవి గదా! యని యనుకొనుము నంత నడుమనుకు బోయి పశులక్ష్మి వర్ణనమును సాంత కావ్యముగా జేసితిని. విచిత్ర వర్ణనమని చెప్పుట తప్పదు. కాని పోసగుదు మాని ప్రలోభము విచిత్ర తరముగా నున్నది. కొందరి చెవిలో గసగసలాడు చున్నాడు. కొందరిని చేతితో లాగుచున్నాడు. కొందరను జోకొట్టు చున్నాడు. కొందరను వ్రేళ్ళతో బసుల సంఖ్యను సూచించుచున్నాడు. కొందరను నిర్దాక్షిణ్యముగ నిగాకరించు చున్నాడు. కొందర చేతిలో నాలు

రూపాయలు బయానాగా బలాత్కారముగ బెట్టి బోపుచున్నాడు. కొంప రను మోచేతితో నేబో సంజ్ఞగా బొడుచు చున్నాడు. ఎంత హంగామా అయిన జేయుచున్నాడు. ఇది అంతయు దొంగ వేషము. మోసము. మహా నటనము. పావులా డబ్బుల కొరకు పడెడి పాటులు. జేబు కత్తిరింపు దొంగ మొదలు బండి పోటు వీరుని వరకు ఉన్న అన్ని ప్రకృతులు - సక్క మొదలు తోడేలు వరకు ఉన్న అన్ని ప్రకృతులు - ఒక్క పొసగుడు వానితో వివిధములగు పాళ్ళతో, పరిపాకములతో మేళవించి యున్నవి.

చారుడు లేని రాజ తంత్రము - సంధాన కర్తలేని సాని సభసము - పౌరోహితుడు లేని పెండ్లి - న్యాయవాది లేని వ్యాజ్యము - వైద్యుడు లేని మరణము - పొసగుడు వాడు లేని పశుపుల సంతయు లేవు. పశు కార్యము స్వకార్యమనుకొని దానిని తగిన సంరక్షకునితో జీర్ణటకు వచ్చిన దయా సముద్రుడు - పై యూరి వారు మోసపడి పోవ్రయత్నమో యను భీతి చేత సంతలో జేరిన పరోపకార పారీణుడు - ఈతని కరహస్త చాలనము, వాచాలత, యుద్ధ్రీపత్వము. మన మహాజన సంఘోపన్యాసకుల కుండిన యెడల బాగుగా నుండును. ఈతని యభినయము, నటనము, అంతరానుభవ ప్రకటీకరణ చణ ముఖ లక్షణత, అభిప్రాయ గోపన సమర్థత, మన నటకుల కుండు నెడల నెంత బాగుగా నుండును ?

సంతవారి కొరకు పెట్టిన దుకాణములోని పెసరట్టు నూనె వాసన, కైమా పకోడిల కమురు వాసన, పులిపెరుగావళల పల్లు వాసన, వట్టి గడ్డి ముక్క వాసన, సంతవాండ్ర లచ్చింవాయ పులి గంజి వాసన, పశు మూత్ర ముల వాసన, సర్వత్ర వ్యాపించిన పొగ మట్టి వాసనతో మేళవించి యున్నవి.

ఎట్టి కంగుల జలతారు కుచ్చు పాగలవారు, ఏబది బొత్తాముల వరకుగల మొలకి చేతుల బొక్కాల వారు, కంటి సుచ్చాల వారు కొందరు దూరముగ నీ చర్య యంతయు గనిపెట్టు చున్నారు. వారే పశు మారకులు. మనము కనిపెట్ట

లేము. రాతితో మాట్లాడో అనుకొందుము. కాని అట్టివానిని పశువుఅంతలో గ్రహింపగలము. మరి పశువు కంటె మనుజుని అధిక్య మేమి? ఇట్లాలోచించు కొనుచు పై చూడ తోచలేదు. స్వప్నములో భయించి నిద్రించితిని. ఒక్క కల వచ్చినది. అది యిట్లుండెను:

స్వప్నములో గూడ పశువుల సంతయే ప్రత్యక్ష మయ్యెను. కాని అవి మనుష్య వాక్కులను మాటలాడ గలిగియుండెను. వానిలో నొక తెల్ల యెద్దుపోతు సభవారి యందున్న కొమ్ములు గల విధేయతతో నమస్కరించి మనుష్య భాష ణముల నిట్లనెను. "సోదర సోదరీమణులారా! మానవులకంటె తొమ్మిది యాతల ముందు నిలచిరో, ఏ పురంధ్రీమణి పుత్రపౌత్రికా పౌత్రాదులు లోకమంతయు వ్యాపించి దొంగ గడ్డి తినక, బందెల దొడ్డిలో బడక, పెద్ద వాడలను బోక, స్వచ్ఛమైనవారము మందగమన మొదలగు సల్లక్షణ ములు లేక, మంచి విఖ్యాతిని నిలుపు చున్నారో, ఏ పిల్లలకును తల్లిపాల లిప్పటి వరకు వ్యాపక నాలుగ నేయకయే తక్కువగా లేదో, ఏ యధికారా శిరోమణి శృంగములు తల యందు మూడు కోతలుండునో, ఏ యింటాము తల్లి పాలలో మినిమి జిడ్డు విశేషముగా నుండునో, గడ్డి మేటి తెగబడిన యెడల నే యెనుముల మిన్న క్షణములో గడ్డి మేటి నంతయు నష్టాని యూడ్చి వైచునో, ఏ సీమంతిని శిరోమణి పేడ, గోడ పెట్టుట కనువుగనుంత చిక్కము కలిగి యుండునో యట్టి లోకవిఖ్యాతమైన నాడు కొమ్ముల ముద్దు గేదె గారిని ఈ సభ కగ్రాసనాధిపత్యము నంది సభా కార్యము నిర్వహింపుదని నేను సభాసదులగు నార్యవర్యుల పక్షమున ప్రార్థించు చున్నాను." అని ఇట్లా ముద్దు యెద్దు నమస్కరించి, సభా సమస్కార సూచకముగా శృంగద్వయమును వంచి యూరకుండెను......అంత సర్వ మహా సద్గితామోద సూచకముగా పెలకొలడ తోకలు తడతడ శబ్దాయ మానములై విరా జిల్లెను. అంత నగ్రాసనాధి పత్ని తోక కదల్చి నేలను తీరాక, మందహాస సంప దలు ముఖ పద్మమున నావరింప, నోటి నుండి నురుగు నమలిన చెంగలి గడ్డి కబళము నురుగతో నేలపై బడ, మత్త గజ యానమున గాలుగ చెట్టు మొదటి దిన్నె పైకెక్కి, కొంతసేపు నిశ్చేష్టయై నెమరు వేయుట మాని, నిలుచబడి నేలను

రెండు మూడు పర్యాయములు మూల్గెనని...శీఘ్రముగ ధైర్యము నొంది ఇట్లుపన్యసించెను:

"ఇంత మహా పశు సభలో నాకంటె పెద్ద పరుసల వారెందఱో యుండ, కుండ పొదుగుల వారు, ఎక్కువ యీతలవారు, ఎక్కువ తరి గలవారుండగా సమస్త తృణశాస్త్ర ప్రవీణులగు విద్వాంసులుండ పచ్చి గడ్డినే కాని ఎండు గడ్డిని మారు కొనని సదాచార సంపన్నులుండ 'నరుడు మనకు ప్రభుడా, కాడిసయా' యను రాజకీయ సమస్యను చర్చించు సభకు అగ్రాసనాధిపత్యమున్ను ఎన్నుకున్నారు. ఇది మీరు నాకు అకారణ కరుణా కటాక్ష మహిమచే నొసగిన గౌరవము...

మన మత ప్రపంచమున, సంఘ ప్రపంచమున, రాజకీయ ప్రపంచమున, ఇప్పుడనేక విధములగు నూతన నాందోళనములును, నూతన పరిస్థితులు, నూతన సమస్యలు బయలుదేరినవి. ద్వేషాదులు, బుద్ధిహీనులు అగు నరులే ఇన్ని తొందరలను గలిగించుటకు కారణ భూతులు. నరులు మన సేవకె ఆదిశక్తిచే నిర్మింపబడిన వారు, మనకు వారు కాదిసులు. మన యొడళ్ళను తోమి మనల స్నానము చేయించు దాసు లెవరు? బీళ్ళలోని గడ్డిని కోసి తెచ్చి లేలేత పచ్చికను-సారవంతమైన పచ్చికను-మన నోటి కిందించు భృత్యు లెవరు? పనికిమాలిన చెత్త యైన యన్నమును చాలు తిని సారవంతమైన గంజిని మనముందు భయ భక్తి పూర్వకముగా నిడు వారెవ్వరు? (నరులే నరులే యని యబిచుచు బహువులు శిరఃకంపనము లొనర్చుచున్నవి.) మన పేడను జేతులతో దీసి, మన శాలలను బరిశుభ్ర పఱచి మన ప్రక్కలకె ప్రాత గడ్డిని బఱచి, మనకు దోమకాటు దగులకుండ సనేక విధముల బానిసతన మొనర్చు వారెవ్వరు? మన సోదరీ మణులగు ధేనువుల పుల మూత్రములు తమకు పరలోక సాధనములని ఎంచి వాని నమృత ప్రాయముగా నారగించు వారెవ్వరు? (పశువులన్నియు ఆనోళ్ళస్ప శృంగ సంఘర్షణమున కరతాళ ధ్వనులిచ్చు చున్నవి.) మన మీ దాస్యము నూరకే చేయించుకొను చున్నామా? (లేదు లేదనుచున్ను పశువులు తమ చెవులను

పెనుకకు ముందుగ కర్ణ లాడించుచున్నవి.) మన క్షీర ధనమును వారి మొగమున, వారి వారి యర్హతల గనుగొనించి కొట్టి, వారిచే సి పాదసేవ చేయించుకొనుచున్నాము. అట్టి మన బండ్లు, మన బానిసలు, పరిచారకులు, పశు భట తారతమ్య మెరుగక, విశ్వాస హీనులై యొడలు మదింప, కన్ను గానక, మనకెదురు తిరిగి, వారే మనపు ప్రభువుల మనుచున్నారట (ఏ ఏ అని అజుచు పశువులు కోపావేశమున ముంగాళ్ళు దువ్వుచున్నవి)...

మోక్షము, ప్రకృతి జీవనమునందే కాని సిద్ధింపదు. కాని యిప్పుడు సరులలో గొందలు తొల్లి పెద్దమను నొక్కొ ప్రతుకు తెరువును చూచుకొని, స్వభావానుసార జీవనమే ప్రధానోద్దేశముగా నుంచికొని, మన జాతిని సమీపింప వలయునని సర్వ ప్రయత్నములు చేయుచున్నారని విందిని. దాగు పడదలచిన వారిని మన మిట్టు పెట్టము. అభయ దాతృత్వరణము మనకిష్టమే. సరుడెన్నటి కైన ముక్తి స్థితి నొంద వలయునన్న యొడల పశువె తీరవలయును, సందెడు గడ్డియు దినవలెను. లోనిపోని పంటలు చేసికొని వ్యాధులను వృద్ధి పఱచుకొని, పస్త్రములు కట్టుకొనుటచే పనిత్రా వాంఛ మరింత వృద్ధి పఱచుకొని, పెండ్లిండ్లు చేసికొనుటచే మెడలకు పాదములకు పడునాలుగు బంధములను దగిల్చికొని సంసారపు కట్టు కొయ్య నుండి కాలి కొనని తిరుగుట-బీటి మేతయు లేక పిల్లలతో వారి పిల్లలతో వారివారి పిల్లలతో ప్రాకులాడుచు-బంధ సహస్రముల బడి గింజుకొనుచున్న నరజాతి కెన్నటికైన ముక్తి యుండునా? కల్ల-కల్ల. పోనిండు.

ఏదో నియమము కొఱకు నరుడు పెండ్లి చేసికొన్నా డనుకొందము. ఏదీ! ఆ నియమమైన జరుపుకొను చున్నాడా? ఛీ ఛీ పట్టి చపలుడు! చలితేంద్రియుడు; మాట ఒకదానికి, చూపొక దానికి; ముద్దొకదానికి, ముడుపొకదానికి, మనసొక దానికి, మాన్యత యొకదానికి; పాలు గుడుపొక దానికి, చూలొక దానికి; ఈ దిక్కు మాలిన పై యాటలలో నెన్ని మిత దోషములు! బంధు

ద్రోహములు' గురు ద్రోహములు! ఛీ' ఛీ! అప్రతిష్ట అప్రతిష్ట! మేలి ముసుగులు, చీకటి షికారులు, గోడ దాటులు, చెప్పు దెబ్బలు, ప్రాణపు పోకడలు.

ఇక జాతీయతను గూర్చి చెప్పెదను. ఏ చచ్చు దైనను, ఏ అపక తపక దైనను, ఎంత బుద్ధి హీనపు దైనను, నరజాతి ఒక జాతియని ఒప్పుకొనక తప్పదు గదా' జాతికి ప్రధాన లక్షణమేది? ఐకమత్యము. అది వారికున్నదా? నా యెడలి రోమములనే శాఖలు. ఆ శాఖలలో నున్న పలకలు. ఆ పలకలలో నున్న చిలుపలు. ఎక్కడ జూచిన పొందు లేదు, పొత్తు లేదు.

సిగ నడుమెత్తి నున్న యెడల నొక శాఖ, ప్రక్కల నున్న యెడల నొక్కటి, వెనుక నున్న నొక్కటి, నగము గొరిగిన యెడల నొక్కటి, పూర్తిగా గొరిగిన యెడల నొక్కటి, కత్తిరించిన యెడల నొక్కటి. ప్రేలాడ జేసిన యెడల నొక్కటి, జడలుగా జేసిన యెడల నొక్కటి, ఇదేనా నరుని బుద్ధి? రోమ బుద్ధి' మూతిమీది వెండ్రుకలలో, గడ్డము మీది వెండ్రుకలతో, కను బొమల మీది వెండ్రుకలలో గూడ గలిగిన మార్పులచేత శాఖా భేదములు సిద్ధించునట! గోచిని బట్టి యొక శాఖ, కుచ్చిళ్ళను బట్టి యొక శాఖ, మెడలో పలుపు లేని యెడల నొక శాఖ, ఉన్న యెడల నొక శాఖ, దానికి తాయి గట్టిన యెడల నొక శాఖ, మొగాన కచ్చిక యొక శాఖ, బొగ్గొక శాఖ, సుద్ద యొక శాఖ, ఎట్ట పొడుమొక శాఖ, పచ్చ పొడుమొక శాఖ; వాని జుట్టు వీని చేతిలో, వీని చెవి వాని చేతిలో, వాని కాలు వీని కడుపుమీద, వీని చేయి వాని మూతి మీద, వాని డబ్బు వీని చేతిలో, వీని ప్రతిష్ట వాని నోటిలో, వీని చెవిని వాడు ఛీ, వాని మొగాన వీడు ఫూ-

ఈ జాతి కెక్కడ నైన మతి యున్నట్లగపడుచున్నదా? ఒక్క బీటిలో సుఖముగా నెపరి మానాన వారు, మనుము మంటల కొలదిగా గడ్డి దిను చుండగా, నిద్ద బుస్సటమ్ములు ఉన్న అన్నము తినలేక, వాని చెంబు వీడు-వీని

తల వాడు-చిదుక గొట్టుకొని రచ్చకెక్కి పొసగడు వారి కాస్తిని సమర్పించి-తాము ముష్టి యెత్తుకొనుచున్నారు కదా!

అసూయ, ఆగ్రహము, కుటిలత్వము. క్రౌర్యము, క్రోధము, కృతఘ్నత, యిక నెన్నియో యవి యన్నియూ నేను జెప్పజాలను. వీని యన్నిటిని మించిన యూశ-లెఱపి లేని యూశ- ఇదేనా నరుని బుద్ధి?...ఇది యుండుటయే మంచిదో లేకుండుటయే మంచిదో విద్వాంసులగు మీరెఱుగ పోరు. ఇక వారిని గూర్చి తలపెట్ట దగదు. ఒక్కటే మాట-సోదర సోదరీమణులారా! మీరు నరులపలె మాత్ర మెన్నడును ప్రవర్తింపకుడు. అది మీకు జాతీయతలో దిగజాఱుట కాని యెగబ్రాకుట కాదు!....." ఇట్లా ఉపన్యాసము సాగినది. కల చెదరినది.

[సాక్షి - రెండవ సంపుటము]

భామనే సత్యభామనే !

శ్రీ దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి...?

ఆవేళ ద్వారకలో గొప్ప అలజడి !

అందరూ ఆశ్చర్యపోయేవారే !

అందరూ ముక్కున వ్రేలు పెట్టుకొనేవారే !

"ఇదేమి చోద్యం? నే పుట్టి పెరిగాక కటువంటి విడ్డూరం చూడలేదు; ఎన్నడూనూ !!" అంటూ విస్తుపోయాడు ఎనభై యేళ్ళ కంచుకి, ధర్మపాలుడు.

"ఆ ! బొత్తిగా చిలిపితనం !! తనేం పదహారేళ్ళ బాలాకుమార్తా?"

"ఓ హద్దూ పద్దూ ఉండనక్కర్లేదూ, ఎంత వారికైనా!"

అని, బుగ్గలు నొక్కుకుంది అరవై యేళ్ళ మందారమాల, రుక్మిణీదేవి ఎదుట.

ఎక్కడ చూచినా ఆ ప్రస్తావనే ! ఏ నోట విన్నా ఆ మాటే !

సత్యభాము కొత్తగా చేయించుకొన్న లోలకుల సంగతి.

కాని, సాయంత్రమయ్యేసరికి, సవతులందరూ, ఒకరికి తెలియకుండా ఒకరు, సత్యభామ కంసాలికి పురమాయించారు, తమకూ అటువంటి లోలకులే చెయ్యమని.

మరునాడు, సత్యభాము తన లోలకులను తీసివేసింది !

సత్యభాము ఏమి చేసినా అంతే ! ఏదో కొత్తదనం; ఇతరులు ఎవ్వరూ అనుకోని కొత్త పద్ధతి!! వాళ్ళు తనని అనుకరించేసరికి వెంటనే తను .దించుమానే

అందరూ తలకింత నూనె రాచుకొని, జుట్టు ఒత్తుగా దువ్వుకొని ఇన్ని కదంబపు దొంతరలు సిగలో పెట్టుకుంటే, తను తలంటి నీళ్ళు పోసుకొని, వదులుగా జడ వేసుకుని, నడినెత్తికి క్రిందగా చిన్న పాయతీసి పాయలో ఒక్క మల్లెపువ్వే తురుముకొంటుంది సత్య. ఒక్క మల్లెపువ్వే! ఎంతటి సువాసన గుబాళిస్తుంది ఆ ఒక్క పువ్వూను!

సత్యభామ ముఖము కోలగా ఉంటుంది. ఆమె అందే అసూయపడేవాళ్లు 'కోసగింజలా ఉంటుంది'-అంటారు. కాని అందమంటే ఏమిటో తెలిసినవాళ్ళు "అప్పరస చిబుకము సుమా!" అని ఆశ్చర్యపోతారు. "అసలు గుండ్రంగానే ఉండేది; కాని, శ్రీకృష్ణుడు మరీ మరీ ముద్దులాడడంవల్ల, అరిగిపోయింది ఆమె చిబుకము, అల్లాగా" అంటాడు విదూషకుడు.

రుక్మిణీదేవి ముఖము పట్టమహిషి ముఖము కాబట్టి, గుండ్రంగా ఉంటుంది: "చంద్రముఖి" సుమా! అంటారు, అందరూ ఆమెను గురించి. కాని, ఎక్కువ మంది సత్యభామ ముఖంకేసే చూస్తూ ఉండిపోతారు, తదేకదీక్షగా.

నవ్వితే, సత్యభామ బుగ్గలు సొట్టలు పడతాయి. కుడిబుగ్గను ఉన్న గులుసంత పుట్టుమచ్చ ఆమె నవ్వుతూ ఉన్నప్పుడు బుగ్గతో దోబూచులాడుతూ ఉంటే ఆమె ముఖం మరింత ఆకర్షణీయంగా ఉంటుంది.

రుక్మిణీదేవి దేహచ్ఛాయ పదహారు పన్నాల బంగారము. సత్యభామ ఒంటి రంగు ఏనుగు దంతపు ఛాయలో చిటికెడు సిందూరము రంగరించినట్లు ఉంటుంది. మన చూపులకే వాడిపోయేట్టు ఉంటుంది ఆ సొబగు.

రుక్మిణీదేవికి కంచి పట్టుచీర లిష్టము. నెమలికంఠపు రంగు చీరలూ, వంగపండు రంగు రవికలూ ఆమెకు ప్రియము.

సత్యభామ ఎప్పుడూ తెలుపే కడుతుంది. శీతాకాలంలో తెల్లని చీని చీనాంబరాలూ, వేసవిలో పాము కుబుసము వంటి పలుచని వెంకటగిరి చీరలూ, మామిడిపిందెల జరీ అంచుతో లేత సంపెంగపువ్వు రంగు రవికలూ ఆమె కిష్టం.

రుక్మిణీదేవికి అరిసెలూ అప్పాలూ ఇష్టము. సత్యభామకు తీపి సహించదు. ఎప్పుడైనా ఏ నోములకయినా తీపి చేయిరుచడము తప్పనిసరి అయితే, ఆవు పాలతో ఆటుకుల పరమాన్నం చేయిస్తుంది-అంతే.

రుక్మిణికి మినప్పప్పు పచ్చడిమీద మోజు. కమ్మగా వేయించిన మినప్పప్పు ఘుమఘుమలను బట్టి తెలుసుకోవచ్చు - అది రుక్మిణీదేవి పాకశాలా ప్రాంతమని.

సత్యభామకు మామిడికోరు పెరుగు పచ్చడి చాలా ఇష్టము. తనే కోరుతుంది పళ్ళని కొచ్చిన మామిడికాయను.

పోపుతో చిటికెడు ఆవాలూ; ఉండీలేనట్టు కాస్త కరివేపాకూ. చాలి, ఏమి సువాసన! సత్య కోసమని ఆమె తోటలో పండెండు నెలలూ కాసే మామిడి అంటును పాతించాడు శ్రీకృష్ణుడు.

శ్రీకృష్ణుడు రుక్మిణీదేవి ఇంటికొస్తే, ఏమి అట్టహాసం! ఏమి అట్టహాసం! ఏమి వైభవము! అదేదో కళ్యాణంలా ఉంటుంది, భూకల్ప నినాదాలతో. అతను ప్రస్తున్నాడనగా, కాళ్ళు తొట్రుపడుతూ ద్వారబంధము కేసి గబగబా పరిగెత్తుతుంది రుక్మిణీదేవి. పసంతపు నీళ్లతో దృష్టితీసి, కర్పూరహారతి ఇచ్చి, కొట్టకతిగి, ఆ నీళ్లు తన తలపై చల్లుకొని, తన పైటకొంగుతో అతని పాదాలనొత్తి, పవిలుగా లోనికి తీసుకుపోతుంది - అతనికి పాల పోళీలు ఫలహారంగా పెట్టడానికి.

సత్య ఇంటికొస్తేనా? అలాకాదు. శ్రీకృష్ణుడు సత్యాదేవి మందిరానికి ఎప్పుడొస్తాడో అర్థంకాకుండా ఎప్పుడు వెళతాడో ఎవరికీ తెలియదు. ఆమె గుమ్మం దుంకు ఉన్న ప్రతీహారి మాత్రం పంగి నమస్కారం చేస్తాడు. పరిచారిక పైటి పాటకలు తొడుగుతుంది. కనబడని పైటి పంజరాలలోని రాచిలుకలు "జటు! జటు!! స్వామీ!!" అంటూ ఉండగా, శ్రీకృష్ణుడు

''సత్య ఏదీ? సత్య ఏదీ?'' అని వెతుక్కుంటూ అంతఃపురంలోకి వెళ్ళపట సిందే! ఎక్కడా కనిపించదు సత్య.

అపతల, పసంతోద్యానవనంలో, పూచిన పోకమ్రానుల మధ్య పచ్చిక తివాసీపైన, ఆశీనురాలై, కట్టెదుట చలువరాతి పిల్లకాలువలో ప్రవహించిపోతూ ఉన్న చల్లని నీటిని కాళ్ళతో చిలుకుతూ, శ్రీకృష్ణుని మెడలో వెయ్యడానికి నిలువెత్తు పొగడదండను గ్రుచ్చుతూ ఉంటుంది సత్య. ''ఇక్కడున్నావా సత్యా?'' అంటూ, ఆమె దగ్గరకు వస్తాడు శ్రీకృష్ణుడు. పూలదండతోనే లేప బోయే ఆమెను వారించి ముంచుకు పంగి దండను ఆమె మెడలోనే వేసి, ఆమెను తన నిండు కౌగిటిలోకి తీసుకుంటాడు అతను. పైడి గిన్నెలో ఉంచిన పటికి బెల్లమ్మూ,ఏలకుపొడుమూ కలిపిన నిమ్మపండ్ల పానకమును అతని పెదవులకు అందిస్తుంది సత్య. తాను రుచి చూచి మరీ ఇస్తుంది శ్రీకృష్ణునికి, అతనికి చాలా ఇష్టమైన అల్లనేరేడు పండ్లను ఒక్కొక్కటిగా.

.....ఎప్పుడైనా ఊరి ప్రయాణము పస్తే, రుక్మిణీదేవి యింట వారం రోజులనుంచీ ఏక హడావుడే! క్రొత్త బట్టలు కుట్టించడమూ, సరంజామా ఏక తొడ త్రొక్కిడిగా ఉంటుంది: అందరూ అన్నిపనులూ చేస్తున్నా బయలు దేరే వేళ మించిపోతూన్నా రుక్మిణీదేవి ఇంకా తెమలదు. ఇంకా ఏదో సర్దుతూనే ఉంటుంది. ఒక పట్టానగాని పూర్తికాదు, ఆ సర్దుడుకు శ్రీకృష్ణుడు చిరాపు పడతాడు కూడాను. ఎలాగో అలాగ తయారయి రథం ఎక్కబోతూన్నా, రుక్మిణీదేవి మళ్ళా అంతఃపురం నాలుగుమూలలా పరికింపవలసిందే - ఏమైనా మరిచిపోయామా అని.

సత్యభామ అలాకాదు. వారు ప్రయాణం మీద వెళుతున్నారని తెలియనే తెలియదు ఎవరికీను. ఆఖరి నిమిషంవరకూ కూడా, సత్యభామ తోటలో ఏదో పని చేయిస్తూనే ఉంటుంది. మాధవీలతను మూసిడిచెట్టుపైకి తానే స్వయంగా ఎక్కించాలి. జాజిపందిరను సరిచేయించాలి. బొండుమల్లె మొక్క

లకు బోయలు చేయించాలి. రథం సిద్ధం అయిందని కబురు వచ్చాకనే, తన గదిలోకి వెళ్ళి పేరు పెట్టిలో రెండు తెల్ల జరీ చీరలూ, రెండు పట్టు రవికలూ వేసి, శ్రీకృష్ణునికి మాత్రం ఒకే జత బట్టలేసి 'మీ కివి చాల్లెండి' అని పెట్టి మూసి "రండి! వెడదాం పదండి!" అంటుంది, సత్యాదేవి. ఏమన్నా అంటుంది అమె. "కావలిస్తే అక్కడ రెండు జతలు కొనుక్కోవచ్చు లెద్దురూ" అన్నా అనొచ్చు. బంగారపు పంజరంలోని తన పెంపుడు చిలకని మాత్రం మరిచి పోను. "అత్తా! అత్తా!!" అంటూ ఆ చిలుక వారితో ఎప్పుడూ ఉండ పలసిందే!

సగలు విషయంలో - పంచిస్తిండా సగలు ఉండేకాని తోచదు రుక్మిణి దేవికి. ఒక్క సగ లోపించినా వీధో టోసిగా ఉంటుంది ఆమెకు. మెళ్ళో కంఠె, కాసులపేరూ, నడుములో గజ్జెల వడ్డాణము, చేతులకి పంకీలూ, పంచకడియాలూ, అడబాసా ముక్కుపుడక, చెవులకు మట్టీలూ, బాలీలూ, తలపైన నాగరమూ, కాళ్ళకు బంగారపు కడియాలూ. వీటితో వీటి మూసకూడదు. ఇవేనా? ఇంకెన్నో ఉండేగాని తోచదు ఆమెకు.

. . . .

సత్యాదేవికి ఇన్ని సగలూ ఉన్నాయి. ఇవిగాక, తన పుట్టింటి వారిచ్చిన వీరు వారపు సగలూ ఉన్నాయి. కాని ఇవ్వేమీ పెట్టుకోదు ఆమె. ఒంటిపేట నెక్లెసూ, నడుములో ఒయ్యారమైన వడ్డాణమూ. ఎప్పుడైనా బుద్ధిపుడితే చర్రాల చంద్రవంక పెట్టుకుంటుంది—అదీ శ్రీకృష్ణుని కోసము.

రుక్మిణీదేవి విలాగా ఒంటిగిండా వసుపు పూసుకుంటుంది. ముఖాన అరకాసంత బొట్టు పెట్టుకుంటుంది. నత్యకు వసుపు అంతగా గిట్టదు. ఏదో కాస్తార్థం, మడి చెంపపైన కాస్తా, పాదాలపైన కాస్తా వసుపుచాయలు కని పిస్తాయి. ముఖాన, కనుపించీ కనుపించనట్టు నక్షత్రమంత కస్తూరిబొట్టు- చెర్రుక్కగా నక్షత్రం కన్న చిన్నని కుంకుమ తిలకము.

ఒకనాడు మాత్రము గౌరీదేవి వ్రతము చేస్తూ సత్యాదేవి ఒంటినిండా పసుపు పూసుకొంది. అంతకు ముందుగా తలంటుకుని అగరు ధూపాలతో తడి ఆర్చిన తలకట్టు నిండా సంపెంగ పువ్వులు తురుముకొని, నుదుట కళ్యాణపు బొట్టు పెట్టుకొని, బుగ్గన చుక్కా, చిలుక చెయ్యని జరీ అంచు తెల్లచీర-(మామిడిపిందెల అంచుది) కట్టుకొని, చంద్రకాంతపు రంగు ముఖమల్ రవిక తొడుక్కొని, మోచేతిదాకా ఘుమఘుమలాడే మంచిగంధం పూసుకొని, కళ కళ్లాడుతూ వచ్చి, కాంతుని సరసన పీటమీద కూర్చుంది, అమ్మవారికి ఎదురుగా, ముసిముసి నవ్వులతో శ్రీకృష్ణుని చూస్తూ.

ఆ దివ్యమంగళ విగ్రహం కేసే రెప్పవాల్చక చూస్తూ, శ్రీకృష్ణుడు పూజ ప్రారంభించాక, అమ్మవారి ఒడిలో వెయ్యవలసిన పువ్వులు, పసుపు పూసిన సత్యాదేవి పాదాలపై వేశాడు-పరధ్యానంగా.

ఇది చూసిన రుక్మిణీదేవికి కోపం రాదు మరి!

[కళాసాగర్ వార్షికోత్సవ సంచిక 1979]

గమనిక : రచయిత పేరు గోప్యంగా ఉంచారు. కానీ దేవులపల్లి వారిది అని తెలుస్తూనే ఉంది.

సిసింద్రీ పత్రిక

—శ్రీ నందివాడ చిదంబరము

[ఇది 15-2-1930 తేదీని, రాజమండ్రి ఆర్ట్సు కాలేజీలో నిడమర్తి జయన్న ప్రసాదరాయనింగారి అధ్యక్షము క్రింద జరిగిన ఆర్ట్సు కాలేజీ ప్రాతవిద్యార్థి సంఘము యొక్క వార్షికోత్సవ సందర్భమున చదువ బడినది.]

ప్రకటనలు

మీ భార్యా రత్నము, మిమ్ములను వెనకాతల ఆక్షేపించుచున్న సంగతి మీకు తెలియునా? తెలిసియున్నో మీరింకనూ చిరిగిన వస్త్రం నేల ధరించెదరు? ఫేషనబుల్ కోట్లు, షర్టులూ, లాగులూ, పంచలూ, తలపాగా గుడ్డలూ మాచేత నేల కుట్టించుకోరు? మేము ప్రతి నిరక్షరకుక్షినీ, చిప్పరాయనీ, రాలుగాయనీ, చీమిడి ముక్కునీ, అనాకారినీ కూడా, కేవలమూ అందముగా మాచేత కుట్ట బడిన వస్త్రములతోనే, బహు ఘరానా మనిషిగానూ, అందగానిగానూ చేయు చున్నాము. వేయేల, మేము కుట్టిన వస్త్రంను ధరించి యింటికి పోయినచో మీ భార్యారత్నము సహితమూ మిమ్ములను ఎక్కువగా 'లవ్' చేయును. అట్టి సందర్భమునందో నామె యొక్క ప్రసన్నతకు కారణము, మిమ్ములను అందమైన క్రొత్త వస్త్రంతో నుండుటవల్ల ఆమె గుర్తింపకుండుటయే అని ధైర్యముగా చెప్పగలము...

మహాత్ అండ్ కంపెనీ-వైజాగ్.

జమీందారీ కాఫీ హోటల్

నవీన రుచులు! నలభీమపాకం!

కొనవలె!! తినవలె!!

వంటవారు: 1. అడవి గయిడు B.A.B.L.

2. పురంధ్రీముఖు B.A.B.L.

షరా:- B. A. అనగా బేచులర్ ఆఫ్ ఆపదలు.

B. L. అనగా బేచులర్ ఆఫ్ లడ్డూలు.

ధనము మాకు ప్రధానం కాదు. పదార్థములకు నూతన రుచి కల్పించుటయే మా పరమావధి. విద్యార్థికులైన పీడర్లు సహితమూ, పరగడుపుననే మా కాఫీ హోటలునకు దయచేయుటయే, మా పదార్థముల రుచికి తారాక్షణము. అతి మాత్రాన సవరు పీడర్లు క్లైంట్ల కొరకు వెదకులాడుచూ ఇక్కడకు వచ్చెదరని అనుకొనుట తమ బోంట్లకు పొరిగాదు. ఇహ, పదార్థముల ఆరోగ్య విషయం చెప్పనక్కరయేలేదు. హెల్తాఫీసరుగారు సుమారు ఉదయము నుండి సాయంకాలము వరకూ ఇక్కడనే కాలక్షేపము చేయుచుందురు. అలాగని ఆ ఆఫీసరుగారు డబ్బివ్వకయే సాయంత్రము వరకూ మా పదార్థములనే ఆరగిస్తూ ఉంచుదురని ఊహించుట కేవలమూ అన్యాయము.

షరా:- గానము నేర్చు అభిలాషగలవారి కొరకు ఇక్కడ శాస్త్రిగారి ప్లేటు ఉంచబడ్డది. గ్రామఫోను మాత్రము కించిత్తు చెడి మూలబడి యుండిన నేమాయె, ప్లేటు కొత్తది. పిన్నులలో గూడ కొన్ని కొత్త పిన్నులు కనబడకపోవు. క్రాఫింగు, మీసములు మొదలా చూచి దువ్వుకొనుటకు వీలుగా పెద్ద నిలువుటద్దములు మా ప్రక్క షాపులోనే ఉంచబడియున్నవి. పదార్థములను చూచుటకు మాత్రమే టికెట్టు, ఒక అణా.

కాలికి జోడెందుకో కళ్ళకి జోడందుకే!

కళ్ళు జబ్బులేనివారు మాత్రమే ఉపయోగించుటకు అన్నిరకములైన అందమైన కళ్ళద్దములుగూడ మాదగ్గర కొలదిగలవు. మాదగ్గర అద్దములను వాడి పలుచిన వారికి మా అద్దములను వాడినది మొదలుకొని మూడు వారములలోపుగా ఏవిధమైన నేత్ర వ్యాధియూ క్రొత్తగా ఏర్పడదని మాటీ యిచ్చుచున్నాము.

మా అద్దములను వాడినది మొదలుకొని మూడు నెలలలోపుగా, మా అద్దములను వాడువారు, వారి బంధువులనూ, స్నేహితులనూ, జోడులేని సమయమున కూడా ఆనవాలు పట్టగలరని ఘంటా పథముగా చెప్పగలము. మేము అద్దములతో పంపెడి రోల్డుగోల్డు చట్రము (Frame) మిక్కిలి గట్టిది. కళ్ళజోడు క్రింద బడినప్పుడు అద్దముల మాట ఎటున్ననూ, చట్రం మాత్రం విరుగదని ధంకా మీద దెబ్బకొట్టి చెప్పగలము—

ఇట్లు

ధృతరాష్ట్ర ఆప్టికల్ కంపెని.

అమ్మకానికి, నమ్మకానికి, అపూర్వమైన కత్తి: ఇదిగో:

ఇది నోటితో కోతలు కోయువారికి అవశ్యము ఉండవగిన ఆయుధము. పెళ్ళి కోతలూ, ప్లీడరీ కోతలూ, పట్నవాసపు కోతలూ, పాలిటీషియను కోతలూ అన్నింటికీ పనికి వచ్చును. ఇది యుద్ధము చేయువారికి పనికి రాకపోయిననూ, దొంగవానిని బెదిరింపుటకు గాంభీర్యముగా నుంచదగినదే! ఉమాపతి వైద్యులు కాని, ఆయుర్వేద వైద్యులు కాని దీనితో శస్త్రచికిత్స చేయుటకు సాహసించి ననూ రోగికి ప్రాణభయం లేదని పూచీయిచ్చుచున్నాము. ఈ కత్తితో నడివీధిలో ఒక మనిషిని కోయుటకు ప్రయత్నించిననూ ఒక్క రక్తపు బొట్టయిననూ క్రిందబడక పోవుటవల్ల, యిది మేజిక్ చేయువారికి ముఖ్యమైన పరికరము అని చెప్పక తప్పదు, దీనికి ఆరమ్స్ యాక్ట్ వర్తించదు.

—కోతల కత్తుల కంపెనీ.

కావలెను:

రాబోవు నవంబరు 12 వ తారీకు నుండి కుశాలనగరం స్త్రీల ట్రయినింగు స్కూలునకు సైన్స పాఠములు నేర్పుటకు ఒక సైన్స గ్రాడ్యుయేట్ కావలెను. పురుషులైతే బ్రహ్మచారులుగాని, క్రాఫింగు కలవారు గాని, కళ్ళజోడు కలవారు గాని పనికిరారు. అదిగాక, పురుషులైతే, గడ్డము నెలకి రెండు పర్యాయములు కన్న ఎక్కువ షేవ్ చేసుకొనకుండుటకు ఒప్పుకొనవలెను. పైవేటు ట్యూషన్లు

చెప్పుటకు వీలులేదు. పురుషులైతే 'Light'లోని చీకటిగది Experimentsను చేయుకయే విద్యార్థినులకు సంగతులను బోధ చేయవలెను.

—హెడ్‌మిస్ట్రెస్సు, స్త్రీల ట్రెయినింగ్ స్కూలు,
కుశాల నగరం.

వేలములు

నెలకి వెయ్యి రూపాయలు పైన జీతము పుచ్చుకొను ఒక ఉన్నతోద్యోగస్తుని గౌరవార్థము వారి కంపసీమయందు ఉంచబడిన కర్పూరదంతలు 12 న్నూ, సదరు ఉద్యోగస్థుని దర్శనము చేయుటకై వెళ్ళిన క్రింది ఉద్యోగస్థులు, ఆశ్రితులు, రయితులు వగైరాలు సందర్శన సందర్భమున కానుకగా సమర్పించిన 25 చక్రకేళీ గెలలున్నూ, బత్తాయి పళ్ళు 200 న్నూ, సదరు ఉద్యోగస్థుడు కేంప్‌లో నున్నప్పుడు రెండు పూటలకు వారికి భోజనము సామగ్రి సప్లయి చేయబడిన సందర్భంలో మిగిలిన 6 మణుగుల నెయ్యిన్నీ, 6 బస్తాల బియ్యమున్నూ ఏలూరు కాలవ ఒడ్డున రాబోవు అక్టోబరు 5 న వేలము వేయబడును గాన, పలయువారు అక్కడకు రాగోరెదను.

—అ. రత్నం- వేలము వేయువాడు.

వివాహ విషయము

ఒక జ్యోతిష పండితుడు, అనపత్యుడనైన నాకు 12 నెలలలోపుగా నొక మొగ శిశువు కలుగునని ధైర్యమునిచ్చి యుండుటచే, నేను యింయమూలముగా అందరికి తెలియజేయునది ఏమనగా-

''నాకూ మా ఆవిడకూ పుట్టబోయ్యే కుమారునికి శ్రోత్రియ కుటుంబములో 12 నెలల తరువాత పుట్టబోయే, అపకరములేని ఆడపిల్లను ఇవ్వదలచిన వారు తక్షణం నన్ను కలసికొని, కట్నకానుకలూ, రానూపోనూ రైలు ఖర్చులూ, ఆంక పానుపుమీద కట్నమూ, వగైరాలు స్థిరపరచుకొనవచ్చును. రాబోయే 1వ ఏప్రిల్ లోపుగా వివాహం జరుగవలెను గాబట్టిన్ని, జన్మించని వధూవరులకు

బయలు ఎవరో ఉండాలి కాబట్టిన్ని, వరుని తండ్రియే వధువు తల్లికి ఒక బదిలీ (transferable) మంగళ సూత్రం కట్టుటకు ఏర్పాటు. వధూవరులు జన్మిం చిన మూడు సంవత్సరములలోపున, కాలదోషము చిక్కు లేకుండా సక్రమమైన మార్గమున ఆ మంగళ సూత్రమును వరునిచే వధువు యొక్క కంఠసీమయందు ఉంచబడును .....factum valet

ఉన్నంత వరకు ఈ వివాహం శాస్త్రీయమే అని పెద్దలు సలహాయిచ్చు చున్నారు. ఇవి అన్నియు అంగీకరించినవారు నన్ను కలసికొని వెంటనే మాట్లాడ వచ్చును."

షరా:- పిల్లకి ఆస్తి సంక్రమించేయెడల, మాకు సాంప్రదాయముల పట్టింపూ, అందము పట్టింపూ లేదు.

—శారదాభయ దీక్షితులు, అలకాపురం.

స్థానిక వార్తలు

కర్నూలు:- సుప్రసిద్ధ వైద్యశిఖామణియని పేరు వడసిన డాక్టరు కె. ఆనందరావు యం.బి.బి.యస్. గారి వద్దకు ఈ సంవత్సరము మొత్తం మీద 22 మనుష్యులు శస్త్ర చికిత్సకై వెళ్ళియుండిరనియూ, సదరు డాక్టరు గారు చాకచక్యముతో ఇరవై మందికి మాత్రము శస్త్రము చేసి తక్కిన యిరు వురిని శస్త్రము చేయకయే పంపివేసిరనియూ, అందులో శస్త్రము చేయబడక పంపివేయబడిన యిరువురు మాత్రం యిప్పుడు సజీవులై యున్నట్లున్నూ తెలియ వచ్చుచున్నది. ఈ సంచర్భమున పురప్రముఖులు మొన్న ఆదివారము నాడు సమావేశమై శ్రీ ఆనందరావు గారు మిక్కిలి తెలివితేటలతోనూ దూరదృష్టి తోనూ బ్రతికియున్న ఆ యిరువురికి శస్త్రము చేయక పంపివేసి ప్రాణములు రక్షించినందులకు వారిని కొనియాడుము ధైర్యానము గొకదానిని ఏకగ్రీవముగ నామోదించిరి.

సంవత్సర ఫలము

ఈ సంవత్సరము న్యాయస్థానము లందుండు జడ్జీలు విచారణ సమయ మున ప్లీడర్లు చెప్పు హంశములను నిద్రపోకుండా ఉండి శ్రద్ధగా విందురు.

పాఠశాలల్లోనూ కళాశాలల్లోనూ, పాలకవర్గము వారి బంధువులైన ఉపాధ్యా యులు కూడ, విద్యార్థులకు పాఠములు చెప్పవలెనను సదుద్దేశమును కనబరచెదరు.

ఈ సంవత్సరము పై ఉద్యోగులకు కొంత దృష్టి మాంద్యమును, క్రింద ఉద్యోగులకు కొంత బధిరత్వమును అనుభవము వలన తప్పనిసరిగ వచ్చును.

సరియైన మధ్యవర్తులు దొరకక పోవుటచే ఈ సంవత్సరములో చిపరి భాగమునందు గవర్నమెంటు ఉద్యోగస్థులకు బహుమాన పూర్వకంగా వచ్చే రాబడి చప్పగా క్షీణించిపోవును.

ఈ సంవత్సరము కూడా ఎప్పటివలె మార్గశిర పుష్యమాసములలో భర్తలు భార్యానుకూలులై వర్తింతురు.

శ్రావణ భాద్రపదములందు నదుల ప్రవాహములు కొంత కుంటుపడిననూ, మ్యూనిసిపల్ రోడ్ల మీద ప్రవాహములు మాత్రము నిరాటంకముగ సాగిపోవును.

ఈ సంవత్సరము విద్యాశాలల యొక్క ప్రధానోపాధ్యాయులు కర్ర పెత్తనమునందు ప్రావీణ్యము జూపుటయేగాక విద్యార్థులకు పాఠములు కూడ చెప్పుటకు ప్రయత్నింతురు.

మోడరన్ రీసెర్చి ఇన్స్టిట్యూట్

పైపులు ఉన్న టోళ్ళలో పిచ్చుకలు ఎక్కువగా ఉన్నట్లు చెప్పకుండుట వలన ఈ మధ్య ఆచార్య పి. యల్. మంగళ్, బొంబాయిగారు, కొన్ని ప్రయోగ ముల మూలంగా గాలిలో పిచ్చుకవలె ఎగిరెడి వన్నియు పిచ్చుకలు గావనియు, వాటిలోని చాల భాగము, బలిసిన దోమలనియూ గనిపెట్టిరి. దీనిని బట్టి దోమ తెరలలో యింక గొప్ప గొప్ప మార్పులు కలుగవచ్చును.

ప్రెస్ ఫొటో బ్యూరో

మొదటి పటం :- మొన్న సాయంత్రం కాకినాడలో మంత్రుల గౌర వార్థం ఇచ్చిన టీపార్టీకి ఆహ్వానము లేకయే దయచేసిన అతిథులు.

రెండవ పటం :- ఈ సంవత్సరము వేసిన చందాలలో మొత్తము మీద రెండు వేల రూపాయల కన్న ఎక్కువ ఎగగొట్టిన లక్షాధికారులు, మొన్న మద్రాసులో సమావేశమై తమ భవిష్యత్ కార్యక్రమమును గూర్చిచర్చించుకొను సందర్భమున తీసిన గ్రూప్ ఫొటో.

చట్టనిర్మాణ చంద్రాసన సభాతీర్మానములు

1. హిందూ దేవాలయాధికారులు దేవాలయముల యొక్క ధనమునూ, ఆస్తినీ, బాధ్యత లేక యిష్టానుసారముగా అనవసరమైన ఖర్చులనుబెట్టి పాడు చేయుచున్నారు గనుక, ఈ సభవారు ఆ దుర్వ్యయమును ఆపుటకు రెండవ ఏర్పాటుగా (మొదటిది ఎండోమెంట్స్ యాక్ట్) ప్రస్తుతం మన రాజధానిలోని అన్ని దేవాలయములలోను ఉండెడి వెండి శఠగోపములను విక్రయింప జేసి శఠగోపములకు బదులు చౌకధరలో దొరుకు మూక్ మార్కెటులోని ఈవెనింగ్ హేట్లను ఒక్కొక్క గుడికి ఒక్కొక్కటిగా సప్లయి చేయవలసిన దనియూ, భక్తుల తలలపై బరువైన వెండి శఠగోపములుంచి ఆశీర్వదించుట కంటె తేలిక యైన ఈవినింగ్ హాట్లు వేసి ఆశీర్వదించుట సౌలభ్యవిహితమూ, ప్రమాద రహితమూ కనుక, ఆ విధము జరిపించవలసినదిగా గవర్నమెంటు వారిని కోరుచున్నారు.

2. ఈ సమావేశమునందే గవర్నమెంటు వారి జ్ఞాతివర్గమునకు చెందిన ఇ. పి. ఫాక్సుగారు, ఈ రెండి తీర్మానమును ప్రతిపాదించెదరని తెలియుచ్చు టచే అద్దానిని బలపరచుటకు ఈ సభవారు తీర్మానించిరి. ఫాక్సు గారు ప్రతిపాదించు తీర్మాన పాఠము—

"ఈ రోజులలో కొందరు మనుష్యులకు వారి రూపలావణ్యము చేతనైన నేమి, సహజ గుణసంపత్తి చేతనైతేనేమి, వారికి గల మానవజాతి యొక్క లక్షణములు క్రమక్రమముగ అదృశ్యమగుచున్నట్లు గనబడుట వలన, అట్టివారికి దేహారోగ్యభంగము కలిగినప్పుడువారిని పశువైద్యశాలల్లోకి రానియ్యవలసిదనియు, తత్సందర్భముననే మనకు గల పశువైద్యశాలల్లో ప్రత్యేకముగ నొక మనుష్యుల వార్డును పెట్టించవలయుననియు, ఈ సభవారు గవర్నమెంటు వారిని కోరుచున్నారు."

3. శాసన సభా సభ్యులలో ఏ వర్గమువారు ఎచట, ఏయే ఆసనములలో కూర్చుండ వలెను అని మీమాంస వచ్చినపుడు, నామినేటెడ్ సభ్యుల తరఫున ఒక గౌరవనీయుడైన సభ్యుడు ఇట్లు మాట్లాడినట్లు కూడిగా తెలియ వచ్చినది.

"గవర్నమెంటు వారు దయతో ఎన్నాళ్ళు మమ్ములను సభ్యులుగా నుండ నిచ్చెదరో అన్నాళ్ళూ మేము ఈ ఆసనము బాగోలేదనిగాని ఆ ఆసనము బాగోలేదని గాని పేచీపెట్టు వారముగాము. ఆ మాటకువస్తే మమ్ములను క్రింద కూర్చోమనిననూ మేము సంతోషముగా ఏదో మూల జాగా చూసుకుని సర్దుకొని కూర్చుండుటకు సంసిద్ధులమై యున్నాము. మమ్ములను సభ నుండి పెడలగొట్టకుండా ఉంటే అదే మాకు పదివేలు. ఈ తీర్మానము మీద మేము ఓట్లు ఎటుల వేయవలెనో నిశ్చయము చేయలేదు. ఎప్పటిపలె గవర్నమెంటువారు ఎటు తిరిగితే మేమూ అట్లే తిరిగెదమని మనవి చేయుచున్నాము."

పరీక్షలు - రసాయన శాస్త్రము

రాబోపు యింటర్మీడియేట్ పరీక్షకు కూర్చుండదలచిన వారు రసాయన శాస్త్రములో నీ దిగువ నుదహరించిన ప్రశ్నలను జాగ్రత్తగా చూచుకొని జవాబులను తయారు చేసికొనినచో లాభముండకపోదని ఒక రసాయన శాస్త్రజ్ఞుడు మాకు వ్రాయుచున్నాడు–

1) ఏ రసాయన పద్ధతుల పలన ఈ క్రింది పదార్థములు, దిగువ చెప్పబడిన సంయోగము (Compound) లో నుండి విడదీయ గలవు?

ఎ) 'పంటలక్క' నుండి 'లక్క' ను విడదీయుము.

బి) 'కలెక్టరు మామిడికాయ' నుండి ఒక కలెక్టరు గారిని గాని, డిప్యూటీ కలెక్టరును గాని విడదీయము.

సి) 'ఆవుకాయ' నుండి ఆవునుగాని కనీసం దూడనుగాని విడదీయుము.

డి) 'పెరుగు తోటకూర' నుండి పెరుగును కాని కనీసం మజ్జిగను కాని విడదీయుము.

2) ఈ క్రిందివాటిలో ఏది భౌతిక మార్పు (Physical Change), ఏది రసాయనిక మార్పు (Chemical Change) కారణములతో కన బర్చుము.

ఎ) ప్రతిపక్షములో ఉన్న ప్రజాప్రతినిధి హఠాత్తుగా రంగు ఫిరాయించి పాలకవర్గములో క్షీరనీర న్యాయముగ కలసిపోవుట.

బి) నల్లధనము తెల్లధనమగుట.

3) కాఫీ హౌటలులో కాఫీ కొరకై ఉపయోగించెడి పాలున్నూ, భోజనపు హౌటలులోని మజ్జిగ అనెడి పదార్థమున్నూ, రైలు స్టేషనుల యందలి భోజన శాలల్లో దొరికెడి చారున్నూ, ఈ మూడూ వేరు వేరు పదార్థములు కావనియూ, ఒకే పదార్థమనియూ ఒకే కుటుంబమునకు చెందినవనియూ నిరూపించుము.

4) ఎ) గవర్నమెంటు ఉద్యోగమును మాన్యుఫేక్చర్ చేయు సందర్భమున దేనిని ఉత్ప్రేరిత శక్తి (Catalytic agent) గా వాడవలెను ?

బి) అల్లుడు మామగారి దగ్గర నుండి ధనమును పిండీకృతము (extract) చేయు సందర్భమున దేనిని ఉత్ప్రేరిత శక్తి (Catalytic agent) గా వాడవలెను?

5) కోర్టులలో యిచ్చెడి 'జడ్జిమెంట్' అనే సంయోగ ద్రవ్యములో (Compound) 1. జడ్జి 2. ఆయన యొక్క మెంటాలిటీ అనే రెండు పదార్థములేనా, లేక యింకా యితరములేవైనా గలవా ? ఇతర పదార్థములేవైనను ఉన్నయెడల, వాటిని ఎట్లు కనిపెట్టగలవు ?

[భారతి అక్టోబరు 1930 సంచికలో ప్రచురింపబడిన పై రచన, సుదీర్ఘమైనది. గ్రంథవిస్తర భీతిచే, ముఖ్యమైన భాగములను మాత్రము స్వీకరించడమైనది.]

రంగస్థలంపై సమయస్ఫూర్తి

శ్రీ స్థానం నరసింహారావు

నాటక ప్రదర్శనాల్లో అప్పు దప్పుడు పొరబాట్లు గాని తప్పిదాలు గాని ఉప్పతిల్లుతూ ఉంటాయి. ఇవి ఆ నాటక సంఘాల వారి అతి శ్రద్ధ వల్ల గాని, అశ్రద్ధ వల్లగాని, లేక భయం వల్లగాని, ఇలాంటివే మరి కొన్నింటి వల్లగాని గలుగుతూ ఉంటాయి. వాటిని ఆ నాటక కథానుగుణ్యంగా నటులు సరిదిద్దు కొంటూ ఉంటే, ఔచిత్యానికి భంగం కలగకుండా ఉంటుంది. రసస్ఫూర్తికి దోహదమవుతూ ఉంటుంది. వాటిని ఉపేక్షించడంగాని విస్మరించడంగాని జరిగితే అది నటుల లోకజ్ఞానానికి గొడ్డలిపెట్టులాంటి దవుతుంది. సాధ్యమైనంత వరకూ వాటిని వెంటనే సరిదిద్దు కోవలసిన బాధ్యత పాత్రధారులైన నటులపై ఎంతయినా ఆధారపడి ఉంటుంది.

ఇలాంటివి, నా నాటక జీవితంలో రంగస్థలాన కొన్ని జరిగాయి. వాటిని ఏవిధంగా సరిదిద్దుకోవలసి వచ్చిందో ఒక్కటి రెంటిని మనవిచేస్తాను పాఠకులకు.

బాపట్లలోని పీడరుగుమాస్తాల నాటక సంఘంలో హరిశ్చంద్ర నాటకంలో చంద్రమతి వేషం ప్రథమంగా నేను ధరించవలసి వచ్చింది, ఆపద్ధర్మంగా. పోక్షను సరిగా రాదు. భయం ఆపాద మస్తకమూ ఆపరించింది. హరిశ్చంద్రుడు వేటకు భార్యాసుత సమేతుడై బయలుదేరి నట్లుగా రంగస్థలానికి వస్తాడు, ముందుగా ఆయన వచ్చాడు. వేటకు సంబంధించిన ఒక పద్యం చదివాడు. తన భార్యకొరకుచూచాడు. అప్పుడు చంద్రమతివేషంలోనున్న నేనురావాలి. ఓప్రక్కగా ప్రేక్షకులవైపు తొంగిచూచాను. నా భయం కళ్ళకు కప్పేసింది. రాలేక నిలబడి పోయ్యాను ఆ సైడు వింగుకో. అప్పటికే రెండు మూడు నిమిషాల ఆలశ్యం

అయింది. ముందడుగు వేయటానికి తటపటాయిస్తున్నాను. వెనుకనుంచి ఆ కంపెనీ మేనేజరు కీ॥ శే॥ గంగవరపు కృష్ణయ్యగారు నన్ను ముందుకు నెట్టారు. కాలి కేదో రాయి తగిలితే ముందుకు పడబోయినట్లుగా రంగస్థలం ప్రవేశించాను. బిత్తరబోతూ నిలుచున్నాను. నా భయాన్ని గమనించిన ఆ నాటి హరిశ్చంద్ర ప్రాతధారి కీ॥ శే॥ చోరగుడి హనుమంతరావు గారు పుస్తకంలో లేని తన స్వంత మాటలతో "దేవీ ! ఇది మహారణ్య ప్రాంతము. రాయో, రప్పా కాలికి తగులు చుండును. ముందు మంచిదారి చూచుకొనుచు అడుగెయ్య వలసినది. అటుల బిత్తర పోయెదవేమి బేలా ! ధనుర్బాణ పాణినై నీ చెంత నేనుంటిని గదా, నీ కేల భయము?" అని నా పీపుతట్టి, భయాన్ని కొంత తగ్గించారు. ఆ నాటి ఆయన సమయస్ఫూర్తి నాముందు నాటక జీవితంలో కొంత ఒరవడి దిద్దిపెట్టింది.

ఒకనాడు అనకాపల్లిలో కృష్ణతులాభారం నాటకం ప్రదర్శిస్తున్నాము. నేను సత్యభామగానూ, కె. గోవిందరావు రుక్మిణి గానూ నటిస్తున్నాము. చివర రంగంలో త్రాసులో కూర్చున్న కృష్ణుణ్ణి, రుక్మిణి వచ్చి భక్తితో ఒక తులసిదళం వేసి తూస్తుంది. ఆది సమానం కంటే హెచ్చుగా, త్రాసూ తక్కెడా పైకి లేవాలి. ఇందులకు అలవాటు పడిన ఒక పద్ధతిని ఆచరణలో పెట్టాము. అదేమంటే - కృష్ణుడు కూర్చున్న త్రాసుయొక్క దండెకు చివర భాగంలో ఒక సన్నని ఇనుప తీగె కట్టాము. దాన్ని రంగస్థలం పైభాగానికి తీసికెళ్ళి పైన ఒక కప్పి చక్రం ద్వారా ఒక సైడువింగుప్రక్కకు జార్చి దానిని నలుగురు బలాఢ్యులు క్రిందికి గుంజితే కృష్ణుడు కూర్చున్న ఆ తక్కెడ పైకి లేస్తుంది. దీనిని నాటకం ప్రారంభించే ముందుగానే సరిగ్గా ఉన్నదో లేదో చూచుకొన్నాం. అప్పుడది బాగానే ఉంది. కాని ఆ చివర రంగంలో మాత్రం మే మనుకున్న విధంగా జరగలేదు. ఏమయిందంటే- రుక్మిణి ఒక తులసిదళం పుచ్చుకుని భక్తి భావంతో "ఫలమో పుష్పమో పత్రమో పుష్పమో గొనుచు భక్తి నిన్ను గొలుచువారికేవు వశు డగుటయే సత్యమేని ఈ తులసిదళము నిన్ను తూచుగాక!" అని ఒక పద్యం చదువుతుంది. చదివి, కృష్ణుడు కూర్చున్న తక్కెడలోగాక రెండవ దానిలో

తులసిదళం ఉంచింది. కాని మా ఏడ్పాటు ప్రకారం కృష్ణుడున్న త్రాసు పైకి లేవలేదు. జనం ఘొల్లున నవ్వుతున్నారు. రంగస్థలం మీదున్న నారదుడు కృష్ణుడు రుక్మిణి సతిని పసంతకులు సత్యభామతో సహా అంతా నిలువుగ్రుడ్లేసుకుని పైకి చూస్తున్నాం. కారణం తెలియక సటనలో ఆరాటపడుతూ నే నొక ప్రక్క సైడు వింగ్ వద్ద నిలబడి ఏమిటిట్లయిందనే భావనతో లోనికి చూచాను. క్రిందకు లాగే తీగ, పై నున్న కప్పి గిలక ప్రక్కసందులో ఇరుక్కుపోయిందట. ఒకరు స్తంభం పై కెగబ్రాకి సరిజేస్తున్నాడట. చెవిలో ఊదాడు ప్రాంప్టరు. గ్రహించుకొన్నాను. అది సరిఅయ్యేటప్పటికి అయిదు నిముషాలు పట్టేట్టుంది. ఈ ఆలశ్యాన్ని కమ్మేశేందుకు నాకో ఆలోచన తట్టింది. చప్పున రుక్మిణీ వేష ధారివద్ద కెళ్ళాను. "అక్కా, రుక్మిణీదేవీ! మన భర్తకు ఇలాంటి స్థితి పట్టినది గదా అన్న నీ ఆవేదనలో, నీ ధ్యానము నిలుకడ తప్పినట్లుంది. మరల నీ మనస్సును భక్తి ధ్యానమందే లగ్నం జేసుకొని త్రాసునందు ఆ తులసీదళ ముంచుము తల్లీ!" అంటూ రహస్యంగా ఆ పద్యాన్నే మరల చదవపలసినదని చెవిలో చెప్పాను. అతడు "ఫలమో ఘనరసంబో" అనే పద్యాన్ని కన్నులు మూసుకొని మరల చదవడం ప్రారంభించాడు. ఆ పద్యం పూర్తిగాకముందే పై కప్పిలో ఇరుక్కున్న తీగె సవరించబడింది. పై కెక్కిన వ్యక్తి, మా సమాజంలోనివాడు గాకపోవడం వల్ల తీగెపు లాగెయ్యమని క్రిందివారికి సైగ జేశాడు. వెంటనే ఆ నలుగురూ క్రిందికి బలంగా గుంజేశారు. త్రాసు ఆ పద్యం పూర్తి కాకముందే పైకి లేచిపోయింది. అసలు ఆ త్రాసుకో రుక్మిణి దళం ఉంచినపుడే కాని అది పైకి లేవకూడదు. ఇది మరొక రసాభాసం. అప్పుడు రుక్మిణి పద్యాన్నంతా చదివి కన్నులు తెరిచి ఆ దళాన్ని అందులో ఉంచ బోయింది. అప్పుడు కూడా నేను మరల సమర్థించవలసి వచ్చింది. రుక్మిణి చెయ్యి పట్టుకొని ఆపేసి "అక్కా! ఇప్పుడు నీ భక్తి మధ్యలోనే పరాకాష్ఠను పొందుటచేత దళం వేయకుండానే కృష్ణుడు కూర్చున్న తక్కెడ పైకి లేచి పోయింది. ఇంక ఆ దళమే వేస్తే మన కృష్ణుడు కూడా మన కందకుండా అంతరిక్షం లోనికి ఎగసిపోతాడేమో, గనుక వేయవద్దు" అని వారించాను.

మరో మాటు ఓ రసాభాసపు చిత్రం జరిగింది. కీ॥ శే॥ కొప్పరపు సుబ్బారావు గారి 'రోషనార' నాటకాన్ని గుంటూరులో ప్రదర్శిస్తున్నాము. సుబ్బారావుగారు కూడా స్టేజిలోనే ఉన్నారు. ఆ నాటకంలో శివాజీచే తిరస్కరింపబడిన రోషనార శివాజీపై పగ సాధించే పట్టుదలతో దక్కను ప్రాంతాలకు అధికారిగా ఉన్న మో అజీమ్ వద్దకు పురుషవేషంలో వస్తుంది. అతని కొలువులోనే ప్రధానోద్యోగిగా ఉన్న మీర్ జుమ్లాతో తన పగను చెప్పుకొంటుంది. మొదటినుంచీ శివాజీనీ మో అజీమ్‌నూ అసహ్య భావంతో చూస్తూన్న మీర్ జుమ్లా ఆమె అభిప్రాయాన్ని అనుసరిస్తాడు. రోషనార అతనితో మో అజీమ్ రహస్య మందిరం ప్రవేశిస్తుంది. అక్కడ మద్యపానుడై తూలుతూ ఇరువురు నాట్యకత్తెలతో విలాసమొందుతూ ఉన్న మో. అజీమ్‌నూ నాట్యకత్తెలనూ బంధిస్తుంది. ఈ నాట్యకత్తెలనూ, సూరత్ సారాయినీ, మో అజీమ్‌ను స్నేహంతో స్వాధీనం చేసుకొనే దురుద్దేశ్యంతోనే శివాజీ పంపిస్తాడు. ఇది ఆ నాటకంలోని ఒక భాగం. ఆ నాట్యకత్తెల పాట, ఆట, అయిన చాలా సేపటికి గాని రోషనార రంగస్థలం మీదకు రాకూడదు. కాని రాక తప్పింది కాదు.

ఆ నాట్యకత్తెల వేషాలను ఇరువురు పురుషులు ధరించారు. అందులో ఒకరు మాస్టరు బసవలింగం. ఈతని నృత్యానికి ముగ్ధులు గాని ప్రేక్షకులుండేవారు గాదు ఆ రోజుల్లో. అతని నవ్వే రంగస్థలంలో వెన్నెల విరిసినట్లుండేది. ఈ ఇరువురూ నృత్యం జేస్తున్నారు. సభ్యులంతా ఆనంద పరవశులై చూస్తున్నారు. ఆ సమయంలో ఒక ఘోరమైన తప్పిదం ఏర్పడింది. బసవలింగం గాక మరో మగవాని ఆడవేషంలో పెట్టుకున్న తలవిగ్గుకు, జడ బరువై, వెనకకు జారింది. ఆతని తల యొక్క ముందు క్రాపింగ్ జుట్టు ఆ విగ్గులోంచి ముందుకు పచ్చేసింది. ఒక్క నిముషంలోనే సగం క్రాపింగ్ బయటపడింది. ఆ నృత్యంలో అతనికది తెలియలేదు. జనమంతా పగలబడి నవ్వుతూ ఈలలు వేస్తూ గోల జేస్తున్నారు. సైడు వింగ్‌లో ఉన్న నాకు ఆ రసాభాసం అర్థం అయింది. చటుక్కున రంగస్థలానికి పచ్చేశాను. నృత్యం ఆపించాను. మీర్

జుమ్లాను పిలిచాను. అతడొచ్చాడు. ''చూచితివా మీర్ జుమ్లా! శివాజీ ఎంతటి మోసగాడో! నిజమైన తన హిందూ స్త్రీలను నృత్యకత్తెలుగా పంపిస్తే తన జాతికి అవమానమని మగాళ్ళకు ఆడవేషాలు వేయించి ఈ మో అజీమ్ కళ్ళకు గంతలు కట్టాలని పంపించాడు. ఇదిగో చూడు, వీని తలకట్టు'' అంటూ ఆ జారిపోతూన్న విగ్గుయొక్క జడ పట్టుకున్నాను. అది మొత్తమంతా ఊడి చేతిలోకి వచ్చేసింది. చీరకట్టు బోడి క్రాఫింగ్ తలతో బిత్తరపోయి నిలబడ్డాడు ఆ పురుషుడు. రెండవవానిని, అనగా, బసవలింగం జడను కూడా పట్టుకొని ''ఏమిరా నీవూ మగవాడివేనా? ఔనా కాదా ?'' అని గద్దించాను. ఇవన్నీ పోర్షనులో లేని ముక్కలు. వానికేమి సమాధానం చెప్పాలనో తోచలేదు. నేనే రహస్యంగా చెప్పాను వానితో 'మగవాడినే' అని చెప్పమని, వాడు భయపడుతూ అట్లే అన్నాడు. ''భేష్! నీవు నిజము ఒప్పుకున్నందున నీ జుట్టు లాగెయ్యకుండా నిన్ను క్షమించి పదిలాను'' అంటూ మీర్ జుమ్లాతో ''వీరిరువురను బందిఖానాలో బంధించండి'' అని ఆజ్ఞ యిచ్చి నాటక కథలో ప్రవేశించాను. ఆ రసాభాసానికి ప్రతిగా నేను జేసిన మరింత రసాభాసం సమయస్ఫూర్తితో సమసిపోయింది. ఇలాంటివే ఎన్నో నా నాటకరంగ జీవితంలో - శలవు.

[కృష్ణాపత్రిక పత్రోత్సవ సంచిక]

బలరామయ్యగారి ఇంగ్లీషు తమ్ముడు

శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు

పెనక, మా అందరికి మల్లేనే మా తమ్ముడు కూడా పెద్దబాలశిక్ష పట్టి, పలకా చదరా పుచ్చుగుని వీధిబళ్ళోకి వెళ్ళేవాడు. కాని, మాకు మరీ దగ్గర వాళ్ళల్లో కొందరు ఇంగ్లీషులు వెలిగించడం ప్రారంభించారు. వాళ్లమీద పోటీకొద్దీ, వాళ్ళు కాస్త పక్క బెదురుగాఉంటూ ఉండడానికి, మా వాణ్ణి ఇంగ్లీషులో పడేశాం. ఇంగ్లీషు అనడంతోటే డబ్బు ఖర్చు. ఖర్చు లేకుండా రాజ విద్య ఊరికే ఎల్లా అబ్బుతుంది చెప్పండి! అక్కడికీ, మా వాడికి దులాబీ ఖర్చులేదు. పైగా, మావాడు అయినకాడికి ప్రతీ క్లాసులోనూ రెడ్డికం వేసుగుని కదలకుండా కూర్చుని ఇల్లంతా ఓ కడికి తీసుకురాలేదు, వాడి ధర్మమా అని. నే చెబితే గర్వంలా కనిపిస్తుంది-మావాడు అతి చురుకు, ఏకసంతగ్రాహి. తోటివాళ్లు చాలా మంది ఏ క్లాసులో బడితే ఆ క్లాసులో మకాం వేస్తూండడం, మావాడు ఎక్కడా ముచ్చటకేనా ఫేలవకుండా, చడీచప్పుడూ లేకుండా ఇట్టే దాటుతూ ఉండడం.

అంచేత, మావాడికి అన్నీ మెప్పులే; అన్నీ బహుమతులే. వాడికి చదువు పిడుగు, పరీక్ష పహిల్మాన్ అనే బిరుదులు కూడా ఉండేవి, కుర్రతనం నుంచీ. మరి పై క్లాసు చదివిద్దామా మాన్దామా అని ఒక్కొక్క పెద్ద మెట్టు దగ్గరా మేం తోపాయికారీగా ఆలోచిస్తూ ఉండేవాళ్ళం. ఆలోచన ఎందుకంటే, తరవాత తరవాత దేవుడు రక్షించి మావాడు చెయ్యగల ఉద్యోగంలో, ఆర్జించగల సొమ్ములో ఖర్చులన్నీ పోగా మిగలగల డబ్బులవల్ల, చదువు పెట్టుబడి సొమ్ముకి వడ్డీ డబ్బులేనా కిడతాయా కిట్టవా అనే సందేహం చొప్పున. మరి తోపాయికారీగా ఎందుకంటే, డబ్బు ఖర్చుకి మేం సందేహిస్తున్నాం అని వెల్లడయితే, మా పరపతి సన్నగిల్లుతుందేమో అనే భయం చొప్పున.

ఇంతలో ఎవరో పెద్దమనిషి చక్కా వచ్చి, నాతో ఈ మాట చెప్పి ఆ మాట చెప్పి, "ఇంకా చూస్తావేమిటయ్యా, బలాదుయ్యా? మీరు జమీందారులు. మీవాడు సీసు పచ్చిమిరపకాయంటివాడు. చూపిస్తే అందకుపోతాడు. వాణ్ణి చదువు మానిపించేరు గనక! నీ రకం నా రకం అయితే నేను మానిపించమనే పట్టుపడుదును. ఓ ముక్క వచ్చేవాడికి చెప్పించకపోతే, త్వాష్ట్రానికిటయ్యా చెప్పించడం? చాల్చాల్లే! ఎవడేనా వింటే నవ్విపోతాడు. తక్షణం పట్టం పంపించెయ్యి, శఠంలో పోస్తే కాని తీర్థం కాదు" అని నన్ను కోప్పడుతూండడం, దాంతోటి నేను హొంగిపోయి, పైకి మాత్రం చప్పకిస్తూ, వీలులో తాకట్టిట్టి మావాణ్ణి పై క్లాసుకి పంపిస్తూండడం. ఇల్లాగ్గా జరుగుతూవచ్చేది. మొట్టుమాట, మావాడు చదువులో సరసరా జువ్వలాగ పైకి లేచి, ఇంగ్లీషులో బాగా తడిసి, నాని, ఊరి ఊరుపున్నాడు. మూలో పిడి కొక్కడికే ఇంగ్లీషు రావడంవల్ల వీణ్ణి మేం 'ఇంగ్లీషు తమ్ముడు' అని వాడుతూ ఉంటాం.

మరి ప్రస్తుతం మావాడితో కలిసి చదువుతూ చిన్న క్లాసులోనే పేలిపోయి మానేసిన వాళ్ళపని, ఇప్పుడు మూడు పువ్వులూ ఆరు కాయలుగా ఉంది. అబ్బే, మరో చమత్కారం! వాళ్ళల్లోనూ ఎంత చిన్న క్లాసులో ఫేలయి ఎంత పెద్దాళ్ళే ఇంగ్లీషు మానేసిన వాడైవుంటే, అంత పనికొచ్చేవాడూ, అంత సంపాదనపరుడూ అయిపోయాడు. మావాడో! చదువుకొనేటప్పుడు వీడి పని ఎంత ప్రభగా ఉండేదో ఇప్పుడంత నస్మరంతిగా ఉంది. వీడికి ఉద్యోగం ఇస్తాననే జ్ఞాని ఎవరూ కనపడ్డు. ఎక్కడేనా ఉద్యోగం ఖాళీగా ఉందని తెలిసి ప్రయత్నించడానికి వెడితే, (అనుకుంటే తప్పు, ఇల్లా వెళ్ళడానికి బోలెడయింది) ప్రతీ అధికారీ మావాడితో "నువ్వు ఏం పని చెయ్యగలవు?" అంటాడటగాని "నువ్వు ఎంత పెద్ద పరీక్ష ప్యాసయినావు?" అని అడగనే అడగట్టు! ఏమైతేం, వీటికి ఒక్క చమ్మిడీ ఇంట్లో పడేద్దాం అనే టోహా లేదు, పడెయ్యగల ప్రజ్ఞా లేదు. తనూ, పెళ్ళాం (ఆవిడ వగ్గర మేం అసలు మాట్లాడలేం) ఇద్దరు కూతుళ్లూ (పిళ్ళకి ఎప్పుడూ ఒళ్లు ససిగా ఉండదు) - పిళ్లంతా ఉమ్మడి సంసారంలోనే.

అంచేత మావాడికి ఊహు మొహమాటం. అసలు వాడికి నోట్లో నాలిక లేదు. పైగా వాడిదంతా అతి సుకుమారం. పై మీద కండువా కూడా బరువే. ఓ గజం నడవలేడు-కారో, విమానమో కట్టిస్తాడు. ప్రతీదీ దర్జాగా ఉండాలంటాడు. సొమ్ము రావలసినచోట దాక్షిణ్యం అంటాడు. ఇవ్వవలసిన చోట తూర్పు మొహంగా దణ్ణంపెట్టి ఇచ్చెయ్యమంటాడు.

వీడు చదివించి ఏమిటో మాకు తెలియదు. ప్రపంచానికి అక్కర్లేదు, (వాడేం చేశాడు, మేమే చదివించాం లెండి). పైన చింత ఉందేమో అంటే, 'దేవుడూ నై గురువూ నై' అంటాడు. పైగా మన దేముళ్లు మనకంటె బొత్తిగా అన్యాయం అంటాడు. సరి, మతం చూద్దాం అంటే వాడి మతం, నా మతం ఒక్క మోస్తరుగానే ఉన్నాయి. పోనీ మనిషైనా రాయల్లా ఉన్నాడేమో అంటే, అబ్బే, ఆ కోటు తొడిగినంతసేపే కాని, విప్పేస్తే మనిషికి ఒంట్లో పంపు మాంసం లేదు. అడ్డిగెత్తు నెత్తురు లేదు. పళ్ళి ఎముకల పోగు. ఎవడేనా తనకి అన్యాయం జేస్తే, వాణ్ణి కాస్త తకాయించడం అంటూ లేదు - వాడి పాపాన్ని వాడేపోతా డంటాడు. లేకపోతే ఇంట్లోవాళ్లమీదా నా మీదా కోప్పడతాడు, లేకపోతే, తన గది తలుపు, రాయల్లా పెద్ద గడియ వేసుగుని, ఒక్కడూ కూర్చొని అవతలవాడిని తిడతాడు.

ఎవళ్ళేనా బంధువులు తటస్థించినపుడు వాళ్లతో-ఉన్న సంగతే అయిరి, లేకపోతే లేని సంగతాయిరి - ఏదో ఒహటి యథాశక్తి ఆప్యాయం కనబరుస్తూ కలిమిడిగా మాట్లాడడం, మావాడెరగడు. ఎక్కడేనా రక్త స్పర్శ ఉన్న వాళ్ళల్లో ఏదైనా కష్టం పచ్చినప్పుడు వాళ్లని కాస్త పరామర్శ చెయ్యకపోతే బాగుండదని వీడికి తెలియదు. ఆ విధానం అసలు తెలియదు.

తన సంసారాన్ని అత్తారింటి దగ్గర్నుంచి తీసి తెచ్చుకోవడం తనకి సిగ్గట, ఇంకోర్ని వెళ్ళి తీసుకు రమ్మంటాడు. ఏమడుగుతారు?

శిస్తు వసూలు కోసం పొలాల మీదకి వెళ్ళి రారా అంటే, అక్కడ ఏమీ తోచదంటాడు. మొన్న మటుక్కి మెడట్టుకు గెంటగా వెళ్ళి, వసూలు సొమ్ము సాపరు ఖర్చుకి చాలక నోటు రాసి ఇంటికొచ్చాడు. పోనీ, అయ్యా, ఎప్పుడేనా తేలు వస్తే ఎవడేనా పైజారుచ్చుకుని పచ్చడికింద కొట్టడూ? మా తమ్ముడేం జేశాడు? "తేలు ఎంత మంచిదనుకున్నారు? దోషం అంతా దాని కొండీది. కొండీ పట్టేస్తే, అది ఎంతో సాధువై పోతుంది. నేను పట్టు గుంటున్నా, చూడండి" అని రెండు వేళ్ళతో పట్టాలని యత్నించాడు నేర్పుగా. కాని, దాని ముడా మొయ్యా, తేలు, అంతకంటె ఎక్కువ నేర్పుగా ఒక్క దెబ్బని రెండు వేళ్ళ మీదా కుట్టింది. ఇక, పామంటే అసలే ఆశలేదు. మా తమ్ముడికి రాత్రిళ్ళు చీకట్లో వెళ్ళటం భయం. "ఏరా" అంటే, "పురుగూ బుర్రా ఉంటాయేమో అని బెదురుగాని దొంగ భయం చిన్నప్పటినుంచీ లేదు" అంటాడు.

దొంగలంటే జ్ఞాపకం వచ్చింది, మొన్న ఈ మధ్య ఒక ముసలాయన ఇంట్లో దొంగలడ్డారు. ఆయన జీవితం అంతా మాటలు చెబుతూనే ఉన్న వాడయినా, దొంగాణ్ణి పట్టడంలో - ఎలాగనుకున్నారు మళ్ళీ - భల్లూకపట్టు పట్టేశాడు. తరువాత వారానికి మా యింటికీ దొంగలొచ్చారు. అప్పుడు మా తమ్ముడు మెళుకువగానే ఉండి, మొహం మీదకి కూడా శాలువా లాగి కప్పు కుని పడుకున్నాడు కాని, వాళ్ళు ఒక్క పరసని ఇల్లంతా వీధిలో పెడుతూంటే, కేకలేనా వెయ్యలేదు. 'ఏమిరా' అని మర్నాడు కనుక్కుంటే, కేకవేస్తే తనకి నామర్దాట. పైగా, తను అప్పుడు మెళుకువగా ఉన్నాడో నిద్దర్లో ఉన్నాడో అని ఓ పెద్ద స్వప్న సమస్యట! ఆ అవస్థ గురించి ముందు ముందు ఓ పుస్తకం రాస్తానన్నాడు.

పోనీ, తను సొమ్ము తేకపోతే పీడా పోయిరి. నేను ఏవో మాసికలు పట్టి తెచ్చిన డబ్బెట్టి "బజారులోంచి ఏమన్నా వస్తుపులు తేరా" అంటే పైసా లేదంటాడు. ఒక్కొక్కప్పుడు ఇంట్లో పోరు పడలేక బజారుకి వెళతాడా, ఆఖరి కూరలు తేవడమేనా తెలియదు. తక్కిడికి దాళా

ఉంటుందని మా వాడు ఎరుగడు, కొనుక్కునే వస్తువులు మంచివో కావో ఎరుగడు. పంచాయకి ముచికి దళసరిగా ఉండాలనీ, ములక్కాడ మెరి తిప్పితే తిరగాలనీ, వెలక్కాయలు డీడిక్కలు కొట్టి చూసుకోవాలనీ, బెండకాయ చివర విరుగుడు పడాలనీ, ఆనపకాయ గోరు దిగేటట్టు ఉండాలనీ, వగైరాలు మావాడికి బొత్తిగా తెలియవు. అట్టా వెళ్ళడం వెళ్ళి, దుకాణాదారుని "ఈ సరుకు మంచి దేటయ్యా" అనడం, అంటే అతడు "బంగారం అండి ఫస్ట్, మా నాణ్యమైన సరుకండి" అంటాడు. లేకపోతే, అమ్ముకో దలిచినవాడు తన సరుకు 'చవట, చెత్త' అంటాడా చెప్పండి? దాంతోటి మావాడు, "అయితే ధర సిసలేనా?" అంటాడు. అంతే గాని, వీసెంత, శేరెంత, తులం ఎంత అని అడగడు. ఎంచేతో తెలుసునా? ఏ వస్తువు ఏ లెక్కని ఉంటుందో ఎరగడు. ఓ మాటు కస్తూరికని వెళ్ళి, "వీసెంత?" అని అడిగాట్ట. అది మొదలు చేసుకుని, ఉమ్మడి ప్రశ్నలు నేర్చుకున్నాడు.

దుకాణాదారు "అయ్యా! మా దగ్గర రెండు మాటలు లేవు. వాకబు చెయ్యండి. తేడా వస్తే రెట్టింపు ముదరా ఇస్తాను" అంటాడు. అంటే మావాడు "అయ్యా! బేరం చెయ్యడం నాకు అసహ్యం. ధర విషయమా, మీ ఇష్టం వచ్చినట్టు పుచ్చుగోండి. ఓ డబ్బు అయినా సరే మనకి ఆ లక్ష్యం లేదు. సరుకు మంచిది కావాలి, త్వరగా ఇప్పించండి, నాకు టైం లేదు" అంటాడు. అంత ముళ్ళమీద నుంచుంటే బేరాలెలా కుదురుతాయి? ఆ పళంగా ఏవో తెచ్చి ఇంట్లో వేస్తాడు. అక్కడీనుంచి స్నేహితులతో జేరి పేకాట, లేకపోతే పా డిలాంటివాడు వీడిలాంటి వాడంటూ ఊళ్ళో వాళ్ళమీద, యాగీ. ఇంతోటి శ్రమకి మధ్య మధ్య పలహారం.

ఓనాడు సీతాఫలాలు ఇంటికి అమ్మొస్తే మావాడే బేరం చేశాడు. అమ్మే అమ్మ అర్ధణాకి అయిదు చెప్పింది. మావాడు "నాకు అయిదక్కర్లేదు. నాలుగే

చాలు. ఏరి తీసుకుంటాను మంచివి" అన్నాడు, అసలు మంచివి ఏరి తీసుగునే పద్ధతినే అయిదని దాని ఉద్దేశం. ఏం చెప్పను? ఇవన్నీ అలా ఉంచండి.

పోనీ ఇంత కొట్టుగుని తినేరకం కాకూడదా? సమస్తం ఇంట్లో ఉంటాయిగా? తనకేమైనా లోటు రానిసామా? పొదసమూనూ తెగ చిరితిండి. చిరితిండి వాళ్ళకి అసలు తిండి మోటు. అయినా సరే, భోజనం వేళ అయేసరికి, గంటల ప్రకారం విస్తట్లో అన్నం పడాలంటాడు, కడంవి, ఎల్లానూ గంటల ప్రకారం జరుపుగోలేం, భోజనమేనా జరపాలని మావాడి పట్టుదల.

ప్రతి రోజూ ఇంట్లో రూల్సు ప్రకారం ఎల్లా దేవుళ్ళాడుతుంది చెప్పండి. తిండి తిండి అనీ ఇంత బులబాటమేగాని తీరా విస్తరి దగ్గరికి వచ్చేసరికి ఒక్క వాయైనా కలుపుగోకుండా, మెతుకులు, కోడి చిమ్మినట్లు చిమ్మి విస్తరంతా కళ్ళంలా చేసి చక్కా పోతాడు. అంచేత, "నాయనా, సంపాదనా వద్దు సమారాధనా వద్దు, నువ్వు అనుకుంటూన్న ఆత్మ గౌరవం చెడ గొట్టుకోకు, లోక వ్యవహారం నేర్చుకోకు, పోనీ ఇంత భోజనం చెయ్యడమేనా నేర్చుకోరా వంటికి మంచిది. 'శరీర మాద్యం' రా" అని అనేకరకాల మా తమ్ముడికి నూరి పోశాను. వాడికి జ్ఞానోదయం కాలేదు.

[మాట వరస - 21-1-1931 న ఆర్ట్స్ కాలేజీ పూర్వ విద్యార్థి సంఘ వార్షికోత్సవం (రాజమండ్రి) లో అసంపూర్తిగా చదివినది]

ప్రౌఢ సరస్వతి - కుమారస్వామి

శ్రీ సురవరము ప్రతాపరెడ్డి

శ్లో॥ ఇత్థం శ్రీకర గంభ్ర కోప కులజో
యస్సింహ పుర్వ్యా ధత
శ్రీ సుచ్ఛంకర కింకర శ్శుభమహా
లక్ష్మీ కుమార స్సుధీ:
న్యాయ వ్యాకరణార్య వైదిక కళా
ప్రత్యగ్రషాణ్మాతుర:
షడ్భాషా పరిభూషితో స్వరచయ
చ్ఛ్రీప్రౌఢ సారస్వతః

-సదాచార విచారప్రచారః

క॥ ప్రౌఢ సరస్వతులరు పద
రూఢల పఠ ద్వచోను రూపకృతి గురు
స్నిఢ కుమారస్వామి సు
సోఢుండేర్పఱచె లోక శుభముగ దీనిన్

-సంఘ సంస్కరణోల్లంఘనం

క॥ ప్రౌఢ సరస్వత్యములప
దాఢాకిత షడ్వచ స్సమంచద్గురు వా
గ్గూఢ కుమారస్వామ్యా
హ్వోఢకాఖ్య ధమ ధమా యితాశుడు వ్రాసెన్.

ఒక కరపత్రము.

శ్రీ గంభ్రకోట కుమారస్వామి శాస్త్రుల వారు నెల్లూరు నగర వాసులు. వారికి అనేక భాషలు వచ్చినను అందు ఆరు భాషలలో 'గురు వాగ్గూఢుడు'

అని తానె వ్రాసికొనినాడు. ఇంగ్లీషుతో ఎఫ్. ఏ. వరకు చదివినాడు. సంస్కృతములో కాశీ పీఠము నుండి ప్రౌఢ సరస్వతీ బిరుదమును సంపాదించినాడు. తెనుగు నుగ్గుపాలతో నేర్చిన పటువిద్య. ల్యాటినులో టక్కులు కలదు. మహారాష్ట్ర మెలు గును. అరవము చిన్ననాడె నేర్చెను. ఉర్దూ నిజాం రాష్ట్రములో నునికి చేసిన తర్వాత నేర్చెను. బంగాలీ తాను బంగాలు దేశములో నుద్యోగము చేసిననాడే నేర్చెను. లోకసంచారి యని యీ దిగ్దేశ సూచన చేత పాఠకులకు విశదమై యుండును. గందరగోళమైన మడిగల్గినవాడు. ముక్కోపి. అది బ్రహ్మచారిగా నుండి నందునను వారి యాహార విశేషము వలనను గలిగిన లక్షణమే. కుశాగ్ర బుద్ధి కలవాడు. కోపము తృణాగ్ని ప్రాయము. చెలరేగిన తిట్టిన తిట్టు తిట్టడు. వెంటనే శాంతి. పశ్చాత్తాపము. పీడితునకు సంపూర్ణ ప్రసన్నుడు. కలము పట్టినా, నాకధునీ ప్రవాహము. కోపము వచ్చినా చూర్వాసముని ప్రత్యక్షమైనట్లే. ప్రసన్నుడయ్యెనా అపర విశ్వామిత్రుడు.

స్ఫురద్రూపి. ఆజానుబాహువు. హాసన్ముఖుడు, భోజనము వేరుశనగ విత్తులు. బాదామి. చక్కెర. అప్పుడు పితికిన పాలు. సారెపప్పు పలహారము. పూటకు చేరడేసి లవంగాలు. ఇందతిశయోక్తి లేదు.

కట్టె పావుకోళ్ళు ధరించెడివాడు. తెల్లని లుంగీ, చంకక్రిందనుండి కట్టు వాడు. రుద్రాక్షమాల మెడలో. నడకలో మాటలో పలె పటుత్వము. నిత్యబ్రహ్మ చారి. శైవమతాభిమాని. శుద్ధ సనాతనుడు. నంస్కారము నచ్చదు. అందుచే రెండు కోమట్లు గ్రాడ్యుయేట్లు రిఫార్మర్లు వీరి కలము పోటులకు గురియైన వారు. అంతగా సంగీతము రాదులెండి. కాని ఆవేశము వచ్చినా భేతాళుడే ! సంగీతమో కాదోకాని వినువారికి పై నిండుట సాధారణ విషయము. అనేక కీర్తనలు రచించెను. అన్నియు పార్వతీ పరమేశ్వర స్తవములే. కాని మన దురదృష్టవశ మున నా కీర్తనలు ఆలంపూరు తాలూకాలోని కొందరి గ్రామీణుల యొద్ద శుద్ధా పభ్రంశములతో నిండి నిలిచినవి. (పండితులు కోరిన ప్రయత్నించి వానినైనను సేకరింతును.)

ఇతడు యవ్వన దశలో బ్రిటిషు గవర్నమెంటులో మొదట బళ్ళారిలో తర్వాత బొంబాయి రాష్ట్రములో తర్వాత బెంగాలులో నుద్యోగము చేసెను. కాని ఎచ్చటికి పోయినను తనలోని దూర్వాసుడు బయటకు పొక్కుచుండుటచే పై యధికారులతో వాదులాడి శీఘ్రము బుద్ధిపలాయనం అగుచుండెడి వాడు.

తుదకు మా పూర్వ కర్మ సంబంధ విశేషము చేత రాయచూరు జిల్లా లోని అతి ప్రాచీన శైవ క్షేత్ర రాజమగు అలంపూరు లోని బాల బ్రహ్మేశ్వరుని దేవాలయమును తన యాస్థానము చేసికొనెను. భక్తులు తండోపతండములు. కీ॥ శే॥ మా చిన్నాయన గారగు రామకృష్ణారెడ్డి గారు వారికి నచ్చినబంటు. అలంపూరులోని నవ బ్రహ్మల దేవాలయములలో నొకటి సుమారు 150 ఎకరముల నినాముతో సహా ఎన్నడో మసీదై పోయెను. బాల బ్రహ్మేశ్వరుని దేవాలయము ప్రక్కనే నొక గోరీ స్థాపితమయ్యేను. దాని కేటేట ఉరుసు. తక్కిన దేవాలయములు గబ్బిలములకు ఆశ్రయ మయ్యేను. మన శాస్త్రులవారు అచ్చట నిలిచిపోయినంతనే ముఖ్యముగా బాల బ్రహ్మేశ్వరుని గుడిని, అందుండు జోగు ళాంబా గుడిని పూజలు జరిపించి, ముందు మంటపములు కట్టించి ఒక సత్రము స్థాపించి చుట్టు పట్టుల తైర్థికులు దిగుటకై మంచి మంచి గదులు కట్టించి యుత్సవ మేటేట జరుగు నేర్పాటు చేసి ఒక నూత్న కళను జేకూర్చెను.

చందాలకు కొదువ లేదు. మా చిన్నాయన గారు చందాలు వేయించి పసూలు చేయుటకై స్వయముగా నేర్పడిన సాకి బిల్ కలెక్టరు. తక్కువ పడి నప్పుడెంతయు సరిపెట్టు ఖజాంచీ. మా గ్రామము శాస్త్రుల వారికి రెండవ అలంపూరు. అలంపూరులో లేకుండిన, మా గ్రామములో వెదికిన, వారు దొరకెడి వారు.

పెఱగుట విరుగుట కొరకే
సరసము విరసము కొరకే

అన్నట్లు శాస్త్రుల వారి యవసాన దశలో మా చిన్నాయన గారితో తగవు లాడిరి. ఇట్లు చాలకాల మిద్దరికి మాటలు లేవు కాని శాస్త్రుల వారి యవసానదశ సమీపించెను. మా చిన్నాయన గారిని పిలిపించి కన్నీటితో స్నేహ ముద్రను గట్టి చేసికొనెను. ఇద్దరు ఒకరిని పట్టుకొని ఒకరు ఏడ్చిరి. వ్రాత ద్వేషము మాయము. శాస్త్రుల వారు సన్యాసము పుచ్చుకొనిన 23 దినములకే సమాధి పొందిరి. వారి సమాధి ఇప్పుడు బాల బ్రహ్మేశ్వరుని గుడి యందే యున్నది. ఇవి యీ బ్రహ్మచారి యొక్క జీవిత విశేషములు. నాకు తెలిసినంత, విన్నంత వ్రాసినాడను.

వీరు పండిత ప్రకాండులు. దిట్ట కవులును, తార్కికులును, ధర్మశాస్త్ర ప్రవక్తకులును, వీర శైవులునై యుండియు నేమియు ప్రబంధములు వ్రాసి యుండక పోయిరి. నా పద్ద వారు చిల్లర పల్లరుగ వ్రాసిన రెండు చిన్న గ్రంథ ములు 1 సదాచార విచార ప్రచారః 2 సంఘ సంస్కరణోల్లంఘనము అను నవియు, కొన్ని పద్యములతో వ్రాసిన కర పత్రములును గలవు. వీరి కవిత ప్రౌఢ మనియు, నారికేళ పాకమునో పడినట్టి దనియు, వ్యాసాదిని నుదహరించిన వీరి శ్లోక పద్యముల నుండి వెల్లడియె. వారి వచన మెట్టుండునో చూడుడు-

"ఓ గ్రాజ్జుడేట్ ప్రొడ్వివాక నావ టూకులారా... ఇంత పక్కాలెత్తో పల్లె కొట్టపో (కలెక్టరీ అని) దివిటీ కొల్లె కట్టో (డిప్టీ) మొన్న సిబ్బో (మున్సిఫ్ అని) వచ్చిన మీరు సంఘ సంస్కరణములలోబడి పాడుకూళ్ళ గుడిచి నానా దుర్వ్యాపారములు జేయుచు, ప్రాయశ్చిత్తమైన బెట్టుకొనక, బోడ దాసల బెది రించడమా ఉద్యోగముల ద్రెంచడమా, ముందరి జుట్టు పెంచడమా ఏమి యీ యపార్థాలు చేయుట. కాలముకు దగినటుల శాస్త్రములను ద్రిప్పవలయునా? దిద్దవలయునా? మీ నెత్తిన గ్రుడ్డవలయునా?"

—సంఘ సంస్కరణోల్లంఘనం.

వీరికి నానా భాషలు వచ్చునంటిని గదా. కాదు. వారే వచ్చుననిని గదా. ఆ భాష లెవ్వియో వారే పై గ్రంథములో నిట్లు వ్రాసికొనినారు:

కా॥ ఇంగ్లీ షర్వము దెన్గు సంస్కృతము నా హిందీ మరాటుల్ గణిం
పం గ్లానింబడితేరి సద్గురు కృపా మాత్రాశ్రయై కాపినే
నాంగ్లో సాక్షను లాటినుల్సా మహి మోద్యచ్ఛక్తి సాధించి పే
ర్మింగ్లో సామ్యము నుర్వి విప్రకుల వార్థింగంటి నన్వింటిరే !

ఇప్పటికే వ్యాసము పెద్దదైనది.....

[గోలకొండ పత్రిక 30-7-1934]

వారాంగనా వీరాంగణము

శ్రీ చిదిరెమఠము వీరభద్రశర్మ

వినోద పాఠముగ కాశీక్షేత్రము నుండి బాలకవి చిదిరెమఠము వీరభద్ర శర్మగారు యిటుల వ్రాయుచున్నారు:-వెనుక ప్రకటించినటుల విలాసపురియందు ౩౪-౧౩-౨౮ తేదియందు అఖిల భారత వర్ష "వేశ్యమహాసభ" బహుతడాఖాగా జరిగినది. సభకు బెంగాలు, మళయాలు, బీహార్, కాశ్మీర్, కర్ణాటకాంధ్ర మహా రాష్ట్రాది దేశముల నుండి ప్రముఖ నాయకుసాను లాగమించి యుండిరి. వేశ్యా కులమున కర్హములగు సర్వగుణము లుండుటచే స్వేచ్ఛావిహారిణి పృథాద్రవ్య హారిణియగు మిస్. మోహినీ సానిగారు సభధ్యక్ష స్థానమలంకరించుట యోగ్య మైనదని బెంగాలు విశాలాక్షీసాని యుపపాదించగా మహారాష్ట్రపు మనోరమాసాని ఆంధ్రదేశపు అళికులవేణీ సాని కర్ణాటకపు కప్పుచంత్రాసాని సహర్షముగ నామో దించిరి. పిదప మి. మోహినీగారు సభాధ్యక్షతను స్వీకరించగా గోవాదేశపు గౌరీసాని పుష్పమాలతో నక్షిణికంఠము నలంకరించెను. పద్ధతి ప్రకారము అరబదేశపు ఆంతాళసానిగారు అరభిరాగమున తమ జాతీయ గీతమును "హా ప్రియా నినుబాసితే నేనే ప్రకారము సైతురా" అనెడి అందమైన పల్లవిచే నాళువుగా బాడెను. తరువాత అధ్యక్షురాలు తమ యసాధారణ ప్రజ్ఞచే నీక్రింది విధమున సంభాషించిరి:-

సోదరీమణులారా! మీకంద రమూల్యమగు వేశ్యావృత్తి నొకవైపుగ నుంచి యుత్సాహమున నీసభకాగమించి నందులకై ధన్యవాదముల నర్పించు చున్నాను. ఆదికాలము నుండి పరంపరగా వచ్చియుండి భారత భూమికి భూషణ ప్రాయమగు మన యీ పవిత్ర పద్ధతిని అరసికులు కొందరు నిర్మూలింప నెంచి యున్నారు. విషాదము! విషాదము! సఖులారా! పరమోపకారియగు మన్మథ

౫. హైందవులకు స్వరాజ్యము లభించినచో మనయ స్త్రీత్వాహాని సంభవించును గనుక నిరంతర మాంగ్లేయుల పాలననేయుంచుటకు దయాళుపగు ప్రభుత్వమును వేడుటేగాక ఖద్దరు వస్త్రముల ధరించుకొని మన పవిత్రమందిరములలో ప్రవేశించు వారిని బహిష్కార మొనర్చవలయును.

౬. సెంట్, పౌడర్, సోప్, వాచ్, సకుటై, సల్వార్, స్ప్రింగ్, పెన్ మొదలగు మన విలాస వస్తువులను కృపతో సకాలమునకు సప్లయిచేయుచున్నారు. కావున జపాను జర్మనీ అరేబియా అమెరికా ఆయర్లండు దేశీయులకు కృతజ్ఞత వెలిబుచ్చుచున్నది.

ఈ యారు తీర్మానము లంగీకరింపబడి "వర్ధంతాం వేశ్యాస్సుభగా। వర్ధంతాం విరాహాతురాః। వర్ధంతాం గణికాపాదీ సర్వస్వార్పిత సాధవః" అను మంగళాచరణ సంగీతమున సభను సమాప్తించగా సూర్యుడుబోయి చుక్కలుదయించుటచేత తమ వృత్తి ననుష్ఠింప తత్తరపడువారివలె కాంగ్రెస్సునుండి కదలిరి.

[నీలగిరి పత్రిక 1926 సెప్టెంబరు 23 వ తేది]

దినదిన ప్రవర్ధమానమగుచున్నది. పంచలకొలది కులీన స్త్రీలు అన్నవస్త్రములు లేక హాయ్‌హాయ్ మనుచున్నను మన భక్తులు వారిని కన్నెత్తిజూతురా ? అగ్ని సాక్షిగా పాణిగ్రహణ మొనర్చికొనిన తమ యర్ధాంగులను వదలి మనల యింటి దేవతలుగ బూజించుచు తమ మానధనములచేత తృప్తిపరచుటకై సడుము గట్టికొని నిల్చిన ప్రియులను జూడ మన యస్తిత్వమును నాశము జేయుటకు బ్రహ్మశక్యముగాదని దెలియవచ్చును. తమ గృహమందు త్రాగుట కంబలి లేక పోయినను భార్యాపుత్రుల త్యజించి దొంగతనముచేతనో దొరతనముచేతనో మన విలాసమునకు సంపూర్ణసహాయమొనర్చు దృఢభక్తులెందరోగలరు. లక్షాధిపతులు తమ యౌదార్యమును వ్యక్తపరచుటకై సర్వస్వమును సమర్పించి మన ద్వార పాలకులై గాచికొనియుందురు. ముందు మన సంఘము నణగద్రొక్కుటకై కంకణము గట్టుకొనియున్న శుద్ధవైదిక బ్రహ్మచారులు, వేదాధ్యయనమును శాస్త్రవ్యాసంగమును వదలి బాల్యవివాహములందును శ్రాద్ధములందును లభించిన పయిసలన్ని మన పాదములంబోసి పరమానంద మొందుచున్నారు. భావి రాష్ట్రోద్ధారులగు విశ్వవిద్యాలయ విద్యార్థులు కూడ మనయం దపారభక్తిపరంతులై యున్నారు. దేశమును సుద్ధరింపదలచిన వారు మనది యార్యసమాజమని దెలిసియేగదా మన గృహమునకు వచ్చినప్పుడు తుచ్ఛమగు జాతి నీతులను లక్షించక తమ విశ్వబాంధవ్యమును గనుపరచెదరు. ప్రపంచమంత మన యార్య సమాజముతో నేకీభవింపజేయు భావము వారి రోమరోమములయందు నిండి యున్నది. మన సోదరీమణులం దనేకులు యవనాది యంత్యజాతివారు, దొమ్మరి సింది వారున్నను ఉచ్చవర్ణీయులగు బ్రాహ్మణాదిచాతుర్వర్ణ్యముల వారు యధరామృతమును గ్రహించుచునే యున్నారు గదా! అన్నతమ్ముడు, తండ్రి కొడుకు, మామ అల్లుడు అనకుండ వినియోగించుచుండగా ఏ దేశనాయకు డెంతటి మారణమంత్రములను చదివినను మనవంశవృక్షమొకింతైనను చలింప నేరదని నిశ్చయముగ నమ్మకమున్నది. ఈ మన విశాలతత్త్వము నరసియే, విధవలును తృతీయాప్రకృతివారును అంతరంగముగ మనవృత్తి ననుష్ఠించు చున్నారు. కులీన శ్రమణులు మన వృత్తినాచరించకున్నను వారివేషభాష హావభావ

రంగుడంగులు మన దారిని జేర్పగలవని చెప్పకయే జెప్పుచున్నవి. కాని ఇట్టి ద్రోహు లెన్నటికిని వృద్ధినొందజాలరు. ఆర్యసమాజ స్థాపనాచార్యుడగు దయానంద సరస్వతి మన ద్రోహమువలననే యికాలమ్మత్యుపాలాయెను. మహాత్మా గాంధీగారెప్పటినుండి మన విద్రోహమనుష్ఠింప నెంచిరో అప్పటినుండి వారి అసహాయోద్యము జెప్పనేరులేని తీరైనది. మనల ద్వేషించి యేమన్న మహారాజొకడు పదచ్యుతుడై పరదేశమేగినాడు. ఇదంత యెందులకు? మాసము రోజులక్రిందట మన విద్రోహమువలననే సూర్యాపేట సభలాగి పోయినవి. పదిండ్లుగల పల్లెమొదలుకొని పాతికవేల మేడలుకల బొంబాయి, కలకత్తా మదరాసు, ఆగ్రా, ఢిల్లీ మున్నగు పట్టణములయందును కాశీగయారామేశ్వరము శ్రీరంగము తిరుపతి మొదలగు దివ్యక్షేత్రము లందును మన ప్రాముఖ్యత గలదు. మనము లేకపోయినచో జాతరలు సాగునా? లగ్నములు కొనముట్టి గలవా? వచ్చిన చుట్టాలు మూతులు ముక్కులు విరుచుకొనరా? యువకులు లఘ్నమునాటి తెల్లవారు జామునసే రైలుకు వెళ్లరా? ఇరుగుపొరుగువారు "యేంపెండ్లమ్మా ఒక భోగమువాండ్లా? ఒక పాటా ఒక పద్దెమా? దావతులేదు గీవతులేదు, గుళ్ళెచేసుకున్న పెండ్లోలిగున్నది" అనరా? సోదరీమణులారా! ఇప్పటి పత్రికలలో అన్యాయముగా వారకాంతలు వారకాంతలని యేమేమో వ్రాసి పడవేయుదురుగాని అదెంతమాత్రము నిజముగాదని నా తలంపు. యెందుకనగా మనమే పవిత్రులము గాకపోయినచో మూసీనది ప్రవాహము వలన గొట్టుకపోయిన మన గొలీగూడెమేకాదు, హయిదరాబాదు పట్టణమంత కూడ రెండింతలు పెరిగినది. అంతేకాదు, మన శాపమువలన విధ్వంసమై మూసీనది ఒకచుక్కలేకుండ యెండిపోయినది. ఇటువంటి మహాత్మ్యములచే నగ్నివంటి మన కులము కవిమహారాజుగారి దక్షిణభాగమున సేనాధిపతియై వీరాంగణముస కత్తి త్రిప్పుచుండ బ్రిటిషురాజ్యమువలె చిరస్థాయి యగుననుటకు గసపు గింజంత యైనను సంశయము లేదు. అంత్యకుండు తమ యందర కాగ్రహ పురస్సరముగ సూచించునదేమనగా వేశ్యాప్రతాపము కల్పాంతరముల వరకైనను విచ్చితి గాకుండ మన వృత్తి సహోదాత్తములయం దసుష్ఠింపుచుండ వలయును.

లభ్యము అయినంత వేశ్యోద్ధార కోశనామమున బ్రోగుజేసి ఈ పృత్తిచే నష్టకష్ట ములపాలైన మన భగినులకు పయి కోశము నుండి సహాయమొనర్చి వారల చక్కపరచవలయును. కావున యభిమానులును ఉదారులును అగు తమ సహా యమున నీ మహత్కార్యము నెరవేరవలసియున్నది. సోదరీ రత్నములారా ! యింతకాలము నా యుపనాస్యము సతిశ్రద్ధతో వినినందులకుగాను మీయెడ కృతా పూర్వకాభివాదముల సర్పించుచున్నాను.

అధ్యక్షిణి విరమించిన పిదప నీక్రింది తీర్మానము లేకగ్రీవముగా స్వీక రింపబడినవి.

౧. వేశ్యాకులమణియగు మిస్. ముంతాజు బేగముగారు మహా విపత్తునుండి తేలినందుకుగాను ఈ మహాసభవారు హార్దిక సంతసమును వెలిబుచ్చుచున్నారు. ఇటువంటివారలచే సమాజమున కపారమగు గౌరవము గలుగుచున్నది గావున ఇట్టి యనేక రమణీ రత్నముల నీ భారత సాగరము ప్రసవించుగాకయని యాప్రద్యుమ్న జనకుని ప్రార్థించుచున్నారు.

౨. అరసికులగు మహాత్ముడు మున్నగు వారు కొందరు తమ దయాత త్వమును మరచి నిర్దయతో మన పంశపృక్షముపయి కుఠారముల నెత్తినందులకు గాను విషాదమందుచు నీయసూయు బాధ్రదోలుడని చక్రవర్తిగారిని ప్రార్థించు టయే గాక వేషధారులగు బ్రహ్మచారులును బావాజీలును సహాయులుగా నుండవేడు చున్నది.

౩. మన యీ పవిత్ర పద్ధతి స్వతంత్రముగా నాచంద్ర తారార్కము స్థాయియగుటకై మన సంఘ పక్షమున ప్రతినిధులను కౌన్సిలునకు బంపు విధా రమున త్వరగా నొకయాలోచనా సంఘమును జేయవలయును.

౪. (సంగీత) మేళములతో బాటు నుపదేశసంఘముల నేర్పరచుకొని హావభావ యుక్తములగు నుపన్యాసములచే అరసికుల చిత్తమాకర్షించుచేగాక విధవలను, తృతీయా ప్రకృతివారు (నపుంసకులను) మన వృత్తి నవలంబించకుండ నిషేధించవలయును.

౫. హైందవులకు స్వరాజ్యము లభించినచో మనయ స్త్రీత్వహాని సంభవించును గనుక నిరంతర మాంగ్లేయుల పాలననేయుంచుటకు దయాళువగు ప్రభుత్వ మును వేడుటేగాక ఖద్దరు వస్త్రముల ధరించుకొని మన పవిత్రమందిరములలో ప్రవేశించు వారిని బహిష్కార మొనర్చవలయును.

౬. సెంట్, పౌడర్, సోప్, వాచ్, సకుటై, సల్వార్, స్ప్రింగ్, పెన్ మొదలగు మన విలాస వస్తువులను కృపతో సకాలమునకు సప్లయిచేయుచున్నారు. కావున జపాను జర్మనీ అరేబియా అమెరికా ఆయర్లండు దేశీయులకు కృతజ్ఞత వెలిబుచ్చుచున్నది.

ఈ యారు తీర్మానము లంగీకరింపబడి ''వర్ధంతాం వేశ్యాస్సుభగా। వర్ధంతాం విరాహాతురాః। వర్ధంతాం గణికాపాదీ సర్వస్వార్పిత సాధవః'' అను మంగళాచరణ సంగీతమున సభను సమాప్తించగా సూర్యుడుబోయి చుక్కలుదయించుటచేత తమ వృత్తి ననుష్ఠింప త త్తరపడువారివలె కాంగ్రెస్సునుండి కదలిరి.

[నీలగిరి పత్రిక 1926 సెప్టెంబరు 23 వ తేది]

46

యశో విమానం

'విశ్వామిత్రుడు'

మోటారు కార్ల గతి పట్టేసింది ఏరోప్లేన్లకు. విమానాలంటే చెంగు చెట్టంత చాలా మంది ప్రజలకు. యశోవిమానం అంటే మరేదో. ప్రాణం మానం ధనం అన్నీ కీర్తికామిని చరణకమలాలకే అర్పిస్తున్నారు అనేకులు. భూతభవిష్యద్వర్తమానకాలాల్లో ఎప్పుడూ కీర్తి దేవతకు జరిగే పూజా, పురస్కారాలలో లోటు పాటులు ఏమీ జరుగవని తెలుపుతీర్మానాలు దేవతల శాసన సభలో ఆనాడే అయ్యేయట. కైలాసం సమీపంలో కీర్తి దేవత తన స్వర్గాన్ని నిర్మించుకొని తన భక్తుల రాకను ఎదురుచూస్తూ ఉంటుందని ఆ మతానిక సంబంధించిన పురాణాలంటవి. అక్కడికి వెళ్ళేవాళ్ళలో కొందరికి సామీప్యం, కొందరికి సాన్నిధ్యం. మరికొందరు సామీప్యం వారివారి అర్హతలను అనుసరించి ప్రాప్తిస్తుంట వంటారు. శివుడి కైలాసానికి వానికి కొన్ని భేదాలున్నాయి. యశోదేవత కైలాసానికి బొంది తోనే వెళ్ళవచ్చు అందరూ. సాధారణంగా అందరూ బొందితోనే వెళ్ళడానికి ప్రయత్నిస్తారు ఆలోకానికి. చాలామంది వెళ్తారు కూడాను. ఆ లోకం చేరడానికి సర్వీసు విమానాలున్నాయి. అయిదారు కంపెనీలు ప్రయాణీకుల సౌకర్యం కోసం చాలా విమానాలను ఏర్పాటు చేశాయి. పత్రికాధిపతులు పత్రికా విలేఖరులు కలిసి ఒక కంపెనీ. పేరిదే పెద్ద కంపెనీ. హైద్రాబాదులో దక్కన్ మోటారు సర్వీసు లాంటిది. భద్రాజులు, ఎడ్వర్టైజ్ మెంట్ బూకోలు, అచ్చాఫీసులు. గోడలు, మోటార్లు-మొదలైనవన్నీ కలిపి ఒక కంపెనీ-ఇందులో చేతనా చేతన భయం కాదు లెండి.

అయితే ఒకటి జ్ఞాపకం పెట్టుకోవాలి. కీర్తి దేవత కైలాసానికి వెళ్ళలేవీ విమానాలన్నీ. యశో విమానం నిలిచే స్థలందాకా తీసుకొచ్చి విడిచి పెట్టిపోతాయి.

తరువాత అక్కడి యశో విమానాధిపతికి ఎవరి అర్హతలు వారు నివేదించుకోవాలి. తరువాత ఆయన నిర్ణయిస్తాడు ఎవరిని ఎక్కించుకోవలసింది, ఎవరిని ఎక్కించుకోకూడనిదీ.

ఒకనాడు షైరుకు వెళ్ళు ఏదో ఆలోచనలో చాలాదూరం నడచిపోయాను. ఒక పెద్ద మైదానంలో చాలా మంది స్త్రీలు పురుషులు మందలు మందలుగా కూడి ఉన్నారు. ఏమిటయ్యా అనుకుంటే అది యశోవిమానం ఆగే మైదానం అని వారందరూ ప్రయాణీకులని ఎవరో చెప్పారు. వినోదం చూద్దామని నేనూ అటువైపు వెళ్ళాను. ఆ తోపుడులో విమానం దగ్గరకు వెళ్ళేసరికి గంటలు పట్టింది. ఏం తోపుడని చెప్పను-నలిగి పోయాననుకున్నాను. విమానం ఎక్కడ దాటిపోతుందో అనే అందరికీ తొందర. ''ఎందుకీ ఆరాటం? మరో విమానంలో వెళ్ళరాదు?'' అన్నాను ఎవరో నన్ను తోసుకుపోతుంటే. ''నీకేం తెలుసు? ఈ విమానంలో వెళ్ళడం చాలా సులభం. లోపల సౌకర్యాలు కూడా చాలా ఉన్నాయి. తక్కిన విమానాలలో దరిచేరడానికైనా తరం అవుతుందా మాకు'' అన్నాడు అతడు. అవును లెండి, ఈ విషయం నేను విన్నాను. The path of glory is strewn with thorns అని ఇంగ్లీషులో ఉంది అన్నాను. మరి తెలిసి ఉండీ ఇలాగంటావేం, అన్నాడతడు.

విమానం దగ్గరకు వెళ్ళాను. అబ్బె పెద్దది కాదు. ఇంత మంది ఎలా గెక్కలనుకుంటున్నారు చెప్మా దీనిలో, అనుకున్నా. నా సందేహం ఒకడు గ్రహించాడు. వీళ్ళందరూ విమానం ఎక్కడానికి వచ్చినవాళ్ళు కారండీ! ఇందులో అర్హతలు ఎవరికివాళ్ళు సరిగా చెప్పుకోలేమేమో అని కొందరు లాయర్లను తెచ్చుకొన్నారు. కొందరు సిఫారసులు చేసే పెద్దమనుషుల్ని తెచ్చుకున్నారు. కొందరు పొగిడే బట్టురాజులను తెచ్చుకొన్నారు. కొందరు మీలాగ వినోదం చూడడానికి వచ్చినవాళ్ళున్నారు, అన్నాడు. కృతజ్ఞుణ్ణి. నా సందేహం తీర్చారు, అన్నాను.

విమానం నడిపే కప్తాను కనిపించాడు. ప్రసన్నముఖం - దరహాసాల్ని వెలిజిమ్ముతున్న కళ్ళు, తీర్చిన ముక్కు, తొణికిసలాడని ఆజానుబాహుడైన తన చేతులతో ప్రజలను వారిస్తున్నాడు - కాని వినేదెవరు?

ఇంతలో ఆ మందలోంచి తొందర తొందరగా వగుర్చుకుంటూ ఒక మనిషి పచ్చాడు. కన్నులు లోపలికి పోయివున్నాయి. దవడలు లోపలకు లాక్కు పోయాయి. విశ్రాంతి లేకుండా వేళకు తిండితిప్పలు లేకుండా మనస్సుని, దేహాన్ని, మెదడును అంతటిబాధ పెట్టిన మనిషిలా కనిపించాడు. కప్తాను జాలి పడ్డాడు. 'నమస్కారం. సుఖమేనా?' అన్నాడు. 'ఏం సుఖం అండి. ఎవ్వరూ ఏం పని చేయరాయె. ఒక్కడిమీద విడిచిపెట్టేస్తారు. workers తక్కువ మన దేశంలో. అందుకు ఇలాగేవుస్తుంది దేశం. చేస్తున్నవాళ్ళకు పంకలుదిద్ద డానికి వస్తారు. ఏదో చేస్తున్నాను. రాత్రింపగళ్లు.'

'చేయండి. చేయడం మన ధర్మం. ఫలాన్నపేక్షించకూడదు. యత్కరోషి యదశ్నాసి' అన్న భగవద్వాక్కు మరవకూడ'దన్నాడు.

'అవునండి. నేను అలాగే చేస్తున్నా' నన్నాడాయన. ఆయన ముఖంలో కొంత ఖంగారు కనిపించింది. ఏమిటింటాడితను, అనుకుంటున్నాడా ఆయన అనిపించింది. చిరునవ్వు నవ్వాడు.

'తమ నామధేయం' అన్నాడు కప్తాన్. ఆయన పేరు చెప్పాడు. 'నన్ను మీరు ఎరిగేఉంటారు. నా పేరు ఈమధ్య చాలా ప్రచారం అయింది. నా బొమ్మ కూడా పత్రికల్లో చూసిఉంటారు.'

'అవును జ్ఞాపకం వచ్చింది. పత్రికా నిర్వాహక కీర్తి మోటారు బస్సు సర్వీసువారు ఈ విషయంలో మీకు కావించిన సేవ అపారం' అన్నాడు చిరు నవ్వు ముఖంతో కప్తాను.

"సభ ఇంత జయప్రదంగా జరగడానికి వారి సహకారం ప్రబలమైన కారణమని మొన్న నేను ఒక స్నేహితుడితో మాటలాడుతూ అన్నాను. మావాళ్లు కొంచెంలో కక్కుర్తి పడలారుగాని లేకపోతే ఇంకా జయప్రదంగా జరిగేవి" అన్నాడు.

'ఐతే ఇప్పుడు ప్రయాణం ఎక్కడికి ? అలంకరించుకొని వచ్చారు?' అన్నాడు కప్తాను.

'ఈ పూలహారం కామారెడ్డిలో వేసింది. ఇది సిరిసిల్లలో. ఇది తూపు రాన్‌లో. నాకు అలంకారం అంటే అంత శ్రద్ధలేదు. ఏదో ప్రజలు మాయందు కల గౌరవం కొద్దీ వేసిన హారాలను తీసేయలేక తొందరలో హారాలతోనే ఇక్కడకు వచ్చేశాను' అన్నాడాయన కొంచెం తడబడుతూ.

'విమానం దాటిపోతుందని తొందరపడినట్టున్నారు' అని సూచించాడు కప్తాను.

'నాకా తొందరేమీలేదు లెండి. ఏదో విమానం దాకా వచ్చానుకదా కీర్తి దేవతను ఒకసారి దర్శించుకుందామని బుద్ధిపుట్టింది. ఆ దేవిని దర్శించాలని చిర కాలం నుండి గాఢమైన వాంఛ ఉంది. కాని మా దేశంలో ఆమెను ఆరాధించ డానికి దేవాలయాలాట్టే లేవు. ఉన్నదే ఒకటి. మొన్న నా అదృష్టం కొద్ది మావాళ్ళు నన్ను పూజారిగా ఏర్పాటుచేశారు. ఆమెను చాలా అర్చించాను. ఆ దేవి ప్రసన్న అయిందో లేదో ఆమెను కళ్ళార దర్శించుకొని అడగాలని ఉంది' అన్నా డాయన.

'ఆమెను దర్శించడానికి మీకేం అర్హత ఉంది?' అని అడిగాడు కప్తాను.

'ఇప్పుడు చెప్పిందంతా ఏంటి ? ఆ దేవి ఆలయంలో అర్చకుడుగా పని చేస్తున్నాను మూడు నెలల నుండి. నా పేరు ఈ రాష్ట్రం అంతా ప్రాకిపోయింది. నా చిత్రం ఇక్కడి పత్రికల్నే కాకుండా ఇతర రాష్ట్రాల్లో పత్రికలను కూడా అలంకరించింది' ఇంకా ఏదో చెప్పబోతున్నా డాయన.

'ఇంతమాత్రానికి మీకు అర్హత లేదంటాను కీర్తికైలాసానికి రావడానికి' అన్నాడు కప్తాన్.

'నాకు అస్వస్థత లేదంటారా? ఒక నెలపాటు వేళకు భోజనం చేయలేదు. కళ్ళార నిద్రపోలేదు. నా ఆత్మ సౌఖ్యాన్ని తృణప్రాయంగా ఎంచాను. నా శ-' అనబోతుంటే కప్తాన్ 'నేనెరగనూ మీ శరీర సౌకుమార్యం. కాఫీ హోటల్లుకు వెళ్ళినా కారులో వెళ్ళేవారు మీరు. అలాంటిది ఇన్నాళ్ళు ఇంతకష్టపడ్డారంటే జాలి పడవలసిన విషయమే. అవును మరి ఏం చేస్తారు. కీర్తి దేవత సామాన్యమైన బలి కోరదు'.

'ఇంతకూ నన్ను తీసుకొని వెళ్తానంటారా?' అని అడిగాడాయన.

'ఎందుకు తొందరపడతారు? కొన్నాళ్ళెందు కాగరు? ముందు మీరు చాలా పని చేయవలసి ఉంది. నా మాట విని కొన్నాళ్ళాగండి.'

''అట్లా ఎలాగౌతుంది? మీకలాంటి భయం ఏమీలేదు. నేను ఎంత పెద్ద వాడినైతే అన్ని ఎక్కువ విషయాలు, అన్ని మంచిపద్ధతులు నేర్చుకొంటాను. అందరికీ నాకూ ఇదే భేదం. అందరూ అన్నివిషయాలు నేర్చుకొనిగాని పెద్దవాళ్ళు కారు. నేనో-పెద్దవాడినై అప్పుడు నేర్చుకొంటాను. ఒకటిచూడండి. పూర్వం ఎప్పటికేది వీలైతే ఆ పని చేసేవాడిని, ఇప్పుడు ఒక Time-table తయారు చేసుకున్నాను. ఏఏవేళల్లో ఏం చేయాలో ముందే ఒక నిర్ణయం చేసుకున్నాను. ఒక Engagement calendar కూడా నా బల్లపై ఎప్పుడూ ఉంటుంది. పూర్వం అందరితో కులాసాగా మాటలాడుతూ ఉండేవాడిని. ఇప్పుడు కొంచెం Reserved గా ఉండడం నేర్చుకొన్నాను. పూర్వం నాకు ఇష్టా ఇష్టాలు అట్టే ఉండేవి కావు. అందరూ ఏది మంచిదంటే నేనూ ఊకొట్టేవాడిని. ఇప్పుడు నా మనస్సులో ఇష్టాఇష్టాల పట్టీ ఒకటి అతికించేశాను. అవన్నీ శాసనాలు. ఎప్పటికీ మారవు. పూర్వం పత్రికల్లో నా ఛాయా చిత్రంగాని, నన్ను గురించి ఏం పడుతుందన్నా సిగ్గుగా ఉండేది. ఇప్పుడా సిగ్గువదిలేశాను. అలాగే పూర్వం నన్నెవరైనా నాయకుడంటే కొంచెం సిగ్గు వేసేది. ఇప్పుడు నన్నెవరైనా నాయకుడంటే అంగీకార సూచకంగా చిరునవ్వు నవ్వుతాను. నేనెలా మారి

పోతున్నానో చూచాయగా చూపించడానికి కొన్ని విషయాలే చెప్పాను. నేను Improve చేసుకుంటాను. నన్ను యశోదేవీ మందిరానికి రానివ్వండి" అన్నాడాయన దీర్ఘంగా. కప్తాన్ చిరునవ్వు నవ్వుతూ, అప్పుడప్పుడు తలపంకిస్తూ, అప్పుడప్పుడు కళ్లలో ఆశ్చర్యం సూచిస్తూ, అప్పుడప్పుడు జాతి చూపిస్తూ, చివరకు ఒకచోట విసుక్కుంటూ అంతా విన్నాడు.

''ఐతే నా మాట వినరన్నమాట మీరు'' అన్నాడు తన నైరాశ్యాన్ని వెలి బుచ్చుతూ కప్తాను.

నల్లటాయన చెమర్చిపోతున్నాడు. ''నేనూ ముందు అలాగే అనుకున్నాను, కొన్నాళ్ళ తర్వాతే ఆ దేవిని చర్శిద్దామని. కాని ఇప్పుడు నాకు ఆత్మ విశ్వాసం హెచ్చయింది. ఆ దేవిని చర్శించడానికి సంపూర్ణ అర్హత కలిగిందని నాకని పిస్తుంది'' అన్నాడాయన వాంఛాదీప్తితో వెలుగుతున్న కళ్లతో చూస్తూ.

''సరే. ఐతేరండి. తీరా అక్కడికి వచ్చి ఏం చేస్తారో, వచ్చిచూడండి. దానిలో ఉన్న కష్టం మీకే తెలుస్తుంది.'' అని దారి చూపించాడు కప్తాన్ విమానంలోనికి.

అత్యధిక సంతృప్తి విజయగర్వం సూచించే దృక్కులను జనంకేసి ఒక్కసారి నిగిడ్చి విమానం ఎక్కాడాయన, మోటారులో డ్రైవరు సీటులోనికి ఎక్కినట్లు.

ఆయన ఎక్కే ఎక్కడంతో మరొకాయన జనాన్ని తోసుకొచ్చాడు. సిఫార్సు చేయడానికి కాబోలు వచ్చిన ఒక పెద్దమనిషిని 'జరగవయ్యా' అని గద్దించి తోసుకు ముందుకు వచ్చి పడ్డాడు. ఆ పెద్దమనిషి ఆయనను ఎగాదిగా చూసి చిరునవ్వునవ్వి ఊరుకున్నాడు.

''ఏడికి వెళ్తుందయ్యా ఈ విమానం?'' అని నిర్లక్ష్యంగా అడిగాను కప్తానును. కప్తాను ఒక నిమిషం వింతగా చూచి ''మీరు ఎక్కడికి వెళ్తారు?'' అని అడిగాడు.

బెంగాలీ లాల్చీ, గాంధీ టోపీ, స్ఫోటకం మచ్చల చామన చాయపైనా కళలనీసుతున్న ముఖం-ఎప్పుడు ముఖం మీద నాట్యమాడే మందహాసం-నిర్లక్ష్య భావం-వయస్సు చూపిస్తున్న తల-తెలివితేటల్ని సూచిస్తున్న కళ్ళు-పెంకితనాన్ని సూచిస్తున్న వాలకం-ఇదంతా చూస్తే ఆట్టే ఎక్కువగా వాదించదగ్గ మనిషిలా కనిపించలేదు కప్తానుకు.

"అదేదో యశోదేవి ఆలయం ఎక్కడో ఉందట. మా వాళ్ళు చాలా మంది వెళ్తున్నారు అక్కడికి. నాకు వెళ్ళాలని బుద్ధిపుట్టింది" అన్నాడాయన మందహాసంతో.

'అక్కడికి అందరూ వెళ్ళడానికి పిల్లేదే. దీనికిమీకేమైనా అర్హత ఉంచా?' అని అడిగాడు కప్తాను భుజంమీద చెయ్యిపెట్టి.

ఆయన భుజంమీద ఉన్నచేతిని విదిల్చేసి "నాకు అర్హత లేకేమిటి? నేను డబల్ గ్రాడ్యుయేటును. ౪ భాషల దాకా వచ్చును. ఒకసారి మా రాష్ట్రంలో కీర్తి దేవతా మందిరానికి పెద్దగా ఉన్నాను. మా రాష్ట్రంలో తెలుగు పత్రికా కీర్తి మోటారుబస్సు సర్వీసుకు కండక్టరుగా ఉంటున్నాను. పద్యాలు రాస్తాను. పాటలు రాస్తాను. కథలు రాస్తాను. కబుర్లు రాస్తాను. నాటకాలు, చారిత్రక వ్యాసాలు, సివిక్సు పుస్తకాలు ఎన్నో రాశాను. నా ఫొటోలు అనేకచోట్ల అనేక సంచర్చాల్లో అచ్చయ్యేయి. మా రాష్ట్రాంధ్రుల్లోకెల్ల నేనే పెద్దవాడనని నై వాళ్ళంచరూ అనుకుంటారు. ఇప్పుడు ఆ నల్లటాయనతోపాటు కీర్తిదేవతా మందిరానికి సహాయపూజారిగా ఉన్నాను. ఇంకేం కావాలయ్యా నీకు.?" అన్నా డాయన మెత కొంచెం ముంచుకు లాగి.

"మీ తక్కిన అర్హతలు ఎలాగున్నా చివరిది కొంచెం నామకః ఉద్యోగం అనుకుంటూ ఉంటే విన్నాను. ఏమంటారు" అన్నాడు కప్తాను చిరునవ్వుతో.

"ఐతే కావచ్చు. నేనే అన్నాను మొన్న మాట. ఆ ఒక్కటి తక్కువైతే నాకేమైన కొరత వచ్చిందా?"

"ఆ మాట నేనూ ఒప్పుకొన్నానుగాని మీరు మరొక విమానంలో వెళ్ళ రాదూ? ఈ విమానంలో స్థలం చాలదనుకుంటాను" అన్నాడు కప్తాను స్నేహ భావంతో.

"దేనిలో ఎక్కమంటారు?"

"మీరు గ్రంథకర్తలుగా! కవులు, కథాకారులు మొదలైనవారి విమానం ఒకటి ఇప్పుడే పస్తుంది. దానిమీద వెళ్ళడానికి కూడా మీకు అభ్యంతరం ఉందన వచ్చును కదా. దానిలో ప్రయత్నించండి." కప్తాను సలహాఇచ్చే గొంతుతో.

"దానిలోమాత్రం ఎక్కడానికి కొద్దిమంది వేచుకొని ఉన్నారు? ఆ కప్తాను ఇలాగే అంటే నేనేం చేసేది అబ్బా. నేనొల్ల. ఇందులోనే పస్తా" అన్నా డాయన పట్టుదలతో.

ఇంక పదలడనుకున్నాడు కప్తాను. "ఐతే రండి. యశోదేవి దగ్గర కొంచెం సున్నితంగా ప్రవర్తించండేం" అని లోపలికి దారి చూపించాడు.

ఆయన వెళ్ళేముందు ఛలోక్తిగా "దూది, పరుపూ, తలగడా" అన మంటారా, లేకపోతే ఛాపకవుల్లా 'మంజులం, మధురం, కోమలం' అని ప్రారం భించమంటారా?" అంటూ లోపలికి ప్రవేశించబోతూ- ముందెక్కిన ఆయన దృష్టిపట్టాడు కాబోలు- 'దండమయ్యో. అప్పుడే లోపలికి వచ్చేశారు. గోల్కొండ వ్యాపారులు!" అంటూ లోపలికి వెళ్ళాడు. "నమస్కారం దయ చెయ్యండి" అని మొదటాయన ఆయన్ని కూర్చోబెట్టాడు.

ఇంతలో మరొకాయన వచ్చాడు. చేతిలో కట్టి, ఖద్దరు షేర్వాని, పంట్లాము, తెల్లటిటోపీ- పొడుగరి కాయ- మంచి తెలివి విరజిమ్ముతున్న కళ్ళు- ప్రసన్న ముఖం. మనిషిలో ఏమీ తొంపర లేదు - సాయంకాలం వాహ్యాళికి వెళ్ళేవాడిలా ఉన్నాడు. కప్తానును చూడగానే అతను నమస్కరించి కుశలమడిగి మాట్లాడ్డం ప్రారంభించాడు. 'ఏం ఇలా దయ

చేశారు?' అన్నాడు దరహసిస్తూ కప్తాను. 'మరేంలేదు. యశోదేవి కైలాసానికి వెళ్ళే విమానాలున్నవట. చూద్దాం. వీలైతే ఒకపారి వెళ్ళి వద్దామని బయలుదేరాను. ఈ విమానం తమదేనా ఏమిటి!' అన్నాడాయన. 'చిత్తం తమకు యశోదేవంటే ఎక్కువ భక్తే' అన్నాడు కప్తాను.

"చూడండి. నేను చెప్తాను. యశోదేవి అంటే భక్తి లేనిదెవరికి? కాసి దానికి అనేక యజ్ఞాలు చేయాలి. మేళ, ప్రభ్ధ, బలం, బుద్ధి, ధనం- ఒక్కొక్కప్పుడు అభిమానం, మానం కూడా- ఆ మహా యజ్ఞాలకు ఆహుతి ఇయ్యవలసి వస్తుంది. ఇవన్నీ ఆహుతి ఇవ్వడానికి ఉండవద్దూ. ఒకటి ఉంటే ఒకటి ఉండదు. మేళ ఉంటే ధనం ఉండదు. ధనం ఉంటే మేళ దొరకదు. ఒక్కొక్కప్పుడు రెండూ ఉన్న చోట్ల బుద్ధిబలం ఉండదు. ఇవన్నీ ఉన్నవాడికి ఎక్కువ అభిమానం ఎక్కువ ఆత్మగౌరవం ఏడ్చాయంటే ఇంక వాడు భ్రష్టుడౌతాడు. ఇలాంటి చిక్కులెన్నో ఉన్నవి. నేను మొన్న కౌన్సిల్ మహాయజ్ఞం చేద్దామనుకొన్నాను. ధనం దొరకలేదు. ఒకసారి కార్పొరేషన్ సవసం చేస్తే కొంత క్షవరం అయింది. అప్పటి నుండి లౌబా చేసుకున్నాను. అదీ కాకుండా నాకు మేళ కూడా లేదు. ధనం కావద్దూ. నాకు ఖర్చెక్కువ. అందరిలాగ కాదు, ఒక పంటవాడు, ఒక డ్రైవరు, ఒక నౌకరు, పెద్ద ఇల్లు-ఇదంతా ఎలా సాగుతుంది, యశోదేవిని ఆరాధిస్తూ కూర్చుంటే?" ఇంకా ఏదో చెప్పుతున్నాడాయన.

కప్తాన్ మాటకు అడ్డువచ్చి "మీ వయస్సెంతండి?" అని అడిగాడు.

"సలభై ఏండ్లుంటాయి. అలాగెందు కడిగారు?" అని కొంచెం ఆశ్చర్యంతో పృచ్ఛించాడాయన.

"ఇంత తక్కువ వయస్సులో ఎంత ప్రపంచజ్ఞానం గడించారండి. మీకు చాలా లౌక్యం తెలుసు సుమండి, అందుకా మీరు ఁం ఏళ్ళ మనిషిలా కనిపిస్తారు. ఎంత మీరు ప్రసన్న ముఖం కలవారైనా" అన్నాడు కప్తాను కళ్ళు వింతగా పెట్టి.

''కానివ్వండి, పూర్వం మా రాష్ట్రంలో నేను లేని యశో దేవతాలయం ఉండేది కాదు. చిరకాలం ఆ దేవిని పూజించాను. అనేక యజ్ఞాలు చేశాను, చేసి చేసి వేసారిపోయాను. ఇప్పుడు కూడా ఆ దేవిని మరువలేదు. ఆమెనప్పుడప్పుడూ పూజిస్తుంటాను. నా అర్హతలు ఆ దేవికి తెలుసును. ఏభాషలోనైనా కవిత్వం చెప్పగలిగేవాణ్ణి. నాలుగు భాషలు బాగా వచ్చు. ఆసు మందిరానికి పెద్దనైకొన్నా ళ్ళున్నాను.''

''ఆ కాలంలో మందిరం పాడు పడిందటగా'' అని కప్తాను మాటకడ్డు వచ్చాడు.

''దానికి నేనా కారణం? అనేక కారణాలున్నాయి లెండి. నా బాధ్యత కూడా కొంత ఉంది. అది నేను ఒప్పుకుంటాను. ఏదో నా శక్తికొద్దీ పూజించాను. జీవితమంతా ఆమెకై తపస్సు చేద్దామంటే నా సాధ్యం కాదు. నేను బ్రహ్మ చారినికాను. యజ్ఞాలైనా చేద్దామంటే తగినన్ని పరికరాలు నా దగ్గరలేవు. ఐనా మానను. నా యావజ్జీవితం ఏమైనా, యజ్ఞాలు-చిన్న చిన్నవైనా-చేసి ఆ దేవిని తృప్తిపరుస్తూనే ఉంటాను. మీ వీలైతే ఆ దేవి దర్శనం చేయించండి. లేక పోతే నాకేమి అంత తొందరలేదు'' అని ప్రత్యుత్తరాని కెదురు చూస్తూ నిశ్చ లంగా నుంచున్నా డాయన.

''కోపలికి దయచెయ్యండి. మీకంత భక్తి ఉంటే నేను నిరాకరిస్తానా!'' అని ఆదరంతో ఆయనకు లోపలికి దారి చూపించాడు కప్తాను.

ఆయనా లోపలికి వెళ్ళేసరికి ఒక బక్కవ్యక్తి గాలికి ఊగిపోతూ వచ్చాడు. ఖద్దరు షేర్వాని. అక్కడక్కడ చిరుగులు పడ్డ ఖద్దరు షరాయి. గాంధీటోపి, శిథిలమైపోయిన చెప్పులు, మాసిన గడ్డం-అంతా తెలుపే, శరీరవర్ణం తప్ప. ఆయనేదో ఆలోచిస్తూన్న మనిషిలా కనిపించాడు.

''ఎన్నాళ్ళైందండి ఈ సర్వీస్ కంపెనీ పెట్టి?'' అని అతిగాడు కప్తానుని కొంచెం ఆలోచిస్తూ.

"స్థాపన అయి చాలాకాలమైనా ళ ఏళ్ళనుండే విమానాలు నడుస్తున్నాయి. Passengers కూడా ఆట్టేరావడంలేదు. ఈ ఏడే కొంచెం ఎక్కువ రావడం ప్రారంభించారు" అన్నాడు కప్తాను.

"మనవాళ్ళ Standard చాల తక్కువ. రేటు తక్కువ పెట్టవలసింది. నాకు జ్ఞాపకమున్నంతవరకు ఇంగ్లాండు, ఫ్రాంసు, అమెరికా దేశాల్లో ఇంతకన్నా ౨౦ రెట్లు ఎక్కువ రేటు ఉన్నప్పటికి ఇంతకు ౨౦౦ రెట్లు ఎక్కువమంది ప్రయాణం చేస్తారు." అన్నాడాయన ఇంకా ఏవో లెక్కలు మనస్సులో అల్లుతూ.

"ఈ లెక్కలన్నీ ఎప్పుడు వేశారండీ! చాలా వింతగా ఉన్నాయి. కొత్త విషయాలు" అన్నాడు సాశ్చర్యలోచనుడై కప్తాను.

"మాకు పేపరొకటి ఉందిగా, దాని కోసం గాలెక్కలన్ని అవసరం. అదీ కాకుండా అంకెలలో చాలా ఇష్టం."

"చూడండి, ఇక్కడికే చాల తక్కువరేట్లు పెట్టినాము. ఏపాటి అర్హత ఉన్న మనిషినీ తీసుకొని వెడుతున్నాము. ఇంతకన్నా తగ్గించామంటే బొత్తిగా బాగుండదు. విదేశస్థులు చూసి చాలా low Standard అంటున్నారు ఇప్పటికే" అన్నాడు కప్తాన్ సంజాయిస్తూ.

"తాముకూడా వస్తారా యేమిటి యశోదేవి మందిరానికి" అని ఇచ్ఛాపూర్వకంగా కనుక్కున్నాడు కప్తాను.

"అక్కడికి రావడానికి ఏం అర్హత కావాలి? ఇంగ్లండులో ౬౦ ఏళ్ళ వయసుదాకా నిరంతర కృషిచేసి ప్రతిభ ఉండి, అనేక మహాయజ్ఞాలు చేస్తేనేగాని అర్హత లభించదు. ఫ్రాంసులో ౫౫ ఏళ్లు రావాలి. విష్ణుపరివిష్ణు యజ్ఞాలు పది చేయాలి. జర్మనీలోను ఇటలీలోను పాతాళహోమం చేయాలి. వీరమహావీర యజ్ఞాలు అనేకసార్లు చేయాలి. అమెరికాలో కుబేరయజ్ఞం, లక్ష్మీపూజ, మాయాధ్వరం – ఇవి ఒక్కొక్కటి అనేకసార్లు చేయాలి. భారతంలో హరికేశ్వర యజ్ఞం

కృషినాధ మంత్రజపం లెక్కలేనన్నిసార్లు చేయాలి. ఇక్కడ మన అవ్వాత లేమిటి ?'' ఇలా పృచ్ఛించాడు ఆయన.

"మా విమానం ఎక్కడానికి సరస్వతీ పూజ చేయనక్కరలేదు. జ్ఞానేశ్వరపూజ అక్కరలేదు. ధైర్యసాహసాది దేవతలను బహిష్కరింపవచ్చు. ధ్వని దేవతను హడావిడి దేవతను నిత్యం ఆరాధిస్తూ కీర్తిమోటారుబస్సు సర్వీసువారితో మంచి చేసుకుంటే చాలును. చెప్పమరిచాను, కుబేరారాధకులకు కూడా అవ్వాత కలగవచ్చును'' అన్నాడు కప్తాను.

కప్తాన్ ఆపలేదు. ''మీరు ఆగ్రహించినట్టు కనిపిస్తుంది, కొద్దిలో కీర్తిదేవీ మందిరానికి మిమ్మల్నే పెద్దలను చేస్తారు వీళ్లు."

"అబ్బే నాకు కోపంఏమీ లేదు. చూద్దాం ఆ కాలం వచ్చినప్పుడు. నాకు యశోదేవి అంటే భక్తి. చాలాకాలంనుండి ఆమె సేవ చేస్తున్నాను. ఆమె దేవాలయాలు ఉన్న ప్రతిచోటిక వీలైనంతవరకు వెళ్లి ఆమెను ఆరాధిస్తుంటాను.''

''అవును. మీకు దేవాలయాలంటే చాలా ప్రీతిలా అనిపిస్తుంది. ఇంత తెలిసిన మీకు ప్రతి రాయిమీద భక్తి. అలాంటప్పుడు యశోదేవిపై ఉండడానికేమి!''

''అయితే అప్పుడే రాను.ఇక్కడికే ఇది Overload ఐనట్టు కనిపిస్తుంది. రెండవ విమానానికి పస్తా. సెలవు'' అని ఆయన గిరుక్కున వెనక్కితిరిగాడు.

ఇంక సూర్యుడస్తాద్రి చేరుకున్నాడు. ఆ మైదానంలో దీపాల ఏర్పాటు ఇంకా జరగలేదు. వచ్చిన ప్రజలు క్రమక్రమంగా పలచబారుతున్నారు. నేనూ బయలుదేరాను వెళ్లిపోవామని. ఒక బెంగాలీబాబు కాబోలు చొంగ కార్చుకుంటూ యశోవిమానాన్ని దానిలో ఎక్కేవాళ్లను చూస్తూ నుంచున్నాడు. 'నమస్కారం' అన్నాను. ఆయన ప్రత్యుత్తరమిచ్చాడు 'ఏం మీరూ చూస్తున్నారా ఏమి వెళ్లటానికి' అన్నాడాయన తీవ్రంగా. ''సెలవు తీసుకుంటా. మా ఆవిడ ప్రొద్దుకుంకితే బయట ఉండటానికి వీల్లేదని శాసించింది'' అని నేను ఇంటికి పోయాను. అప్ప

టికే ఆలస్యమయింది అని మా ఆవిడ చెబ్బలాడింది. ఏదో సంజాయిషీ చెప్పుకొన్నాను.

మొన్నటి తడవ పళ్ళు విషయం మనవి చేసోక్కా మరిచాను. ఆ కంటి అదాల బెంగాలీబాబుతో మాట్లాడే సరాల్లో యీ పొరపాటు జరిగింది. అంచేత ఈ తడవ మనవి చేసుక్కుంటున్నాను.

యశోవిమానంలో కూర్చో తగిన వారంతా తమ తమ అర్హతలను చెప్పుకుంటూ ఎక్కారు. యశో విమానం ఇంకో రెండు నిముషాలలో కదుల్తుందేమో! జనసమ్మర్దము విశేషంగా ఉండింది. ఆ సమ్మర్దములో నుంచీ పక బక్కపలుచని వ్యక్తి కొంచెము గూనివీపుతో పక్క చూపులు చూస్తూ తొండను తిన్న మనిషిలాగా ముందుకు కాలు వేద్దామా వద్దా అనే వాలకంతో జనాన్ని నాజూకుగా తోస్కుంటూ యేదో విధంగా యశోవిమానం సమీపించాడు. ఈ వ్యక్తి వళ్ళు గంట సేపటినుంచీ విమానం చుట్టూ జనులచుట్టూ పారాడుతూ ఉండింది చూశానుగాని ఈయనకూడా విమానాన్నిక్కా అర్హుడౌతాడా అనుకొని ఉంటిని.

ఈ నూతన వ్యక్తి ౫ అడుగుల ౨ అంగుళా లుంటాడు. నలుపురంగులో పక్కా రంగు (Fast colour). దొంగనవ్వు ఎప్పుడూ నవ్వుతూ వుంటాడు. తెల్లని ఓపన్‌కోటు. ఆ కోటు రెండు జోబీలలో చేతులు దూర్చాడు. ఊదారంగు పంట్లోన్. తూకం 100 పౌండ్ల లోపలనే వుంటుంది.

ఈ వ్యక్తి యశోవిమానం కండక్టరును చూట్టంతోనే ''నమస్కారమండీ'' అని పక వంకర నమస్కారం విసరేశాడు.

''నమస్కారం బాబూ. తామూ ఏదో మతలబుతో వచ్చినట్లుందే'' అన్నాడు కందర్పుడు.

''మతలబు లేదూ గితలబు లేదు. నాకు కూడా కాస్త స్థలంయిస్తే నేనున్నూ వచ్చి కీర్తిదేవత యొక్క సేవ చేసుకుంటాను'' అన్నాడా వ్యక్తి.

''ఏంటీ! తాముకూడా దయ చేస్తున్నారా బాబూ! తామున్నా యీ వేలాం వెర్రిలో పడ్డారా. ఆ కండ్లు దవడలు లోపలికి లాక్కునిపోయినాయన– ఆ పెంకెతనాన్ని సూచిస్తున్న వాలకం ఆయన–ఆ కర్ర పట్టుకున్న పొట్టాయన– గాలికి పొయ్యే ఖద్దరు షేర్వానీ ఆయన–వీళ్ళంతా మా విమానంలో సీటుకొరకై పడ్డ అవస్థంతా తాము చూసే వుంటారుగా. మరి యిప్పటికే ఓవర్‌లోడ్ అయింది. పైగా తమకేదైనా మంచి అర్హత వుండాలిగా.....'' అని వకే ధాటిగా చిన్న లెక్చరే యిచ్చబట్టినాడు కండక్టరు. ''ఢిల్లీకా పాంచ్వాసవార్!'' లాంటి యీ యైదవ వ్యక్తి యిట్లాంటి కండక్టర్ల చెప్పన్నారు చూసివుంటాడు. పిట్ట చిన్నదైనా కూతఘనం అన్నట్టు ఏమిన్ని జంకుకొంకూ లేకుండా మధ్య మధ్య తెచ్చిపెట్టుకున్న నవ్వు ఆ నల్లని మెరిసే చురుకైన కండ్లద్వారా ప్రకటిస్తూ కోటి తుంపురులు వర్షిస్తూ యిలా చెప్పుకోబట్టినాడు.

''ఏమండీ! నా స్వవిషయం చెబుకోకూడదు కాని మీరిలా సెలవిచ్చారు కాబట్టి మనవి చేసుకోవలసి వచ్చింది. నేను యీ పట్నం వచ్చి మూడుమాసాలు కూడా కాలేదుగాని అప్పుడే నా కీర్తి నూసీకి అవతల ఇవతలే కాకుండా హుసేనుసాగరు నాలుగుపక్కలా వ్యాపించిపోయింది. నేను ఎన్ని ఉపన్యాసాలిచ్చానో. అది లెక్కపెట్టుంటేగా చెప్పేదానికి. ఒక్కొక్క ఉపన్యాసం రెండు మూడు ఘంటలపరకు చెప్పేపరకు చాలామంది పరపశులై పడిపోయినారు. నిజాం కాలేజీలో నాకు ఘనమైన గౌరవం జరిగింది. ఏది వినకున్నా ఈ పక్క అంకమైనా తాము వినిపుంటారె.....ఏమి! అలా నోరు తెరుచుకొని చూస్తారు. అరె! తాము విన్నే లేదా! పోనీ! నా ఉపన్యాసాలు పరిపూర్ణంగా బ్రిటిషిండియాలో ఆంధ్రపత్రికలో వచ్చాయిగా.''

''బాబూ. గోలకొండ పత్రికలో.....''

''ఉండవయ్యా. నన్ను పూర్తి చెప్పనిద్దూ! గోలకొండ పత్రిక పక్ష పాత పత్రికండీ! మనలో మాట' ఈ రాష్ట్రములో సరియైన పత్రిక, సరియైన కవి, సరియైన గ్రంథకర్త ఒకడున్నాడా మీరే చెప్పండి?''

"సరే కాని మా విమానం ఎక్కడానికి ఈ సేవ చాలదు" అన్నాడు కప్తాన్ కరుగ్గా.

ఏమన్నా సరే వదిలే మనిషి కాడాయె యీ బక్క పలుచని మనిషి. షళ్ళా తన స్వీయ చరిత్ర మొదలు పెట్టినాడు.

"అరే! అదేమండీ అట్లు సెలవిస్తారు. ఇంకా చెబుతాను వినండి. ఈ రాష్ట్రంలో ఒకరిద్దరు పిల్లకాయలకు తప్ప ఇతరులకు గిడుగు వారి పేరే తెలియదుగా. వారి యశోగానం చేసి వ్యావహారిక భాషా వాదం చిరస్థాయిగా స్థాపించేశాను చూశారా."

"అయితే సికింద్రాబాదులో అందిరూ మీకు ప్రతికూలం అయినారట. బాబూ నిజమా" అన్నాడు కండక్టరు.

"ఛా! ఎవరన్నారండి యీ మాట. ఆ గోలకొండ పత్రికలో యేమైనా నాకు ప్రతికూల ప్రచారం చేశారేమో. నేను భావకవిత్వాన్ని గురించి చెప్పిన వుపన్యాసాలు విని అందరు డంగైపొయ్యారు."

"ఇంతమాత్రము చాలదండీ" అన్నాడు మళ్ళీ కండక్టరు.

"ఇంకా వినండి! నేను పూర్తి చేయందే ఏ మట్టు తొందరపడ్డారు. నేను ఉమర్ ఖయాంను తర్జుమా చేశాను. గొప్ప వుపోద్ఘాతం వ్రాశాను. కొన్నాళ్లు పత్రికలకు ప్రత్యేకంగా విలువైన వ్యాసాలు వ్రాస్తూవుండేవాణ్ణి"

ఇట్లా వకేఫోరణిలో వుపన్యాసం యిస్తూ వుంటే ఆమొకం మచ్చల పెంక తనం మనిషి లోపలివుండి యిట్లా అన్నాడు.

"చాల్ లేవయ్యా నీదొకే ఆర్భాటం అప్పటినుంచీ! యానుంటి పస్తి పయ్యానీవు. మాకు పొద్దపుతుంచే నీదేమిటిదయ్యా గొల్లవేషం కథ. జరుగు జరుగు విమానాన్ని పోనిమ్ము."

ఈమాట వినేసరికి మన నూతనవ్యక్తి కించిత్తుకూడ కోపం చేసుకోకుండా యథా ప్రకారంగా నవ్వుతూ ''సమస్కారమండోయ్! తామిక్కడనే వున్నారా! క్షమించాలి! క్షమించాలి! తెలియక తమ కాలహరణం చేశాను.''

''మళ్ళీ ఏదిదయ్యా నీ గడబిడా! కండక్టర్! ఈ మనిషి సన్నాసివాడే! యాత్మోపకచోట యిరికించవయ్యా'' అన్నాడు పెంకమనిషి.

''వీల్లేదంకీ! ఇప్పటికే చాలా ఓవర్‌లోడ్ అయింది క్షమించాలి.''

''అయితే కండక్టరుగారూ! నన్ను లక్డీకాపూల్ వరకైనా తీసికొని అక్కడ వదిలేసి పోండి. అదే బాటగా మీకీర్తి నగరాభి...'' అన్నాడు నూతనవ్యక్తి.

కండక్టరు కొంచెము సంకోచపడ్డాడు. చేతక్రర పొట్టాయన తన సహజమైన (Compromising spirit) దరహాస సంజీవ పద్ధతితో కండక్టరు బుజాన్నదిమి కన్ను గీటి చేయి ఎగవేసి ''కానీ ఏదో పీడ తెగనీ'' అని అర్థం వచ్చే సంజ్ఞ చేశాడు. అంతట్లో ఆ గాలికి పొయ్యే కద్దరు షర్వానీ మనిషి ''పాపం, ఆయన్ని ఎంత సతాయిస్తారండీ! ఇక్కడ రావయ్యా నా వద్దికి'' అని ఆదర పూర్వకంగా తల్లి తన చంటిపిల్లను ఆదరించిన రీతిగా తన పక్కలోనే స్థలం సరిది కూర్చో బెట్టుకున్నాడు. విమానం ''కీర్తి మాతాకీ జై'' అనే ధ్వనులతో బుర్రున పైకి లేచింది.

[గోలకొండ పత్రిక 17-2-1936]

నా కా షష్టిపూర్తి!

శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య

ఈరుక్కున్నవారూకోక్కక ఏదో ఒకటి రేపెట్టాను. వీరికి పెండి జూబిలీ. వారికి బంగారపుది-మరి యొకరికి రపల జూబిలీ-ఒకరు ఒక మంచి మాటాడితే పది మంది పాడు మాట ఆడుతారు. 'పదుగురాడుమాట పాటయైధరజెల్లు' నన్న లోకోక్తి అందరకు తెలిసిందే కదా! 'కుక్కకు చెడ్డపేరెట్టి ఉరిదియ్యి' అను సామెత ఇంగ్లీషునందు గలదు. 'మనిషికి మంచి పేరిచ్చి ఉరిదీయి' అని మన తెలుగులో వాడుకకు వచ్చేటట్లున్నది.

షష్టిపూర్తి అంటే అర్థమేమిటో ఎంత యోచించినా తోచడం లేదు. ఆయుర్దాయం ముగియనై యున్నదనా! జాతకాలనుబట్టి చూస్తే నాకు ఇంకా పద్నాలుగేళ్ళు ఈ రాగద్వేషాలతో, మోదఖేదాలతో విహరించే యోగమున్నది. పనిబట్టి చూతమా అంటే, ఇంతటితో మనకి 'ఎత్తేయజ్ఞె' చెప్పదలచుకున్నారా ఎవరైనా? ఆ ప్రకారం ఒప్పుకునేదిలేదు. నిన్ననే న్యూఫీల్డు ప్రభువు చరిత్ర పత్రికలలో చదివినాను. బైసికిళ్ళు బాగుచేసుకునే దుకాణము పెట్టుకుని, పిమ్మట షాపు తెఱచి, స్నేహితుని సహాయముచే పెట్టుబడి తెచ్చుకుని, క్రమంగా మోటారుకార్లు ఆరంభించి, 1925 లో 48712 కార్లను చేసి, తన ఫాక్టరీకి $16\frac{1}{2}$ కోట్ల రూపాయలను ఇస్తామన్న అమెరికనుల బేరమును వద్దని, ఇప్పటికి $19\frac{1}{2}$ కోట్ల రూపాయిల దానములు చేసిన విలియం మారీసు అను ఆంగ్లేయుడు - న్యూఫీల్డు ప్రభువు. ఈతడు జీతము లేకుండా ఈ రోజున యుద్ధములో బ్రిటిషు వాయు విమాన శాఖయందు డైరక్టరుగ పనిచేయుచున్న మహనీయుడు. వయస్సు 62 ఏండ్లు. నీవు ఎప్పుడు పని చాలించుకుంటావని మామూలు ప్రశ్న అడిగితే

'ఎన్నటికీ మానను' అని బదులు చెప్పేను. స్వరాజ్యం వచ్చేంత వరకు మనము పాటు పడవలసినవారమే- స్వరాజ్యం ఒక్కరోజున ఉపాలో పార్సెల్‌లాగా వచ్చి చేతులలో పడదు కనుక- స్వరాజ్యమంటే దేశములో ప్రతి అంగుళమును-ప్రతి శాఖను తిరిగి జయించుకొని స్వాధీనము జేసికొనుట అన్నమాట. కావున ఆద్యంతములు లేని కార్యము. ఈ కార్యము నుండి మనము విరమించుకొనునెట్లు?

ఇంక షష్టిపూర్తి ఎందుకయ్యా ? దీనికి మరి యొక కారణము-ప్రయోజనము చెప్పారు. ఇద్దరు మిత్రులు నా వద్దకు వచ్చి మీకీ 'మంగళం' చేస్తామన్నారు. నేను అంగీకరింపసన్నాను. కాదు గూడదు, పర్సు (పారితోషికము) కూడా ఏర్పాటు చేస్తామన్నారు. నేను లోభిని అని లోక వచంతి కదా ! దాని కైనా లొంగుతాను అనుకొని యుండవచ్చును. అయితే వీరికి ఆ పర్సులో నున్న రూపాయలు అన్నీ నేనే తీసుకుంటానేమో అన్న సందేహము గలిగిందో ఏమో ! కాంగ్రెసు భవనమునకు యివ్వవచ్చును అన్నారు. అంచుకూ లొంగలేదు. వీరు వదిలేటట్లు కన్పించలేదు. అప్పుడు జన్మ పత్రముదెచ్చి నేను విక్రమ సం॥ కార్తీక బ॥ సప్తమినాడు (28-11-1880) పుట్టాననిన్ని, 60 సం॥ల ఆయుర్దాయమే అల్పమై యుండగా ఇంకో ఏడాది గూడ అందులో తగ్గించడము చాలా అన్యాయమనిన్ని నేను వేడుకోగా వారు నాకు సెలవిచ్చిరి.

చిన్నప్పుడు 60 ఏళ్లు అంటే ఎక్కువగా కనిపించేది కాని ఇప్పుడు అలా తోచడంలేదు. ఈ మాటే గాంధిగారితో చెప్పడం తటస్థించింది. ఒక మిత్రుడు మాటవరుసగా, "గాంధిగారికి వయస్సు అయిపోతూన్నదన్నమాటే తోచదు" అన్నాడు. ఆ మాట అన్నవారి పేరు కూడ నేను గాంధి గారితో చెప్పుతూ "మాకు 60 గొప్పగా కన్పించుటలేదు. మీకు 70 ఎక్కువగా కన్పించవని తలుస్తాను" అన్నాను. నిజమే అన్నారు. ఇంట్లో చంటి బిడ్డకు వైద్యము కోసము వెళ్ళితే 'నాయనా, నాచెయ్యి కొంచెముచూడు, బొత్తిగా ఆకలిలేదు. ఏమి తిన్నా అరుగుట' అని 95 ఏండ్ల అవ్వచెయ్యి చాస్తుంది. కలియుగం కనుక 60 ఏళ్ళు ఎక్కువగా కన్పించవచ్చును. అంతా ఎందుకు- ఆ మధ్య కొందరు అర్ధ

షష్టిపూర్తి చేసుకున్నారు; ఎందుచేత? లెక్కల ప్రకారం ఇండియా దామాషా యిని ఆయుర్దాయము 22 ఏండ్లే. అర్ధషష్టి పూర్తి అంటే 8 ఏళ్లు పెరిగింది అన్నమాట.

షష్టిపూర్తి ఎవరో మహనీయులు చేసికో తగ్గమాట. ఈ మధ్య సర్ సి.పి. రామస్వామి అయ్యరుగారు చేసికొన్న విషయం మన మందరము ఎరుగుదుము. 10 వ తేదీన ఉత్సవాలు జరుగవలసి ఉంటే తిరువాన్కూరు స్టేటు కాంగ్రెసు వారు వీరికి వ్యతిరేక ప్రచారము జరిపినందున వారిని జైలులో పెట్టి మరీ ఉత్సవములు జరుపుకోవలసి వచ్చింది. ఇంకొకరు షష్టిపూర్తి ఉత్సవములు జరుపుకున్నమాట జ్ఞాపకం వస్తున్నది. 25 ఏండ్ల క్రింద మా ఇంటి ప్రక్కని కాపుర మున్న శ్రోత్రియులు ఒకరు యథావిధిగ నీయుత్సవమును జరుపుకుంటూ నన్ను పిలిచారు. ఆయన కలాత్ ఖానా ఇజారాచేసిన శ్రోత్రియులు. కల్లు పాటలవలన డబ్బు సంపాదించారు. 'మీరు ఏం పంచిపెట్టారు?' అని అన్నాను. షష్టిపూర్తి ఉత్సవములలో స్థాళీలు బట్టలు పంచిపెట్టారు. స్థాళీలలో కల్లుపోసి పంచిపెడ్తే సహ్యముగా ఉంటుందేమోనని మనవి చేసినాను. ఆయన మంచివారు కనుక నవ్వి ఊరుకొన్నారు.

ఇంతకాలం బ్రతకడమే నాకు ఆశ్చర్యంగా ఉన్నది. ఒక మాటు అసలు చచ్చానని వదంతి గలిగి 1917 సం॥లో నేను నీలగిరిలో ఉండగా 'నీవు బ్రతికి ఉన్నావా, చచ్చిపోయినావా' తెలియజేయమని మిత్రుల నుండి తంతి వార్తలు వచ్చి ఉండెను. ప్రత్యుత్తరమునకు డబ్బుకట్టలేదు. తిరిగి తంతి నియ్యనైతిని. అందుచే చచ్చిపోయిన మాటే నిజమనుకొని విచారపడ్డవారు కొందరు; సంతోషించిన వారనేకులు గలరట. కాని చావువాడుక పీడాపరిహారమని చెపుతారు. ఇప్పటికి 23 ఏండ్లయినది. రానురాను తూకం హెచ్చుతున్నది. చొక్కాలు చాల వన్నచింతతప్ప మరేమీలేదు. నెలకు 25 రోజులు సంచారంలో ఉండడంవల్ల పర ఇంటి భోజనము అరుగుటలకు కారణమై - ఆరోగ్యము బాగుపడుతున్నది. ఇప్పుడు గర్వించి షష్టిపూర్తి చేసుకుంటే ఏమి ప్రమాదమో అని భయము. ఒక

వేళ పర్సే ఇస్తే దేనికి ఇయ్యడమా లేక అసలే ఇయ్యక పోవడమా అని ఒక సందేహము. అయితే ఆమధ్య ఒక స్నేహితుడు జైలు నుంచి వచ్చేసరికి ఒక అభినందన పత్రిక, ఒక 'సంచి' ఇచ్చారు. ఆ సంచిలో ఉన్న మొత్తం రు. 1200 అని చెప్పారు. వెంటనే హరిజనోద్యమమునకు ఇచ్చివేసినానని ఆయన ప్రకటించిరి. అంతట హరిజనులకు సొమ్ము వినియోగిస్తే 'నా చందా నేను ఇయ్యనే ఇయ్యను' అని చందాలు వేసిన వారిలో ఒకరు బెదిరించిరి. ఇంటికి వచ్చిన తరువాత సంచి విదిల్చిచూస్తే ఒక చీటీమీద రు. 1200 అనివేసి ఉన్నది. 'కాకితము మాత్రమున్నదండి' అని సంచి విప్పినవారు చెప్పగా, నోట్లు అయితే మాత్రమేమి? నోట్లు డబ్బుకాదా అని ఒకరన్నారు. చెక్కేమో అని మరి యొకరన్నారు. చిత్తు కాకితమయ్యా అని చూచినవారు చెప్పారు. అంతట ఊళ్లో చందాదారుల వాగ్వాదములు అంతరించినవి. హరిజనులకు ఆశీర్వచనములు మాత్రమే మిగిలినవి.

ఈ షష్టిపూర్తి అని వ్యాసము రాగానే ఒక వెర్రి స్నేహితులు నాపేరనే రు. 5 లు మనీ ఆర్డరు పంపినారు. ఫలాని కార్యమునకు అని 'కూపన్' లో వ్రాశారు. ఏంచెయ్యాలో తెలియలేదు. పుచ్చుకుంటే ఎవరికియ్యాలో విచారించాలి. ఎవరిని విచారించను? నా షష్టిపూర్తికి కార్యదర్శి ఎవరు? అని అగుపడ్డ స్నేహితులను, కృష్ణాపత్రిక వారిని ప్రశ్నించాలి. పత్రికవారు మాత్రము ఏమంటారు? "ఏమో! ఎవరో వ్యాసంవ్రాస్తే, వేసిందే కాకుండా, మీకే సంజాయిషీలు ఎవరు చెప్పుతారు? పో, పోవయ్యా" అంటారు. ఇంక స్నేహితులను అడుగుతే, తెలియదని మర్యాదగా చెప్పి- ఏమిటోయి, ఈయనకు కూడా ఈ పిశాచము పట్టిందే- అనుకుని హేళన లోలోన చేస్తారు. ఇదంతా ఎందుకు, పుచ్చుకొని తప్రసఫీచేస్తే ఏమి అవుతుంది? నాపేర వచ్చిన డబ్బు నావద్ద ఉంటుంది, ఎవరేనా అడిగే వరకు ఉంటుంది అనుకుంటే- సొమ్ము పంపించినవారు దేవాంతకులు. వారి షష్టిపూర్తి ఇదివరకే అయింది. వైశ్యులు - జమాఖర్చులు - చితా ఆపర్జాలు - రశీదులు- శ్రద్ధతో గమనించేవారు. ఇదెందుకు అదెందుకు అని- మనీ ఆర్డరును

త్రిప్పివేసినాను. ఇంకా ఏమైనా వ్రాదాము అనుకొన్నాను. కాని ఇంతలో పామర్రు ఫిర్కాలో గెలుపొందిన వారి పక్షమున పని చేసిన ఇరువురు స్నేహితులు వచ్చియుండుటచే ఆపివేసినాను. ఉదయమున కూడా వాకిట్లోంచి చూచినేను 10 మందితో మాట్లాడడం కనిపెట్టి వెళ్ళిపోయినారు. వారిని ఆపుట భావ్యము కాదు. ఇంకోమాటు ఎన్నికలలో ఓట్లు జాగ్రత్త పెట్టవలెగదా! ''కార్యాంతే విసర్జయేత్'' అన్న నీతి ఓటర్లకు మాత్రము వర్తింపరాదు. మనకు షష్టిపూర్తులుండవచ్చును. ఆయుర్దాయములుండవచ్చును. బోర్డుల ఎన్నికలు, శాసన సభలు జాంబవంతుడు, హనుమంతుడు, మార్కండేయులు వంటి చిరంజీవులు. ఇంతేకాక, ఈ వ్యాసము వ్రాయుటకు ఏర్పాటు చేసుకున్న ఒకవైపు వ్రాతగాని అచ్చుగాని ఉన్న కాకితములు సంఖ్య 25 న్ను ముగిసినవి. ఇంక ఈ సైజు కాకితములు లేవు; కావున సమాప్తి చెప్పడమగుచున్నది.

[10-2-1940 కృష్ణాపత్రిక]

పన్నీటి జల్లు

? ? ?

మా దర్బారీయుల స్వరూప స్వభావా లొక్కొక్కరివే వర్ణించి చెపుదా మనుకొన్నాను. కాని ఎప్పటికప్పుడే కొత్తసభ్యులు చేరుతూ ఉండడంవల్ల ఆ పని పెట్టుకుంటే తెమిలేటట్లులేదు. దర్బారులో ప్రవేశానికి దర్శనాలుగాని, సభ్యత్వా నికి చందాలుగాని అక్కరలేదు. గ్రంథకర్త అయిన వానికల్లా సులభ ప్రవేశం దొరుకుతుంది. గ్రంథకర్త కాకపోయినా కళాభాయి అయితేచాలు. కళాభాయి అంటే ఏమిటో కొంచెం విపరించాలనుకుంటాను. సూక్లు ఫైనలు వరకయినా దొక్కచుద్ధి చేసుకుని, సవిలాసమైన వేషం వేసుకుని, సినీమా,నాటకం,కవిత్వం, చిత్రలేఖనం మొదలైన కళలను గూర్చి ధారాళంగా సూత్రాలు నిర్మించగలవా రంతా యీ తెగలో చేరుతారు. ఉభయవేళలా మంజప్పయ్య సత్రప్రవేశమూ, కళ్ళజోడూ, ఒకచేత సిగరెట్టూ, ఒకచేత అలంకార గ్రంథం ధరించి దర్బారు వీధిని బయలుదేరిన పెద్ద మనిషి నెవరినైనాసరే మీరు నిస్సందేహంగా నిలబెట్టి 'మీరు కళాభాయీలు కారా' అని అడుగవచ్చు.

*　　*　　*　　*

కళాభాయి లక్షణాలన్నీ గ్రంథకర్తలకు పట్టకపోయినా, వీరికి కవిత్వ మంటే తమదేననే పల్లమాలిన అభిమానం మాత్రం ఉండాలి. పదుల మీద పన్నీటి కలయంపీ, దర్బారీయుల మీద పన్నీటి జల్లూ విసరగల శక్తి ఉభయు లకూ అవసరమే సనుకోండీ. అయితే పత్రికా సంపాదకులు గ్రంథకర్తల రాశిలో చేరుతారో, కళాభాయీల సజ్జులో చేరుతారో మేమింకా నిశ్చయించుకోలేదు. కాని వారి సహాయం వీరికి, వీరి సహాయం వారికి అవసరం కనుక వారంతా దర్బారీ యులే అనిపించుకుంటారు.

*　　*　　*　　*

దర్బారీయుల కింతకండే ఇతర విధులేమిన్నిలేవు. నిషేధాలు మాత్ర మేమంత చెప్పదగిన వున్నాయటగాని, అయినా ముఖ్యమైన ఒకటి రెండు మనవి చేస్తాను. దర్బారీయులంతా మంజప్పయ్య సత్రాన్ని తప్ప ఇతర ప్రదేశాలు త్రొక్క గూడదు. తోటి దర్బారీయులెవరైనా కాఫీ టీలు గాని సిగరెట్టు ఖిళ్ళీలు గాని ఇంద అని ఇచ్చినప్పుడు నిరాకరించగూడదు. దర్బారులో ఎవరికి వారే సర్వజ్ఞులు, తక్కినవాళ్ళంతా శుంఠలూ కావడం ఒకరి నొకరే మనుకున్నా యిబ్బందిలేదు గాని, ఇతరత్రా మాత్రం దర్బారీయులలో ఎవరిమీద ఈగను వాలనివ్వకూడదు. దర్బారుతోనైనా ఎదుట ఉండగా ఎవ్వరి మీదను కలాపి చిమ్మకూడదు. ఆత్మస్తుతి, పరనింద - మా దర్బారుతో రాజకీయితో నడుస్తుంది.

*　　*　　*　　*

దర్బారీయులు ఇతర సంఘాలలో సభ్యులుగా ఉండవచ్చునా అనే విషయం ఇంకా మేము తేల్చుకోలేదు.అందుకనే ఈ మధ్య నవ్యసాహిత్య మండలి పషాన రాయబారులు, దర్బారీయులు మండలిలో చేరపలసిందనీ, లేదా మండలినే దర్బారులో చేర్చుకొనపలసిందనీ కోరితే ఎటూ చెప్పలేకపోయినాము. కాబట్టి యితర గ్రామాలవారు దర్బారులో సభ్యులుగా పరిగణింపబడతారా ? అనే విషయం కూడా తేలలేదన్న మాట.

*　　*　　*　　*

ఇంకొక్క సంగతి మరిచిపోయినాను. కొత్తగా దర్బారులో చేరేవారు మొదటి రోజు తాము రచించిన పద్యమో, పాటో, తాము చేసిన పరిశోధనమో, మరియే ఘనకార్యమో నిండు దర్బారులో బ్రుత పరచి ఆనాడు దర్బారీయులు దిమ్మరించే పన్నీటి కలాపికి మాత్రం ఓర్చుకోవలసి ఉంటుంది.

*　　*　　*　　*

ఇది మా దర్బారు స్థూల స్వరూపం. ఈ విధి నిషేధాలన్నీ ఇంతకు ముందు గ్రంథస్థం చేసి లేవు. బ్రిటిష్ పార్లమెంటులో వలె క్రమంగా ఏర్పడిన

సంప్రదాయం ఇది. దర్బారీయుల స్వరూప స్వభావాలు వివరించి చెప్పడం సాధ్యం కాదని మనవి చేశాను. అసలిట్లా మాటలతో చెప్పటం కంటె ఒకమారు ఏకంగా అందరినీ వారి వారి దర్జాలతో ఫోటో ఎత్తి ప్రకటించితే బాగుండును గాని- ఆ ఉద్దేశంతోనే ఈ మధ్య నొకసారి అందరినీ తలకాయలిమ్మని కోరాము. తీరా ఒక రోజున కాంతా మనోహరం గారు బిక్క మొహంతో చక్కావచ్చి, "ఏమండోయ్ ! నేను ప్రకటనకు తల తీయించి యిద్దామని ఫొటోగ్రాఫరు దగ్గరకు వెళ్ళితే ఏమన్నాడో విన్నారా ! 'నీకు తలలేదు పొమ్మన్నా' డండీ !" అని చెప్పేసరికి ఎవరి మట్టుకు వారే భయపడి తల తడివి చూచుకొన్నారే గాని, సాహసించి ఒక్కరూ మళ్ళా ఫొటోగ్రాఫరు గుమ్మంకేసి వెళ్ళడానికి సాహసించలేదు.

* * * *

ఈమధ్య మా దర్బారీయులలో ఒకరికి తన్మూలాన దర్బారుకు తప్పి పోయిన గండాన్ని గురించి ఈసారి చెబుదామనుకుంటే, ఈ ఉపోద్ఘాతంతోనే సరిపోయింది. అయినా టూకీగా చెప్పేస్తాను.

మరేంలేదు. మా సిజర్సు శిరోమణి పేరు వినడమేగాని ఆయన ప్రతాపం మీ రెరుగరు. మాకో దావాపు అందరమూ గ్రంథకర్తలమైనప్పటికి ఆధునిక వాఙ్మయమంతా ఆయనకు కొట్టిన పిండి కావడమే కాక, దానిమీద ఈగను కూడ వాలనివ్వనంతటి గాఢాభిమానం కలవాడు కావడం చేతనూ, శిరోమణి మాత్రుడే కాక, సిజర్సు శిరోమణి కూడ అయుండడం చేతనూ, మా దర్బారులో ఆధునిక కవితాపీఠాధిపత్యం ఆయనకే కట్టబెట్టాము. ఆమధ్య కృష్ణలో ప్రచురించిన కవుల లిస్టు. నటుల జాబితా యావత్తున్నూ ఆయన ఒక్కడి చేతిమీదే తయారయిందంటే ఇక ఊహించుకోండి తత్ప్రతిభావిశేష మెటువంటిదో? అంతేకాదు, నేటి కవులలో గురజాడ మొదలుకొని కుందుర్తి వరకు నీకు ఎవరి పద్యం కావాలో, ఎవరి పాట కావాలో, ఎవరి కథ కావాలో అడగండి. నిలుచున్న

పాళంగా, అది ఎప్పుడు ఏ పత్రికలో పడిందో చెప్పడమే కాకుండా, దానిలోంచి మీరెక్కడ అందిస్తే అక్కడ నుంచి 'వేద పఠన' చెప్పినట్టుగా వప్పజెప్పగల ప్రజ్ఞ ఉంది ఆయనకు! పోని వయసు చూద్దామంటే వడసారం యిరవై యేళ్ళ కించుమించు!

*　　*　　*　　*

శిరోమణి మాంచి స్ఫురద్రూపి. విశాలమైన ఫాలము. దౌడలు. సూదివలె నానాటికి మొనతేలుతున్న ముక్కు. ఆ మొనమీద లగ్నమయ్యే వారి చూపు. ఆ చూపుల వాడిమికి చురుకు నిచ్చే బొమముడి. ఆ ముక్కు మొనకు, చూపుల వాడికి, బొమముడి చురుకుకు, ప్రాణంపోసే హుంకారము. ఆ హుంకారపు టురుముతో తళుక్కుమని మెరిసే కిలకిలా రావము చూస్తే దర్బారు గ్రంథకర్త లకు దడ పుట్టుతుందంటే నమ్మండి. మాలో మాకు ఎంత భయంకరుడైనా పరాయి కవులు వచ్చినప్పుడు మా దర్బారు శిరోమణియే పెట్టనికోటయై నిలుస్తాడు. అయితే చేతిలో సిజర్సు డబ్బా లేకుండా చేశారంటే కోరలూడ్చిన పామైపోతాడు శిరోమణి. శిరోమణికి సిజర్సే ఆయుధం.

*　　*　　*　　*

సర్వ విధాల వృద్ధికాముకు. మా దర్బారుకు ముణిహూస వంటి వాడు అనుకుంటూ ఉన్న మా శిరోమణికి ఒక్కకళంకం వచ్చి పడింది. ఏమిటంటారా? తాను స్వయం శిరోమణి అయి ఉండిస్నీ సాహిత్య శిరోమణి అనిపించుకోవాలనే పిచ్చి పట్టింది అకడకి. 'నిక్షేపం లాంటి సిజర్సు శిరోమణి బిరుదుండగా ఇంకా నీకు సాహిత్య శిరోమణి ఎందుకయ్యా? పిచ్చి బ్రాహ్మడా? రేపు కర్మం చాలక పరీక్షలో నెగ్గావా అంటే ఏ స్కూల్లోనో పంతులువై నిష్కారణంగా చెడి పోతావు సుమా! నీవు చెడడం కాకుండా నీవంటి వాడు బడి పంతులయి పాడయి పోతే దర్బారుకు కాకుండా పోవడమే కాక భాషకు దేశానికి కాని వాధవై పోతావ'ని మేమెంత మొత్తుకున్నా వినక, స్కూల్లో ఒక కాలు, దర్బారులో ఒక

కాలుగా కాలక్షేపం చేశారు. ఎట్లాగో పరీక్షా గుండంలో దూకి ఇవతల పడ్డాడు. ఎక్కడ నెగ్గిపోతాడో అని మా గుండెలు పీచు పీచు మంటున్నవి. అయి పోయింది. మన శిరోమణి చెడిపోయినట్లేనని మేమంతా నిరాశ చేసికొన్నాము. ఇంతలో అతడి తల్లి కడుపు చల్లగా, మా దర్బారు అదృష్టం వల్ల, ఆంధ్ర భాష నోచిన నోముల ప్రభావం వల్ల, మా శిరోమణి సిజర్సు శిరోమణిగానే స్థిరపడి పోయినాడు అని శుభవార్త వచ్చింది.

* * * *

ఈ మధ్య జరిగిన టీ పార్టీలలో ఆనాడు చేసుకొన్న దొకటి. ఆనాడు మా శిరోమణి మీద మేమంతా ఈ అభినందన పద్యాలు వ్రాసి ఆంధ్రవాణి అదృష్ట వంతురాలని ఆనందించాము. శిరోమణి చిరకాలం సిజర్సు శిరోమణియై వర్ధిల్లాలని ఆశీర్వదించాము-మేమంతా వయోవృద్ధులమైనా- కాలం చేత సుమండీ!

చుళుకీ కృత కాఫీ టీ
జలనిధి కిల్లీ సహస్ర చర్వణచణ! ని
ర్మల ధూమోజ్వల పరి వే
షల సన్మూర్తీ! సిజర్సు సారజ్ఞమణీ.

శ్రపణావతంసమై చే
ఓవిటీయై నీదు గెల్పు దెల్పు ధ్వజమ్మై
భువి నీదు యశోఘృణియై
మిపులన్ వెలిగింపుమోయి మేటి సిజర్సున్.

స్వాహానాద నిరంత రాహుత
భవ త్సైజర్సు సాంద్రాటవీ
వ్యూహ ప్రోద్ధిత ధూమ మాలిక
ధరా వ్యోమావకాశమ్ములం

దాహా పుట్టగ బండు వెన్నెలలపై
నట్టెత్తి కాలాతప
శ్రీహానిన్ ఘటియించు రేయి బవలున్
శ్రీ సౌరభోద్గారి యై.

ప్రతివాది ముఖ నిధానము
హిత ముఖ వికసనము శాత్ర వేక్షణ విధుతా
మిత రజము మిత్ర నేత్రా
మృత పత్రిక నీ సిజర్సు మెచ్చందగురా!

వదన బిల నాసికా పుట
పదవీయుగ పద్వి ధూత బంధుర ధూమాం
బుధమాల మాకు శీతల
మెదిరికి కరకాన్వితమ్ము సృష్టి నొసగుతన్.

[మధుర స్మృతులు-కృష్ణాపత్రిక 14-2-1964]

ధనార్జనకి దగ్గర మార్గం!

శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రి

ఇప్పుడు నేను చెప్పేదానివల్ల లక్షలొచ్చిపడి గారడీవాడు చూస్తూండగా మామిడి పెంకసుంచి మొక్క మొలిపించి కాయ కాపించి పండు పండించినట్లు 24 గంటల్లో కోటీశ్వరుడ వవుతావసుకోకు! శ్రమ లేకుండా నాలుగు డబ్బులు రాల్తోండడం, దాన్తో సుఖజీవనం చెయ్యడం. అంతవరకూ సంతృప్తి పడతానంటే రెండు మూడు చిట్కాలు చెప్తాను. ఏం?...సరేనా?...ఐతే విను-

మీ ఊళ్ళో పెద్ద వ్యాపారం చేసే ఆసామీ కాని, వందలాది ఎకరము లున్న ఓ పెద్ద భూస్వామికాని, అలాంటివాళ్ళు ఎవరున్నా, అందులో వీలైన వాడిని ఒకడిని పట్టుకో-నిత్యం త్రికాలముల యందూ, కొన్నాళ్ళు ఆయన దర్శనం చేసుకో. 'ఏమయ్యా, ఏం పనిమీద వచ్చావు?' అంటారు. 'పని ఏమీ లేదు బాబూ-ఊరికే దర్శనం చేసుకుపోదామని వచ్చాను' అను. వాళ్ళింట్లో పచ్చి పుంచి నీళ్ళయినా తాగకు. ఆయన ఏది చెప్పినా అతి శ్రద్ధగా వింటున్నట్లు నటించు. అలాంటివారు ఎప్పుడు మాట్లాడినా రెండే విషయాలుంటాయి. ఆత్మ స్తుతి-పరనిందాను. ఐతే తిరగేసీ బోర్లేసీ చర్విత చర్వణంగా చెబుతూ ఉంటారు. ఎప్పటికప్పుడు అవి కొత్తగా ఉన్నట్లుగానూ, ఇదివరకెన్నడూ వినన్నట్లుగానూ నటించు. ''చాల్లేవయ్యా సొద. లక్షసార్లు చెప్పావివి'' అని పొరబాటునైనా అన్నావో నువ్వింక ఆజన్మ విరోధివై ఊరుకుంటావు. అందుకని బహు జాగర్తగా, ఏ సూత్రభాష్యమో విన్నంత శ్రద్ధగా, ఆయన ప్రతాపాలూ, ప్రలాపాలూ విని ఆనందించు.

ఎంత అర్థంలేని మాట అన్నా, ఆయనేదో పెద్ద చమత్కారంగా మాట్లాడి నట్లు పకపక నవ్వుతూ ఉండు. అబే పన్నెమోర్ అని మళ్ళీ నవ్వు. దానితో

నీవు చాలా సరసుడవు. బుద్ధిమంతుడవు. రసగ్రహణ పారీణుడవు అనే అభిప్రాయం ఆ పెద్ద మనిషికి ఏర్పడుతుంది. సలుగురిలోనూ నిన్ను గురించీ నీ మంచితనాన్ని గురించీ ప్రశంస చేస్తూంటాడు. కొన్నాళ్ళకు ఆయనకు నువ్వు నల్లమంతులా తయారవుతావు. నువ్వు లేనిదే ఒక్క-పూట-పూటన్న మాటేవిటి, ఒక గంటకూడా ఆయన బ్రతుకలేని స్థితికి వస్తాడు. ఆయన కష్టసుఖాలు, ఆయన దినచర్య, ఆయన వ్యవహారాలు, ఆఖరుకు ఆయన ప్రణయ ప్రతాపాల దగ్గరనుంచీ, నీ చెవిని పడితేనేగాని ఆయనకు తృప్తి ఉండదు. అక్కడనుంచి నీకు తెలియకుండా మీ యింటికి పాలూ పెరుగూ నెయ్యీ, ఒకటేమిటి సమస్త వస్తువులూ వచ్చిపడతాయి. నీకు ఈ విషయం తెలియనట్లూ, తెలిసినా ఏమీ పట్టించుకోనట్లూ నటించాలి.

అలా కొన్నాళ్ళు గడిచేటప్పటికి ఆ ఆసామివల్ల నీ సంసారం అంతా గడవడమే కాక, నీకు నాలుగురాళ్ళు కనిపించే వ్యాపారమో, ఉద్యోగమో దఖలు పడి తీరుతుంది. అలా జరుగుతుందా అని అనుమానిస్తున్నావా? వెర్రివాడా-ఎందుకు జరగదు? ఈ కాలంలో ఏ మంత్రినో పట్టుకుని ఇలాగే స్తోత్రం చేసి, జిడ్డు పట్టించి తోమి, మర్దనా చేసి సంపాదించిన పెర్మిట్లూ, కంట్రాక్టులూ, బస్సురూట్లూ ఎప్పుడూ కనలేదా, వినలేదా? దాన్నిబట్టేనా నా చిట్కా మహత్తు తెలుసుకోలేవూ ?

ఇంతకంటే పూజనీయమైనదీ, సర్వజనాదరణీయమైనదీ, సర్వ సంపత్కరమైనదీ, మకో పద్ధతి-అదే ఇంకో చిట్కా-ఉంది. ఏమిటంటావా? మరేం లేదు. ఉదయాన్నే లేచి, స్నానం చేసి, నీ అలవాటును బట్టి కాస్త చద్ది ఆరగించడమో, కాఫీ సేవించడమో చేసి, ముఖానికి దట్టంగా విభూతి ధరించి, పిలైతే చొక్కా తొడుక్కోకుండా, ఎరిగున్న పెద్దల దగ్గరకు, ఒకరిద్దరి దగ్గరకు వెళ్ళడం. ఏదో బాతాఖానీ చేస్తూ ఉండడం. ఎటొచ్చీ ఈ బాతాఖానీ పద్ధతిలో కొంత తేడా ఉంది. అందరికి మల్లేనే రాజకీయరంగంలో వీరవిహారం చెయ్యవచ్చు. సంఘ సంస్కారాన్ని గురించిన సమస్యలు చర్చించవచ్చు. నా

అభ్యంతరం ఎంత మాత్రమూ లేదు. ఎటొచ్చీ ఏమిటంటే నీవు ఉపయోగించే భాషా, వాదన పద్ధతీ తేడాగా ఉండాలి. మాటవరుసకు చెబుతున్నాను.

రాజకీయాల గురించి చర్చ జరుగుతోందనుకో - నెమ్మదిగా సంభాషణ యుద్ధం వైపో, సత్యాగ్రహం వైపో మరలించు. హఠాత్తుగా ఏమీ వార్నింగ్ లేకుండ, సందర్భ శుద్ధి ఉందా లేదా అనే చచ్చు ఆలోచన పెట్టుకోకుండ - "చూచారూ, ఏదైన ఒక నిశ్చయాని కొచ్చి కార్య రంగంలోకి దిగాలి. దిగిన తరువాత యింక వెను తియ్యకూడదు. శ్రీకృష్ణభగవానులు చెప్పినట్లు 'హతోవా ప్రాప్స్యసే స్వర్గం., జిత్వావా భోక్ష్యసే మహీమ్' - భస్తే భస్తాం బాధలేదు. బ్రతికామా - ధంకా మీద దెబ్బకొట్టి విజయలక్ష్మిని చేపట్టా మన్నమాటే - ఇంతకూ భస్తేమటుకు వచ్చిన లోటేమిటి ? అదేమంత విచారించ తగ్గ విషయం కాదు. ఏమంటే పుట్టినవాడు గిట్టకమానడు. ఈ తనువులేమీ శాశ్వతంకావు. 'దేహీ నిత్యం అవధ్యోయం' అన్నట్లు శాశ్వతమైనది దేహికాని దేహం కాదు.ఈ శరీరం క్షణభంగురం అన్న సంగతి అందరకూ విదితమేకదా - ఎప్పుడో ఒకప్పుడు -

"వాసాంసి జీర్ణాని యధావిహాయ
నవాని గృహ్ణాతి నరోపరాణి
తధా శరీరాణి విహాయజీర్ణా
న్యన్యాని సంయాతి నవాని దేహీ"

అని గీతాకారుడు చెప్పినట్లు ఈ దేహం, మనం పాడబట్టను విసర్జించి నూత్న వస్త్ర ధారణ చేసినట్లు, సమయం వచ్చినప్పుడు ఈ దేహాన్ని విసర్జించి, నూత్న దేహాన్ని సంపాదిస్తాం;" అంటూ వేదాంత ధోరణిలోకి లాగేస్తివా, నీ చిత్తం వచ్చినంతసేపు విరవిహారం చెయ్యవచ్చు. శ్రోతల్ని అఘాతంలో దింపి వాళ్ళు ఉక్కిరి బిక్కిరి అవుతుంటే నీవు ఆనందించనూ వచ్చు. ఏమంటున్నావు ! ఏమి చెబుతున్నావు; అనేవాడుండడు. పది వాక్యాలకోసారి ఒక భగవద్గీత శ్లోకం, ఒక ఉపనిషద్వాక్యం ఉండాల్న సంగతి మాత్రం మరిచిపోకు.

ఏదో మాటల మధ్యను - పూర్వా పరసందర్భం ఎంతమాత్రం అపసరం లేదు - అందుకనే మనవాళ్ళు 'నానోషధక సమం దానం' అన్నారు. ఎందుచేత సంటే,

అన్నేన ప్రాణం
ప్రాణైర్బలం
బలేన తపః

తపసా శ్రద్ధ ..... చూచారా? అన్నం వల్ల బలం. దానివల్ల తపశ్శక్తి. చానివల్ల బుద్ధి వికాసం, మనోవికాసం. దానివల్ల సదసద్వస్తు వివేకం ; దానివల్ల తత్త్వవిచారణ ; తత్త్వవిచారణ వల్ల నేనే బ్రహ్మననే జ్ఞానం కలుగుతుంది. అందుచేత అన్నదానం చెయ్యమన్నారు. ఈ అన్నంతిన్నపాళ్ళల్లో కోటి కొక్కడు బ్రహ్మజ్ఞాని అయినా చాలునని తై తిరీయో పనిషత్తులో చెప్పబడింది నాయనా - మన విజ్ఞానమున్నదే - అపార పారావారము. అందులో మునిగి ఏరినకొద్దీ రత్నాలు దొరుకుతాయి బాబూ అని దంచు. శ్రోతలు ముగ్ధులై ప్రాణాలు అరచేతులో పెట్టుకొక్కా చుంటారు.

లేదూ - ఈ ఎన్నికల గొడవేదైనా వచ్చిందనుకో - ఎపరు గెలుస్తారు? కాంగ్రెసా? కమ్యూనిష్టా ? అని వాదోపవాదాలు జరుగుతున్నాయనుకో - అమాంతం రంగం లోకి దూకు. ఎందుకు బాబూ అలా గిజుకుంటారు ? నేను ఆంధ్రరాష్ట్రానికి జాతకం వేశాను. గ్రహసంపత్తి బహు అనుకూలంగా ఉన్నది. సమస్త శుభయోగా లూపట్టాయి. భాగ్యరాజ్యాధి పతుల పరివర్తన, గజకేసరి యోగం, నీచభంగ రాజయోగం - ఒకటేమిటి బాబూ - ఇది ఉందీ అది లేదూ అనుకోకు. ద్వాదశ రాసుల్లోనూ తొమ్మిది గ్రహాలూ ఉన్నాయి. నాలుగు గ్రహాలకు ఉచ్ఛ, మూడింటికి స్వక్షేత్రం. లగ్నాధిపతి వాహన మందు, వాహనాధిపతి సప్తమ మందూ. సప్త మాధిపతి రాజ్యమందూ, రాజ్యాధిపతి లాభమంచూ, అష్టమాధిపతి వ్యయ మందూ, పదమూడో యింటికి వెళ్ళకుండా, ఈ పన్నెండిళ్ళలోనే సర్దుకున్నప్పుడు ఆంధ్ర దేశాని కష్టసౌకర్యాలూ పట్టకేం చేస్తాయి ? చచ్చినట్టు పడతాయి. పూర్ణ

మైన ఆయుర్దాయం. ఆర్థికంగా ఆఖండమైన ధన సంపత్తి ; ప్రాజెక్టులు, రోడ్లు, ఆసకట్టలు ; పరిశ్రమలు ; తేనెపట్టులో లాగు కుల కులలాడుతూ ఎంతో చైతన్యంతో అభ్యుదయ పంథాలో నడుస్తుంది. సందేహంలేదు. ఏమండీ ఏమంటారు ? ఇందులో కాదనగల గొడివ ఎవడేనా ఉన్నాడా ?'' అని సవాలుచెయ్యి.

చూస్తూ చూస్తూ గొడివ కావడానికి ఎవడు ఒప్పుకుంటాడు ? అందువల్ల ఒక్కడు కికురుమనడు.

ఈ పరివర్తన లేమిటి, ఈ ఎచ్చ లేవిటి, ఈ నీచ లేమిటి, ఏవిటీదంతా అనగలిగిన నిర్భాగ్యు డొక్కడూ ఉండడు. కర్మం చాలక ఎవడేనా ఎందుకో లేచి గోచీ సర్దుకుంటుంటే, వాదాని కనుకొని, సభికులంతా ఏకగ్రీవంగా ''చాల్లే వయ్యా లేచావు మహా ! నిన్నగాక మొన్న కళ్ళు తెరిచావో లేదో - మహానుభావుడు - ఆయనేదో అనర్గళంగా అరిటి పండొలిచి చేతిలో పెట్టినట్లు, ప్రతి విషయం ఎన్నో ఆధారాలు చూపించి చెబుతూంటే, పానకంలో పుడకలాగ, నువ్వెందుకు లేస్తావు'' అనే సరికి ఆయన హడలి పోయి, ఎందుకు లేచిందీ మరిచి పోయి, తపీ మని చతికిల పడతాడు. అక్కడి నుంచి నీ పలుకుబడి చూసుకో...

మరో సందర్భం ఏదైనా వచ్చిందనుకో-దాన్ని వెంటనే పట్టాలు తప్పించు. మంత్రసానుల వేతనాల గురించో, వేదనలను గురించో మాట్లాడుతుంటే, సంభాణని మంత్ర శాస్త్రంలోకి లాగు. ఆ సర్వ సారతంత్రంలో ఉన్నదే అండీ నిజానికి అనేసరికి, అందరూ, సర్వసేనా మూర్ఛపడినట్లు చల్లారి పోరుకుంటారు. అక్కడ నుంచి నీ ఇష్టం-మంత్రంలోంచి తంత్రంలోకి, తంత్రంలోంచి మంత్రంలోకి పిల్లి మంత్రాలు కొట్టించు. ఏవిటో అంతుబట్టక శ్రోతలు శ్లేష్మంలో పడ్డ ఈగల్లా కొట్టుకుంటున్న సమయంలో చిత్తు చిత్తు చెయ్యడానికి చేతిబాంటు ఒకటి విసురు.

ఏవిటా చేతిబాంబు అంటావా ? వినుము. ''అసలు ఈ మంత్రశాస్త్రం ఉన్నదే - అంతా రసవాదం. దాని అంతరార్థం తెలియక మనవాళ్ళు కొట్టుకు

ఛస్తారు. పంచ మకారాల అర్థం ఏవిటో ఎవడేనా విచారించాడూ? సావకాశంగా దొరికింది కదా అని పట్టినంతవరకూ పట్టించడమే కాని! ఈ స్వర్ణయోగ ముస్నదే మనవాళ్లు ప్రతిదానిలోనూ ఇమిడ్చారు. శ్రీ సూక్తం చూడరాదూ?

"హిరణ్య ప్రాకారా మార్ద్రాం జ్వలంతాం..."

ఈ మంత్రార్థం ఏమిటంటారూ? పురుష సూక్తం, నమకం, చమకం, ఆఖరికి సంధ్యావందనం - ఒకటేమిటి - సమస్తానికి అంతరార్థం ఇదే. రామాయణం అంతా ఇదేనంటే నమ్మండి. తెలుసుకోవడం మాత్రం దుర్లభం. అందుకనే గుప్త విద్య అన్నారు దాన్ని.....

దాంతో నువ్వు సర్వ మంత్ర, తంత్ర, జ్యోతిషాది విద్యల్లోనూ పారంగతుడవనే సదభిప్రాయం యావన్మందికీ కలుగుతుంది. ఇంక నీకు ధన ధాన్య కనక వస్తువాహనాదులకు లోటేమిటి చెప్పు!

[బారిష్టరు గారి బాతాఖానీ]

సాహిత్య రచన

శ్రీ కె. కె. రావు

[సాహిత్యం రాయడం ఎట్లా? ఎంత? ఎందుకు? ఎవరికి? ఎప్పుడు? ఇత్యాది సమస్యలను గురించి ఈ వ్యాసంలో సమగ్రంగా చర్చించబడింది—సం॥]

సాహిత్యం రాయటం అంటే అట్టే కష్టం కావని చాలా మందికి తెలీదు. సాహిత్య రచనకు కావలసిందల్లా కాగితాలూ, కలమూను. కాగితాలు తెల్లవిగా ఉండడం మంచిది. రంగు కాగితాలైనా ఫరవాలేదు. రంగు కాగితా లుపయోగించే టప్పుడు సిరా రంగూ, కాగితం రంగూ ఒకటిగా ఉండకుండా చూచుకోవడం కొంతవరకు అవసరం. తమ విధేయుడు ఎర్ర కాగితాల మీద ఎర్ర సిరాతో రాసిన రచనలు కూడా చదివాడు. కాని అరవై రూపాయలు తీసి సంపాదకత్వ మంత్రసానితనం పైన వేసుకున్న అభాజనుడు అన్నిటికీ సంసిద్ధుడనే ఉండాలి. (ఈ రచయిత చాలాఅదృష్టవంతుడు. మేము నీలిరంగు కాగితాల మీద నీలిరంగు సిరాతో రాసిన వ్యాసాలు కూడా చదివాము- సం॥) ఒకసారి రాసిన కాగితాలు మరి రాయటానికి పనికిరావనే మూఢ విశ్వాసం చాలా మందికి ఉన్నది. ఇది కేవలము అహోహా! పెనసలుతో రాసిన కాగితాల మీద సిరాతోటి, సిరాతో రాసిన కాగితాల మీద రంగుపెనసలుతోటి, మహారాజుగా రాయవచ్చు. అయితే ఇట్లా రాసినది ఉత్తమ జాతి సాహిత్యం అవుతుందా అని సందేహం. కాని ఉత్తమజాతి సాహిత్యం కింద చేర్చదగిన పద్యాలు సంపాదకుడి లేఖల మార్జినులలో రాయబడి రావటం కూడా తమ విధేయుడి అనుభవంలోదే గనుక ఈ విషయంలో సంకుచిత తత్వం పెట్టుకోకుండా ఉండటమే మంచిదేమో.

ఇటీవల సాహిత్యం మరీ ఎక్కువగా ఉంటున్నదనీ, పత్రికలు - వీటిని తగలెయ్యా-మరీ జాస్తి అయిపోతున్నాయనీ చాలామంది విసుక్కుంటున్నారు.

కాని ఇందులో మనం నసపెట్టవలసిన అంశం ఏమీ లేదు. వెనుకటి రోజుల్లో - సాహిత్యం శాశ్వతంగా రాతి పుస్తకాల మీద రాయబడిన రోజుల్లో - సాహిత్య రచన అంటే ఒక విధమైన గృహ పరిశ్రమగా ఉండేది. అప్పటి రచయితలు ఈనాటి కూలివాళ్ళల్లే ఉదయమే లేచి కాలకృత్యాలు తీర్చుకుని వసారాలోకి వచ్చి కూర్చుని కుర్రాడిని ఉలికి పదునుపెట్టమని చెప్పి, ఈలోపుగా ఇష్టదేవతా ప్రార్థన ముగించుకుని, సూర్యోదయం వేళకల్లా సాహిత్యం చెక్కటం ప్రారంభిస్తే భోజనాల వేళకు మూడు నాలు గక్షరాలు పూర్తి అయ్యేవి. అంతట రచయిత లేచి ఒంటిమీద పడ్డ రాతి నలుసులు దులుపుకొని, స్నానపానాదులుచేసి ఇంచిల్లిపాదికి తాను ఉదయం చెక్కేసినంతవరకూ సాహిత్యం వినిపించి ఒక కునుకు కునికి మళ్ళీ లేచి రాతిమీద పనికి కూచుంటే రాత్రి ఒకయామము గడిచి ఆముదం దీపం కొడిగట్టే లోపుగా ఒక పంక్తి యావత్తూ ఇట్టే పూర్తి అయి పోయేది.

సాహిత్య స్రష్టల గతి ఇట్లా ఉంటే పఠితల గతి ఇంకా అన్యాయంగా ఉండేది. ఈనాటి రచయితలు నున్నటి కాగితాలమీద ఖరీదైన కలాంతో రాస్తుంటేనే ఒక్కొక్క సమయంలో రచయిత యొక్క అభిప్రాయాలు దురూహ్యంగా ఉంటాయి గదా, ఆ రోజుల్లో రాతికీ ఉలికీ గల సంఘర్షణలో ఉద్భవించిన ఆ లిపి ఏ మల్లంపల్లి సోమశేఖరశర్మగారి లాంటి కొద్దిమందికో తప్ప అర్థ మయేది కాదంటే ఆశ్చర్యం ఏమిటి గనక ? ఈనాటి కవులు "నా రచన విను" అని అన్యాయత్తచిత్తులైన ప్రజల వెంటపడ్డ విధంగా అప్పట్లో ప్రజలు నీ రచన కాస్త చదివి పెట్టవూ? అని కవిగాడిని వెంబడించేవారు.

ఆ రోజుల్లో రాసిన సాహిత్యం శాశ్వతంగానూ, పరిమితంగానూ, పామర జనాతీతంగానూ ఎందుకు ఉండేదో ఇప్పుడు మీరు తెలుసుకున్నారు.

ఆ తర్వాత కాలక్రమాన తాటాకులూ గంటాలూ వెలిశాయి. కొందరు జిజ్ఞాసాపరులు తాటాకులను సృజించారు. అవి నిలవ్వు; వాటి మీద రాసిన సాహిత్యం ఎండి, పగిలి, నుసి అయి, కాలక్రమాన ఇంత దుమ్ముగా మారిపో

తుంది; సాహిత్యం ఏ అయిదారు శతాబ్దాలో మించి ఉండదు; ఇది సరస్వతీదేవికి ద్రోహం అన్నారు. కాని అప్పటి అభ్యుదయ రచయితలు వినిపింపుకోక, "మేము ప్రజాబాహుళ్యం కోసం రాయడలిచాం. వస్తాదులు కానివాళ్ళు సహితం చంకని పెట్టుకొనే స్వరూపంలో సలుగురికీ అర్థమయే లిపిలో రాసినదే ఈనాడు అభ్యుదయ సాహిత్యం. మా కీర్తి పెయ్యేళ్ళు మాత్రమే దక్కితే ఇంతలో పోయేదేముంది?" అని పూర్వాచార పరాయణులమీద తిరుగుబాటుచేసి తాటాకులమీద గంటాలతో రచన సాగించారు. అంతటితో, గృహపరిశ్రమగా ఉంటూ వచ్చిన సాహిత్య రచన విస్తరించింది. కాస్త చదువుకొన్నవాళ్ళ ఇళ్ళల్లో రెండు మూడు తాళపత్ర గ్రంథాలు అమ్మవారి మందిరంలో చేరటమూ, అప్పుడప్పుడు దీపారాధన వాటికి సోకి ప్రమాదం జరగటమూ తటస్థిస్తూ ఉండేది. "ఈ గ్రంథాలన్నీ చదవటానికి నీకు వేళ ఎక్కడిది బాబూ?" అని లౌకిక చింతా పారాయణులు సాహితీ ప్రియులను మందలించేవారు. సాహిత్యాన్ని పూజా మందిరంలో దాచిని పక్షంలో పిల్లలు ఉద్గ్రంథంతో ఉదయం నాలుక గీసుకొనే ప్రమాదం ఎక్కువగా ఉండేది. పిల్లల బాధపడి గాని, దీపారాధనకు నైవేద్యం అయిగాని ఒక గ్రంథమో గ్రంథభాగమో నశించినప్పుడు ఎన్నో రోజుల శ్రమా ఎన్నో కుంచాల ధాన్యమూ ఎంతో అపురూపమైన వస్తువూ వృధా అయిపోయినట్లయేది.

మరి ఈనాడు మన ఆలవాళ్లు నిశ్చింతగా పత్రికలతో నెయ్యికరగబెట్టేస్తున్నారంటే ఇది పరిణామమే అనాలి. ఇవాళ కాగితం కరువొచ్చి కొంచెం గిజాటుగా ఉందిగాని పౌను అయిదు కాన్లకి బోలెడంత కాగితం: పౌను పావలాకి బోలెడంత పైపు: రోజూ ఆరణాల పేతనం మీద బోలెడంత మంది కంపోజిటర్లు: (భాష తెలిసిన వాడైతే మరో బేడ, చదవగలవాడు కూడా అయితే ఇంకో అణా -సం॥) ఈ పరిస్థితుల్లో సాహిత్యం విరివిగా రాకేం జేస్తుంది? పైగా, చదివే వాళ్ళ సంఖ్య తరుగుతున్నకొద్దీ సహజంగా అది రాసేవాళ్ళ సంఖ్యగా మారుతుంది. (మేము తప్పని సరిగా చదవపలసి రావటంచేతనే రచన చెయ్యలేకుండా ఉండటం జరుగుతూ ఉంది. ఎవరైనా మా స్థానం ఆక్రమించటానికి ముందుకు

వస్తే ఇటువంటి అమూల్య వ్యాసాలు మేము కూడా రాయగలమని చెప్పటానికి సాహసిస్తున్నాము- సం॥) అందుచేత ''సాహిత్యం ఎంత?'' అనే సమస్యకి సమాధానం: ''వెళ్ళిన కొద్దీను.''

పోతే ''సాహిత్యం ఎందుకు?'' అనే క్లిష్ట సమస్య మరని ఘోరంగా ఎదుర్కొంటుంది.

ప్రతిదానికి, ''ఎందుకు?'' అని అడగటం చాలా మందికి దురలవాటు. కర్ణుడు చావటానికి ఏడు కారణాలుట. ఒకే కారణం పెట్టుకుని ఎవరూ ఏ పనీ చెయ్యరు. అందులో కూడా ఏ ఒక్క కారణమూ స్థాయిగా ఉండక మార్పు చెందుతుంది. ముందు విందులు కుడుస్తాం; తర్వాత పథ్యం తింటాం. అట్లాగే ముందు కీర్తికోసం రాస్తాం. అది వ్రతికలో పడకపోతే ఏ తత్సంపాదకుణ్ణి తిట్టడానికి రాస్తాం. తమ విధేయుణ్ణి దుమ్మెత్తి పొయ్యటానికి వెనక ఒక ఉద్యమం లేపటమేకాక ఇందుకుగాను బోలెడంత డబ్బుపోసి ఒక పత్రికారాజము నడపటం కూడా జరిగింది. (ఈ రచయిత చాలా అదృష్టవంతుడని మొదటే చెప్పాము. మేము సంపాదకత్వం మొదలు పెట్టినాక మాకీ సన్మానం ఇంతవరకూ జరగ లేదు. అయితే మేము నిరాశ చెందటంలేదు. పేపరు కరువు వెనక పడగానే మా ఆశయం సిద్ధిస్తుందని నమ్ముతున్నాము-సం॥)

మన వ్యాసాలు పత్రికలో పడగానే మనకి పేరు వస్తుందా అని కొందరికి అనుమానం, కాని ఈ ఆధునిక యుగంలో ఇంతకంటె మంచి పద్ధతి లేదు. ఖ్యాతి అంటే పేరు ప్రచారం కావటం. ప్రామిసరీ నోట్లమీద, దస్తావేజుల్లోను, స్కూలు రికార్డుల్లోను, మ్యునిసిపల్ రిజిష్టరులోను, మన పేర్లుండవచ్చు గాని, అవన్నీ చెరగని అచ్చులో చెలామణీ గల పత్రికలో పెద్ద అక్షరాల్లో పడే మన పేరులాగ ప్రచారం కాజాలవు. ఒకవేళ రచయిత అమాయకుడై మారుపేరుతో రచనలు సాగించినట్లయితే ఆ రచనలు అచ్చే కావాలి కాని త్వరలోనే ఆ రచయితకు మారుపేరు సార్థక నామమై తీరుకుంటుంది. (ఇటీవల మాకు కూడా మా స్వంత పేరు చప్పున స్మరణకు రాకుండా ఉంటున్నది-సం॥)

సాహిత్యం పదిమందీ చదవటానికనీ, ప్రపంచాన్ని ఉద్ధరించటానికనీ, సంఘాన్ని మార్పు చెయ్యటానికనీ, కొన్ని అభిప్రాయాలు చెలామణిలో ఉన్న మాట నిజమే! కాని ఇవన్నీ వట్టి గొంతెమ్మ కోరికలు. కొత్తగా రచనలు చెయ్యటం మొదలు చేసిన వాళ్ళు పది మంది చేత చదివించాలనే సత్సం కల్పంతో తమ రచనలు పత్రిక పట్టుకుని తిరుగుతారు. కాని త్వరలోనే వాళ్ళకి నిజం తెలిసొస్తుంది. ఈ నిజం ఏమిటంటే, ఎవరన్నా పత్రికలు చూస్తారు. కాని చదవరు. కొన్ని సంవత్సరాల క్రితం ఒకానొక పత్రిక ప్రత్యేక సంచికను మరో పత్రిక సింహావలోకనం చేస్తూ - అవలోకనం అనే మాట గుర్తుంచుకోండి-అందులో ఎన్ని బొమ్మలున్నదీ, అవి ఏయే జాతులకు చెందినదీ విపులంగా చెప్పి, అందులో కొన్ని వ్యాసాలు కూడా ఉన్నట్టు టూకీగా చెప్పి ఊరుకుంది. అందుచేతనే తమ విధేయుడు తన స్నేహితులను, "ఈ మధ్య నేను రాసిన వ్యాసం చూశారా?" అని అడుగుతాడు కాని చదివారా అని పొరబాటున కూడా అడగడు.

ఇక ప్రపంచం ఉద్ధరించడం మాటా? ప్రపంచాన్ని ఉద్ధరించే వాళ్ళు శాస్త్ర పరిశోధనలు చేస్తారు. నూతన సృష్టి చేస్తారు. రాజకీయ వేత్తలవుతారు కొత్త పార్టీలు లేవదీస్తారు. వైద్యులవుతారు. ప్లీడర్లవుతారు, మరేదైనా చేస్తారు. కాని సాహిత్యం మటుకు రాయరు. మన రాజకీయ నాయకులుగాని సంస్కర్తలు గాని, తదితర గొప్పవాళ్ళు కాని, ఎవరైనా సాహిత్యం రాస్తారేమో చూడండి.

సంఘాన్ని మార్పు చెయ్యడం గురించి ఈ పనిలో చాలా కాలం వ్యయం చేసిన చలంగారేం అంటున్నారో వినండి. సంఘం దున్నపోతుట. మనవంటి మనుషులం దాన్ని ఎంత బాదినా, తోసినా, ఏం చేసినా కదలదుట. అది ఎప్పుడో, ఎటో, దాని ఇష్టానుసారం కదులుతుందట. ఈ భాగ్యానికి ఈ దున్న పోతుని కదిలించడానికి సాహిత్యం వ్యర్థ పరచడం కూడా దేనికి? ఇంతకన్నా చక్కగా పేరు ప్రచారం కావడానికి రాసుకోవటమే చాలా మంచిది. రాయగా రాయగా ఏనుగెక్కే అవకాశం ఉంది.

సాహిత్యం ఎవరికి అనే ప్రశ్న పై సంగతుల్ని బట్టి దానంతట అదే తేలిపోతుంది. మనం రాసేది పత్రిక కొనేవాళ్ళంతా చూస్తారనుకోండి. వాళ్ళ దగ్గర పట్టిగెళ్ళి పత్రికలు పారేసే వాళ్ళు కూడా చూసే అవకాశం ఉంది. తీసుకున్న వెంటనే పారెయ్యకపోతే, వీళ్ళుకాక ప్రత్యేకించి చూడపలసిన వాళ్ళు వేరే ఉంటారు. మనం ఎవరి మీదనైతే దెబ్బలు తీస్తూ రచన చేశామో వారందరూ పత్రికలో మన వ్యాసం చూడాలి. వీలైతే చదవాలి. వాళ్ళు పత్రిక కొనిగాని కొన్నవాళ్ళ దగ్గర బదులు తెచ్చిగాని మన వ్యాసం చూడటం చాలా అనుమానాస్పదం. ఎందుకంటే, కాస్త తీరికి చిక్కితే ఎవరన్నా సినిమాలకి పోతారు, కాఫీ హోటల్‌కి పోతారు, హస్కు కొడతారు, లేకపోతే క్లబ్బుకి పోయి చీట్ల పేక ఆడతారు. కాని పనివేళా పత్రిక లెవరూ చూస్తారు? అందుకని ఈ ప్రత్యేక పోస్టులకు మనమే, స్వంతాన పత్రిక కాపీలు కొని పోస్టు చెయ్యాలి. మనం ప్రణయ కథలుగాని కవిత్వంగాని రాసినప్పుడు మనం ప్రేమించే డజను మంది ఆడ పిల్లలకు తలా ఒక కాపీ పోస్టు చెయ్యాలి. బీద రచయితకి ఇది ఖర్చుతో కూడుకున్న వ్యాపకమే మరి. అయినా చేతి చిలుము వదలకుండా రచయిత కానేరడనేది మనం మరచిపోకూడదు. ఎవడన్నా స్నేహిత బ్రువుడు కనిపించి, "ఏమోయ్, మొన్న నువ్వదేదో పత్రికలో అదేవిటో రాశావే" అనగానే మర్యాద కోసం కాఫీ హోటలుకు వాణ్ణి పట్టించుకుపోయి ఇంత కాఫీ పొయ్యిటం తప్పదు కదా! ప్రెస్సు వాళ్ళకి అప్పు పెట్ట గలిగిన పరిస్థితుల్లో మనం అచ్చేయించే మన పుస్తకం తాలూకు కాపీలు నోరు చేసుకుని అడిగిన వాడికల్లా ఆటోగ్రాఫ్‌తో సహా ఇవ్వక తప్పదు. రాసే వ్యాసాలు పత్రిక్కి పంపించేటప్పుడు పోస్టు బిళ్ళల ఖర్చు తప్పదు కదా, ఏది తప్పుతుంది గనుకా?

సాహిత్యం ఎప్పుడు రాయాలి అంటే వేరే ఏ పనీ చెయ్యటానికి లేనప్పుడని వేరే చెప్పక్కర్లేదు. సాహిత్య రచనకు చాలా తీరిక ఉండాలి. ఇన్‌స్పిరేషను రావాలా? దానికోసం నలుగు రాడవాళ్ళ తోటి అంతో ఇంతో పరిచయం సంపాదించటమూ, నలుగురి మగాళ్ళతోటి అభిప్రాయ భేదాలు తెచ్చుకోవటమూ మొద

లైనవి చెయ్యాలంటే ఇతర వ్యాపకాలుండరాదు. ఇచ్ఛా, పొలాలూ, పుట్రా ఉంటే వాటి ఆలోచనలు సాహిత్య ప్రవాహా న్నడ్డుతాయి. ఉదోగ్యం ఉంటే అదే ఉన్న కాస్త శక్తినీ హరించేస్తుంది. ఏ రాజకీయాల్లో గాని, ఏ ఇతర ఉద్యమంలో గాని ఆసక్తి ఉంటే జీవితాన్ని గురించి అంతో ఇంతో నిజం తెలియడం ప్రారంభించి ఇక సాహిత్యం సృష్టించటానికే చెయ్యాడదు. అందు వల్ల కాణీ ఆర్జన లేకుండా, చేసే పని బొ తిగా లేనివాళ్ళే విరివిగా ఉత్తమ సాహిత్య రచన చెయ్యగలుగుతారు. అట్లా స్వేచ్ఛా విహంగంగా ఉన్న రోజుల్లోనే, నేను చాలా ఉత్తమ సాహిత్యం రచించానని నా మిత్రులు చెబుతున్నారు.

(ఆ రోజులు మళ్ళీ తిరిగి రావు కదా!-సం॥)

[ఫిబ్రవరి 1946-ఆంధ్రజ్యోతి]

హాస్య రచనలో సాధక బాధకాలు

శ్రీ నిరంజన్

ఆఁ, మరేంలేదు. నేనొక మాస పత్రికలో మంచి రసవంతమైన ప్రహసనం ఒకటి వ్రాశాను.

అది చదివిన నా ఆంతరంగిక స్నేహితులందరూ పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వారు; అయితే చెప్పవలసిన విషయం ఏమంటే, నా విరోధులు కూడా కడుపు ఉబ్బేట్లు నవ్వుకుంటున్నారు. ఆముదాలపల్లి, నెల్లిమర, పోససానపల్లి నుంచి ముగ్గురు పాఠకులు నాకు ఉత్తరాలు రాశారు - ఈ ప్రహసనం యొక్క అర్థ మేమిటో చెబుతారా అని.

వీరిలో కొంచెం పెద్దమనిషి తరహా ఉన్న ఒకాయన ''బహుశా ముద్రణలో ఏదో దోషం ఉండి ఉంటుంది. లేకపోతే ఎందుకు అర్థం కాదు?'' అని అభిప్రాయపడ్డాడు. రెండో ఆయన అనావశ్యకమైన సహృదయతతో "మీ మానసిక స్థితి ఎలా ఉంది?... అబ్బే... మీ రచన చూశాక నాకే ఆదుర్దా ఏర్పడింది'' అంటూ రాశాడు. మూడో వ్యక్తి అనుమానానికి, శంకకే అతీతమైన స్థితిలో పడ్డాడు. పర్యవసానంగా నేనే పడపలసి వచ్చింది ఆయన విషయంలో ఆదుర్దా.

ఇది ఇలా ఉండగా, మరి కొన్ని ఉత్తరాలు వచ్చాయి. శ్రీనివాసమూర్తి గారట, శ్రీకాకుళం నుంచి ఇలా వ్రాశారు: మాస పత్రికకి డైరెక్ట్‌గా—

"గోవిందం గారు వ్రాసిన ఈ ప్రహసనం యొక్క ఉద్దేశ్యం ఏమిటి? దీనివల్ల దక్షిణ ఆఫ్రికాలో మన సోదరీవాళ్ళు పడుతున్న అగచాట్లు ఏమైనా తీరుతయ్యా? పోనీ, దేశంలో రోజూ ఇంతమందిని పిచ్చి కుక్కలు కరుస్తున్నయ్. కనీసం దానికైనా గ్రంథకర్త ఈ రచనలో ప్రతిక్రియ సూచించాడా?''

దక్షిణ ఆఫ్రికా ఏమిటి? సాలె వాళ్ళేమిటి? పిచ్చికుక్క లేమిటి?... ఇదంతా ఏమిటి బాబోయ్! నా ప్రహసనానికీ వీటికీ సంబంధం ఏమిటి?

అజ్ఞాన తిమిర నివారిణీ పత్రిక నా రచనను గురించి ఇలా సమీక్ష చేసింది: ''పొలాలలో వరిసాగు తగ్గించేసి దానిస్థానే పట్టు పండిస్తూండడం వల్ల రైతుల స్థితి వెనకటికంటె ఇప్పుడు మెరుగైందనే గనక గోవిందంగారు అభిప్రాయ పడుతున్నట్లయితే మాకూ గ్రంథకర్తకూ మతం కలపదని చెప్పక తప్పదు. కాని ఒకవేళ, పట్టు పండించడం కన్న వరి సాగుచేయడమే శ్రేయస్కరమని ఆయన ఉద్దేశ్యం అయినట్లయితే, అదీ సంపూర్ణ సత్యం కాదు. అయితే ఈ రెంటిలో ఆయన ఉద్దేశ్యం సరిగ్గా ఏదో, వ్రాసినదానినిబట్టి నిర్ధారణ చేయడం అసంభవం.''

నాకు మతి పోయింది. నా రచనలో పట్టు పరిశ్రమా, వరి సాగూ, వీటి ప్రస్తావనేం లేదే! ఈ అజ్ఞాన తిమిర నివారిణీ పత్రిక వారికి అవెక్కడ కనిపించాయి చెప్మా.

జ్ఞాన్ ప్రకాష్ అనే ఆమె ఇలా వ్రాసింది: ''మన దేశంలో బాల వితంతువులు పడుతూన్న కష్ట నిష్ఠూరాలు చూసి, పాఠకుల హృదయాల్లో కరుణ రసం ఉప్పతిల్లి కుప్పతిప్పలై ఏడ్చేసేటట్లు చెయ్యడానికి ఈ ప్రహసనంలో రచయిత నానా తంటాలూ పడ్డాడని అర్థం అవుతోంది. వీడి తంటాలూ, వీడి ఏడుపూ, వీడూ బంగారం గాను! మాకు గ్రంథం చదువుతున్నంత సేపూ ఎక్కడా ఏడుపు రాలేదు సరికదా, మొదట్నించీ చివరివాకా పొట్ట చెక్కలయేట్లు నవ్వించింది.''

బాల వితంతులా?... సరి సరి! వారి పొట్ట చెక్కలవడానికి నేను పూర్తిగా బాధ్యత వహించక పోయినా ఈ ఉత్తరంతో మాత్రం వారు నిస్సందేహంగా నా తల గిరుక తిరిగేటట్లు చేస్తున్నారు. కళ్ళు తిరిగి పడిపోయి నా బుర్ర చెక్కలయితే మాత్రం అందుకు పూర్తి బాధ్యత జ్ఞాన్ ప్రకాష్ గారిదే!

వారు స్త్రీయో పురుషుడో, పేరును బట్టి నిర్ణయించలేకపోతున్నా.ఏమైనా, ఏం కాకపోయినా వారికి బాల వితంతువులపై ఉన్న మమకారానికి మాత్రం నా అభి వాదాలు. వారికి నా ప్రహసనం వితంతు ప్రహసనంగా అర్థమైతే అది నా తప్పు కాదనీ, దానికంతకీ వారి బుద్ధికుశలతే కారణమనీ సవినయంగా మనవి చేస్తున్నాను.

'సమ్మార్జనీ' అనే వారపత్రిక ఇలా ప్రాసింది : "హరిహరపురం మునిసిపాలిటీని విమర్శిస్తూ గోవిందంగారు ప్రాసిన గంభీర వచనరచన సుబో ధకంగానూ, సునిశితంగానూ ఉన్నదనడంలో ఆవంతయినా సందేహం లేదు. కాని ఒక్క విషయం మాత్రం మాకు చాలా దుఃఖమూ, ఆశ్చర్యమూ కలిగిం చింది. ఈయన ఇతరుల అభిప్రాయాలను స్వంత అభిప్రాయాలుగా ప్రదర్శించ డానికి ఏ మాత్రమూ జంకడు-సందేహించడు.

ఉదాహరణకి చూడండి. ఈ రచయిత ఒకచోట 'పుట్టిన తరువాత చావక తప్పదు' అని రాశాడు. ఇది ఈయన స్వంతభావమా? ఈ చమత్కార భావం గ్రీకు పండితుడైన సోక్రటీస్ గ్రంథంలో కనిపించి ఉండక పోయి నట్లయితే, రచయిత యొక్క స్వతంత్ర ఆలోచనా శక్తిని తప్పకుండా ప్రశం సించి ఉండేవాళ్ళం. ఇటువంటివే దొంగసొత్తు నమూనాలు మరికొన్ని ఈ కింద పొందుపరుస్తున్నాం.

గిబ్బన్ ప్రాశాడు–'రాజ్యంలో రాజు లేకపోతే ప్రజలు విశృంఖలులు అవుతారు' అని. మరి గోవిందంగారు ?... "ఒక పంక అరాజకత...దానికి తోడు అనావృష్టి...'–చూడండి ఎంత కాపీయో. 'గండ స్యోపరి విస్ఫోటకం' మాత్రం? ఇది ఈయన స్వంతమా? కాళిదాసు కావ్యంలోంచి దొంగిలించింది. కాళిదాసు సంస్కృత శ్లోకంలో రాస్తే, ఈయన 'గండస్యోపరి...' అంటూ అచ్చతెలుగులో రాశారు. అంతే లేడా!

రస్కిన్ 'ఆకాశం మధ్యలో పున్నమి చంద్రుడు నడినెత్తిన ఉద యించాడు. అలా ఉదయించిన చంద్రుని వెన్నెల, సముద్రపు నీళ్ళమీద పడింది'

అని తన పుస్తకంలో వర్ణిస్తే దానిని చౌర్యం చేసి గోవిందంగారు 'పంచమి చంద్రుని వెన్నెల రామస్వామిగారి బట్టతల మీద పడి మిలమిలలాడుతోంది' అంటూ తన గ్రంథంలో చొప్పించారు. ఏమి సాహసం! ఏమి చౌర్యం!! ఏమి పంచన!!!''

హా హతవిధీ! అని తలపట్టుకున్నాను.

సంవాద సారం అనే పత్రిక ఇలా విమర్శించింది: "గోవిందంగారి గ్రంథంలోని రామస్వామి బెజవాడ పట్టణ వాస్తవ్యులైన కృష్ణమూర్తిగా రసడంలో ఇసుమంతయినా సందేహం లేదు. బెజవాడ కృష్ణమూర్తిగారికి బట్టతల లేని మాట నిజమే కాని ఆయన భ్రాతుష్పుత్రుడికి ఇప్పుడిప్పుడే జుట్టు రాలిపోయి బట్టతల ఏర్పడడం ప్రారంభించిందని మాకు నమ్మకంగా తెలియవచ్చింది. ఈ విధంగా వ్యక్తిగతమైన ఆక్షేపణలు చెయ్యడం పూర్తిగా గర్హ్యం.''

మహాప్రభో!

నేరకపోయి రాశాను కదా ఈ ప్రహసన:!

నాకు నిజంగా బుర్ర తిరిగిపోతోంది. నా ప్రహసనం హరిహరపురం మునిసిపాలిటీని విమర్శించడానికి ప్రాసిందేనని సమ్మార్జనీ పత్రిక ప్రకటించింది. ఈ అభిప్రాయాన్ని ఖండించడానికి అవకాశం లేదు; ఎందుచేత నంటే, హరిహరపురం ఇరవై నాలుగు పరగణాలలో ఉందో, లేక టిబెట్టులో ఉందో, లేక గుడివాడ తాలూకాలోనే ఉందో కూడా నేను ఎరుగను. అక్కడ ఇప్పుడు మునిసిపాలిటీ ఉన్నదా, ఉండించా, లేక రాబోతోందా—ఇదీ నేను జోస్యం చెప్పలేను.

ఇకపోతే నేను బెజవాడ కృష్ణమూర్తిగారి మీద నాగ్రంథంలో అన్యాయమైన పక్షపాతం చూపించానని సంవాద సారం పత్రిక చేసిన ఆరోపణని కూడా ఉపేక్షణీయమని నేను నిరూపించలేను, ఎందుచేతనంటే, సంవాద సారం తన వాదాన్ని

రంధ్రాన్వేషణకు ఎడం ఇవ్వకుండా ప్రమాణాలతో సహా సమర్థించుకొన్నది. కృష్ణమూర్తి అన్న పేరుతో ఉన్న వ్యక్తిని ఒక్కణ్ణి మాత్రం నేను ఎరుగుదును. అయితే ఆయనమహారాష్ట్రకాదు, శర్మ. ఆయన ఇల్లు బెజవాడలో లేదు, ఏలూర్లో ఉంది. భ్రాతృవ్రతుడి తల బంగారంగాను! నేను ఎరిగిన కృష్ణశర్మగారి అన్న గారికి కుమారుడే లేడు. అయితే ఆయన చెల్లెలికి మాత్రం ఇద్దరు కూతుళ్ళున్నారు.

ఇక నా గ్రంథంలో బొగ్గుగనుల ఆసాముల మలీమస చరిత్రను బొగ్గు మసితో పోల్చానని సమీక్షలలో వ్రాసిన వారికి నా విజ్ఞాపన ఇది.

అవునూ?... అలాంటి మసిబొగ్గు సమీక్ష వచ్చిందా అసలు నాగ్రంథం మీద? వచ్చే ఉంటుంది. నాకు మతిపోతోంది కదా- మరిచిపోయి ఉంటాను. వస్తే ఓ మసి బొగ్గు విమర్శక మహాశయా, నా మనవి విను.

అసలు అటువంటి గనులు ఎక్కడైనా ఉండడం సంభవమో కాదో, సంభవమయే పక్షంలో అవి ఎక్కడ ఉన్నవో నారు తెలిపి గనుల విషయమైగల మదీయ అజ్ఞానమును తొలగించవలసిందని ప్రార్థిస్తున్నాను.

ఎపర్రు ఏమి అన్నప్పటికీ, ఉప్పుపన్ను, విధవావివాహం, ఆవునెయ్యి గురించి నేను ఏమీ వ్రాయలేదని ఒట్టువేసి చెప్పగలను.

బైట సంగతి ఇలా ఉండగా ఇటు ఇంట్లో కూడా నాకు రొష్టు తప్పలేదు. ఏదో గంభీరమైన భావాన్ని పెల్లడిస్తూన్న వాడిలాగా, ప్రహసనంలో ఒక చోట ఇలా వ్రాశాను: ''ఈ జగత్తు ఒక పెద్ద పశుశాల'' అని.

దాంతో కొంప ములిగింది.

రాసినప్పుడు నేననుకొన్న దేమిటంటే, ఇది చదివి పాఠకులందరూ నవ్వుకుంటారు అని. కాని ముగ్గురు పాఠకులు మాత్రం నవ్వుకోలేదని ఉత్తరోత్తరా నాకు దాఖలాలు లభించినవి. మొట్టమొదట నా దాపమ్మరిదివచ్చి నన్ను తిట్టిపోషణం ప్రారంభించాడు.

"నువ్వు వెయ్యి చెప్పు, లక్ష చెప్పు-నువ్వు పశువు అన్నది నన్నే" అని మొరాయించుకూచున్నాడు.

నేను అన్నాను "ఒకవేళ నిన్ను నేను అలా అనిఉన్నా తప్పేమీలేదు. కాని నీమీద ఒట్టు, నిన్ను అనలేదు." అన్నగారు చేసిన అపమానానికి చెల్లెల్ని పుట్టింటికి పంపేస్తానన్నాడు. చివరకి అంతపనీ చేశాడు. నేను ప్రహసనం రాసిన పాపానికి నా చెల్లెలి కాపురం చెట్టెక్కింది.

'పశుశాల' అన్న పదానికి కోపం తెచ్చుకొన్న మొదటి ఆసామీ ఇతనైతే, రెండోవారు మా టూరి జమీందారుగారు.

నా ప్రహసనం చదువుతూ, చదువుతూ ఆ పదం దగ్గరికి వచ్చేసరికి జమీందారు పశుపతిశాస్త్రిగారు నోటివెంట మాటరాక ఉక్కిరిబిక్కిరైపోయినారుట. తనను శాలా (బావమరిది) అని సంబోధించడానికి అవసరమైన అధికారం కాని, చనువు కాని నాకు లేదనీ, నన్ను గురించి పదిమంది ఎదుటా తాను అంటున్న మాటలు కూడా ఏమంత ప్రాప్యమైనవి కావనీ అన్నారట.

ఇక మూతో ఆయన, పక్కింటి జగద్బాబు.

ఒక రోజున టీ ప్రాగుతూ నేను రాసిన సదరు ప్రహసనం చదువు తున్నాట్ట. ఉండి ఉండి ఉబికివస్తూన్న నవ్వును ఆపుకోలేక, ఇంకా గుటకమింగని టీనీ, నములుతూన్న రొట్టె ముక్కలనీ, మధ్య మధ్య బైటికి పిచికారీ చేస్తూ, 'జగత్తు పశుశాల' అన్న వాక్యం దగ్గరికి వచ్చేసరికి, హఠాత్తుగా హాస్య వేగం అంతా ఆగిపోయి ముఖం కందగడ్డ అయిందట. గొంతు పొలమారి ఉక్కిరి బిక్కిరై డాక్టర్ని పిలిచేంత కంగారయిందట.

ఈ ముగ్గుర్నీ అలా ఉంచండి.

ఇంకా వందలాది చిన్నా పెద్దా, వయసూ వగ్గూ, ధనాఢ్య దరిద్రవర్గీయు లెంతమందో నా మీద ఛార్జిషీట్లు రెడీచేసి చేత్తో పట్టుకుని కూర్చున్నారు.

వీరందరి అభిప్రాయం ఏమిటంటే, నా ప్రహసనంలో నేను వారి పరమపూజనీయులైన జ్యేష్ఠభ్రాతనో, లేక మామగారినో, లేక అల్లుడినో దృష్టిలో ఉంచుకొనే ఈ వర్ణనలన్నీ చేశాను అని. వాళ్ళు కూడా క్షణభంగురమైన ఈ నా రచనని భగ్నం చెయ్యడమే తమ లక్ష్యమని ప్రకటించారు.

పోను పోను, పైన ఉదహరించిన అందరి భాషా, నా మీద కోపంవల్ల రకరకాల మార్పులు చెందసాగింది. అసందిగ్ధమైన స్వరూపం దాల్చడం కూడా ప్రారంభించింది...నాకు ఏం చెయ్యడానికీ తోచలేదు. ఇల్లు మార్చి వేయడం మంచిది అనుకున్నాను మొదట. తర్వాత, ఇంటితోబాటు రచనల్లో నేను ఉపయోగించే భాష కూడా మార్చడం అవసరం అనిపించింది. ఏమైనా ఇతరుల్ని నవ్వించడానికి ఇకముందు ప్రయత్నం చెయ్యనని ఒట్టేసి చెబుతున్నాను. ప్రస్తుతానికి ఈ ప్రహసనం రాసినందుకు రెండు లెంపలూ వేసుకుంటున్నాను. ఈ వ్యాసం రాయడానికి ధైర్యం కల్పించిన రవీంద్రనాథ టాగూరు రచనకి కృతజ్ఞతలు - శలవు.

[భారతి - మార్చి 1948]

యాత్రా స్పెషల్స్!

శ్రీ శిల్పశ్రీ

ప్రయాణాలు చాలా మంచివి. వాటివల్ల చాలా ప్రయోజనాలున్నాయి. దేశం తెలుస్తుంది. ఆతిథ్యం తెలుస్తుంది. సభ్యతలు తెలుస్తాయి- అని ఏవేవో చెబుతారు పెద్దలు.

పూర్వకాలంలో ప్రయాణాలమాటవేరు. అప్పుడింత సుఖమూలేదు, ఇంత దండగాలేదు. కాశీకి పోవాలన్నా సామాను కావిడి బుజాన వేసుకుని ఇల్లాలిని మేక పిల్లలాగా వెనకాల నడిపించుకుంటూ ఎంతెంత దూరమైనా వెళ్ళేవాళ్ళు.

టిక్కెట్టు ఖర్చంటూ లేదుకదా! ఏ ఊళ్ళో పొద్దుగూకితే అక్కడొకయిల్లు చూసి- కొంచెం పెద్ద అరుగులున్నది- అక్కడ తిష్ఠవెయ్యడం - సరే - ఇక బోర్డింగు ఖర్చంతా ఆ యింటివారిదే!

అతిథుల్ని మర్యాద చెయ్యడం - అప్పయినా సరే - వారి దీవెనలు పొందడం గార్హస్థ్య లక్షణాలలో ఒకటి. ఎంత అప్పుచేసి,పప్పుభోజనాలు పెడితే అంత మంచి గృహస్థు అని అర్థం. వచ్చిన బాటసారులు- ఆనాటికి వారే బంధువులనుకోండి; (మనకొక సామెత ఉన్నదిగా; బిచ్చానికి వచ్చినవాడైనా అచ్చంగా కాకపోయినా ఆపూటకి చుట్టమేకని)- మార్గంలో చెందిన బడలిక తీరేవరకూ ఉంచవచ్చు. వెళ్ళమనడం తప్పుకాదు, పాపం కూడా.

అందువల్ల బడలిక తీర్చుకొంటూ బసలుచేస్తూ ప్రయాణంచేసేవారు పూర్వం- ఖర్చు ఉండదు. పోనీ దేనికన్నా అవసరం వస్తుందేమోనని పాతిక రూపాయలు పట్టుపోవడానికయినా మార్గంలో, ఎవరైనా దొంగలు కొడతారు. ఎందుకని మానివేసి పట్టిచేతులతోనే ప్రయాణం.

ఇక్కడొకళ్ళ విషయం చెబ్తారు. అప్పటి మాట అలా ఉంచి ఇప్పటికీ జేబులో డబ్బులు లేకుండా బయలుదేరేవారు చాలా మంది ఉన్నారు. ఎక్కడికీ? పొరుగూరైనా షికార్లకికాదు. బజారులోకే! అలా అర్ధణా లేకుండా వెళ్ళి ఆ పూట తృప్తిగా ఫలహారంచేసి, కిళ్ళీ నమిలి, సిగరెట్టుపీల్చి, పచ్చే అవకాశాలు కొంద రికి ఉన్నాయి.

డబ్బు జేబులో ఉన్నవారేమైనా కొంచెం ఇబ్బంది పడతారేమో కాని-వీరు మాత్రం పడరు. కాని వీరు కొంచెం నటనా, అదో రకం నవ్వూ, అభిమానానికి కొంచెం దూరం అయితే చాలు. పూర్వకాలంకోకంటే ఎక్కువ మర్యాదలు జరుగుతాయి-సరే! ఆ మాట అలా ఉంచి అసలు విషయంలోకి పద్దాం.

ఆడవాళ్లను వెంటబెట్టుకుని వెళ్ళేవారు గనుక మరి వారి వంటిన నగలు పగైరాలు ఉంచేవారు కాదు. దొంగల భయమే! నాలుగు పాత చీరలు మూట గట్టి అచ్చమ్మలలాగా వారిని వెంట వేసుకొని బయలుదేరేవారట! ఇలా రావడంలో మరో మేలు కూడా ఉంది. ఇప్పటికిమల్లే బయలుదేరినప్పటినుంచీ, చూపంతా ఇంటిమీద పెట్టుకొని-కార్డులూ, కవరులూ, టెలిగ్రాం ఫారాలూ దగ్గర ఉంచుకొని-ఇప్పుడే మేలు ఎక్కాను. ఇప్పుడు బొప్పట్ట దాటాను. రైలు బాగానే నడుస్తోంది. నాకు నిద్దరపట్టడంలేదు - కొంచెం బెర్తుమీద నడుం వాల్చి పత్రిక చదువుతున్నా - ఒంగోలులో భోజనం చేస్తానులే - గూడూరులో కాఫీ తాగుతాలే - ఆ! ఇవాళ మేలు ఒక అరగంట లేటు-చినగంజాంలో జీడిపప్పు అమ్మ వచ్చింది. పచ్చిపప్పుడు కొంటాను; మేలు దిగగానే రాస్తాను; అవసరమైతే కవరురాస్తానూ - మరీ అవసరమైతే టెలిగ్రాం ఇస్తాను.

ఇలా అనేక విధాలుగా రాస్తూనే ఉంటారు ఇల్లు బయలుదేరినపద్దనుంచి. తిరిగి అక్కడనుంచి "మీరు సరిగా చేరేరా? మీరు వెళ్ళిన రాత్రి పిల్లవాడు ఉత్తరాత్రివేళ లేచి ఒకటే ఏడుపు. 'నాన్నా నాన్నా' అంటాడు. ఎంత చెప్పినా వినడు. ఒకటే దెంగ సన్నాసికి; మరి జాగ్రత్తగా వెళ్ళండి. ఆహారం జాగ్రత్త-

మధ్యాహ్నం నిద్దర పోకపోతే మీకు తలనొప్పి వస్తుంది. ఎక్కడో అక్కడ వీలు చేసుకొని ఒక కునుకు తీస్తూ ఉండండి. సాధ్యమైనంతవరకూ వట్ట కాఫీ త్రాగండి. నూనె వస్తువులు మీకు పడవు. తెల్లవారగానే కాఫీ కావాలిగావాల్ను. రాత్రిళ్ళు ఫ్లాస్కులో పోసి ఉంచుకోండి. ముందు వెళ్ళిన పని చూచుకొని తక్కిన పనులు చూడండి- స్నేహితులతో మాట్లాడకండి, సవరం మాట మరిచి పోకండి, ఆ ఊళ్ళో చింతకాయలు ఎలా ఇస్తారో తెలుసుకొని రండి- రైల్లో ఊర్మిళా దేవి నిద్రా, లక్ష్మణ స్వామి మూర్ఛా, పతివ్రతల కథలూ-పుస్తకాలు అమ్మ వస్తాడు కొంచెం చూడండ-మీరు వెళ్ళేటప్పుడు చెప్పినట్టు వాడు బియ్యం పంప లేదు-వీడు నెయ్యి తేలేదు. ఆవిడ ఇస్తానన్నా దన్నాడు, ఇవ్వలేదు. ఈవిడ పది రూపాయలకి వెయ్యి మారులు తిరిగింది- ఇలా వారు రాస్తూనే ఉంటారు.

అసలు వీరి మనస్తత్వాన్ని బట్టి చూస్తే ఇద్దరి చేతుల్లోనూ ఫోను ఉండడం మంచిదనిపిస్తుంది. లేకపోతే ఎన్ని ఉత్తరాలు, ఎన్ని టెలిగ్రాములు? ఇది ఆబద్ధం కాదు. ఒకాయన అన్ని ఉత్తరాలు సాయంత్రం ఒక్కసారే వెళతాయని మరచిపోయి వెంట వెంటనే ఉత్తరం రాస్తానన్నాను కదా అని గంట గంటకీ ఆమెకొక ఉత్తరం రాసి పోస్టులో వేశాడట. అవన్నీ ఒక్కసారి చేరాయట ఆమెకి.

ఇన్ని ఉత్తరాలు వచ్చాయని సంతోషించినా ఈయనకి ఎంత చావస్తం పట్టుకున్నాదేమిరా ప్రభూ అని విచార పడ్డాడట. ఒకాయన కొంచెం సుస్తీగా ఉందే ఊరు బయలుదేరి వెళ్ళి ఆ ఊరు చేరగానే - తన ఆరోగ్యం వెంటనే తెలుస్తుంది గదా అన్న సంతోషంలో ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం ఇచ్చాడట. దాంతో ఆమె గుండె బ్రద్దలై కవరు విప్పకుండానే ఒక్కటే ఏడుపుట.

ఈ రోజుల్లో కారులూ, విమానాలూ ఎక్కడైనాక ప్రయాణాలు కూడా ఎక్కువయినాయి. కార్డు వ్రాయడానికి బద్ధకించి టెలిగ్రాం ఇచ్చేవాళ్ళూ

పోస్టాఫీసు దాకా ఎందుకని ట్రంక్ కాల్ బుక్ చేసేవాళ్ళు. ఈ డబ్బు పెడితే టిక్కెట్టుకే సరిపోతుంది గదా అని-తరిమ్మా సావర్ణ మాట ఆలోచించకుండా బయలుదేరే వాళ్ళు ఎక్కువైనారు. ఎందుకు ఉత్తరాలు రాయడం? ఆయనకు తిరిగి రాసే అలవాటు లేదు. మనమే పోతే బాగుంటుందేమోనని బయలుదేరే వాళ్ళు లక్ష మంది ఉన్నారు.

ఇలా వెళ్ళేవాళ్ళల్లో కొంచకికి యాత్రల ఆక్టు ఒకటి ఉంటుంది. ఆ ఊళ్ళో ఎరుగున్న వాళ్ళకు ముందుగా ఆలోచించి ఒక కార్డు వ్రాయడం, సరాసరి వెళ్ళి పాత బట్టల దుకాణం పెట్టడం. పొద్దున్నా సాయంత్రం ఎక్కడికో కొంచెం సేపు బయలుదేరి 'రోడ్లు కొలిచి' చక్కారావడం. మళ్ళీ బసకువచ్చి 'ఆయనిష్ట కనిపించలేదండీ. సాయంత్రమైనా పట్టుకోవాలి. ఇంటివద్ద బోలెడు పనులున్నాయి. ఇక్కడ చిక్కుకున్నాను' అంటూ ఇంట్లో అన్నం పండేదాకా కూర్చోవడం - దానిపల్ల చాలా కలిసివస్తుంది, అపతల వాళ్ళ అవస్థ ఎల్లాడున్నా -

మరి కొందరు - ఊరు బయలుదేరడమంటే భయం. ఏడాది కానివ్వండి, పది యేళ్ళు కానివ్వండి. వెళతా వెళతా అనడమేకాని వెళ్ళడమంటూ ఉండదు. 'ఏమండీ వెళ్ళలేదు ?' అంటే - "ఆ... ? మాయింట్లో అట్టోబరులో పురుడు వచ్చేలాగ ఉంది. ఈ అయిదు నెలలూ ఆగి ఆ తరువాతనే వెళదామని ఆగాను," అంటూ ఉంటారు.

మరి కొందరికి ఊరి ప్రయాణం మాత్రం సిద్ధం. కాని బయలు దేరడానికి తగిన సన్నాహం తడీ వుండదు. అంచుపల్ల ప్రతిమెయిలుకూ ప్రయాణమే ! ఊళ్ళో మాచినవాళ్ళు "ఏమంట్రోయ్ ! అప్పుడే వెళ్ళివచ్చేశారే" అంటూ ఉంటారు. "ఇంకా ఏదీ ? వెళ్ళలేదండీ" అంటూ వీరు ఇకిలిస్తూ ఉంటారు.

[కప్పుకాఫీ - ఆనందవాణి - 17-12-1950]

ఉపాధ్యాయ ఉవాచ!

—శ్రీ మునిమాణిక్యం నరసింహారావు

ఉపాధ్యాయుడి జీవితం అంధకార బంధురమూ కాదు; బ్రతకలేక బడి పంతులు కావడం అనే మాట నిజమూ కాదు; అనుభవించే వాడికి ఈ జీవితం కూడా హాస్యరసం ఇస్తుంది—ఈ సంగతి చెప్పడమే ఈ వ్యాసం యొక్క ముఖ్యోద్దేశం.

నామీద ఛార్జి షీటే పెట్టదలుచుకుంటే, ఉపాధ్యాయ వృత్తి చెయ్యడం అనే నేరాన్ని కూడా ఆ ఛార్జిషీటులో చేర్చండి అన్నాడట వెనకటికి మేధావి అయిన ఓ ఇంగ్లీషు మేష్టారు. తెలిసో తెలియకో నేనూ ఆ నేరమే చేశాను ఈ జీవితంలో.

చెప్పానుగా ఈ జీవితంలో కూడా నవ్వుకోడానికి చాలా ఉంటుందని. అలా నాతో పాటు కలిసి మీరు కూడా నవ్వుకుందామనుకుంటే ఇది చదవండి. మంచో చెడ్డో నవ్వడం ప్రధానం. చిరునవ్వు నవ్వినాసరే, కడుపు చెక్కలయ్యేటట్లు నవ్వినాసరే, నాకేదైనా సంతోషమే! అది మీ తత్వాన్ని అనుసరించి ఉంటుంది. ధన్వంతరి సిద్ధాంతం ప్రకారం బహుశః పిత్తకోశాన్ని ఆధారం చేసికొని ఉంటుంది. పైత్య తత్వం అయితే విరగబడి నవ్వుతారు. కొంచెం వాతం కూడా కలిసి ఉంటే చిరునవ్వు నవ్వుతారు. కలభై ఏండ్లు దాటినవాళ్ళకు ఈ వ్యాసం చదవడానికి అర్హత లేదు. వాళ్ళకు పైత్యం బొత్తిగా నశించి, నాడి వాతంమీద హంసనడకలాగ నడుస్తుంది. అట్టివారికి నవ్వు రాదు.

మొదట నేనీ ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించాలని నిర్ణయించుకున్నాక, ఎన్ని సూక్ష్మాలకి ఎన్ని దరఖాస్తులు పంపానో లెక్క లేదు. నేను పెట్టిన దరఖాస్తు

లన్నీ హూణ విద్యార్థులకు చెప్పిన విద్యలాగ, అగ్నిలో పోసిన ఆజ్యంలాగ నామరూపాలు లేకుండా పోయాయి. ఇంకిది పని కావనుకొని దరఖాస్తు వ్రాసి పెట్టెలో పెట్టుకొని కావలసిన బట్టలు తీసుకుని బయలుదేరి రెండడుగులు వేశానో లేదో పిల్లి ఎదురుగా వచ్చింది. దాన్ని నాలుగు తిట్టి తిరిగి ఇంటికి పోయి కాళ్ళు కడుక్కుని కాస్సేపు అరుగుమీద కూర్చుని రెండు బియ్యపు గింజలు నమిలి మా అమ్మాయిని నాకు ఎదురుగా రమ్మని ముందు పంపాను. ఈ తఫా కన్నె ముత్తయిదువు ఎదురుగా వచ్చిందని సంతోషించి బయలుదేరాను. కాకి ఒకటి ఎడమవైపు నుండి కుడికి పారటంవల్ల శుభ శకునాలు ద్విగుణంగా వచ్చినవని సంతోషించి వైలెక్కాను.

హైస్కూలు కమిటీ అధికారి పదిసార్లు తిప్పి ఇరవైసార్లు బేరమాడి చివరకి ఏమైతేనేం నెలకి 28 రూపాయల జీతానికి పనిజేస్తానని నా మెడలు వంచి ఒప్పించాడు. తీరా ఆర్డరు ఇయ్యబోయే ముందు ఒక్క సందేహం అన్నాడు. సెలవియ్యండి అన్నాను వినయంగా.

"ఏమీ లేదండీ. మా స్కూల్లో కొంచెం అల్లరి కుర్రవాళ్ళున్నారు. చూడబోతే మీ దగ్గర నదరు తక్కువ. చెప్పగల ధైర్యం ఉందా?" అని అడిగాడు.

మల్లుపంచె, పాప్లిను చొక్కా, సిల్కు కోటు—ఇన్ని ఉన్నా ఇంకా నదరు తక్కువేమిటో నాకు అర్థం కాలేదు. ఏమైతేనేం ఆర్డరు చేతిలో పడింది.

విద్యార్థిగా బల్లపై కూర్చున్నవాడికి కుర్చీలో కూర్చునే రోజు వచ్చింది. ఠల్లాసుగా స్కూలుకి వెళ్ళొచ్చుగా?...ఊహు!...ఏదో చెప్పలేని భయం... కొంత క్రొత్త...కొంత బిడియం...కొంత సిగ్గూను...అతి ప్రయాస మీద మేడ మెట్లెక్కి క్లాసులోకి వెళ్ళాను—వెళ్ళాను అనడం ఒక శబ్దాలంకారం. వెళ్ళింది నేను కాదు-నా కాళ్ళు.

కుర్చీలో కూర్చునే పర్యంతము చీమ చీమకుట్టినా వినిపించేటంతటి నిశ్శబ్దంగా వుంది. కూర్చునేసరికి నాకు పరమానందం కలిగింది. బ్రిటిష్

రాజ్యాన్ని ఏలే చక్రవర్తి సింహాసనం మీద కూర్చున్నప్పుడు ఆయనకు గలిగే ఆనందం నాకు కలిగిన సంతోషం ముందు తృణ సమానము. జయసూచకంగా ఒక్క చిరునవ్వు నవ్వాను. ఉత్తర క్షణంలో పిల్లలందరు ఒక్కుమారు బెంచీల మీద ధమధమా అని చాయించారు. ప్రళయకాల సూచనార్హమైన పిడుగువలె ఆ శబ్దము నా గుండెల్లో మారుమ్రోగింది. ఆ చిన్న చిరునవ్వు మెరుపునకు ఇన్ని ఉరుములా ?

నాకేం తోచలేదు. కాళ్ళు తేలిపోవడం మొదలెట్టాయి. సాధ్యమయినంత పరకు గాంభీర్యాన్ని కళ్ళల్లో నిలుపబెట్టి ఇంగ్లీషులో "నాకు చాలా విచారముగా ఉంది" అనేసరికి అందరూ ఏకగ్రీవంగా "చ్చో చ్చో చ్చో చ్చో" అని సాను భూతిని మెలిబుచ్చారు. ఇంతకంటె దీనావస్థ ఇంకేముంది ?

ఏమీ తోచక ఒక విధమైన మరవస్థలో పడి నేను కొట్టుకుంటూండే, మీసకట్టున్న కాలు పొడవు పెద్ద కుర్రాడొకడు చటుక్కున లేచాడు. లేచి నా ప్రాపక్ష్యం లేకుండానే చరచరా క్లాసు వదిలి బయటికి వెళ్ళిపోయాడు. నేను అతగాడిని ఆపేస్థితిలో లేను.

ఏవో ఒక దాక్షిణ్యం చేయకపోతే పిల్లలు హద్దుమీరి అల్లరి సాగించేలాగు న్నారు. పాఠం చెప్పటం మొదలుపెడదామంటే అది ఏమో నాకు తెలియదు. అడిగితే సక్రమంగానూ, వినయంగానూ చెప్పే స్థితిలో వాళ్ళు లేరు. వాతావరణ స్థితి ప్రమాదకరంగా ఉంది.

ఇవన్నీ అవగాహన చేసికొని ఈమాంతం ఉపన్యాసం ఎత్తుకొని పెద్ద పెద్ద మాటలు నోటినిండా పలుకుతూ, తడుముకోకుండా ఒక్క దమ్మున గంటకొట్టే పర్యంతం వాళ్ళకి ఒక్క ముక్క అర్థం కాకుండా ఉపన్యాసం కురిపించాను. అంతే-వాళ్ళు చల్లబడ్డారు. ముఖాలు వికసించాయి, కొత్త మాష్టరు గట్టినాడేరని నమ్మకం ఏర్పడినట్లుంది. నాకు ఆ విధంగా ఆ రోజుకి గండం తప్పింది.

అయితే ఉపాధ్యాయుడికి గండాల గౌరిదేవిలాగ ఏ రోజున ఏ గండం వస్తుందో చెప్పలేం. కనీసం కొన్ని గండాలేనా తప్పించుకోడానికి ఈ క్రింది విషయాలని అతను తప్పకుండా తెలుసుకుని ఉండాలి:-

ప్రతి సంస్థకీ, జాతికీ, బృందానికి ఎల్లాగయితే కొన్ని హక్కులుంటాయో, అల్లాగే విద్యార్థి బృందానికి కూడా కొన్ని జన్మహక్కు లున్నాయి. మాస్టారు మార్కులు బాగా వెయ్యాలి; తన సొమ్మేదో పోతున్నట్లు పిసినారిగా వ్యవహరించి మొహం చూసుకోరాదు. పరీక్షపత్రాలు కూడా అలాగే కఠినంగా ఇవ్వకూడదు; పుస్తకం మొహం చూడని విద్యార్థి కూడా దర్జాగా ఆన్సర్లు రాసేటట్లు ఉండాలి ప్రశ్నపత్రం అంటే-ఇవి ముఖ్యమైనవి.

ఇవిగాక మరికొన్ని నిబంధనలున్నాయి.

1. పరీక్షలో కాపీ చేస్తూ ఉంటే ఉపాధ్యాయుడు చూసీ చూడనట్లు వూరుకోవలె. పేపరు చదువుకుంటున్నట్లు నటించాలి. అంతేకాదు గుమ్మందగ్గరనుంచుని, హెడ్‌మేష్టారు (లేదా ప్రిన్సిపాల్) వస్తూఉంటే, ఆ సమాచారాన్ని కుర్రాళ్ళకి అందించాలి.

2. కుర్రవాడు ఆలశ్యంగా వచ్చినా, అసలు క్లాసుకు రాకపోయినా ఉపాధ్యాయుడు గమనించరాదు.

3. రోడ్డు వెంట పోతున్నప్పుడు ఏ విద్యార్థి అయినా తనకి నమస్కారం పెడతాడేమో, పెడితే తను వెంటనే స్వీకరించడానికి కొద్దిగా చెయ్యి ఎత్తవలసి ఉంటుందేమో, దాంతో పాటు సన్నగా చిరునవ్వు నవ్వవలసి ఉంటుందేమో, అని అందుకు సంసిద్ధంగా ఉండాలి. ఏమరిపాటుతో ఉండకూడదు.

4. కుర్రవాడి రాబోకు తల్లిదండ్రు లెవరైనా తటస్థపడి, అతని చదువు సంధ్యల గురించి వాకబు చేస్తే. "మీ వాడికేమండీ బంగారం" అంటూ కాసిన్ని మంచి మాటలే చెప్పాలి కాని, అబద్ధాలు నేనెందుకు చెప్పాలి అంటూ విర్రవీగరాదు.

ఇలాగే ఇంకా ఎనోఎనో్న నిబంధనలూ చట్టాలూ ఉన్నాయి.

చట్టాన్ని ధిక్కరించి ఏ ఉపాధ్యాయుడైనా, విద్యార్థి అంచనాకి తక్కువ మార్కులు వేసినా, క్లాసులో హాజరు విషయంలో కఠినంగా ప్రవర్తించినా, విద్యార్థి యొక్క తల్లి దండ్రులతో గొప్పకిపోయి నేరాలు చెప్పినా - ఆట్టి ఉపాధ్యాయుడు శిక్షార్హుడు.

శిక్షలు మళ్ళీ రెండు రకాలు. ఒకటి సామాన్య శిక్ష. రెండవది కఠినశిక్ష. ఉపాధ్యాయుని తప్పిదమును బట్టి బాలురే శిక్షలు నిర్ణయింతురు.

ఆయన క్లాసులో పిల్లికూతలు కూయుట. ఎదిరించుట. ఆయన సైకిలుకి గాలి తీసివేయుట. ఆయన పుస్తకములు తస్కరించుట. భార్యతో ఆయన ఏ సినీమాకో వెళుతున్నప్పుడు సర్వనామములతో ఆయనని పిలుచుట - ప్రతి ఉపాధ్యాయునికీ ఏదో ఒక సర్వనామముండుట సర్వసాధారణం-ఇవి సామాన్య శిక్షలో భాగములు.

ఇక కఠిన శిక్ష విధానం ఎటువంటిదంటే, క్లాసులో సామూహికంగా ఎదిరించుట - ఆ ఉపాధ్యాయునకు వ్యతిరేకముగ నినాదాలిస్తూ ఊరేగుట - వంటరిగా వెళుతున్నప్పుడు రాళ్ళు రువ్వుట, అవసరమునుబట్టి కొట్టుట - ఇవీ –

సర్వనామాలు సర్వసాధారణం అని చెప్పాను కదా - సుబ్బారావుగారికి 'డబ్బా' అని పేరు పెట్టారు. గోడల మీదకి ఆ పేరు ఎక్కించారు. ఊరు అశేష జనానికి తెలిసే నిమిత్తం ఊళ్ళో స్వేచ్ఛగా విహరించే ఆబోతు మీద అందంగా రాశారు 'డబ్బా' అని. సుబ్బారావు మేష్టారి సర్వనామమైన డబ్బా ఎంత ప్రచురితం అయిపోయిందంటే, ఆయన భార్య "ఏమండీ - పిల్లాడికి పాలడబ్బా తేవాలండీ" అని అంటానికి కూడా భయపడేది.

విద్యార్థులికి తీవ్రమైన కోపం వస్తే ఉపాధ్యాయుణ్ణి కొట్టడం పరిపాటి. నా సహోపాధ్యాయుడైన నాగరాజుగారిని విద్యార్థులు ఓ మూటు ఆ కాస్త మంచి

మాటా చేశారు. ఆయన హెడ్మాష్టారు దగ్గరకు వెళ్ళి మొరపెట్టుకుని "అయ్యా నేనీ ఉపాధ్యాయ వృత్తిని వదిలేస్తాను. బతికే లాగుకలేదు పరిస్థితి. దెబ్బలు తిని మళ్ళీ ఏ ముఖం పెట్టుకుని పదిమందిలో తిరిగేది" అన్నాడు. దానికి హెడ్మాష్టారు సహజ గాంభీర్యంతో "ఏ మొఖం తోనా? ఉపాధ్యాయుని ముఖంతో - అదిసరే- ఎన్నోసారి నువ్వు దెబ్బలు తినడం ?" సాగర సదృశమైన ఆ గాంభీర్యానికి నాగరాజుగారు పాపం కళ్ళు తేలేస్తూ "ఎన్నోసారి కూడా నండి నా కర్మం కాలితే !" అన్నారు. హెడ్ మాస్టారు గొంతు సవరించుకొని "ఓష్, మొదటి సారికే ఇంతా? పిచ్చివాడా! నిక్షేపంలాంటి ఉద్యోగాన్ని పదులుకొని నోట మన్ను కొట్టుకుంటావా? ఎవరు చెప్పారు నీకీ సలహా? ఎవరు చెప్పారంట?... చాలు చాల్లే...అవమానమా? ఇటువంటివి పెట్టుకుంటే నెగ్గినట్టే! నా జీవితం ఆదర్శంగా తీసుకో - నన్ను చూచి ధైర్యం తెచ్చుకో - ఎందుకు పిచ్చిన పడతావు ? కొట్టారు కొట్టారు అంటావు. కొట్టింది ఎవరిని? మొదట నన్ను నెల్లూరులో కొట్టారు. తర్వాత గుంటూరు స్కూల్లో పనిచేస్తుంటే అక్కడ కొట్టారు. అటు తర్వాత నూజివీడులో, తర్వాత ఏలూరు, దెందులూరు. అత్మకూరు, అనకాపల్లులలో కొట్టారు. విశాఖ పట్నంలో సముద్రపు ఒడ్డున పడేసి మరీ కొట్టారు. రాజధానికి మూల ఉందామని బరంపురం పోతే అక్కడ కూడా తప్పలేదు దెబ్బలు... అందుకని..."

హెడ్మాష్టారుగారి యీ అనుభవ కథా కథనం విన్నాక, 'విద్యార్థులు నన్ను కొట్టార'ని ఒక్క ఉపాధ్యాయుడు పబ్లిగ్గా బాధపడితే ఓట్టు ! ఎప్పుడూ బాధపడని నన్ను చూసి తోటి ఉపాధ్యాయులు 'రావుగారినీ విద్యార్థులు కొట్టేస్తే ఉంటారు' అని జాలిపడితే "మొర్రో నా కలాంటి సన్మానం జరగలేదయ్యా" అంటే, నామాట నమ్మరే! ఆవున్లే...అవున్లే...అంటూ ముసిముసినవ్వులు నవ్వుతారు...పోనీ మీ రైనా నమ్ముతారా ? లేక వాళ్ళలాగే నవ్వుతారా ?

పాఠశాలల్లో తెలుగు పండితులకు బొత్తిగా గౌరవం లేకపోతోంది. ఆ క్లాసులో పిల్లలు విజృంభించి అల్లరిచేసి ఇతర క్లాసులలో కూడా పని జరుగ

కుండా చేయటం అందరికీ తెలిసిన విషయమే ! ఇంగ్లీషు క్లాసులో నోరెత్తి రెండు మాటలు మాట్లాడలేని గుంటడికి తెలుగు క్లాసులో పల్లమాలిన తెలివి పుట్టుకొస్తుంది. ఇతర క్లాసులలో బెంచీలతో బాటు నిర్జీవ ప్రతిమ లాగ ఉండేవాడు ఈ క్లాసు వచ్చేసరికి సజీవుడై గొంతెత్తి ఉపన్యాసాలు ఇస్తాడు. అంతేకాకుండా ఇంగ్లీషులో మూగవోయిన అతని సరస్వతి తెలుగు క్లాసులో ఫణక్‌మని నాట్యం చేస్తుంది.

ఇదంతా ఎందుకు చెప్పానంటే, ఓరోజున తెలుగు మేష్టారు శలవు పెడితే ఆ క్లాసుకి నన్ను వెళ్ళమన్నారు హెడ్‌మాస్టారు. నేనూ తెలుగు భాషయందుండే అభిమానంవల్ల ఒప్పుకున్నాను కాని పాండిత్యం ఉండికాదు. నాకు తెలుగులో పాండిత్యంలేదనీ, వ్యాకరణం క్షుణ్ణంగా చదివి ఉండలేదనీ ఎట్లా తెలిసిందో మరి; కొందరికి తెలిసింది- తెలిసిందని నేననుకుంటాను. లేకపోతే, ఓ కుర్రాడు లేచి నా ప్రాణానికి 'లంగూడీ అంటే ఏమిటండీ?' అంటూ ఎందుకు అడుగుతాడు! లంగూడీ! లంగూడీ ఏమిటి? ఇదెక్కడి మాటదేవుడా! ఎప్పుడూ వినలేదే! నాలో బయలుదేరిన గాభరాని పైకి కనిపించనియ్యకుండా, కోపంగా ముఖంపెట్టి 'సమాసంబునం భ్రాతాదుల తొలియచ్చు మీది' సూత్రం అర్థం అయిందా?' అన్నా. ''అది అర్థం అయిందండి. లంగూడీయే అర్థం కాలేదండి'' అన్నాడు. అతగాడి వరసచూస్తే యుద్ధానికి సిద్ధం అవుతూన్న ప్రత్యర్థిలా కనిపించాడు. ఓటమిని అంగీకరించబుద్ధిపడదు. అందుకే బింకంగా ''వ్యాకరణం క్లాసులో ఇతర విషయాలు అడక్కూ'' అన్నా. ''ఇది వ్యాకరణానికి సంబంధించినమాటే సుండి''- ఎంత సౌమ్యంగా అన్నా నా ప్రాణాలతో ఆడుకుంటున్నట్లనిపించింది... అప్పటికే పిల్లలు ఒకరి మొఖం ఒకరు చూచుకుని తలవొంచుకుని ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నారు. ఇంతతో నా పాలిట భగవంతుడిలా స్కూల్ ఫూన్ బెల్ కొట్టాడు. 'బ్రతుకు జీవుడా' అనుకుని దాని అర్థం వచ్చే క్లాసుకో చెప్తాను లేవోయ్ అని బయటికి వచ్చిపడ్డాను.

తర్వాత ఆమాటకోసం ఎన్ని నిఘంటువుల్ని తిరగేశానో లెక్కలేదు. ఎవరినేనా అడుగుదామంటే నామోషీ- అసలు అలాంటి పదం ఉందో లేదో.

ఆ కుర్రాడు నన్నేడిపించడానికి ఈ పదం ఏదో సృష్టిస్తే, దీని గురించి పది మందినీ అడిగితే అంతకంటే అభాస ఉందా? 'మేష్టారూ వాడు మిమ్మల్ని ఏడిపించడానికి అన్నట్టున్నాడండీ' అని వాళ్ళంతా నవ్వితే? అందుకే ఆ సంగతి అంతటితో మరిచిపోయాను. కనీసం మరిచిపోయినట్లు నటించాను.

కాని ఆ గడుగ్గాయి కుర్రాడెందుకు మరిచిపోతాడు? నన్ను ఏడిపించడానికే కంకణం కట్టుకున్నాడు- తర్వాత క్లాసులో ఆడగనే అడిగాడు. నేను భయపడినంతా అయింది. నేను తెల్లమొహం వెయ్యడం-తబ్బిబ్బు పడడం- వాడు కూర్చోకుండా అర్థం చెప్పవలసిందే అన్నట్లు జండాకొయ్యలాగ నుంచునే ఉండడం- తక్కిన విద్యార్థులలో కొందరు చాటుచాటుగానూ కొందరు బాహాటంగానూ నవ్వుతూ ఉండడం- నాకు తెలియదు అని చివరకి ఓటమిని అంగీకరించి 'అయినా ఎక్కడుంది ఆ మాట?' అని చిరాకు పడ్డాను. ఇదిగోనండి ఈ వ్యాకరణ పుస్తకంలో అంటూ ముందుకు వచ్చాడు. నా గుండె గుభిల్లుమంది- తీరా వాడిచ్చిన పుస్తకం చూద్దును కదా నాకూ నవ్వు వచ్చింది- అప్పటికే సముద్ర ఘోషలా ఉంది క్లాసంతా నవ్వులతో - ఇంతకీ అదేవిటో తెలుసాండీ- చిన్నయ సూరి వ్యాకరణ సూత్రంలో మాట అది:- ఇ ఈ ఎ ఏ లంగూడి- అని, 'లం' అనే అక్షరాన్ని దాని ముందు అక్షరంతో కలపకుండా తర్వాత అక్షరంతో కలిపి చదివి నా ప్రాణమూ పరువూ రెండూ తీశాడు. తెలియక అలా చేశాడంటారా? ఒక్కనాటికి సమ్మను.

ఇలాంటి లంగూడి ప్రకరణాలెన్నో ఉపాధ్యాయుని జీవితంలో-

ఈ లంగూడీ కుర్రవాడు తార్తారు వంశంవాడయి ఉంటాడు. వెనుక రష్యనులకూ తార్తారులకూ యుద్ధం జరిగింది. అనేక యుద్ధాలలో జయించిన రష్యనులు మహాగర్విష్ఠులు. కాని ఆ యుద్ధంలో రష్యనులే ఓడిపోయి పరిగెత్తడం మొదలు పెట్టారు. తార్తారులు వెంబడించారు. కొంతదూరము పోయిన తరువాత రష్యను సైనికుడొకడు తన సేనానితో "తార్తారుని పట్టుకున్నాను. వెంటనే వచ్చి

నాకు సహాయం చేయవలసింది'' అన్నాడు. సేనాని ముందునుంచి, ''మంచిది. ఆగడానికి వీలులేదు. వాడిని లాగుకొనిరా'' అని గర్వంతో అన్నాడు. రష్యనుడు మళ్ళీ ''వాడు రావడంలేదు. నీవు రావాలి'' అని పెద్దగా అరిచాడు. సేనాని ''సరే ఆగడానికి ఏమాత్రం వీలులేదు. వాడిని పదిలేసిరా'' అని ముందు నుంచి కేకేశాడు. ''నేను వదిలినా వాడు నన్ను వదలడంలేదు'' అంటూ అరిచాడు రష్యనుడు. నా పరిస్థితి అలా అయింది. ఆ తార్తారుడు రష్యనుని పట్టుకుని వదల నట్లు నన్ను ఆ లంగూడీ కుర్రాడు పట్టుకుని వదలలేదు.

ఇలాంటివి కొన్ని ఉపాధ్యాయుడి జీవితంలో జరుగుతూ ఉంటాయి.

నేను సర్వనామాల గురించి చెబుతూన్నప్పుడు ''ఎవరికేనా, మనం ఒక పేరు పెట్టామనుకోండి. ఆయన అసలు పేరు బదులు ఈ పెట్టుడు పేరు పెట్టి ఆయన్ని పిలుస్తున్నామనుకోండి. అప్పుడు ఈ పెట్టుడు పేరు అసలు పేరుకి బదులుగా ఉపయోగించిందే కదాండి. దానిని సర్వనామం అనవచ్చాండీ'' అంటూ అడిగాడు ఓకుర్రాడు. ఆ ప్రశ్న వినేసరికి అవేవో భయపుటూహలు మేఘాకృతిగా నా మనస్సులో పరిగెత్తడం మొదలెట్టాయి. వాడి ప్రశ్న నాకు అర్థంకాలేదనుకున్నాడో ఏమో ''అది కాదండీ. ఇప్పుడు ఒకాయనకి చిట్టిగారె అని పేరుంది అనుకోండి. 'ఫలాని ఆయన చాలా మంచివాడు' అని అనకుండా 'చిట్టిగారె చాలా మంచివాడు' అంటే రెండు వాక్యాలలో చెప్పపలసిన భావం ఒక్క వాక్యంలో ఇమడడమే కాక, చిట్టిగారె అనే పదం సర్వనామం ఇచ్చే ప్రయోజనాన్ని ఇస్తుంది కదాండి' దాన్ని సర్వనామం అనొచ్చాండి'' అన్నాడు కళ్లల్లో తలివి విస్తృతంగా వెలిగించుకొంటూ. నాకు చిట్టిగారెలు ఇష్టం అనే సంగతి వీడికేమైనా తెలిసిందా చెప్మా అని పళ్ళు బిగబట్టుకుని అనుకున్నాను. ఆ తర్వాత డబాయింపు స్వరంతో ''ఒరే అబ్బాయి! ఈ ధాతుయుష్మ దర్థంబుల మీద దక్కు ఉంపుసు పేర్ల ఉకారైకాంత శబ్దంబులకు ద్వితీయాషష్ఠుల ఇకారోకార చకారంబులు నిషేధంబులు అని అథర్వణ కారికలలో ఉంది. మరి నువ్వు చెప్పింది ఎట్లా సరిపోతుంది? తెలిసిందా? కూర్చో'' అన్నాను గుక్క తిప్పుకోకుండా.

మర్నాడు కుఱు చిఱు కడు నిడు శబ్దంబుల కచ్చు పరంబగుసప్పుడు ''ద్విరుక్తట కారంబగు'' అని సంధి ప్రకరణం చెప్తునప్పుడు మరో కుర్రాడులేచి మరి చిరు + గారె = చిట్టి గారె అవుతుందాండీ ఈ సూత్రం ప్రకారం?' అని అడిగాడు, కర్ణుడి పైకి అర్జునుడు సర్పాస్త్రాన్ని ప్రయోగించినపుడు చూపుల తో. సర్వ నామాలలో తప్పినా సంధిలో తప్పలేదురా బాబూ నాకీ చిట్టిగారె సంధానం అనుకున్నాను.

మొత్తానికి చిట్టిగారె పదం ఆ రోజు నుంచీ నాకు రూఢం అయిపోయింది. నా ఒక్కడికే ఏవిటి, ప్రతి ఉపాధ్యాయుడికీ ఏదో ఒక సర్వనామం అని వార్యంగా ఉంటుంది. సల్లగా ఉంటే కాటిక కాయ, ఎర్రగా ఉంటే దొండపండు, తెల్లగా ఉంటే పిడత, సన్నగా ఉంటే పీరు, లావుగా ఉంటే బాయిలర్, మసక కళ్ళయితే కబోది, ఓ కన్ను మసక అయితే శుక్రాచార్యులు - ఇలా ఏదో ఒకటి తప్పదు. ఉమారాజేశ్వరరావు ఏమీరానేశ్వర రావు గానూ, రాజారావు బాబా రావుగానూ. వరదాచారి బురదాచారి గానూ మారడం కద్దు. అయితే ఈ పేర్లు పెట్టడం పిల్లలతో బాటు సరదాగా తిరుగుతూ, వాళ్లకు చదువు సంధ్యలు రావా లనే మాట తలపెట్టకుండా పాఠాలు చెప్పడం ఎగ్గొట్టే వాళ్ళ విషయంలో మాత్రం నిషేధం. ఏదో చెప్పి చెప్పక తప్పించుకొని తిరిగే వాళ్ల విషయంలో బహుళం. కష్టపడి చెప్పే వాళ్ళ విషయంలో మాత్రం నిత్యం.

విద్యార్థుల ఆకతాయి తనాన్ని ఇలా భరిస్తూంటే, ఉపాధ్యాయు డనబడే బడుగు మానిసి, పై అధికారు ధాం ధూంలు హుకా సహిస్తూ ఉండుకోవాలి. వాళ్ళు ఒక్కొక్కప్పుడు ఒంటి కాలి మీదా, మరొకప్పుడు రెండు కాళ్ళ మీద కూడా లేస్తూ ఉంటారు. ఆ లేవడానికి సరి అయిన కారణం ఉండక్కర్లేదు. వాళ్లు ఉపాధ్యాయుల్ని కేక లెయ్యడం తెలిసి కొంతా; తెలియక కొంతాను.

ఓ రోజు మా పాఠశాల ప్రెసిడెంటు గారు ఆ గదీ ఈ గదీ చూసుకుంటూ సైన్సు గదిలోకి వెళ్ళారు. గది మూల పగిలిపోయిన గాజుబుడ్లు కనిపించాయి. టెస్టుట్యూబులకీ ఫ్లాస్కులకీ ఆయన పెట్టుకున్న పేరు గాజుబుడ్లు - మొదట

ముఖం చిట్లించి, విసుక్కుని ఆ పైన కోపంగా ''ఏమయ్యా, మంచీ చెడ్డా తెలియ నక్కర్లేదూ ? ఇన్ని బుడ్డు పగల గొట్టించావు కదా ఎవరి సొమ్ము అనుకున్నావు? చిన్నతనపు చేష్టలా లేక కొంపెతనమా ?'' అంటూ చివాట్లు పెట్టారు.

దానికి సైన్సు మాష్టారు వినమ్రుడై "పిల్లలు వాటితో పని చేసేటప్పుడు ప్రమాదవశం చేత అవి పగులుతాయి'' అని విన్నవించుకున్నాడు.

వెంటనే ప్రెసిడెంటు గారు ''అవునయ్యా నాకూ తెలుసు. అయినా గాజు బుడ్డు పిల్లల చేతికిస్తావా ? సున్నితమైన పదార్థపు పిల్లలకి ఇస్తే ఏమవుతుంది ? ఇన్నాళ్ళూ చదివి నువ్వు నేర్చుకున్న విషయం ఇదేనా ? ఈ గాజు బుడ్డు పిల్లల చేతికి ఎందుకిచ్చావు ? ఏదైనా పని ఉంటే నువ్వు వాడి చూపించరాదా ?'' అన్నారు.

సైన్సు మేష్టారికి ఏం చెప్పాలో ఎలా చెప్పాలో తోచలేదు. చివరికి నెమ్మదిగా ''వాళ్ళ చేతికి ఇయ్యక తప్పదండీ'' అన్నాడు.

''చాలు చాల్లేవయ్యా. అంతగా తప్పకపోతే నాకు మాట మాత్రంగానైనా చెప్పి ఉంచవలసింది. దాని దుంపతెగ, పోతే పోయింది. ఇత్తడివో సీసాదేవో ఇనుపవో చేయించి పడేసేవాణ్ణి. కుర్రాళ్ళ మాస్టరుగా ఉంటే కష్టసుఖాలు తెలియవు గదా'' అంటూ పెద్ద పెద్ద అంగలేసుకుంటూ ఇవతలికి వచ్చారు. ఆ రావడం రావడం తిన్నగా నా జాగ్రఫీ క్లాసులోకి వచ్చారు. క్లాసులో మేష్టార్ని అడిగి మరీ లోపలికి రావాలనే సంగతి ఆయనకి తోచలేదు. తోచకపోతే పోయె, తిన్నగా వచ్చి నేను కూర్చోవలసిన కుర్చీలో తను వచ్చి కూర్చున్నాడు. కూర్చుని ''ఏవిటయ్యా, పాఠం చెబుతున్నావా ఆడుకుంటున్నావా - టేబిల్ మీద ఆ బంతి ఏమిటి ?'' అన్నాడు.

''అది బంతి కాదు సార్ - గ్లోబ్...భూగోళం'' అన్నా సవినయంగా.

''తెలుసు లేవయ్యా'' అంటూ దాని మీద చెయ్యి వేశారు. అది గిర్రున తిరిగింది. ''అబ్బ దీ ! దీని సీలు కూడా ఊడగొట్టాపన్నమాట - అక్కడ ఆ

సైన్సు మేష్టారు బుద్ధు పగుల గొట్టాడు. నువ్వు దీని మేకులూ సీలలూ ఊడ గొట్టావు. ఎల్లా తిరిగి పోతోందో చూడు...ఉండు నీపని చెప్తాను. దీన్ని కమిటీ వాళ్ళందరికీ చూపించి నీ వ్యవహారం తేలుస్తాను'' అంటూ ఆ గ్లోబ్ పట్టుకుని బయలుదేరాడు.

నేను కావాలనే ''అయ్యా క్షమించాలి. ఏదో పొరబాటు జరిగింది. ఈ సంగతి కమిటీ ముందు పెట్టి నా ఉద్యోగం ఊడ గొట్టించకండి'' అంటూ వెన కాలే వెళ్ళి బ్రతిమాలాను. కాని ఆయన బిగిసి పోయాడు. తర్వాత ఆయన కమిటీ ముందు ఆ గ్లోబ్ పెట్టడం, వాళ్లు ఆయన్ని చివాట్లు పెట్టడం, తర్వాత నన్ను చూసినప్పుడల్లా ఆయన ముఖం కోపంగా పెట్టడం, జరిగింది.

ఉపాధ్యాయుడు కమిటీ మెంబర్ల ధాటికి తట్టుకోవడమే కాదు—తల్లిదండ్రుల ఆగ్రహావేశాలకి కూడా ఒక్కొక్కప్పుడు తలవంచాలి.

ఒక రోజున ఒక విద్యార్థి తండ్రి, మల్లయ్య శ్రేష్ఠిగా రనుకుంటాను, రౌద్రమూర్తియై వచ్చి, తను స్కూలు కమిటీలో మెంబరుననే విషయం సూచిస్తూ "ఏమయ్యా మేస్టరూ - మా అబ్బాయిని ఆరో క్లాసులో వెయ్యలేదట - అయిదో క్లాసు తప్పించావట! ఏం?... ఎంచేత?'' అన్నాడు కాళ్లు మిరియాలు నూరుతూ.

ఆయనకి విషయాన్ని సచ్చ చెప్పవలసిన అవసరాన్ని గుర్తించిన వాడనై ''అయ్యా! మీరు పత్రికలు గదా మీ అబ్బాయి రేపు బేరాలు చేస్తుంటే సరిగ్గా పద్దులు వ్రాయవద్దా! అవే ఇక్కడ నేర్పుతున్నాము. మాటలు తప్పు లేకుండా వ్రాయగల అక్షర జ్ఞానం మీవాడికి రాలేదు. అందుచేత తప్పించాము'' అన్నాను. "ఏమాట తప్పు వ్రాశావండి'' అని ఆయన అడిగాడు. చింతపండు అనే మాట ''శింతపండు'' అని వ్రాశాడండి అని చెప్పి ఆయన సానుభూతిని ఆమోదాన్ని కోరే ఒక చిరునవ్వు నవ్వాను. ఆయన బదులుగా చిరునవ్వు నవ్వాలా? ఊహు! ఆయన పెదవులపై చిరునవ్వు ప్రతిఫలించక పోగా ముఖం ముడతలు పడింది.

విసుగుతో ''ఓసీ-ఇదిటయ్యా...నేనింకా ఏమిటో అనుకున్నాను...లేనిపోని చావ స్తాలు పెట్టుకోకు! చింతపండు అంటేనేమి? శింతపండు అంటేనేమి? దాని పులుపు పిరిగిందా? ధర తగ్గిందా? చాలు చాలు-ఇలాగే రాయాలి, అలాగ రాయకూడదు అని పిచ్చి పిచ్చి పట్టింపులు పెట్టుకోకుండా, పై క్లాసులో వేసి, డోకరాలు కట్టడం నేర్పి కాస్త లెక్కా డొక్కా గట్టి చెయ్యండి- ఏం తెలిసిందా?'' అంటూంటే, నా ఉద్యోగం నిలుపుకొనేందుకు తల ఊచి 'చిత్తం చిత్తం' అనాల్సి వచ్చింది...

తల్లి దండ్రులతో ఇలాగే అనేకం.

కలకా వల్ల నూటికి 12.7 చనిపోయారంటే, ఓ తండ్రిగారు "మధ్యలో ఆ చుక్కేవిటయ్యా" అంటే ''పన్నెండు కంటే ఎక్కువ. పదమూడు కంటే తక్కువా" అని చెప్పాల్సి వచ్చింది. ''అంటే?" అంటూ ఆయన తల గోక్కుని ''ఓహో పన్నెండుగురు పూర్తిగా చచ్చారా? పదమూడోవాడు ఏడు వంతులు చచ్చి మూడు పంతులు చావకుండా ఉన్నాడా? సరిసరి...అర్థం అయిందిలే" అంటూ వెళ్ళిపోయారు.

మరోమారు ఉపాధ్యాయుడు దండించాడని చెప్పి ఓ విద్యార్థి ఇంటికి ఏడుస్తూ వెళ్ళాడు. ''ఎందుకురా నాయనా ఏడుస్తావు?'' అని అడిగాడు తండ్రి. ''మా మాష్టరుగారు చైనా ఎక్కడుందని అడిగారు. నేను చెప్పలేక పోయాను. అందుకని కొట్టారు'' అని కుర్రాడు ఏడుస్తూ జవాబు చెప్పాడు. అది విని ఆ తండ్రి జాలిపడి ''నాయనా-ఇక్కడ నుంచి ఏది ఎక్కడ పెట్టిందీ జ్ఞాపకం ఉంచుకో-ఏం" అని కన్న కడుపుకి ఉండే సహజమైన ప్రేమతో ప్రబోధము కావించారు. ఆ తండ్రిగారు కూడా మా పాఠశాల కమిటీ మెంబరు గారే అనే విషయాన్ని జ్ఞాపక ముంచుకోవలసినదని మనవి.

L. T. క్లాసులో 'ఉపాధ్యాయుడు జ్ఞాన సంపన్నుడు గాను, దయా సముద్రుడు గాను, శాంతుడు గాను, దాంతుడు గాను, జితేంద్రియుడు గాను ఉండాలి' అనే ఏవేవో రత్నాల లాంటి ముక్కలు చెప్పగా విన్నాను. తర్వాత

తర్వాత మిత్రులు పల్లా పెద్దలు పల్లా ఏన్నవి తప్పకుండా ఉన్నాయి. నామీద ఎంతో గౌరవం ఉన్న ఓ పెద్దలుగారు ఏమన్నారంటే "మాస్టారూ-అదికాదండీ-తనకంటూ ఒక అభిప్రాయం ఎవరికుండదో ఆతనే ఉపాధ్యాయుడు- పశువులు ఉపాధ్యాయులు కానేరవు. ఎందుపల్లనంటే అవి ఒకప్పుడు కాకపోతే మరొకప్పుడైనా స్వంత అభిప్రాయాన్ని స్వతంత్రమైన ఇచ్చనూ కనబరుస్తాయి" అన్నారు-కావచ్చు-ఆయన మాటకూడా నిజం కావచ్చు.

ఉపాధ్యాయ వృత్తికి ఒదంబడిన వాడు దూషణ భూషణ తిరస్కారాల్ని సమానంగా స్వీకరించే మనస్థయిర్యం కలవాడై ఉండాలి.

ఓ మారు క్లాసులో పిల్లల భావనా శక్తికి ఉత్తేజం కలిగించాలనే ఉద్దేశంతో "ఒరే అబ్బాయి! ఒక బాకరిపాము ఒక గాడిదను చంపబోతూంటే నేను వెళ్ళి ఆ గార్దభాన్ని రక్షించాను. అప్పటి నా ప్రవర్తన ఎట్టి నీతిని అనుసరించింది?" అని ప్రశ్నించాను. బుద్ధ భగవానుని రీతిని అని జవాబు రాబట్టాలని నా ఉద్దేశం. కాని ఆ అబ్బాయి చటుక్కున లేని స్పష్టంగా "అప్పటి మీ ప్రవర్తన సోదర భావాన్ని అనుసరించి ఉందండి" అని కూర్చున్నాడు.

నా ముఖాన కత్తివాటుకి నెత్తురు చుక్క లేదు.

పిల్లలు జడ్జీలు డాక్టర్లు యాక్టర్లు వీళ్ళంతా "మేష్టరీ పని హాయి. లాయర్లు క్రొత్త విషయాలూ, క్రొత్తగా వచ్చిన జడ్జిమెంట్లు ఎప్పటి కప్పుడు క్రొత్తగా తెలుసుకోవాలి. మేష్టర్లకి అలా కాదు. చెప్పించే చెప్పొచ్చు. క్రిందటి సంవత్సరం భూమి గుండ్రంగా ఉంది ఈ సంవత్సరం చప్పున మారి బల్ల పరుపు కాదు కదా. ట్రయాంగిల్ యొక్క మూడు యాంగిల్సూ కలిసి ఎప్పుడూ రెండు రైట్ యాంగిల్సే-ఒక వైలు గంటకు ముప్పై మైళ్ళ వేగంతో పోతోంది. దాని వెనకాల నాలుగు గంటల ఆలశ్యంగా మరో బండి బయలుదేరి గంటకు నూటై మైళ్ళ వేగంతో పోతోంది. ఈ రెండు బళ్ళూ ఎన్ని మైళ్ళు పోయిన తర్వాత కలుస్తాయి అన్న లెఖ్ఖ చెప్పటంలో ఏవైనా పొరబాటు పచ్చినా ఆ రెండు

కైళ్ళా కొట్టుకోనూ కొట్టుకోవు, ఎప్పరికీ ఆపదా రాదు- ఒక పుంపు బదులు మరో మందు ఇస్తే మా పృత్తిలో కొంపలంటుకుంటాయి. మేష్టరికి అన్నీ శలవలే-శనివారం, ఆదివారం, పండగవస్తే, చలేస్తే, ఎండకాస్తే, వానకురిస్తే, పరద వస్తే, ఉన్న ఊళ్ళో ఉత్సవమైతే, ప్రక్క ఊళ్ళో బాజా వాయిస్తే, ఇలా ఎన్ని శలవలో'' అంటూ మేష్టరే అంత హాయి మరోటి లేదంటారు.

ఉపాధ్యాయుడికి ఉండే బాధలు ఉపాధ్యాయుడికి ఉన్నాయి. పై అధికారుల పద్ద నుంచి మొట్టి కాయలూ, కుర్రవాళ్ళ దగ్గర వెటకారాలూ, వెక్కిరింపులూ. క్లాసులో నలభై మంది ఉన్నారంటే, నలభయి మందివీ నలభై రకాల మనస్తత్వాలు. వీళ్ళందరికీ ఒక్కటే పాఠం చెప్పాలి. అంతకంటె నలభై అడవి మృగాల్ని సర్దడం సులభం. ఎందుచేతంటే, అవన్నీ ఒక్క మోస్తరు మనఃప్రవృత్తి కలవిగానే ఉంటాయి. ఆవులన్నింటికీ గడ్డి ఇష్టం. ఒకదానికి గడ్డీ ఒకదానికి వంకాయలు ఇష్టం అంటూ లేదు. భిన్న భిన్న ప్రకృతులు గల క్లాసులో ఒకడికి బొమ్మలంటే ప్రేమ. చరిత్ర పాఠం ఎంత కష్టపడి చెబుతున్నా వాడికి రవ్వంతాయినా రుచించదు. ఆయన ఆవేదనతో చెబుతూంటే, వాడు ఆ చెబుతూన్న మేష్టారి బొమ్మ వికృతంగా గీస్తూ ఉంటాడు. భిన్న రుచులు గల విద్యార్థులకి ఒకే రకమైన విద్య గరపడంలో ఉత్తమ ఉపాధ్యాయుడికి ఎంతో కష్టం ఉంది. తరుణ వయస్కులైన విద్యార్థుల ఉత్సాహం ఉరకలు పెడుతూ ఉంటుంది. వారి జీవితంలో చైతన్యం ఎక్కువ, ఒకచోట అరగంట సేపు నిలకడగా కూర్చోలేరు. పట్టుమని పది నిముషాలు ఏ విషయాన్నీ వినమూ లేరు. రాళ్ళపై నుండి జలజలమంటూ, కిలకిల మంటూ, పల్లానికి ప్రవహిస్తూ, గెంతుతూ ఎత్తైన కొండల మించి క్రిందికి గభీలున దూకుతూ, నవ్వుతూ పోయే సెలయేరు లాగ ఉంటుంది వాళ్ళ జీవితం. అలాంటి కుర్రవాళ్ళకి పాఠాన్ని తియ్యని మాటలతో ఆకర్షణ ఏర్పడేలాగ చెప్పాలి. పాఠం వింటున్నప్పుడు విద్యార్థికి ఒక నాటక ప్రదర్శనం చూస్తున్నప్పుడు కలిగే ఆనందాన్ని కలిగించాలి. ఇవన్నీ అందరూ అనుకుంటున్నట్లు అంత సులువైన పని కాదు.

సరే - అది అలా ఉంచండి.

ఈ ఉపాధ్యాయ వృత్తిలో ఉండే సాధక బాధకాలు చెప్పడం పూర్తి చెయ్యబోయేముందు ముఖ్యమైన సంగతి ఒకటి చెప్పాలి. అదేవిటంటే, 'ఇంట గెలిచి రచ్చగెలువు' అన్నట్లు, మొదట తనింట్లో తాను ఉత్తమ ఉపాధ్యాయుడుగా రాణించాలి. అప్పుడే బయట ఉత్తమ ఉపాధ్యాయుడో, ఉత్త ఉపాధ్యాయుడో అయ్యేది.

క్రొత్తగా మాస్టరీ పని దొరకడంతోనే అతనికి ముందుగా తన భార్యకి చదువు చెప్పుకోవాలనిపిస్తుంది. ఆవిడ ఇంగ్లీషులో మాట్లాడితే చూడాలని (లేదా వినాలని) ముచ్చట పడతాడు. ఇంగ్లీషు పుస్తకం కొని పట్టుకొస్తాడు. అక్షరాలదాకా నిరాటంకంగా సాగినా తర్వాత లక్ష ఆటంకాలు. ఆవిడ ఆ ఇంగ్లీషు పుస్తకాన్ని ఏ చారు రాచ్చిప్ప మీదో మూత పెడుతుంది. దాంతో అతని గుండె బేజారయిపోయి ఇంక ఆ చదువు కట్టిపెడతాడు. ఒకవేళ పట్టుదలతో సాగించాలనుకున్నా పగలు ఆయనకి తీరిక ఉండదు. రాత్రి ఆమెకి ఇష్టం ఉండదు. తాము కూడదని రాత్రి భోజనాలయాక బలవంతంగా కూర్చోబెట్టి పాఠం మొదలెడితే, కళ్ళు మూస్తూ తెరుస్తూ చిటికెలేస్తూ ఉండగానే మధ్య ఏదో ముఖ్యమైన విషయం జ్ఞాపకానికి వస్తుంది ఆ పిల్లకు. "ఈ చదువుకేం కానీండి-రేపు కార్తీక మాసానికి యుద్ధం ఆపేసి నవరసులు చొక్క చేస్తారటగా?" అంటుంది. ఏమిటి ఆ మాటకర్థం? అంటే నవరసులు ప్రియంచేసి ఆడవాళ్ళను ఏడ్పించేటందుకే అసలు ఈ యుద్ధం చేస్తున్నట్టూ, కాస్సేపు ఏడిపించి చాల్లే పిళ్ళని ఏడ్పించడం అనే స్త్రీలపై జాలిదలిచి యుద్ధం ఆపివేయడానికి ఎవరో నిశ్చయించి నట్టూ! ఇక చదువు సాగదు - ఒక వేళ నెలో రెండు నెలలో పట్టుదలతో సాగించినా ఆ తర్వాత ఆ అమ్మాయికి కొంచెం వికారం ఏర్పడడం అంతటితో చదువు పూర్తిగా ఆగిపోవడం తప్పదు.

భార్యకి సరే - కొన్నేళ్ళ తర్వాత ఇంట్లో బిడ్డలకి పాఠం చెప్పినా, కొన్ని కొన్ని విపరీత పరిణామాలు ఉద్భవిస్తాయి. ఓ సారి మా అమ్మాయికి

లెక్కలు చెబుతున్నా. "ఒకడు ఒక పనిని మూడు రోజుల్లో చేస్తాడు. ఆ పనినే మరొకడు అయిదు రోజుల్లో చేస్తాడు. ఇద్దరూ కలిసి ఆ పనిని ఎన్ని రోజులలో చేస్తారు?" అని లెక్క. మా అమ్మాయి చెయ్యలేకపోయింది ఆ లెక్క. నే నొక్కటి వేశాను. వెంటనే మా ఆవిడ వచ్చి పిల్లను లెక్కచ్చుకుని వెనక్కి లాగి "ఏవిటండీ పెద్ద లెక్కలు. దానికి చెప్పడం ఎందుకూ! బిడ్డను కొడుతున్నారు కూడానూ? కాకపోయినా ఏం లెక్కలివి? ఒకడు ఒక పనిని మూడు రోజుల్లో చక్కగా పూర్తి చేయగలిగి ఉంటే, అయిదు రోజులదాకా డేకే మరో వెధవను కూడా ఆ పనిలో ఇరికించడం ఏమంత తెలివైన పనండీ? ఆ ఒక్కడి చేతే చేయించుకోకూడదూ? ఆ ఇద్దర్నీ కలపడం ఎందుకండీ? వాళ్ళిద్దరూ కలిస్తే వప్పందాలు పోతారుగాని ఛస్తే ఆ పని పూర్తి అవుతుందంటారా? పిచ్చా ఏమన్నా మీకూ? ఇలాంటి లెక్కలు చెయ్యలేకపోతే మానె, పిల్లదాన్ని కొట్టబోకండి" అంటూ దాన్ని లాక్కుని వెళ్ళింది.

ఒక రోజున మా అబ్బాయికి ఒక లెక్క ఇచ్చి చెయ్యమన్నాను. లెక్క ఏమిటంటే - ఒకడు గంటకు పది మైళ్ళు పరిగెడతాడు. పద్దెనిమిది గంటల్లో ఎన్ని మైళ్ళు పరిగెడతాడు అని. వాడు లెక్క ప్రారంభించి ఒక్క క్షణం అయిన తర్వాత ఆగి వెర్రి చూపులు చూస్తూ ఉండి పోయాడు. "లెక్క చేశావా? ఎన్ని మైళ్ళు?" అని గుడ్లెర్రజేశాను. 'ఏవిటండీ' అన్నాడు. "ఏమిటేమిటి నీ ముఖం! గంటకి పది మైళ్ళ చొప్పున పద్దెనిమిది గంటల్లో ఎన్ని మైళ్ళు పోతాడో కనుక్కో" అని కోప్పడ్డాను. "కనుక్కంటానండీ. చాలా దూరం పోయాడు గానీ-అసలు వాడు అట్లా పరిగెత్తితే, రెండు మూడు గంటలయ్యేసరికి గుండె పగిలి తపీ మని చావడా అని ఆలోచిస్తున్నానండి" అన్నాడు. "చావడా? లెక్కల్లో మనుష్యులు చావరు. లెక్క ప్రకారం పద్దెనిమిది గంటలూ పరిగెడతాడు కాని మరీ చావడు.... ఇంక లెక్క వెయ్యి" అని కోప్పడ్డాను.

"ఓ తొట్టికి ఓ బంధం ఉంది, అందులోంచి గంటకి అయిదు గేలనుల చొప్పున నీరు కారిపోతోంది. గంటకి తొమ్మిది గేలనుల చొప్పున నీరును ఇచ్చే పంపు మూలంగా ఆ తొట్టి ఎంత కాలంలో నిండుతుంది?" అదీ లెక్క.

"ఇవేం లెక్కాయిడే - పిల్లలకి కాస్త తెలివైనవి చెప్పండి" అంది మా ఆవిడ.

"ఏం?" అన్నా.

"ఏం ఏమిటి? నా ముఖం. చిల్లి తొట్టికో నీరు పోస్తూంటే ఓ చెంప కారి పోయేవి కారిపోతూంటే, పైనుంచి నింపడం ఏమిటి? ఆ చిల్లి తొట్టికి మూతేసుకుని ఆ తర్వాత నీరు నింపుకోకూడదూ?"

"నీకు తెలియదులే. ఇది అచ్చు పుస్తకంలో విషయం - దొరలు రాసింది."

"అయితే మటుకు? దొరలైతే మటుకు తొట్టికి చిల్లి ఉంటే, కాస్త మూతేసుకుని వాడుకోరా ఏమిటి? - చాల్లెండి లెక్కలూ మీరూను."

నా కెలా సమాధానం చెప్పాలో అర్థం కాలేదు.

మరో సారి నేను మా చిన్నవాడికి లెక్కలు చెబుతున్నాను. "ఒరే బాబూ, మనం ఉన్న ఇల్లు పదహారు వేల రూపాయల ఖరీదు గలదిరా. దీన్ని ఒక లక్ష రూపాయల కమ్మేస్తే ఎంత లాభం వస్తుంది?" అని నోటి లెక్క అడిగాను. వాడు తెల్లబోయి చూడ్డం మొదలెట్టాడు. "ఏం చెప్పవేంరా?" అన్నాను. వాడు బిక్క మొహంతో "అసలు ఈ యిల్లు మనది కాదుగా నాన్నా!" అన్నాడు. నేను విసుగ్గా "మనదే అనుకో-అనుకొని, అమ్మితే ఎంత లాభం వస్తుందో చెప్పూ" అన్నాను. "బోలెడు లాభం వస్తుందిలే నాన్నా!" అని విసుగ్గా అంటూ అక్కడి నుంచి పరిగెట్టుకుని పారిపోయాడు ఆడుకోడానికి. ఇల్లు మనది కానప్పుడు ఎందుకు వచ్చిన పనికిమాలిన ఆలోచన ఇదంతా అని వాడి ఊహ అయి ఉంటుంది.

ఇలా ఉంటుంది ఉపాధ్యాయుడి జీవితం, సుఖ, దుఃఖాల సమ్మిశ్రితమై పెలుగు చీకట్లతో దోబూచులాడుతూ. హాయిగా నవ్వుకో గలిగితే ఉపాధ్యాయ వృత్తి తమాషాగానే ఉంటుంది మరి!

['ఉపాధ్యాయుడు' అనే గ్రంథం నుంచి]

బ్రహ్మచారీ లిమిటెడ్

శ్రీ బృహస్పతి

వ్యాపారానికివి మంచి రోజులు. భారత స్వాతంత్ర్య పరిశ్రమలో వాటా లన్నీ వ్యాపారస్థులవే. స్వాతంత్ర్యం డివిడెండ్లుకూడా వాళ్ళవే, సహజంగా. అది వరకల్లా దేశం పరాధీనమై ఉండడంవల్ల దేశీయ పరిశ్రమలకు నిజమైన ప్రోత్సాహం లేకపోయింది. ఇప్పుడా అడ్డంకి తొలగిపోయింది గనుక, దేశీయ పరిశ్రమలు క్రొత్తపోకడలు పోవడానికి అభ్యంతరం ఉండగూడదు.

ఇదంతా ఎందుకు చెప్పానంటే-వ్యాపారస్థులు సాగించదలిస్తే చక్కని, సరికొత్త దేశీయ పరిశ్రమ ఒకటి ఉంది. అదేమిటంటే బ్రహ్మచార్లు. మన దేశంలో బ్రహ్మచారిగాళ్ళకి మాంచి గిరాకీ ఉంది. ఆడవాళ్ళు అవివాహితలుగా ఉండిపోవడానికి భయపడినంత కాలమూ ఈ గిరాకీ తగ్గే భయంలేదు.

వ్యాపార దృష్టితో చూచినట్టయితే బ్రహ్మచార్ల పరిశ్రమలో చాలా ఆకర్షణ లున్నాయి. ఈ పరిశ్రమకు యంత్ర సామగ్రి అవసరంలేదు; స్టెర్లింగు నిలవలు గాని డాలర్లుగాని ఖర్చుకావు; దీనికి పెద్ద పెట్టుబడికూడా లేదు. కొద్దిపాటి మూల ధనంతోనూ, ఆర్గనైజేషనుతోనూ ఈ పరిశ్రమ సాగించవచ్చు.

ఈ పరిశ్రమలో వీటన్నిటికన్నా గొప్ప ఆకర్షణ లేవంటే, ఇందులో నష్టానికి తావులేదు; సబ్లబజారు అసలేలేదు.

ప్రధానంగా ఇది వ్యాపారమేకాని పరిశ్రమ కాదు. ఈ వ్యాపారంలో చేతులు మారే సరుకు బ్రహ్మచార్లు.

ఈ వ్యాపారం సాగించే పద్ధతి ; బ్రహ్మచారులను మార్కెట్టులో సాధ్య మైనంత తక్కువ ఖరీదుకు కొనటమూ, పెళ్ళికిగాను సాధ్యమైనంత ఎక్కువ ఖరీదుకు అమ్మడమూను.

ఇంచుమించు అక్రమం ఏమీలేదు. ఇది సర్వసాధారణంగా జరుగుతున్న వ్యాపారమే. అయితే ఈ వ్యాపారాన్ని సాగించేవాళ్ళు వ్యాపార దక్షులుకాని కారణంచేత బ్రహ్మచార్ల మార్కెటు సరిగా 'ఎక్స్‌ప్లాయిట్' కావటంలేదు. కొందరు బ్రహ్మచార్లు న్యాయమైన ధరకంటె చాలా తక్కువకు అమ్ముతుపోవటమూ, మరి కొందరు ఆడపిల్లల తండ్రులు బ్రహ్మచార్లకు మార్కెటు ధరకంటె చాలా హెచ్చు ఇవ్వటమూకూడా జరుగుతున్నది. వ్యాపారస్థులు కానివాళ్ళు చేసే ఏ వ్యాపారమైనా ఇట్లాగే ఉంటుందని వేరే చెప్పనవసరంలేదు.

వ్యాపారదక్షత బాగా ఉన్న సమాజంలో సరుకుల ధరలలో వ్యత్యాసాలను బట్టి వాటి యథార్థమైన నాణ్యాలలోగల తేడాలు చెప్పటానికి వీలుంటుంది. ఇవాళ మన సమాజంలో పెళ్ళికొడుకులు పుచ్చుకొనే వరకట్నాలలో వ్యత్యాసాన్ని బట్టి వాళ్ళలో ఉండే తేడాలు నిర్ణయించటం సాధ్యంకాకుండా ఉంది. ఇది వెనుకబడి ఉన్న సమాజంయొక్క లక్షణం. అందుకని బ్రహ్మచార్ల వ్యాపారం సిద్ధహస్తులైన వ్యాపారస్థుల చేతిలో పడినట్టయితే సంఘం బాగుపడుతుందిగాని చెడిపోదు. వ్యాపారస్థులు న్యాయమైన లాభంపొందటమే కాక, బ్రహ్మచారులకు న్యాయమైన ధరలు గిట్టటమూ, వధువుల తండ్రులకు తమ డబ్బుకు తగ్గ ప్రతిఫలం ముట్టటమూ జరుగుతుంది.

కాని ఇంచుమించు పరిశ్రమకూడా అవకాశం లేకపోలేదు. అదెట్లాగంటే, దక్షులైన పారిశ్రామికులు జేరి, కేవలమూ బ్రహ్మచార్ల క్రయవిక్రయాలతో ఆగక, తక్కువ తరగతి బ్రహ్మచారులను తీసుకుని ఆధునిక పారిశ్రామిక పద్ధతులపై వారిని ఉత్తమ తరగతి బ్రహ్మచార్లుగా తయారుజేసి వారి మార్కెటు ధర పెంచవచ్చును.

మాట వరసకు కొద్ది చదువు చదివిన బ్రహ్మచారి ఉన్నాడనుకోండి. అతని మీద కొంత డబ్బు ఖర్చు జేసి పెద్ద చదువు చదివించి అంచువల్ల అతనికి లభించే అధిక వరకట్నంలోంచి ఆ ఖర్చు లాభాలతో సహా మినహాయించుకోవచ్చును. పెద్ద చదువులు చదివి విదేశాలకు పోయ్యే తాహతు లేనివారిని విదే

శాలకు పంపి బ్రహ్మచారుల సంపాదన శక్తితో బాటు పరకట్నాల మీది రాబడి కూడా పెంచవచ్చు. బజారులో చవుకగా జాజి చెక్కలు కొని వాటితో బీరువాలూ అవీ చేసి వార్నిషు వూసి మూడు నాలుగింతల ఖరీదుకు అమ్మటం ఎటువంటి పరిశ్రమో ఇదీ అటువంటి పరిశ్రమే. ఏ విధంగా చూసినా ఈ పరిశ్రమ సంఘానికి ఉపకారమే కాని అపకారం కాదు.

బ్రహ్మచార్ల పరిశ్రమ జోరుగా సాగితే సంఘాని కుండే లాభాలు మనం సులభంగా ఊహించవచ్చు. ఇతర పరిశ్రమల వల్ల కలిగే లాభాలే ఈ పరిశ్రమ వల్లా కలుగుతాయి. అవేమంటే, మరింత నాజూకైన, నాణ్యమైన సరుకు తయారు కావటమూ, క్రమంగా సరుకుల ధరలు తగ్గటమూను. ఈ రెండు లాభాలతో బాటు ఈ పరిశ్రమకు ప్రత్యేక సదుపాయం ఒకటి ఉంది. అది మనస్తత్వానికి చెందినది. దాని గురించి వివరించాలి.

ప్రస్తుతం బ్రహ్మచార్ల క్రయవిక్రయాలు, నిపుణులు కానివాళ్లు సాగిస్తూ ఉండడం వల్ల బ్రహ్మచార్ల మార్కెటు ధరలకు అన్యాయం జరగటమే కాక మరొకటి కూడా జరుగుతున్నది. కొందరు బ్రహ్మచార్ల తండ్రులు వ్యక్తిగత కారణాలవల్ల బేరంలోకి దిగడానికే వీలులేని స్థితిలో ఉన్నారు. అందువలలో వాళ్ళు వరకట్నం గురించి చేసి ఉన్న ప్రసంగాలూ, శపథాలూ, విమర్శలూ మొదలైనవి ప్రతి బంధకాలు కావటం కొన్ని కేసులలో జరుగుచున్నది. మరికొన్ని కేసులలో బ్రహ్మచార్ల తండ్రులూ అవతలి పార్టీ వాళ్ళూ దగ్గిర వాళ్ళయి సప్పుడు మొహమాట పడటం జరుగుతున్నది. అదృష్టవశాత్తూ వాణిజ్యానికి నైతిక విశ్వాసాలూ మొహమాటాలూ లేవు కనుక బ్రహ్మచార్ల పరిశ్రమ సాగితే ఈ యాతి బాధలు కూడా తెరపడతాయి.

ఒకప్పుడు పారిశ్రామిక వ్యాపార దృష్టి సాగక పూర్వం - ముఖ్యంగా పల్లెపట్టుల్లో అడగని వాడికి పాపంగా అన్నీ ఊరికే దొరికేవి. గరిటెడు మజ్జిగ కావాలన్నా, నాలుగు వంకాయలు కావాలన్నా అడిగిపుచ్చు గోపడమే కాని న్యాయ

మైన ధరలకు క్రయ విక్రయాలు జరగటం ఉండేది కాదు. పై పెచ్చు, దగ్గిర ఉన్నదానికి డబ్బు పుచ్చుకోవటం చాలా తప్పని అప్పటి వాళ్ళు అపోహపడేవాళ్లు. ఆ విధంగానే ఈనాడు కూడా అనేక మంది బ్రహ్మచార్లు అమ్మాడు పోవటం తప్పనే అపోహతో ఊరికే పెళ్ళి చేసేసుకుంటున్నారు. ఇందువల్ల సంఘం ముందుకు పోలేక పోవటం తప్ప మరేమీ జరగడం లేదు. పై పెచ్చు ఇట్లా ఉచితంగా అమ్మాడు పోయేవాళ్లు ఇతరుల మార్కెటు ధరలను కూడా పాడు చేస్తున్నారు. ఇది చాలా పొరబాటు. వీళ్ల కట్నాల ఆచారాన్ని నిర్మూలిస్తూన్నామని భ్రమపడవచ్చు. కట్నాల ఆచారం అభివృద్ధి అవుతున్నది గాని తగ్గిపోవడం లేదు. దీన్నిబట్టి అయినా గ్రహించవచ్చు - బ్రహ్మచారుల పరిశ్రమ ఎంత ముఖ్యమైనదో.

అయితే మార్క్స్ సిద్ధాంతాలలో విశ్వాసం కలవారు బ్రహ్మచారుల పరిశ్రమకు ఒక్క అభ్యంతరం చెప్పవచ్చు. ఈ పరిశ్రమ సాగితే క్రమంగా బ్రహ్మచారులను ఉత్పత్తి చేసే శక్తి కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరించుకొని రాను రాను బ్రహ్మచార్లను కొనే శక్తి అధిక సంఖ్యాకులకు లేకుండా పోయి సంఘంలో ఒకే సారిగా అవివాహితులు, అవివాహితులు కూడా ఏర్పడి ఒకరి కొకరు అందక పోవడం జరుగుతుంది.

ఈ అభ్యంతరానికి రెండు సమాధానాలు : ఒకటి, మార్క్స్టు సిద్ధాంతాలు తప్పు. రెండు, వ్యాపారం, క్రయ విక్రయాలు జరపలేని ప్రజానీకం యొక్క కష్టసుఖాలను పరిగణించ జాలము. బజారులో అమ్మాడుపోని సరుకులూ, ఇళ్ళల్లో సరుకులు కొనలేని మనుష్యులూ ఉండటం వల్ల సంఘానికి ఏమీ నష్టం లేనప్పుడు, కొందరు అమ్మాడు పోని బ్రహ్మచారులూ, కొందరు బ్రహ్మచార్లను కొనలేని కన్యలూ ఉన్న మాత్రం చేత జరిగే అపచారం ఏమిటి ?

[17-6-1949 'తెలుగు స్వతంత్ర']

కృష్ణా పత్రికా దర్బార్

శ్రీ చెఱుకువాడ వెంకట నరసింహం

నా బందరు గురు చతుష్టయంలో ప్రప్రథముగా బ్రహ్మశ్రీ ముట్నూరి వారు అంతర్ముఖ చిద్విలాస ప్రబుద్ధ గురుపాద ముఖ్యులు.

నాకు విద్యార్థి దశలోనే 1905 వ సంవత్సర ప్రాంతమున వందేమాతరోద్యమ ఆరంభ దినములలో శ్రీ వారితో నా పరిచయ భాగ్యం ప్రారంభమైనది. శ్రీయుతులు భోగరాజు వారు నా భౌతిక యోగక్షేమాభ్యున్నతులను పరిపోషించిన పితృ గురుపాదులు రెండవవారు. వీరి సహవాస భాగ్యం నాకు 1919 నుండి లభించినది. దాదాపుగ అదే సమయములో తృతీయ గురుపాదులైన శ్రీ కోపల్లె వారి సహ చర్య భాగ్యము కూడ నాకు దైవ యోగముననే సంప్రాప్తమైనది. ఈ మూర్తిత్రయము వారి వాత్సల్యాదరాభిమానములతో బందరు ఆంధ్ర జాతీయ కళాశాలలో ఒక చిన్న అధ్యాపకత్వమునకు అరోజుల్లోనే నియోజితుడనైతిని. మూడవ వారైన శ్రీ కోపల్లె వారి సహచర్య భాగ్యం శ్రీ వారు 1922 వ సంవత్సర ప్రారంభమునందే స్వర్గస్థులగుటచే, అనతి కాలములోనే లుప్తమైపోయినది. శ్రీ కోపల్లె గురుదేవులను దర్శించినపుడు అనంత గభీర విస్తృత మహాసాగర వీచీ పరంపరా రావములు, దుర్గమ ఘోరారణ్యావృత ఉన్నతోన్నత మహాపర్వతశ్రేణులు, సంధ్యారాగ ఇంద్రచాప కాంతి పుంజములు సందర్శించినపుడు గలుగు భయ విస్మయానందములు కలుగుచుండెడివి. అంటివలే వీరు దూర దూరమున నుండియే ధ్యాన మనన నమస్కారార్హా మూర్తిగా నుండేవారు. ఇంక నాల్గవ వారు శ్రీ కవుతా శ్రీరామ శాస్త్రిగారు. వీరికి ఆంగ్ల భాషా జ్ఞానం బొత్తిగాలేదు. ఈయన కూడా 1903-1904 సంవత్సర ప్రాంతంలో బందరు నివాసి అయ్యేను. వంగ భాషను స్వయం కృషితో నేర్చుకొనెను. అనేక

గ్రంథములు పంగ భాష నుండి తెనుగు లోనికి అనువదించెను. బందరులో ఈ శతాబ్దారంభమున బయలుదేరిన జాతీయోద్యమ మహోన్నత భావములన్నిటికి ఈయనమే ముఖ్య ప్రాణాచార్యులుగ నుండేవారు. పైన పేర్కొన్న మూర్తి త్రయమునకు కూడా అనేక సందర్భములలో ఈ శాస్త్రిగారే నూతన భావోత్సాహములను, సరికొత్త ఆలోచనలను సూచిస్తూ ఉండేవారు, వీరు నల్గురును దాదాపు సమవయస్కులును, సమాన సద్భావ సంస్కార విలసితులైన సహృదయులగుటచే అన్యోన్య ఏకవచన ప్రయోగ సంభాషణలే వీరిలో జరుగుచుండేవి. నేను మాత్రం వీర సన్నిధిని రామ పట్టాభిషేకములోని ఆంజనేయమూర్తి స్థానమునాక్రమించుకొనుచుండేవాడను. నిజానికి ఉన్మాదులకు విద్యార్థి దశ నుండియే ప్రజాహిత కార్యాసక్తి, ప్రబోధ ప్రచారణాభిలాష పురికొల్పిన ప్రథమ గురువు దేవులు శ్రీ కవుతా శాస్త్రిగారనే చెప్పవలెను. నా సహాధ్యాయియు నాకత్యంత సన్నిహిత చిర మిత్రుడును అయిన శ్రీ కోట సుబ్బారావు కూడా పై వివరించిన మా కూటమిలో చేరినవాడే. ఇతడు ముట్నూరి వారికి నా కంటె ముఖ్య సన్నిహిత గర్భగుడి అర్చక శ్రేణిలోపేరి శ్రీ వారి సన్నిధిని శ్రీ అరవిందుల వారి "ఆర్య" పత్రికలోని వేదాంత తత్వ ప్రబోధములను గురుశిష్యమర్యాదతో బహుకాలము ప్రబోధితుడైన ధన్యాత్ముడు. శ్రీ ముట్నూరివారు 1930-31 సంవత్సరములలో మహాత్ముని అసహాయోద్యమ సందర్భమున నెల్లూరు పగైరా జైళ్ళలో కారాగారవాస శిక్ష అనుభవించినప్పుడు ఈ కోట సుబ్బారావే కృష్ణా పత్రికా సంపాదకత్వమును గురు మార్గానువర్తిగా గురువును మరిపించి అత్యంత సమర్థతతో నిర్వహించగా కృష్ణారావుగారే జైలులో నుండి సంపాదకీయ వ్యాసములను రహస్యముగ పంపుతూ యుండి ఉంటారని ఏ తత్పత్రికా పాఠకులెందరో భ్రాంతి చెందుతూ ఉండేవారు.

పైన పేర్కొన్న నా బందరు నలుగురు గురుదేవులూ బందరు కృష్ణా క్లబ్‌లో మొట్టమొదటి సభ్యులుగ నుండేవారు. అచట జరుగుచుండిన పేకాటలు ధూమపానాలు పగైరా వీరికి ఏవగింపుగ తోచుటచే వీరాక్లబ్‌లో సభ్యత్వములను వదలుకొని బందరు పట్టణమునకు ఆగ్నేయ భాగమున బెజవాడ-బందరు కృష్ణ

కాల్వ శాఖాగ్రమున బొంబాయి అను పేరుతో వ్యవహరింపబడు ఒక గుండ్రని జలాశయము పద్ద ఈ పైన పేర్కొన్న పెద్దలందరూ ప్రతి సాయంత్రమూ సమావేశమై ఒకటి రెండు గంటలసేపు లోకవృత్తములనెల్ల సర్వతోముఖంగా చర్చించి, విమర్శించి, ఖండించి, సమన్వయపరచి కాలక్షేపం చేస్తూ ఉండేవారు. వారి ప్రసంగములలో అస్మదాదులకు కాపలసిన విలువైన ఉపయోగకరమైన అంశము లెన్నియో స్వర్ణకారుడు స్వర్ణాభరణములకు మెరుగు పెట్టునపుడు మసి కట్టువానికి లభించు స్వర్ణరత్న లేశములవంటివి లభించేవి. వాటినే నేను పొదుపుగా భద్రం చేసుకుని మార్కెట్‌లో చెలామణీ చేసుకొనుచుండేవాడను. ఇప్పటికిని నా సంచి కట్టులో నున్న సరుకంతా ఆ మసికట్టు బాపతుకు సంబంధించినదే అని ఆంధ్ర మహాజనులకు బహిరంగంగా నా జ్ఞానలేశ చౌర్య మూలరహస్యమును విన్నవించుకుంటున్నాను.

బందరులో కృష్ణాపత్రికా కార్యస్థానం ప్రస్తుతపు కూరగాయల మార్కెట్టు నకు దక్షిణపు దిశను గంగానమ్మ గుడి నానుకొని రెండు విడి భవనములుగ నుండేవి. అందు ఉత్తరదిశ నున్న విశాలమైన హాలులో ముద్రణా కార్య మంతయు జరుగుచుండేది. దక్షిణపు వైపున కృష్ణా కో ఆపరేటివు బ్యాంకు గోడ్డు నానుకొన్న రెండు గదుల్లోను బైండింగ్ పని, ఆఫీసు గుమాస్తాలు ఉండేవారు. ఈ రెండు గదులను ఆనుకొని ఉత్తరమున ఒక పెద్ద గది ఉండేది. దానిలో శ్రీ మా గురుపాదులవారి సింహాసనము ఒకరిద్దరు ఉప సంపా దకుల వ్రాత కోతలు జరుగుచుండేవి. ఈ మూడు గదులపైన దరిమిలాను పరీక్షిన్మహారాజుగారి ఒంటి స్తంభపు మేడవంటి ఒక చిన్న డాబామేడ గది కూడా నిర్మించుకొన్నారు. కొంతకాలము కృష్ణారావుగారు మేడగదిలో కూడా కాలక్షేపం చేస్తూ ఉండేవారు. ఈ ఉత్తర దక్షిణ భవనముల నానుకొని తూర్పు వైపున ఒక సరిహద్దు గోడ ఉండేది. ఉత్తర దక్షిణ భవనముల రెంటికి మధ్యనున్న కాకి ప్రవేశముకో పుస్తకాలు యూనివర్సిటీ గ్రాడ్యుయేట్స్ వంటివారు చూచుటకు మాత్రమే ఇంపుగు కొన్ని ఆకు పసందు మొక్కలు ఉండేవి. తూర్పు వైపు సరిహద్దు గోడ నానుకొని మూడు నాలుగు గజముల వెడల్పున అయిదారు

గజముల పొడవున సదరు రెండు భవనముల మధ్యను ఒక రెల్లుపాక (దీనినే మునిమాణిక్యంవాను ''జమ్మి మహల్''—జమ్ముగడ్డితో కప్పబడిన పాక-అని వ్యవహరించుట కద్దు) మా కోట సుబ్బారావు చేత నిర్మింపబడినది. ఇది బహుశ కృష్ణారావుగారు జైలులో నుండగా ఆయన స్థానంలో మా వాడు కృష్ణాపత్రికను నిర్వహించినపుడు కత్తెర కాళ్ళమీద ఈ జమ్మిమహల్‌ను నిర్మించి ఉంటాడని జ్ఞాపకం. ఆ వసారాలోనే వేణుగోపాల్, నటరాజ్, విఘ్నేశ్వర వగైరా శిథిల శిలా విగ్రహములు ఎక్కడో దొరికినవి సిమెంటు దిమ్మలమీద మావాడు అమర్పించినాడు. ఈ రెల్లు వసారా ఆచ్ఛాదనం కింద గురుదేవులు శ్రీ కృష్ణారావు పంతులుగారు ప్రతి సాయంత్రం 4, 5 గంటల మధ్యనుండి సుమారు రెండు గంటలసేపు నిండు పేరోలగమున కొలువు తీర్చుచుండేవారు. శ్రీవారి దర్బారులో నానా శాస్త్ర సకల కళాభిజ్ఞులును, నవరసభావ సంభరితులైన కవి గాయక పండిత నటకా పతంసులును, బహు భంగులైన లోకవృత్తేతిహాస పారంగతులై చారచక్షువులుగా గ్రామ పట్టణ జిల్లా రాష్ట్రివార్తలను ఎప్పటికప్పుడు మూజు వాణిగా దశదిశలనుండి శ్రీవారి సన్నిధికి అనుదినము జారవేయు వార్తాహరులును పరివేష్టించి, ఎప్పుడెక్కడ జరిగిన అంతర్గత రహస్యములును, శ్రీవారి సముఖమున నిగూఢముగను, సూచితముగను, ఏకాంతముగను, బహిరంగముగను, నివేదించుకొని వెళ్ళిపోతూ ఉండేవారు. అందుకనే వారికి రవిగానని రహస్యము లన్నియు కవిజన శ్రేణికి కానపచ్చినట్టు శ్రీవారికి ఎక్కడెక్కడి గుట్టుమట్టు రహస్యములును ఎప్పటికప్పుడు కేరళ పక్షి జోస్యముగ రరతలా మంత్రముగుసుడెసు. వారా రహస్య నివేదనలన్నియు స్వర్ణకారుడు నవరత్నము లను స్వర్ణాభరణములందు సముచిత రీతిని పొందుపరచి చూపరులకు ఆనందము గొలుపునట్లు తమ పత్రికా వ్యాసములలో స్థలకాల సందర్భోచితముగ ఉల్లేఖించి పాఠక మహాశయులకు అపూర్వ విషయజ్ఞానానందములను కలిగిస్తూ ఉండేవారు. ఒక సందర్భములో పత్రికా వ్యాసరచన, సభావేదికోపన్యాసములను గూర్చి గురు పాదులు ఈ క్రింది నిర్వచనమును ప్రసంగమున నాతో సెలవిచ్చినారు.

Whenever you want to write something to the Press or something to talk on the Platform, you must only do so when you believe you can throw more light or more heat, if possible both, if not keep quiet, than others before you.

గుమూర్తి స్వరూపం:- కుదిమట్టముగ నుండు పొట్టికురుచ సమస్థూలోన్నతకాయం. తెల్లజామపండు చాయగల సువిశాల ఫాలభాగముతో కూడిన పూర్ణ చంద్ర బింబాననము, చంద్రబింబములోని కళంకమువలె ఉభయ కనుబొమల మధ్యను పసినాడు బాలపాప వ్యాధికి వేసిన చుట్టకాల్పుమచ్చ, శుద్ధ స్వచ్ఛ శ్వేత ఖద్దరు దుస్తులలో ముచ్చిలి గుంటమీద జానెడు గొరెతోకపంటి కుచ్చుగల కోరా తలపాగా, మోకాళ్ళ పరకు వ్రేలాడు వొదులు బెంగాలీ ప్రక్కజేబుల లాల్చీకి ముంజేతి గుడ్డ గుండీలు, ముందు పెనుకలు కొంగులు వ్రేలాడు గోరంచుల ఖద్దరు ధోవతి, చేయూత కొరకుగాక శిక్షాదండ చిహ్నముగ వినోదార్థము చేత ధరించు నునుపుచేసి మెరుగుపెట్టబడిన ఒక చిన్ననాటి చేవచేతికర్ర. ఈ రూపముతో శ్రీవారు వారి ఆస్థాన దర్బారు హాలుకో కొలుపు తీర్చుతూ ఉండేవారు. ఆ దర్బారులో శ్రీ భోగరాజు వారొక్కరే శ్రీ వారితో సమాన ఫాయిగా ప్రవర్తించుచుండేవారు. తక్కిన వారంతరము శ్రీవారి నొక్కరిని దర్బారు షాహిగాను మేమందరము తత్పరివార పర్గముగా భావించుకొను చుండేవారము.

సదరు దర్బారు సభా స్థారులలో ముఖ్యులు కోలవెన్నువారు, విశ్వనాథ వారు, కాటూరివారు, మునిమాణిక్యంవారు, కీ॥ శే॥ అవధానివారు, అప్పుడప్పుడు పువ్వాడవారు, కొడాలిబ్బయం, పూర్వం బందరులో నున్నప్పుడు పింగళి నాగేంద్రరావుగారు, దామరాజువారు, కీ॥ శే॥ గుడిసేవ సుబ్బయ్యగారు, కాళీనాథునివారు, పెనుమర్తివారు. వీరుగాక గ్రామాల నుండి బందరువచ్చే గొట్టిపాటివారు, గొరెపాటివారు, కొల్లిపరవారు, చిగురుపాటివారు, ఎర్నేని సాధుగారు, అయ్యంకివారు పగైరాలను కూడా దర్బారు సదస్య కోటిలో చేర్చవచ్చును.

ఇంకను ఈ దర్బారుకు ఆగంతుకంగాపచ్చి పోవుచుండెడి నటవిటగాయకాది బహువిధ ప్రజ్ఞాధురీణు లెందరో ఉండేవారు. వారిలో కొందరు తమ స్వీయకథా కలాపములు విన్నవించి పోవుచుండేవారు. మరచిపోయినాను. మా చిరంజీవి జల సూత్రం రుక్మిణీనాథుడు కూడా దర్బారు పరివారములోనివాడే- ఇతనితల్లి కడుపు వర్ధిల్ల, నవ్యాంధ్ర కవితాప్రపంచంలో శ్రీ రాయప్రోలు వారి గీతాంజలి మొదలు తుమ్మలవారు, దువ్వూరివారు, ఏటుకూరివారు, జాషివారు, కాటూరి వారు, పింగళివారు, కొడాలివారు, వేదులవారు, దేవులపల్లివారు, తల్లావఝుల వారు, పిలకాపారు, గరికిపాటివారు, అద్దేపల్లివారు, కవికొండలవారు, గురజాడ వారు, విశ్వనాథవారు, జాషువా, శ్రీ శ్రీ, ఆరుద్ర, దాశరథి, కాళోజీ, నారాయణ రెడ్డి, వారు వీరసనేల వేడవేడి పెసరట్టులవలె నవ్యభావకవితా ఖండములన్నీ ఎపరు రచించినవైనా సపరు రుక్మిణీనాథశాస్త్రి లాలా ప్రపంచంలో తడిసి మునిగి ఎంగిలి కానివి లభించుట మిక్కిలి అరుదు. ఎప్పటికప్పుడు ఇతను నవ్య తాజా కవితలన్నిటిని గురుదేవులకు తన సిజన్ను సిగరెట్ట కవిత్వంతోసహా ప్రతపరుస్తూ ఉండేవాడు.

ఆడంబరములపట్ల మానవుని ఆత్మాభిమానస్ఫూర్తికి, ఋజుపర్తనకు, సత్య నిరతికి, ధర్మసాధనకు ముఖ్య ప్రతిబంధకమని గురుదేవుని తరుమ వాక్కుల్ని సుండేవారు. అందుచేతనే శ్రీవారు రాజకీయ సాంఘిక మత విషయాలన్నిటి లోనూ సత్యదూరముగ ప్రవర్తిత మగుచుండు దాంబికాడంబర వాగాటోపముల నన్నిటిని సూచితముగ సుస్పష్టముగ విమర్శించి నిరసించి నిరుత్సాహ పరచు సుండేవారు. యాపనోత్సాహముచేత నేమి, వెనుక ముందు లాలోచింపలేని తాత్కాలికోద్రేకము చేతనేమి శ్రీవారి అనుయాయులు మనుకొనువారెపరైనా ఏమైనా నూతనారంభములకు ఉద్రిక్తులైనప్పుడు శ్రీవారు ఆట్టివారిని తరచుగా పూరెడు ముందుకునోయి దారెడు వెనుక్కు దిగజారకుండా వారి అనాలోచిత ఉద్రేకావేశములపై పుడిసెడు చన్నీళ్ళు చల్లి ఇంచుక శమింపజేస్తూ ఉండేవారు. ఏ సందర్భములోనైన సోడాగ్లాసు బుస్సుదోత్సాహులను నిరసించేవారు. ఏ

మహత్కార్యమునైనా నూరుమంది అసంస్కారులు ప్రారంభించి అపజయ మొందుటకంటె ఒక్క సుసంస్కారి ప్రారంభించి విజయమొందితే ఆ మహా త్కార్య ఫలసిద్ధికి ఆయువు పట్టని గురుదేవుల నమ్మకం. ఎన్నెన్నో మహా పద వుల కెగబ్రాకదలచిన యువకులెందరో ఆయన సమహా ప్రోత్సాహములకై ఆయన సన్నిధికీపచ్చి నిరుత్సాహపడి పోతూఉండేవారు, నేను, మా కోట సుబ్బారావు శ్రీవారికి నిత్య సన్నిధులుగ నుండేవారము. అందుచేత శ్రీవారికి నేను ఒకానొక సమయమున గురు భక్తి పురస్సరంగా బ్రహ్మశ్రీ ముట్నూరి కృష్ణరాయ నష్ట జాతక సిద్ధాంతిగారని బిరుదు ప్రదానము సమర్పించుకొంటూ, అట్టి శ్రీవారి శిష్య పరమాణువుగా నొకానొక నా దృక్ సిద్ధాంత పంచాంగ పీఠికలో ఉదా హరించు కొంటిని. ఈ నా గురు దక్షిణకు గురు దేవులు మందస్మిత వదనార విందముతో తమ ఆమోద ముద్రను దయచేసిరి. మా కృష్ణారావుగారు జీవించి యున్నంత కాలము పట్టాభిగారు కూడ పత్రికా ప్రతినిధులతో తన సందర్శన ప్రసంగములు పత్రికలలో తన రాక పోక ప్రకటనలు ప్రతి పబ్లిక్ విషయములో, ప్రతి ప్రముఖుల మరణ సందర్భములలోను, అయాచితముగ తనంతట తాను పరుగెత్తుకొనిపోయి తన అభిప్రాయములను పత్రికలలో ప్రకటించుకొనుట మున్నగు ఆర్భాటములను చేసికొనుటకు లోలోపల కృష్ణారావుగారు ఏమంటారో అని భయపడి వెనుకాడుచుండేవారు. స్వప్రాధాన్యంకోసం ప్రాకులాడు ఇటు వంటి ఈ కాలపు ధోరణులు కలవారి నందరిని కృష్ణారావుగారు 'X, the Self - Starter' అని వెటకరించు చుండేవారు. ఆధ్యాత్మిక ధర్మసాధన మాటటుంచి కొందరి విషయములో మాత్రం ఈ కాలపు పాశ్చాత్య మర్యాద ననుసరించి రాజకీయ ప్రాధాన్యమును పొందగోరు వారిట్టి అప్రాచ్య మర్యాదలను పాటించుట కూడా అవసరమే సనేవారు. ఆంధ్రదేశములోని ఏ జిల్లా వాసులైనమ రాజకీయ పరిజ్ఞాన గంధము ఏమాత్రము కలవారైనను లేక కవి గాయక పండిత కళారాధక శ్రేణిలో జేరిన వారెవరైనను ఏ పనిమీద బందరు వచ్చిన తటస్థించినను ఒకసారి మా దర్బారు షోషాగారి సందర్శనము కూడ వారికి అపూర్వ తీర్థ యాత్రా పుణ్యకార్యాచరణగా ఉండేది.

భోజరాజు సన్నిధికి నేతనేయు దేవంగి వెళ్ళినపుడు అతనికి 'కవయామి వయామి యామీ' అను కవిత్వ ధోరణి కలిగినట్లు, గురు పాదుల సేవా సాంగత్య నిరతిలో నున్న వారికి పత్రికా వ్యాస రచనా ధురంధరత్వము లభించుట అబ్బురం కాదు. ఆ కోవలోని వారే మా కోటి సుబ్బారావు, కమలా కర వెంకట్రావు, రావూరి సత్యనారాయణ, విశ్వనాథ వెంకటేశ్వర్లు మున్నగు వారు. నేడు ఆంధ్ర దేశములో తెలుగు భాషలో పత్రికా సంపాదకత్వమున పేరెన్నిక గన్న చిరంజీవి మా నారకూడా వీరలక్ష్య న్యాయంగా గురుదేవుల శిష్య పరంపర శ్రేణిలో చేరిన వాడనుట సత్య దూరము కాదు. నేను కృష్ణా పత్రికలో వ్రాసిన వ్రాతలన్నిటికి గురుదేవులు ప్రసాదించిన మంత్ర బీజాక్షరములే మూల కారణము. ప్రతి దినము కృష్ణా పత్రికా చర్చాలలో అంతర్జాతీయ సమస్యలు మొదలుకొని మునిసిపాలిటీ మురుగు కాల్వల దోమల బాధ వరకు విమర్శా పాత్రము లగుచుండేవి. అప్పుడప్పుడు తలపని తలంపుగ ప్రసంగావ సరములలో గురుదేవుల వాక్ కుహరము నుండి ఉపనిషత్ తత్త్వ రహస్యము లేమి, ప్రపంచములోని సర్వమత తారతమ్య సామరస్య సమన్వయము లేమి, సగుణ నిర్గుణ ఆస్తిక నాస్తికాది వాదోపవాదము లేమి, లోకములో స్థలకాల సంపర్క ప్రభేదములచే కలుగుచుండు సామాజిక నీతి మర్యాదాచారము లేమి, వివిధ రాజ్యాంగ పరిపాలనా సూత్ర రహస్యము లేమి, చారు లోహ శిలా శిల్పాది శిల్ప కళా గూఢార్థములేమి, అవి ఇవి యనకుండా అనర్గళంగా దొర్లి పోవు చుండేవి. ఇంత యేల? మా కృష్ణారావు గారు ఒక జంగమ విశ్వ విజ్ఞాన పదార్థము. ఈయన వద్దనున్న సరుకంతా మార్కెట్‌లో ఖరీదునకు వేదికపై కరతాళ ధ్వనులకు గ్రంథరూప విక్రయమునకు వినియోగ పడునది గాక, స్వంత ఉపయోగమునకు వినియోగ పడు పంట దొడ్డిలోని తోటకూర వంటిది. ఆయనొక అద్వైతానంద ధర్మ సాధనమౌన మూర్తి. వీరి కించుమించు సమ కాలికుడుగా బందరులో ఇంకొక మహా వ్యక్తి ఉండేవాడు. ఆయనొకా నొక వకీలు మహాశయుడు. ఆయన పేరు పూజ్యశ్రీ చిట్టూ సుందర రామయ్య పంతులు గారు. ఆయన హయాములో ముద్రితము లైన ఆంధ్రాంగ్ల గ్రంథము

లలో ఆయన చదివి నెమరు వేసుకుని జ్ఞాపకం పెట్టుకొనినవి ఒక్కటియూ లేదని చెప్పుకొనే వారు. ముట్నూరి వారికి కృష్ణా పత్రికా రచనా సందర్భములో నేమి, భోగరాజు వారికి జన్మభూమి పత్రికా నిర్వహణలో నేమి అవసరమైన విషయము లన్నిటికి ఈ సుందర రామయ్య గారు సజీన నిఘంటువుగ ఉపయోగ పడు చుండే వారు.

బిరుద ప్రదానాలు :- ఆ రోజుల్లో బ్రిటిష్ గవర్నమెంటు వారు ప్రముఖ లైన తమ భారత ప్రభుత్వోద్యోగులకును ఇతర విధములైన తమ ఆశ్రితులకును ప్రతి ఆంగ్ల సంవత్సరాది దినమునను చక్రవర్తి జన్మదినమగు ప్రతి జూన్ నెలారంభమునను నూతన బిరుద ప్రదానముల నొసంగి సత్కరించు చుండే వారు. అట్టి బిరుద ప్రదానములకై ప్రభుత్వాశ్రయమును కోరి బ్రిటిష్ రాజభక్త పరాయణులుగా నుండుట కెందరో దేశంలోని మహనీయులు ఎప్పటికప్పుడు తహ తహతో ఉవ్విళ్ళూరుతూ ఉండేవారు. అట్టి బిరుద ప్రదాన ఋతువులో ఒకా నొకనాడు గురుదేవులును నేనును ఇరువురము మాత్రమే దర్బారులో ఏకాం తముగ నున్నప్పుడు మన పత్రిక తరపున కూడా సుప్రసిద్ధులైన కొంద రాంధ్ర ప్రముఖులకు నూతన బిరుద ప్రదానములను ఈ సారి పత్రికలో మనము ఒక జాబితాను గమ్మత్తుగా ప్రచురించుదామని బహుశః నేనే కాబోలు ఒక సూచన నందించితిని. అంతట గురుదేవులు నా సూచనను చిరునవ్వుతో భేష్ అని మెచ్చు కొని కాగితం కలం పుచ్చుకొని నూతన బిరుదావళి జాబితాను వ్రాయ నారం భించిరి. ప్రథమంగా శ్రీ ప్రకాశం పంతులు గారికి ఆంధ్రసింహ అని బిరుదు నేను సూచించగా, శ్రీవారు సింహ శబ్దముకంటే కేసరి శబ్దము సముచితముగ నుండునని నా మాటను సవరించిరి. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని నామకరణ మిసిరి. ఆ శుభ ముహూర్తము నుండియే శ్రీ ప్రకాశం పంతులు గారికి ఆంధ్రకేసరి అన్వర్థ నామం అజన్మ ప్రవర్తితమై పోయినది. ఆ జాబితా లోనే ఈ క్రింది మరికొన్ని బిరుదావళులను మేమిరువురము కొంచెము తర్జన భర్జనల మీద తయారు చేసి ప్రచురించితిమి.

1. వేపా రామేశం పంతులు గారు :

'సంతానారణ్య కుఠారా'

2. వేమగిరపు రామదాసు పంతులుగారు:

'సహకార కల్పద్రుమ'

3. వల్లూరి సూర్యనారాయణగారు:

'జీర్ణదేవాలయోద్ధారక'

4. గిడుగు రామమూర్తి పంతులుగారు:

'అభినవాంధ్ర వాగనుశాసన'

5. భమిడిపాటి కామేశ్వరరావుగారు:

'పరిహాస పారిజాత'

6. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు:

'శోకరస గంగాధర'

7. కళా వెంకట్రావుగారు:

'త్రిపదార్థ తత్వవేది'

8. పట్టాభి సీతారామయ్యగారు:

'ప్రతివాది భయంకర'

9. గద్దె రంగయ్య నాయుడుగారు:

'సర్వసభారంజన్'

10. న్యాయపతి నారాయణమూర్తిగారు:

'అఖిలాంధ్ర కేతకి మసాకాధ్యక్ష'

11. మువ్వారి సుబ్బమ్మగారు:

'దేశ బాంధవి'

పగైరా పగైరా ఇంకేవేవో ఆ జాబితాలో కలవు.

మన మిద్దరము కూడా చెరి యొక బిరుదును తగిలింపసంచే ఈ పై బిరుదావళి రచయితలు మనము కాదని పాఠకులను మభ్య పెట్టవచ్చునని సూచిస్తూ గురుదేవులకు భక్తిపురస్సరంగా 'మౌన ముద్రాలంకార'- (ఆయన బహిరంగ సభా ప్రసంగముల కెన్నడును ఈయకొనక మౌననిష్ట స్వీకరించుటచే) బిరుదును గురు దక్షిణగా నేనే సమర్పించుకొంటిని. అందుకు శ్రీవారును వాత్సల్య ఆదర ములతో ఈ శిష్యునికి ప్రత్యూహ్నాయముగా నొసంగిన బిరుదు 'ఆంధ్ర భీమా డిండిమ.'

1. దుగ్గిరాల గోపాల కృష్ణయ్య గారికి
'ఆంధ్ర రత్న'

2. మోచర్ల రామచంద్రరావు పంతులు గారికి
'ఆంధ్ర గోఖలే'

3. న్యాపతి సుబ్బారావు పంతులు గారికి
'ఆంధ్ర భీష్మ'

4. కొండా వెంకటప్పయ్య పంతులుగారికి
'దేశ భక్త'

5. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారికి
'దేశోద్ధారక'

అను బిరుదులు అంతకు పూర్వమే ఎట్లాగో రూఢి కెక్కినవి.

కృష్ణారావుగారు బ్రహ్మవారం ఉదయం కృష్ణా పత్రికా వ్యాసరచనకు పూనుకొన్నప్పుడు భారత యుద్ధములో అర్జునుని సవ్యసాచిత్వముపలె తల యెత్తకుండా వెనుక ముందు లాలోచింప ననసరము లేకుండా విషయము, భావము, భాష ఒక దానితో నొకటి పోటాపోటీలుగా ముందు ముందుకు తోసు కొని నిరాటంకముగ సయాగరా జలపాతమువలె పేజీల తరువాత పేజీలు పుట

సంఖ్యలకు హద్దా వ్యవధి లేకుండా ఆ కలం వాయువేగంతో పరిగెత్తుకొని పోవలసిందే. దేశంలోని క్లిష్టమైన వివిధ రాజకీయ సమస్యల విమర్శా సమన్వయముల కొరకేమి, ఖండాంతరములలో జరుగుచుండిన మహా సంగ్రామములలోని యుద్ధ విన్యాసముల పూర్వాపర సందర్భముల కొరకేమి, స్వపర పక్ష జయాపజయ యుద్ధ వార్తా ప్రాచుర్యము కొరకేమి, అనితర సాధ్యమైన గాంధీ మహాత్ముని ధర్మ తత్వ సిద్ధాంతాచరణ సమర్థత కొరకేమి, పత్రికా పాఠక మహాశయులందరు ఏ తత్ పత్రికా దర్శనమునకై వేయి కనులతో శని ఆదివారములలో నిరీక్షిస్తూ ఉండేవారు. ఆయన కలము పత్రికా రచనకు పూనుకొన్నప్పుడు ఎంత ధాటిగా, నిరాఘాటంగా సాగిపోవునో సభా ప్రసంగమునకు ఆయన వాక్కు అంత మొగమాటంగా, పిరికితనంగా, వెనుకంజ వేస్తూ ఉండేది. ఇటీవల ఆయన మరణమునకు పూర్వం కొన్ని దశాబ్దముల తరబడి సభావేదికపై నిలచి ఏ విషయమును గూర్చి అయినను పట్టుమని ప్రసంగము చేసిన పాపమున బోలేదు. శ్రీవారు 'సత్యాయ మితభాషిణాం' అను న్యాయమును జీవిత నియమముగ స్వీకరించియుండురు. గురుదేవులు నన్ను అప్పుడప్పుడు కృష్ణాపత్రికకు ఏవో కొన్ని వ్యాసములు వ్రాయుటకు పురికొల్పుచుండేవారు. తత్ఫలముగా నేను వ్రాసినవన్నియు వ్యంగ్యాత్మకమగు వెటకార వ్యాసములే (Satires). 'మల్లు తానుల మహాసభ', 'అఖిలాంధ్ర బ్రహ్మచారుల మహాసభ', హక్కు విడుదల దస్తావేజు, పంచాంగ శ్రవణములు మున్నగునవి-ఈ వ్రాతలన్నిటికి పూర్వ దోహదమంతయు గురుపాదుల వారిదే - శ్రీవారు సభాప్రసంగములంటే ఎంత వెనుకాడుచుండిరో వ్యాసరచనకు నా కలం అంత వెనుతాడుచుండేది. సెకండు హాండు బొగ్గు బస్సును స్టార్ చేయుటకు వెనుకనుండి త్రోసినట్లు నా కలమును కూడా శ్రీవారు కొంతదూరము నెట్టగా సాగి గాడిలో పడిన తర్వాత బ్రేకు తొడి పోయిన బస్సువలె నడిచిపోయేది. అందుచే ఒకనాడు శ్రీవారితో నేనీ క్రింది రసోక్తిని సవినయంగా విన్నవించుకొంటిని: "పత్రికా రచనలో గురువుగారి కలమునకు, సభావేదికపై నిమ్మని నోటికి అతిసార (డయేరియా) వ్యాధి సహజమై పోయింది" అంటిని. వెంటనే శ్రీవారు "అయితే నా నోటికి మీ చేతికి 'కాన్‌స్టిపేషన్' కూడాను" అని చిరునవ్వుతో పలవిచ్చారు.

శ్రీ కోపల్లె వారు భూలోకమును, కౌతా వారు బందరు నివాసమును వదిలిన తరువాత మిగిలిన మేము ముప్పురము మాత్రమే చాలా కాలము బందరులో మూర్తి త్రయముగ చలామణీ అగుచుండే వారము. వారిరువురు మూల విరాట్టులుగాను నేను ఉత్సవ విగ్రహముగాను తూర్పు కృష్ణా జిల్లా యావత్తూ కాంగ్రెసు సందేశ ప్రచారార్థం సంచారం చేస్తూ ఉండేవారము. గ్రామాలలో గ్రంథాలయోత్సవాది పబ్లిక్ సభలేమి, ఇతర కాంగ్రెసు ప్రచార సభలేమి, జరిగినప్పుడు మేము ముప్పురము ఆ సభలలో ఏదో విధముగ కొంత ప్రధాన స్థానములను ఆక్రమించుకొనక తప్పేది కాదు. మామూలు సభా మర్యాద ప్రకారం గొప్పవో కొద్దివో పూలదండలు గాని కర్పూర దండలు గాని చెమ్కీ దండలు గాని ఖద్దరు చిలప దండలు గాని మాకును సభా వేదిక మీద గౌరవార్థం కంఠాలంకారములుగ వేయుచుండే వాడు. కృష్ణారావు గారు మౌనముతో నమ్రతగా లేచి వారి చేతులలోని దండలు తానే తీసికొని కన్నుల కద్దుకొని ఆ దండలు చేత పుచ్చుకుని తన కుర్చీలో కూర్చుండేవారు. ఇంక మా పట్టాభిగారు సదరు మాలలు తీసుకు వచ్చు వారు మా వేదికకు మూడు నాలుగు గజముల దూరములో నుండగానే అతనిపై లేడి పిల్లపై కురుకు సింగపు కొదమవలె చెంగున దూకి తన మెడలో వేయనీయకుండా అతనితో కలియబడి అతని చేతిలోని మాలను పెనగులాడి సగము నలిగిపోయిన మాలను తానే లాగి తీసుకొని తనముందు బల్లపై వేసుకొనే వారు. సభలో పూల మాలా లంకారము లతో గౌరవా డంబరములను పొంద గోరుట కిష్టము లేని తమ నిగర్వ వినయ నమ్రతలను ప్రదర్శించుటకై ఇంత రుస్సీ అట్టహాసములు చేస్తూ ఉండేవారు. వీరుభయులకు మధ్యగా నా కుర్చీ ఉండేది. పట్టాభిగారు చేసే హడావిడి ఎంతయు నాకు కొంచెము అతిగాను వెగటుగాను కనిపించి వారి నేమనుటకు సాహసము లేక నా వంతు పూల హారము వచ్చినప్పుడు నేను మాత్రం మిఠాయి ఉండలకు వాపిరిగా చేయి బాపు బాలునివలె దాణాబుట్టకు అర్రులు చాచే దూడవలె సదరు పూలమాలకు మొగము వాచి నిరీక్షిస్తూన్నట్లు నాకు వెయ్యండి నాకు వెయ్యండి అని బ్రతి మాలినట్లు నా మెడను ముందుకు చాచేవాడను. శ్రీ పట్టాభిగారు నా ఆ కొంచె

పనిని గమనించక పూల మాలలంటే మా సరసింహంగారికి చాలా ఇష్టం. ఆయనకు వేయండని తరుచుగా సిఫార్సు చేస్తూ ఉండేవారు. కృష్ణారావుగారు మాత్రం నా వెటకారమునకు తనలో తాను ముసిముసి నవ్వులు నవ్వుకొనేవాడు. ఆంధ్రదేశంలో సభాంగణమున ప్రముఖ స్థానము వహించిన వారి మెడలలో వేయు పూల మాలలను మరుసటి క్షణమే తీసి ముందు బల్లమీద పడవేసే వినయాచారమును ఆంధ్రదేశమున నెలకొల్పిన ప్రథమ శిష్టాచార ప్రవక్త శ్రీ పట్టాభిగారే. అప్పటినుండి ఈ ఆచారము సర్వే సర్వత్రా శిష్టాచారమైపోయినది. సభలో వేసిన పూలహారాదులను ఛెంగున వెంటనే తీసి బల్లమీద వేయుట తమ మోటారు రేడియేటర్లకు తగిలించుట సభా నిర్వాహకులను కించపరచుట అని గ్రహించలేని పెద్దలు మాత్రమే ఇట్టి అనుచితాచారమునకు పాల్పడెదరని ఒక సందర్భమున విక్రమదేవవర్మగారు శలవిచ్చినారు. అప్పటినుండి నేను సభాంగణమున వేసిన పూలమాలలను బుద్ధిపూర్వకముగ చాలసేపు మెడలో నుంచుకొను సదాచారమును సాగిస్తున్నాను.

ఓం శ్రీ గురుభ్యోనమః

[కృష్ణాపత్రిక–వజ్రోత్సవ సంచిక]

న్యూ సిలబస్

శ్రీ దేవరకొండ బాలగంగాధర తిలక్

1. అమెరికాలో డాలర్లు పండును
ఇండియాలో సంతానం పండును.

2. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ
ధనవంతుని చుట్టూ తిరుగుతోంది.

3. ఆశ ఉత్తర ధ్రువం, విధి దక్షిణ ధ్రువం
మనిషి రెండిటి మధ్యా బంతిలా ఎగిరిపడే ప్రహసనం.

4. వాణిజ్యం ఆజ్యం క్రింద నాగరికతా క్రతు గుండంలో
అనురాగం ఆత్మీయతా ప్రేల్చబడే సమిధలు
స్వార్థం సోమయాజి, లక్ష్యం అధికార రంభాపరిష్వంగం.

5. ఆడిస్ అబాబాలో హెయిలీ సెలాసీ గడ్డం పొడుగు
చైనాలో చౌ-ఎన్-లై- అంటే పెద్ద అబద్ధం మడుగు

6. ప్రజాస్వామ్య దేశాలలో ఖర కాంతలు వ్రీడావతులు
సామ్యవాద రాజ్యాలలో కౌశికులే కుల గురువులు

7. మజాకి పదవీ మోహం ముందు మద్యపానం వృథా వృథా
గజానికొక గాంధారి కొడుకు గాంధీగారి దేశంలో.

8. మాధుర్యం కావ్యంలో ఎందుకు? మత్కృతిపతి స్తోత్రంలో
ఉంటే చాలంటాడు తెలుగులో కవి.

మాలిన్యం మనసులో ఉన్నా
మల్లెపువ్వులా నవ్వగలగడం యీ నాటి తెలివి.

9. పల్లెటూరి పిల్లకి సినీతార దివాస్వప్నం
పట్నవాసం షోకిల్లాకి హాలీవుడ్ భూతల స్వర్గం.

10. చంద్ర గోళం చవిటి పర్రమీద వెతగ్గా వెతగ్గా
ప్రబంధ నాయికల ఉపాలంభనలు దొరికినవట
విశ్వనాధవారు వెనక్కి నడవగా నడవగా
వేదకాలం ఇంకా వెనక్కి వెనక్కి పోయిందట.

11. విలాస వతుల క్రీగంటి చూపునుండి
విద్యుచ్ఛక్తి సరఫరా చేస్తారు
విశాఖపట్టణంలోని ఆస్పత్రిని
వేదాంత భవనంగా మార్చేస్తారు.

12. సుందరాంగుల జాగ్రఫీలో
విద్యార్థులు నిమ్నోన్నతాలు గుర్తిస్తారు
సువర్ణకన్న అగ్రపర్ణంలేదని
సకల కులాల వారూ అంగీకరిస్తారు.

13. ఘనా ఘనంగా గర్జించింది ఆఫ్రికన్ ఘనా
పంచశీలలో టూడిపోయిన సీలపేరు చైనా.

14. అణుబాంబు యుగంలో
భూతల మొక స్వర్గం మనుష్యులు వినా
మను సంభవం ఇంక మార్చేసి
రాయాళి అలసాని పెద్దన్న అయినా.

15. భూమధ్య రేఖ కన్నా
ఆడదాని భ్రూమధ్య రేఖ దగ్గర వేడి ఎక్కువ
ఎన్నికలలో ఎగరేసిన వాగ్దానపు కత్తులకి
మొనకన్న పిడిదగ్గర వాడి ఎక్కువ.

16. మతం నల్లమందు
గతం ముదిమికి విందు
భవి యౌవనులకు
భావుకుల కల బలే పసందు.

['అమృతం కురిసిన రాత్రి'-మరియు

ఆనందవాణి-తిలక్ సంచిక.]

తుమ్మెదా ఒకసారి...

శ్రీ తురగా కృష్ణ మోహనరావు

"తుమ్మెదా ఒకసారి మోమెత్తి చూడమని చెప్పవే రాచిలుకతోడ" అంటూ పాడడం ప్రారంభించాడో గాయక శిఖామణి. తుమ్మడాన్ని గురించి ఎందుకు పాడవలసి వచ్చిందో నా కర్థం కాదు. బహుశః ఆయనకు తను బాగా తుమ్మగలనని గర్వం అయి ఉండవచ్చు. మనుష్యులకు అనేక రకాల గర్వా లుంటాయిట. పొడుగ్గా ఉన్నానని ఒకరికి గర్వం అయితే, పొట్టిగా ఉన్నానని మరొకరికి గర్వం. తను డబ్బు విషయంలో చాలా పొదుపుగా ఉంటానని ఒక రికి గర్వం అయితే, తను డబ్బు విచ్చల విడిగా ఖర్చు పెట్టగలనని వేరొకరికి గర్వం. తనకి ఆత్మగౌరవం ఎక్కువ అని ఒకాయనకి గర్వం అయితే, ఇత్యాదులు ఎన్నో ఎక్కువ నాకు అని ఇంకొకరికి గర్వం. అసలు తనకు గర్వమన్నదే లేదని మరొకరికి గర్వం.

పైన చెప్పానుగా - ఆయనకు తను బహుశః బాగా తుమ్మగలనని గర్వం ఏమోనని? అసలు నన్నడిగితే, బాగా తుమ్మగలనని గర్వం కలిగి ఉండ డంలో అర్థంలేదు. కాని మనుష్యు లనేక రకాలుగా ఉంటారు. వాళ్ళ కనేక రకాల గర్వాలు ఉంటాయి. మనమేమీ అనడానికి వీల్లేదు.

నాకు మటుక్కు నాకు తుమ్మడ మంటే అదో రకమైన భయం. తుమ్మే టప్పుడు మొహం అష్టవంకరలుగా తయారవుతుంది. స్వతహాగా నా మొహం కొంచెం తీరుగా ఉంటుందేమో-ఈ సంగతి మా ఆవిడ కూడా కాదనటానికి వీల్లేదు!— తుమ్మితే మరీ అసహ్యంగా తయారవుతుంది. ఆవిడగారు అప్పు డప్పుడు నన్ను ఏడిపిద్దామని ప్రయత్నం చేస్తూ వుంటుంది. ఈ మధ్యనే ఒక

సారి చల్లగా నా పక్కన చేరి అంది: ''ఏమండీ ! మీరు నిన్న తుమ్ముతూంటే చూశాను. ఎంతో బాగున్నారు. సరిగ్గా దిలీప్‌కుమారులా ఉన్నారు'' అని. నేనా మోసపోయేవాణ్ణి ? నాకు తెలియదూ దిలీప్‌కుమార్ తుమ్ముతూండగా ఆవిడ ఎప్పుడూ చూడలేదని ?

సరి సరి ! ఒక విషయంలోంచి యింకో విషయంలోకి పోయినట్టున్నాను. ఆ పాట పాడిన పెద్ద మనిషిని గురించి కాదూ చెప్తున్నాను ? ఆయనకు బాగా తుమ్మగలనని గర్వం ఉందనుకోండి. నిజంగా ఆయనకు గర్వమే ఉంటే, అవకాశం ఉన్నప్పుడల్లా తుమ్మడానికి ప్రయత్నించాలి. తుమ్ములు వస్తే అప్రయత్నంగానే తుమ్మాలి. తుమ్ములు రాకపోతే అధవా ముక్కు పొడుం పీల్చయినా తుమ్మాలి. ఉహూఁ ! ఆయన అల్లా చేయడట. తుమ్మితే ''ఒక సారి'' మాత్రమే తుమ్ముతాడట. ''తుమ్మెదా ఒకసారి'' మాత్రమే అంటూ మనల్ని జడిపిస్తున్నాడు - ఆయన తుమ్ము ఏదో పెద్ద విలువగలదయినట్టు; ఒక్కొక్కసారి ఒక్కొక్క చానికంటే మనకు ఎక్కువ ప్రసాదిస్తే మనం ఏదో ''వేస్టు'' చేసి పారేస్తామేమో అన్నట్టు.

ఇంతేకాదు. మోమెత్తి చూడమని అంటున్నాడు. ''ఎవరి మోము'' అన్నది ప్రశ్న. తుమ్మేటప్పుడు కర్త - అంటే తుమ్మే పెద్దమనిషి అన్న మాట - రైల్వేసిగ్నల్‌లాగ తలకాయ దింపి తుమ్మడు కదా ? తనకి యిష్ట మున్నా లేకపోయినా తుమ్మేటప్పుడు తలకాయెత్తి తుమ్మవలసిందే. ఇంకా ''మోమెత్తి'' అనడంలో అర్థమేమిటి ? బహుశా కర్త ఇంకో విధంగా ఉద్దేశించి ఉండవచ్చు. ''నేను తుమ్ముతాను, నువ్వు నీ మోమెత్తి చూడు'' అని అతని ఉద్దేశ్యం అయి ఉండవచ్చు. ఎందుకంటే - ''నేను తుమ్ముతాను : మోమెత్తి అంటే నా మోమెత్తి నువ్వు చూడు'' అనేకనక కర్త ఉద్దేశ్యం అయితే దానికి చాలా అభ్యంతరాలుంటాయి. ఉదాహరణకి ఒకటి రెండు చెపుతాను. తుమ్మడానికి ఎత్తిన మోమును ఇంకా యెత్తి చూడడం అసంభవం. ఇంకో విషయం ఏమటంటే, ఒక ప్రక్కన తుమ్ము తుఫానులా ముంచుకొస్తూంటే, ''సరిగమ

పదనిస" అని పాడుతూ తన మొమెత్తి చూడమని ఎదటి వాళ్ళను అడిగేవరకూ అవకాశం ఎక్కడుంది ?

పోనీ కర్త ఉద్దేశ్యం : "తుమ్మెదా ఒకసారి మోమెత్తి చూడమని చెప్పవే రాచిలుకతోడ" అనేమో అనుకుంటే, దానికి కూడా ఒకటి రెండు అభ్యంతరాలున్నాయి. ఎవరికి తుమ్ము వచ్చినా మోమెత్తే తుమ్ముతారు. నా సంగతి నేను చెప్పానుగా ? అందరూ అంతే. మా యింటి పక్కని వెంకయ్యగారి తమ్ముడు తుమ్మేడంటే మొహం 270 కోణంలో ఎత్తి మరీ తుమ్ముతాడు. మొహం ఎంత ఎత్తుతాడు అన్నది ప్రశ్నేకాని, ఎల్లరూ మొహంఎత్తి మరీ తుమ్ముతారన్నది పరమ సత్యం. మరి ఈ కర్త ప్రత్యేకంగా తనే "మోమెత్తి" తుమ్మేటట్లు చెప్పుకోటం దేనికి ?

ఈ పాటకు అసలు కారణమేమిటో నాకు తెలుసు. ఏమిటో ఒక నిమిషం ఆగి చెబుతా నుండండి.

అయితే యింతవరకు కర్తను గురించి-అంటే తుమ్మబోతూన్న ఆ "పెద్ద మనిషిని గురించి-" ప్రస్తావించాం. ఇక కర్మను గురించి కూడా ఆలోచిద్దాం: "తుమ్మెదా...చెప్పవే", ఎవరితోటి ? రాచిలుకతోటి ! మిమ్మల్ని అడుగుతున్నా నని ఏమనుకోకండి కాని, మీరెప్పుడయినా చిలకతో తుమ్మడాన్ని గురించి మాట్లాడేవాళ్ళని చూశారా? నేను చూడలేదు. కర్తకూడా చిలక నుద్దేశించి ఈ పలుకులు పలికేడని నేను అనుకోను. ఇందులో అంతరార్థమేదో ఉంది.

మా క్లాసులో ఒక అమ్మాయి ఉండేది. ఆమెకు తలిదండ్రులు ఏమి పేరు పెట్టారో తెలియదు. "భారత భాగ్యలక్ష్మి సత్యభీమేశ్వరీ వెంకటరత్నం" అని పేరెట్టుండవచ్చు. లేదా. అంతకంటే పెద్ద పేరే పెట్టుండవచ్చు. కాని మేమందరం ఆమెను ముద్దు ముద్దుగా "చిలకమ్మ" అని పిలిచేవాళ్ళం. "పిలిచేవాళ్ళం" అంటే - అదే - అర్థమయిందిగా ? అసలీ పేరు ఎవడు పుణ్యం కట్టుకున్నాడో తెలియదు. ముప్ఫయిమూడు కోట్ల దేవతలు 'క్యూ'లో నిల్చునుండగా ఆమెకు ఈ పేరెందుకు పెట్టవలసివచ్చిందో తెలియదు.

బహుశః ఆమె ముక్కు చిలకముక్కులా ఉంటుందనేమో! లేకపోతే ఆమెకు జామపళ్ళు యిష్టమనేమో? ఏది ఏమైనప్పటికీ, ఆమె ''చిలకమ్మ'' అంటూ కూర్చుంది.

ఇదంతా ఎందుకు చెబుతున్నానో తెలుసా? చిలకమ్మ అనే పేరు మీరు విన్నారు కాని "చిలకయ్య" అనే పేరు మీరు ఎప్పుడయినా విన్నారా? లేదు. అంటే, 'ఎ' వ్యక్తి ''చిలకా'' అని 'బి' అనే వ్యక్తిని పిలుస్తున్నాడను కోండి. (లేదా పిలుస్తోందనుకోండి), దాన్ని బట్టి మనకు ఏం తెలుస్తోందంటే – 'ఎ' మగవాడయినా ఆడదయినా కావచ్చుకాని 'బి' మాత్రం తప్పక ఆడదే! (మీకు రహస్యంగా చెబుతున్నాను మళ్ళీ కొంప తీసి మా ఆవిడ దగ్గర అనేరు! అప్పుడప్పుడు మా ఆవిడ చూర్వాసుడి పాత్ర ధరిస్తూ ఉంటుంది. మరీ చేతులు దాటిపోతుంటే 'చిలకా' అని సున్నితంగా వ్యవహరిస్తాను. ఆంతే! ఎక్కడి కోపం అక్కడ పటాపంచలయిపోతుంది)

అయితే మనకు స్పష్టమైన విషయం ఏమిటంటే, ''చిలక'' అంటే అది ఒక స్త్రీ యొక్క సర్వనామం అని. మరి - ''చిలక'' ఆడదయితే ''రాచిలక'' మాత్రం కాదాయేం?

కర్త పాడుతున్నాడు: ''నేను తుమ్ముతున్నాను. మోమెత్తి చూడు'" అని. చూడవలసింది ఎవరు? ఒక ''రాచిలుక'' - అంటే ఒక స్త్రీ. ఇంతకంటే అఘాయిత్యమేమైనా ఉందా? చెప్పానుగా? తుమ్మేటప్పుడు మొహం అష్టవంకర్లు గానూ తయారవుతుంది. కొంచెం అందంగానూ నాజూకుగానూ ఉన్న నా విషయమే అలా అయితే, కొంచెం అటూ ఇటూగా ఉన్నవాళ్ళ సంగతి ఏమిటో చెప్పండి. అంచేత ఆత్మగౌరవంగా ఉన్న ఏమగవాడయినా ఆడువారి ఎదుట తుమ్మడు. అదేవిధంగా ఆడవాళ్ళసంగతి కూడా.

ఈ పెద్దమనిషి ఈ విధంగా "తుమ్మితా చూడు!" అంటూ పాటలు పాడుతున్నాడా? మీకో విషయం చెప్పమంటారా? నేనింత కాలం నుంచీ నా

భార్యతో కాపురం చేస్తున్నాను. ఇంతవరకు మేమిద్దరం ఒక రెదురు గుండా ఒకరు తుమ్మలేదు. అంటే అర్థమఱుంది గాతూ ? ఒకసారి మాత్రం ఆపగింజం తలో ప్రమాదం తప్పిపోయింది. మా ఆవిత చాకలాడికి బట్టలు వేస్తూంది. నాకు హఠాత్తుగా తుమ్ము వచ్చింది. అక్కడ అలా ఎందుకు తుమ్ము వచ్చిందో నేనింత వరకూ చెప్పలేను. విధికృతం అనుకుంటాను. "ఏయ్ ! పిల్లాడేడుస్తున్నట్లున్నాడు. పోయి చూసిరా" అన్నాను. "లేదండీ ! ఉయ్యాల్లో పడుకుని నిద్ర పోతున్నాడు. ఏడుస్తున్నది పక్కింటి వాళ్ళబ్బాయి," అంది నిశ్చలంగా. నాకు తుమ్ము తుఫానులా వస్తోంది. "వంటింట్లోంచి మాడు వాసన వేస్తోంది. కూర పొయ్యి మీద పెట్టి మరిచి పోయి చక్కా వచ్చినట్లున్నావు చూడు" అన్నాను. "లేదండీ ! వంటంతా అయిపోయింది. కూర దింపే వచ్చాను" అంది అత్యంత ప్రశాంతంగా. ఆడవాళ్ల మాత్రమే అంత ప్రశాంతంగా జవాబు లియ్యగలరు ఒక ప్రక్కన కొంపలు ముంచు కొస్తూంటే, వెయ్యి పంజాబు మెఱుల్ను పరిగెత్తు కొని వచ్చినట్లుగా వస్తోంది నాకు తుమ్ము. అప్పుడేం చేసేది లేక ఎడం చేతి వైపు గుమ్మంలోంచి వెళ్ళి ఉయ్యాల్లో కుర్రాణ్ణి గట్టిగా గిల్లేసి, కుడి చేతి వైపు లోంచి తోపలికి చక్కా పచ్చాను. కుర్రాడు కేరుమన్నాడు. పద్దు పుస్తకం పారేసి "అమ్మో !" అంటూ పరుగెత్తించి నా యిల్లాలు. "ధాం !" అని తుమ్మేశాను నేను. భగవంతుణ్ణి తలచుకున్నాడు చాకలాడు.

ఇదంతా ఎందుకు చెప్పానంటే అత్మ గౌరవంగల ఏ మగాడూ ఆడదాని ఎదుట తుమ్మడానికి యిష్టపడడు. నా సంగతి విన్నారుగా ? ఆ కుర్రాడంటే నాకు అపరిమితమైన ప్రేమ. వాణ్ణి చేతులారా గిల్లుతుంటే నేను పడిన బాధ- మొహం, చేతులూ కూడా ఎర్రగా అయిపోయాయి - లోహితాస్యుడిని అమ్మే టప్పుడు డి. వి. సుబ్బారావు గారు కూడా చూపించి వుండరు. కడుపు తరుక్కు పోయింది. అయితేనేం ? ఆత్మ గౌరవం ప్రధానం. దాని ముందు ఈ తుచ్ఛ మనకారాలు తొలగిపోవలసిందే !

అంటే కర్తగారిలో ఆత్మ గౌరవం లోపించిందని నేను అనను. పాటను నేను బాగా చదివాను. మూల భావాన్ని నేను అర్థం చేసుకున్నానని అనుకుంటు

న్నాను. ఆ పాటలో ఒక ద్విగు సమాసం ఉంది. (ద్విగు సమాసమేనా అది?) అదే పాట కంతకీ ప్రధానమయినది. దానిని అర్థం చేసుకుంటే కర్త గారి మన స్తత్వం కూడా చక్కగా అర్థం అవుతుంది. ఆ సమాసం ఏదో చెప్పనుంటారా? వినండి అదే ''ఒకసారి.''

మీకు తుమ్మలో నమ్మకముందో లేదో తెలియదు. తుమ్మల్లో ప్రతి వాడికీ నమ్మక ముంటుంది లెండి. ఉన్నా, లేకపోయినా తుమ్మ పచ్చినప్పుడు తుమ్మి తీరవలసిందే! నేనడిగేది-ఏదయినా పని మొదలెట్టినప్పుడు ఎవరేనా తుమ్మితే పని పాడవుతుందని. ఫలానా వాడు తుమ్మితే పని నాశనమౌతుందని-ఇటువంటి నమ్మకాలు మీకేమైనా ఉన్నాయా? అని.

మా అన్నయ్యకు తుమ్మల్లో బాగా నమ్మకం. ఏదైనా పని చేస్తూన్న ప్పుడు గాని ఎవరైనా తుమ్మేరా! అంతే! శాపనార్థాలు పెట్టేవాడు. ఎదుట వాడు చిన్న వాడయితే పైకి; పెద్దవాడయితే లోలోపల. కాని నా ఖర్మం కాలి, నేను మా అన్నయ్య కంటే ఎప్పుడూ చిన్నవాడినే అయిపోయాను. ఒకప్పుడు అనుకుంటూంటాను. మిగిలిన వాటికోసం కాకపోయినా, అధమం తుమ్ముల కోసమయినా నేను మా అన్నయ్య కంటే పెద్దవాణ్ణయితే బాగుండునని.

నేను మీకు చెప్పానుగా-నేను మా అన్నయ్య కంటే చిన్నవాణ్ణని? ఫలిత మేమిటంటే, మా అన్నయ్యను కేంద్రంగా తీసుకుని అర్ధ మైలు వ్యాసార్ధంతో ఒక వృత్తాన్ని చుట్టి, వృత్తం మధ్యలో నేనెక్కడ ఎప్పుడు ఎలాంటి పరిస్థితు లలో తుమ్మినా మా అన్నయ్య పెట్టేవాడు శాపనార్థాలు, ఒకవేళ ఖర్మం కాలి మా అన్నయ్య తలపెట్టిన పని పెద్దదయినా, లేదా నేను తుమ్మిన తుమ్ము పెద్ద దయినా ఆ వేళకు తూర్పు బెంగాలు (బంగ్లాదేశ్) శరణార్థుల్లా ప్రక్కింట్లో తలదాచుకోవలసిందే!

ఒకరోజున మా తాతగారి ప్రక్కన కూర్చున్నాను. ఆయన పొడుంబాగా పీల్చేవాడు. కళ్ళు చిన్నప్పుడే పోయాయి. నిశ్శబ్దంగా వచ్చి తీసుకుంటే

పొడుం కాయ మన స్వాధీనం అయేది. ఒక పట్టు పొడుం తీసి ముక్కలోకి దట్టించాను. నాకేం తెలుసు? ఆ వేళ పొడుంలో మిరపకాయలపాలు ఎక్కువయింది కాబోలు. "ఢాం" అని తుమ్మేశాను. సరిగ్గా మా అన్నయ్య ఎడం కాలుమీద నిలబడి, కుడి కాలు తీసి బండిలో పెడుతున్నాడు. వెంటనే ఆ కాలుకూడా కింద పెట్టేసి, పెద్దపులిలా వచ్చాడు లోపలికి. "ఏరా! తుమ్మడానికి ఇదే సమయం దొరికిందీ? నేను ఆఫీసుకి పోతున్నాను గదా! తుమ్మొస్తే లోపలికి పోయి తుమ్ము లేవూ?" అన్నట్లు శబ్దాలు చేశాడు. ఇంకో నిముషం ఉంటే నాలుగు వేసేవాడే! ఈ లోపుగా నా చేతిలో ముక్కు పొడుం డబ్బి కనబడింది. ఒక్కసారి ధర్మరాజులా మొహం పెట్టి "పొడుం పీల్చావేమిటా?" అన్నాడు.

నా పరిస్థితి అయోమయంలో పడింది. ముందు చూచిన "అన్నయ్య"-వెనుక చూచిన "తాతయ్య." పీలవలేదంటే అన్నయ్య మీద పడతాడు. పీల్చానంటే తాతయ్య వెనక బడతాడు. "ఏమిరా భగవంతుడా!" అని ఆలోచిస్తూ ఉంటే మళ్ళీ ఇంకో తుమ్ము వచ్చింది. మా అన్నయ్య చిరునవ్వులు నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

మా అన్నయ్య చిరునవ్వులు విరజిమ్ముతూ పోడానికి కారణం ఉంది. తుమ్ము ఒకసారి తుమ్మితే ఎంత అపాయమైనా సరే, రెండోసారి తుమ్మే టప్పటికి అదంతా కొట్టుకుపోతుంది. అయితే ముక్కు పొడుం పీల్చిన తుమ్ములు (అందు అర్థం ముక్కు పొడుం పీలవగా వచ్చిన తుమ్ములు అన్నమాట!) లెక్కలోనికి రావు.

ఈ తుమ్ముల్లో నమ్మకం ఉండడం వల్ల, కొన్ని నష్టాలున్నా కొన్ని లాభాలు కూడా ఉన్నాయి. మా తెలుగు మాష్టారికి తుమ్ముల్లో బాగా నమ్మకం. ఆయన క్లాసులోకి వస్తే ఎక్కడ 'గ్రామరు' చెబుతాడో అని మా కంచరికీ భయమేసేది. అందుకని రోజు కొకడు చొప్పున పంతు వేసుకొని హెచ్ మాష్టారి గది ప్రక్కగా నుంచునే వాళ్ళం. అయన సరిగా క్లాసు కొడ్డామని

బయలుదేరేసరికి ముక్కు పొడుం చిట్టంగా పీల్చి తుమ్మేవాళ్ళం, ఆయన 'సల్లా' దగ్గర కెళ్ళి కాళ్ళు కడుక్కొచ్చే వాడు. పాఠం మొదలెట్టి, దేముణ్ణి తలుచుకొని "రంతుల్ మానుము కుక్కు టాధమ" అనేసరికి ఎవడో వెనక నుండి 'ఢాం' అనేవాడు. దాంతో అరగంట వరకు పాఠం ఉపక్రమించేవాడు కాదు మా మాస్టర్ సాబ్.

ఇంతకి మీకు చెప్పదలుచుకున్న దేమిటంటే, ఒకసారి తుమ్మడానికీ రెండుసార్లు తుమ్మడానికీ చాలా తేడా ఉందని. ఇది సామాన్యుల విషయంలో. కొందరు పెద్దలుంటారు. వాళ్ళు ఒకసారి తుమ్మినా ఒకటే, పదిసార్లు తుమ్మినా ఒకటే! మా వెంకయ్యగారి తమ్ముడు సంగతి చెప్పానుకుంటాను. మా ఊళ్ళో దుకాణాల వాళ్ళందరూ, ఏదైనా పెద్ద బేరం వచ్చినప్పుడు, ''వెంకయ్య తమ్ముడు లేడు కదా?'' అని అటూ ఇటూ చూసి మరీ వ్యవహారం జరుపుకుంటారు. అతడు తుమ్మడంలో ప్రపంచానికి ఎంత ప్రమాదం తెచ్చి పెడతాడో-తుమ్మే విధం వల్ల కూడా అంతే ప్రమాదం తెచ్చి పెడతాడు. అందే మీకు అర్థం కాలేదనుకుంటాను. మనం రెండు రకాలుగా తుమ్మే వాళ్ళను చూశాం (లేదా, విన్నాం) ఒక రకం వాళ్ళు 'వార్నింగ్' ఏమీ ఇవ్వకుండానే 'ఢాం' అని తుమ్ముతారు. వినగానే మనకు గుండె ఒకసారి ఆగిపోతుంది, కాని మళ్ళీ కొట్టుకోవడం ప్రారంభిస్తుంది. రెండో రకం వాళ్ళు రెండతస్తుల మేడ ఎక్కుతోన్నట్టు ''హచ్. హచ్చ్, హోచ్చ్...హచ్చ్'' అంటారు. కాని మా వెంకయ్య గారి తమ్ముడు ఇలాగా కాకుండా అలాగా కాకుండా, ''హచ్ హచ్చ్ హచ్చ్... ఢాం!'' అని తుమ్ముతాడు. అలవాటయిన వాళ్ళు తప్ప కొత్తవాళ్ళు వస్తే చాలా ప్రమాదకరమయిన విషయం.

వెంకయ్యగారి తమ్ముడు ఒకసారి తుమ్మినాసరే పదిసార్లు తుమ్మినాసరే ఒకటే ఫలితం అని చూసినవాళ్ళు (అంటే-అదే-విన్నవాళ్ళు) అందరూ చెప్పుతుంటారు. కాని సామాన్యుల విషయంలో 'ఒకసారి' తుమ్మడం చాలా హానికరమయినదని ఒప్పుకోక తప్పదు.

ఇందాక చెప్పిన గాయక శిఖామణి పాడాడు : "తుమ్మెదా ఒకసారి" అంటూ. ఒక విషయం ఆలోచించండి. తుమ్మడానికి ముందు ఎన్నిసార్లు తుమ్మ గలమో తెలుస్తుందా మనకు ? తెలియదు. తెలియడానికి అవకాశం లేదు. తుమ్ము (లేక, తుమ్ములు) రాబోతున్నది (రాబోతున్నాయి) అని మాత్రం ముందు తెలియవచ్చు. కాని ఒకసారా రెండుసార్లా అన్న విషయం ముందు తెలియదు. అయినప్పుడు ఈ పెద్దమనిషికి ఒకసారి తుమ్మబోతున్నట్టుగా ఎలా తెలుసు.?

దీనికంతకీ అర్థం ఒకటే ఉంది. ఆ 'రాచిలుక' ఎవరో నాకు తెలియదు కాని ఆ రాచిలుక అంటే ఈ కర్తకు యిష్టంలేదని మాత్రం నాకు తెలుసు. ఆమె అంటే ఇతనికి పడదు. ఆమె పని పాడుచెయ్యాలని నిశ్చయం చేసుకున్నాడు. అతనికి తుమ్ములొస్తే సమ్మకం ఉందా లేదా అన్నది సందేహాస్పదమైన విషయం. ఆమెకు సమ్మకం ఉందా లేదా అన్నది కూడా సందేహమే! సమ్మకం ఉంటే తుమ్ములయొక్క ఫలితం ప్రత్యక్షంగా కనిపిస్తుంది. లేకపోతే పరోక్షంగా కని పిస్తుంది. నాకు మటుక్కు పిచ్చి సమ్మకాలు వేటిల్లోను-తుమ్ములతో సహా-లేవు. అయినప్పటికీ వెంకయ్యగారి తమ్ముడు తుమ్మితే కాస్త కాళ్ళు కడుక్కొని మరీ చేస్తాను ఏ పనయినా.అందుచేత తుమ్ములొస్తే సమ్మకం లేకపోయినా మనం ఏదయినా పని ప్రారంభిసోన్నప్పుడు ఎవరైనా తుమ్మాలని మనం అనుకోం గదా! అదే విధంగా పాపం ఆ 'రాచిలుక' ఏదైనా శుభకార్యం ప్రారంభిస్తో న్నట్టుంది. అది పాడుచేద్దామనే ఉద్దేశ్యంతో ఈయన "తుమ్మెదా!" "తుమ్మెదా!" అంటూ పాడుతున్నాడు. నిజంగా తుమ్మినా తుమ్మకపోయినా ఈ బెదిరింపులకు ఆ 'రాచిలుక' మనస్తత్వంతో మార్పులు ఏర్పడి, పని పాడుచేస్తుందనడంలో సందేహం లేదు. అంచులోనూ ఒకసారి తుమ్మితానన్నడం.


ఇది సమంజసం అని ఎవరూ అనలేరు. భారత రాజ్యాంగం ప్రకారం అందరికీ ప్రాథమిక హక్కులున్నాయి. ఇంకొకరి హక్కులకు భంగం కలగ నంతకాలం లోచినది మాట్లాడవచ్చు; ప్రాయవచ్చు; ఏపనయినాచేయవచ్చు. అదే విధంగా యిష్టం వచ్చినన్నిసార్లు తుమ్మవచ్చు కూడా ! కాని ఈ తుమ్ములొల్ని

"యితరులకు నష్టం కలగాలనే ఉద్దేశ్యంతో, తన తుమ్ములవలన యితరులకు నష్టం కలగవచ్చునని తెలిసి కూడా ఉదాసీన భావంతో" ఉపయోగించడం రాజ్యాంగం సహించదు. ఎవరైనా ఉన్నత న్యాయస్థానానికి పోతే తప్పక నెగ్గుతారు.

. నేను కర్తను ప్రార్థిస్తున్నానూ : (ఆయన ఎవరో నాకు తెలియదు) నేను కర్తను ప్రార్థిస్తున్నాను. ఈ విధంగా దురుద్దేశ్యంతో-'ఒకసారి' తుమ్మడం తగదు! అసలు సాధ్యమయినంతవరకు తుమ్మనే తుమ్మవద్దు. కాని తప్పనిసరి అయితే అధమం రెండుసార్లయినా తుమ్మాలి! కర్తగారు నా మాటల్లోని సహృదయత్వాన్ని అంగీకరిస్తారని ఆశిస్తున్నాను.

అతి త్వరలోనే "తుమ్మెదా రెండుసార్లు....." అంటూ పాటను వినే అవకాశం కలుగుతుందని విశ్వసిస్తున్నాను.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక–ఆగస్టు 1955)



10h)

నదీ జలములు

శ్రీ అనంతం

విజయవాడ చేరితిమి. 'స్టేషను' దాటి యీవలకు వచ్చుసరికి రామమోహన గ్రంథాలయములో నదీజలవివాదముపై అఖిలపక్ష సభ జరుగుచున్నదని తెలుపు పెద్దక్షరముల తడిక ఎదురుగా ప్రత్యక్షమగుటచే 'రిక్షా' నెక్కి త్వరత్వరగా నచ్చటకు పోయితిమి.

వేదికపై ననేకోన్నతాసనము లున్నవి. ఉన్నతాసనములపై ననేకోన్నతానున్నత స్థూలాస్థూలకాయులుపవిష్టులై యున్నారు. ఒకరిద్దరు లలనామణులు కూడ వేదిక కలంకారము కల్పించియున్నారు. ఉపవిష్టుల నామధేయముల నిటనుటంకింప నవసరము కాని అవకాశము కాని లేదు. కాని ధవళ ధవళ వసనధారియు, వికుచ ఫలహరిత లలిత సుందర శరీర వర్ణుడును, కాచ యుగళాలంకృత కమనీయ నేత్రారవిందుడును, నీలచండ విభూషిత సవ్యేతరపాణియు, నత్తె మల్లెపువ్వువంటివాడును, అగునొక మహనీయుడు పూసలలో మేకువువలె; పక్షులలో హంసవలె, జాలలో సాల గ్రామమువలె నడుమ గూర్చుండి యున్నాడు. అతడధ్యక్షుడయి యుండునని కొంటిని. ఆయనకు కుడివైపున ఒక కంకర రంగు ముదుక ఖద్దరు లాల్పును, రేగుజుట్టు పొల్పును, కొంచెము చిఱుగడ్డపు మొల్పును కలయాతడుపన్యాసకుని ప్రశంసా పృష్టుల జూచుచు మిలమిల మెదలిపోవుచున్నాడు. అతని తీరులో నెవ్వరిని లక్ష్యపెట్టని సర్వతంత్ర స్వతంత్రత కొట్టవచ్చినట్లు పేటెత్తి పోవుచున్నది.

మేము సభలోనికి పోవునప్పటికే యొక యుపన్యాసకుడెవరో యలిపి పేయుచుండెను. ఆ యడావుడిలో అతడెవరని ప్రక్కవారి నడుగుటకే అవకాశము రాని, ఆస్థకాని లేకపోయెను. అనంతము రెండుమూడు మాటులు ప్రక్క

వాని సడుగుటకై కాఁబోలు తనతలఁ ప్రక్కవాని తలప్రక్కఁ చేర్పఁబోయెఁ. కాని వెనుక యూతఁడు "ఏమయ్యా, తలకాయ గడియారపు 'పెండ్యులము'వలె ఊరక కదుపుచున్నావు. మమ్ముపన్యాసకుని మొగము చూడనీయవా యేమి ?" అనుటతో, చుట్టుప్రక్కలవారు "హుష్ హుష్" కార పురస్కార వితరణ మొనరించుటతో విఫల ప్రయత్నుఁడై యూరకున్నాఁడు. అప్పటికుండియు ఉపన్యాస మించుమించుగా నిట్లు సాగినది :

"ఏమి, ఏమి, ఎంతటి మధుర వాక్కులు వినసయ్యెను ! ఏమి ధర్మోపదేశములు ! ఏమి రాజనీతి చతురతలు ! ఏమి విశాల భావములు! ఏమి జాతీయ సమైక్యములు ! ఏమి లోక సంగ్రహ కాంక్షలు ! ఏమి ప్రజాస్వామ్య ప్రశంసలు! ఏమి స్వార్థ త్యాగ ప్రదర్శనములు ! ఏమి ! ఏమి !

ఇంతవఱకు మాటాడిన ఆ పెద్దల ఉపన్యాసములను బట్టి ఏ కొన్ని యజగరములైన కదులునేమో, ఏ నాలుగు పొడపాములైన మెదలునేమో, ఏ రెండు దివ్వెలైన వెలుఁగునేమో, ఏ కొంచెము చీకటియైన తొలఁగునేమో, ఏ కొంచెము మెలకువయైన కలుగునేమో అని, వెట్టి పుల్లయ్యవలె, పల్లెటూరి బైతువలె, 'చావస్తపు' మొద్దువలె తలంచిన నాకు జ్ఞానోదయ మగునట్లు, బుద్ధివచ్చునట్లు, సిగ్గు వచ్చునట్లు, బ్రతుకుతెరువు తెలియునట్లు ఎంత చక్కనిమాట సెలవిచ్చినారు వీరు?

ఏమి, ఏమి ! సంకుచిత స్వభావము పనికిరాదా ? ఆంధ్రుల కట్టి ప్రథ-సంకుచిత స్వభావము గలవారను- ప్రథ-యున్నదా ? ఇప్పు డుదారముగా నుండనిచో అది సుస్థిరమైపోవునా ?

మనము భారతీయుల మని మాత్రమే అనుకొనవలయునుగాని ఆంధ్రులము, తీరాంధ్రులము, దూరాంధ్రులము, మధ్యాంధ్రులము, అనుకొనరాదా?

భారతదేశములో నే ప్రాజెక్టెచ్చట నున్నను అది భారతీయులందరిదియునా ?

మనవారు పై పదవులలో నున్నారు కనుక మనము తొందరపడపలసిన, బాధపడపలసిన, సభలు చేయవలసిన, తీర్మానములు చేయవలసిన, ఉపన్యసింప పలసిన, మోషింపపలసిన, కుయ్యో అరపలసిన, మొట్టో అనపలసిన అవసరము లేదా? అందర క్షేమమును వారే అరయుదురా?

ఆహా, ఆహా, ఎంత చక్కగా నున్నది? వ్యాస వాల్మీకులు వాక్రుప్ప పలసిన వాక్యములే, పైల, సుమంత, జైమిని, వైశంపాయనాదులు ప్రచారము చేయవలసిన భావములే!

ఏమి, ఏమి, ఆంధ్రులు సంకుచిత స్వభావులా? నిజమే? ఏమి యల్లనుట కాధారము? పై వారి యకృత్యములు సాగనీయని యందులకా? త్రాగుటకు నీరైన లేకుండ తీసికొని పోనీయని యందులకా? ఎల్లరకు ఆహారము సమకూర్చు మన్నందులకా? మంచి నీళ్ళ నుప్పు నీళ్ళలో పారబోయ నీయ మన్నందులకా? 'మసగొని రేగుబండ్లకయి మౌక్తికములు వెలవోయరా' దని మా గోపన్న యన్నాడంచులకా?

తనది యగు దానిని 'నీది కా' దని బలాత్కారముగా అన్న అయినంత మాత్రమున తీసికొని పోవుచుండగా, తమ్ముడు "నాది మొర్రో నాది నాకిమ్ము కుయ్యో" అనుట సంకుచిత స్వభావమా? ఔదార్య విహీనతయా? దేశ భక్తి లేమియా? జాతీయతకు విరుద్ధతయా?

నలుగురు పెద్దల యెదుట నలుగురును సమ్మతించి చేసికొనిన యుప్పు డం నీ కనుకూలముగ లేదని నాలుగేండ్లయిన పిదప నీకు తోచినంచులకు, నీ మాట వినువారు నలుగురు దొరికినంచులకు, గాలికి పోపలసినదేనా? ఇదే లోకమున కాదర్శమగుచో ఇట్టివారే పరిపాలకు లగుచో, ఇట్టి నిర్ణయములే చెల్ల బగిన ధర్మము లగుచో, ఇక ఏది శాశ్వతము? ఏది అశాశ్వతము? ఏది నమ్మ బగినది? ఏది నమ్మదగనిది? ఏది సత్యము? ఏది మిథ్య? ఆద్వైత సిద్ధి బయ నిముషములలో అయిపోవుచున్నదే! అటులే కాబగి యున్నచో ఇక మొదలో

పుస్తెలు నిలుచునా? గుడిలో దేముడు నిలుచునా? మడిలో పంటలు పండునా? తల్లి పిల్లలను పెంచవలయునా? పిల్లలు తల్లిని పోషింపవలయునా? ఉద్యోగులుద్యోగములు చేయవలయునా? ఉద్యోగులకు జీతము లీయవలయునా? ప్రాసిన ప్రాతకే, ప్రభుత్వముల నడుమ జరిగిన యెప్పుదలకే, ఒక దేశములోని ఒక సార్వభౌమాధికారము గల ఒక కేంద్ర ప్రభుత్వాజ్ఞ తల దాల్పవలసిన రాష్ట్ర ప్రభుత్వముల నడుమ జరిగిన యెప్పుదలకే గతిలేక పోయినచో నిక దేనికి? సోదరు లెల్లరు తల్లికి తిండి పెట్టవలసిన వారై నందులకు, తదితరు లందర అత్యాశాపూరిత సౌఖ్యమునకై ఒకడు తన భార్యను పస్తుండ బెట్టవలయునా? అదియే ధర్మమా? అదియే ఐకమత్యమా? అదియే జాతీయతా?

ఏమి విశాల భావములు! ఒక యూరాంధ్ర రాష్ట్రములోని దైనందులకు ఆ యూరివాడు తానా యూరి వాడనని భావించుటయు తప్పే! తన యూరి పొలములకు కాలువ నీరు కావలసినంత, రావలసినంత, రానీయ వలయు ననుటయు స్వార్థమే? పై యూళ్ళవారు బాగుపడుట తన కభిమతమై నందులకు తన యూరి పొలము లన్నియు బీడు పెట్టుకొన వలసినదే!

నిష్పక్ష పాతులై నిజము తేల్చవలసి లీడరులు ఒక ప్రక్క కొరగి పోయి నటుల వాన్పింపగా నోరు మూసికొని యూరకుండవలయునా? అన్యాయము జరుగనున్నదని అనరాదా?

మనవారు పై నున్నారని మనకే బాధయు లేదని మనము నిశ్చింతగా నుండవలయునా?

అయ్యో - అయ్యో - అంత అదృష్టమే? ఆంధ్రులు పైకి పోవ్రసపుడు ఆంధ్రుల సౌభాగ్య మడుగుగుతకు పోవుట తప్ప మరి ఇంకేమైన నున్నదా? లేము-లేము-ఎన్నడును లేదు. కొంత నాయకకు మందు వేయగా ఉన్న నాయకయు టీడి పోయినటుల' మ త్రిత్వమునకై మాలాడగా శాసన సభ్యత్వమే జారి పోయినటుల

ఆంధ్రుడు పైకి పోని దెన్నడు? పోయినపు డాంధ్రము-ఆంధ్ర-మడుగు నకు పోనిదెన్నడు?

ఆంధ్రుల చరిత్ర తెలియుట శాతవాహనులతో కదా ఆరంభ మగునది? ఏదీ శాతవాహను లాంధ్రులకై చేసిన వేమున్నవి? దిబ్బలున్నవి. అవి త్రవ్వగా వాని ప్రక్క నేర్పడిన గోతులున్నవి. ఒక ఆంధ్ర సాహిత్య పోషణమా? చట్టు బండలా? ఖచ్చితముగా చెప్పుకొనుటకు ఆంధ్ర శబ్ద వ్యవహారమైన లేదే! ఆంధ్రుల మనుకొన్నంతనే ఆ గొప్ప అంతర్ధాన మగు ననుకొనిరో యేమో! వా రాంధ్రుల మనుకొనిన నేమి? అనుకొనకున్ననేమి? వారైన పట్టిస సిరి నిల్పు కొన్నదేది?

ఆ తరువాత జెప్పుకొన దగినవాడు ప్రతాప రుద్రుడు గదా! నవలక్ష ధనుర్ధరుల కధినాథుడు గదా! ఆంధ్రులకు ఒరగబెట్టిన దేమున్నది? ఏమున్నది? ప్రమత్తత వలన సంప్రాప్త మయిన శిధిల శిల్ప సముచ్చయము. ఆపేడు మారులు దండెత్తి వచ్చిన వైరులు మఱి రాకని ప్రమత్తు డగుటకు హేతు వున్నదా? ఉన్నది ఉన్నది-అదే ఆంధ్రుల దురదృష్టము!

ఆ పిదప కొండవీటిలో కర్పూరము గప్పుమన్నదే అనుకొందము-అది మాత్ర మాగినదేది? సోదర కలహ జంఝామారుతముతో సమసిపోయినదే! హరించి పోయిందే! ఫలము? మహా కవులు గూడ నగరి వాకిలి నల్లగుండ్లు మోయవలసి వచ్చుటయే కదా!

పోనీ, అటు విజయనగరము వైపు చూతుము. అక్కడ ఏమి జరిగినది? రాయలు కన్నడుడా ఆంధ్రుడా అను తగవు లింకను కలవు కనుక ఆయనను పదలి వేయుదము. స్వచ్ఛాంధ్ర క్షత్రియుడే కదా రాను రాయలు! కృష్ణరాయల కన్న చాకచక్యము కలవాడై సురక్షాణ పంచకమును సురసుర లాడించి వారి వళిపోకయుంకో ప్రేలు పెట్టగలుగుట అతనికే కదా సాధ్యమైంది. అయిన

నేమి? అతడు చేసిన పొరపాటు వలన కదా మన పుట్టి తుంగభద్రలో మునిగి పోయినది!

ఇంకను ఒకమాట మన నోటితో మన మనుకొనరాదేమో! కాని, ఇంగ్లీషు వానికి మొట్ట మొదటిసారిగా హిందూ దేశమున కోట గట్టుకొన అనుమతించిన వాడు మన ప్రబుద్ధుడు శ్రీరంగ నాయకుడే కదా! అయ్యలారా! ఇక నెందులకు! కడుపు చించుకొనినచో పడునది కాళ్ళపైననే కదా!

అంత వెనుకటి చరిత్ర సంగతి వదలివేయుడు. ప్రస్తుతకాలమునకు వచ్చి వేయుడు. ఆధునిక భారతములోకూడ మన కంటిని పొడిచికొనినది మన చేతితోనే అనుట కుదాహరణములు కావలయునా ?

మహాజనులారా ! వినుడు. కోరాపుట్టి, గంజాం జిల్లాలు ఒరిస్సా రాష్ట్రములో కలిసిపోయి నపుడు అప్పటి మన మద్రాసు రాష్ట్రము నేలుచుండినది మన తెనుగు జస్టిసు మహారాజాలే కదా !

అదికూడ అట్టె యుంచుడు. మద్రాసు మనది కాదని సెలవిచ్చిన అగ్ర నాయకత్రయములో నప్పుడున్న రాష్ట్రపతి యెవరు ? ఎవరు ? జ్ఞప్తిలేదా ? స్మృతిరాదా ? మన పట్టాభిగదా ! అట్లు మనది కాకుండ పోరాదని గర్జించిన అంధ్రకేసరి రోజులు పీకివైచి గోచ్చుకత్తిరించి వేసిన వారాంధ్రులుకారా ? కారా?

ఇంతకును తేలిన దేమిటి? అంగడిలో నన్నియు నున్నవి; అల్లుని నోటిలో శని యున్నది. ఆంధ్రులకు అత్యుత్తమ నాయకత్వమబ్బినదో అంధ్రజాతి నష్టపడి పోవుచున్నది.

హుం ! నష్టపోదా ? నష్టపోవలదా ? నష్టపోక తప్పించు కొనగలదా ?

చేసుకొన్నవారికి చేసుకొన్నంత మహదేవా కాదా ? రాము పెద సాగరము కోసము అహోరాత్రములు శ్రమించి, విసిగి, తుదకు, ఆ సమస్యపై లోక్ సభకు అభ్యర్థిగా నిలచిన కొంతిని, మరల మాటాడ సంకగ మంచుకోనికైన

మిగలకుండగ "ఈ జన్మలో మళ్ల ఆంధ్ర దేశము బాగు పడపెలయునని యనుట మానుదువా మానవా" యని చిదుక గొట్టి, నూరి, సిగ్గుపడునట్లు జేసి, తలకాయ వంచుకొనునట్లు చేసి, మాకు ప్రాజెక్టు లక్కరలేదు. మా నీరు సముద్రము లోనికి బోయినను బాధలేదు. మేము పలసరాపో పస్తులుందుము. చిక్కుదుము - చిక్కుదుము - చిక్కి చిక్కి చచ్చెదము. అంతకును చావకున్నచో బంగాళాఖాతములో దుముకుదుము. మధ్య నీ వెవ్వడవు ? అన్నవారము మనము కామా ? చేసుకొనిన కర్మము అనుభనింపకతీరునా ? మనలో మనకెన్ని భేదములున్నను రాష్ట్ర యోగక్షేమముల విషయమున నుత్తర ప్రదేశీయులవలె, బెంగాలు బాబుల వలె - అంత దూర మెందులకు? - అరవ అన్నల వలె ఐక్యము, సఖ్యము, చూపికొన్నదేది ? అపుడే రామ పాద సాగర మారంభమైనచో ఇప్పుడిన్ని తిప్పలుండెడివా ? మనము మన పాపములకు ప్రాయశ్చిత్తము చేసికొన, ఇంత చరిత్ర గల మనము బాధ్యత పెద్దలపై నుంచి తీరకుండ దగునా ? కావున మన వారు పైనున్నారని మనము చేయవలసినది లేదని చేతులు ముడుచుకొనరాదు. ప్రమత్తులము కారాదు.

ఇప్పుడు కొందరు నాయకులు - ముఖ్యముగా ప్రభుత్వము లోని వారు - మన భాపములను వ్యక్తీకరించు చుండుట విశేషమే ; కాని ఇట్టిది ఇతఃపూర్వము వినీకని ఎరుగని ఆంధ్రైక్యమత్యముకుటచే ఇదియూ ఆంధ్రులకు రాగల ఏ యుత్పాతమునకు సూచకమో అని నాకు భయమునే గొలుపుచున్నది.

అయినను మనము కేవలము వారిపై ఆధారపడియుండరాదు. గోదావరి స్నానమునకు కొండు భట్టు నాజ్ఞ యవసరము లేదు. మనము ప్రజకిన ప్రతుపనుకు భగవద్గీత పారాయణమాయని సంబేహింపనక్కర్లేదు. అచ్చమ్మ తత్వమునకు రామనామము సరిపడబోదు. ఏకో కమీషను వచ్చినది; వీళ్లకి తన నివేదిక సమర్పింపపున్నది. సమర్పింప కేమి చేయుదు? కడుపుతో నున్నమ్మ తనకమానునా? పండుకొన్నమ్మ తినకమానునా' సమర్పించును. ఆ సమర్పించుట ఏమని అన్నది ప్రశ్నయే. ఎంతగా వారు చెప్పుకొని చేతోయినను తోపుడి

పొన్నూరునకు అప్పట్లు ప్రవర్తించినను, మనకు తెలియుచునే యున్నది. కనుక ఆ ధోరణిని మనమెట్లును మార్చలేము.

కాని మనము మన నోటి నిప్పుడు మసీదు తలుపువలె సదా పూసి యుంచరాదు. ఇది ప్రజా స్వామ్యము. అనగా నోరుగల వారిది రాజ్యము. అడుగనిచే అమ్మయును బెట్టదు; నోరున్నచో తంగాయును గదా! మంచి గలవానిదే బలము.

నాయనలారా ! నేనీ రీతిగా బహుశః ఆవేదనా తీవ్రముగా మాటలాడి నందుల కాగ్రహింపకుడు. ఆగ్రహించినను మంచిదేకాని ఆ యాగ్రహము కార్యసాధనపై జూపి ఆంధ్రులకు అన్యాయము జరుగకుండ చూడుడు. ఆవుల మళ్ళించినవాడే అర్జునుడు; క్రియాశూరులు కండు.

అప్పుడే నేను మగడు కొట్టిన కొట్టినాడు కాని ముక్కు పడిసెము పోయిన దని సంతసింతును, లెండు; చేతులు కాలిన వెనుక ఆకులు పట్టుకొని లాభము లేదు.''

అని ఆ యుపన్యాసకుడు చాలించెను. కరతాళములు మ్రోగినవి.

[ఆంధ్రప్రభ - దిన పత్రిక - 8-11-1961]

అమ్మ కడుపు చల్లగా అత్త కడుపు చల్లగా

—శ్రీమతి పురాణం సీత

ఎక్కడ సినీమాలు ఫ్రీయో

ఏ వీధిలో కాఫీ హోటళ్ళూ, కిల్లీ కొట్లూ తెల్లార్లూ తెరిచే ఉంటాయో

ఏ కొట్లో ప్రతి వస్తువూ అరువు దొరుకుతుందో

రెండు చేతులా అప్పు చేసినా మనుష్యులు ఎక్కడ నిర్భయంగా తలెత్తుకుని తిరగ గలుగుతారో

ఎక్కడ చదువుకోకుండా

తెలివి తక్కువ వాళ్ళకు పెద్ద పెద్ద ఉద్యోగాలు లభిస్తాయో

ఎక్కడ పంపు ఉండి కరెంటు ఖర్చులేకుండా అడ్వాన్స్‌లేకా అద్దె తక్కువకి దొరుకుతాయో ఇళ్ళు- ఆ టూకికి; భగవాన్

ఇప్పుడే ఈ క్షణమే

మూవార్ని ట్రాన్స్‌ఫర్ చెయ్యి:

(తరువాత-)

ఎక్కడ ఆచారాలూ

అత్తగార్ల సాధింపులూ

ఆడబిడ్డ గొణుగుళ్ళూ ఉండవో

ఎక్కడ మొగుడితో షికార్లకు లేచిపోయినా

ఆడముండలు బుగ్గలు నొక్కుకోరో

ఎక్కడ అంపంగా ఉండకూడని పనిమనిషి

అంట్లు గిన్నెలు అందంగా తోముతుందో

ఎక్కడ శుక్రవారంనాడు
శుభ్రంగా తలంటోసుకుని
మడి కట్టుకొని బుద్ధిగా మాలక్ష్మి పీటదగ్గర పూజ చేసు
కుంటూంటే మొగుడు పచ్చి ముద్దు పెట్టుకున్నా తప్పులేదో
తండ్రి ఆ స్వర్గానికి
నన్నూ మావార్నీ లేవదీసుకుని పో.
(బైదిబై)
కళ్ళకు కాటుక పెట్టుకొనీ
నుదుటన్ తిలకం దిద్దుకొనీ
గుండెకు పుస్తకాల్ హత్తుకొనీ...
కాలేజీ మెట్లమీద జీరాడే కుచ్చెళ్ళు
కుర్రవాళ్ళ గుండెలకు సరిగా
ఉంపపు కోత కాగా—
పొట్టి రవికలు తొడుగుకొని
పొట్ట కనిపించేలా పవిటేసుకుని
కళ్ళముందు సదయాడే కన్నెపిల్లలు
చిన్నారి చిలిపికళ్ళ జయలలితలూ
పొన్నారి పొడుగు కాళ్ళ వైజయంతీమాలలూ
ముద్దుల మూట కట్టే
కృష్ణకుమారి, సుకన్య, రాజశ్రీ
కాంచన, విజయలలితలూ
ముద్దులు మూటకట్టని గీతాంజలి
గిరిజ, చిన్నసైజు సూరేకాంతాలూ —
యువక హృదయాలను పిండి
ఎండవేసే జమునలూ—సావిత్రులూ
విశ్వంచర్నీ పోలిన ఈ పెళ్ళికూతుళ్ళని

స్వేచ్ఛగా కానీ కట్నం లేకుండా పెళ్ళికొడుకులు దొరికే చోటుకి
ఓ భగవంతుడా
లేవదీసుకపో !

నే వ్రాసిన ఈ పచన కవితను డస్కు బల్లమీద చూసి మా వారు నేలకేసి కొట్టి - ఫూలిష్, ట్రాష్, నాన్సెన్స్ అని గొణుక్కున్నారు. టాగూర్నో మరెవర్నో చూసి కాపీ కొట్టాన్ట.

చంద్రుడ్ని తిట్టి, సూర్యుడ్ని పొగిడి, నక్షత్రాలకు వాత్సింగు ఇచ్చారు.

వెన్నెలను చూషించి వర్షాన్ని మెచ్చుకున్నారు.
పప్పులో పచ్చిమిరపకాయలూ,
పచ్చడిలో టిల్లిపాయలూ కొరక నన్నారు.
అప్పడాల పిండి తినను
పచ్చి పడియాలు వేయించక్కర్లేదన్నారు.
కందిపచ్చడి కూడా చేయొద్దన్నారు.
పోనీ - తలంటోసుకోండి రండన్నాను.

ఎవరూ అచ్చువేయని సీరియల్ నవలలా ఉంది గదా - జుట్టు బాగా పెరిగిపోయింది. షాపు కెళ్ళి రండి - వేడ్నీళ్ళు కాచి, కుంకుడు కాయలు కొట్టి సిద్ధంగా ఉంచుతాను అన్నాను.

డావిట్! ఇడియట్! రాస్కెల్! అని తిట్టారు.

నాసక్ తెలియక బ్రహ్మాయెలు మీద కయ్యానికి కాలు దువ్వినట్లు, నా మీదకు దండెత్తి వస్తున్నారు. జాగ్రత్త! అన్నా.

ఇంట్లోంచి మెడపట్టుకు గెంటుతా నన్నారు. రుసరుసలతో విసవిసలతో పొగలు సెగలు గ్రక్కుతున్నారు.

తలంటోసుకుంటారా లేదా– మీ అమ్మగారు రైలెక్కుతూ మా వాడికి వారం వారం తలంటొయ్యి తల్లి బద్దకించక, అని మీ తల నా కప్పజెప్పారు. అది అప్పుడే ఓవర్ డ్యూ...అని అల్లిమేటం ఇచ్చాను.

తలంటంటే మా వారికి గొప్ప ఎలర్జీ–ప్రతి ఆదదీ తన మొగుడికి వారం వారం తనే తలంటాలి. అంటే వారానికోసారి తన తలను మన స్వాధీనంలోకి తెచ్చుకోవచ్చు అన్నమాట. ముందు నూనె బాగా రాసుకోమనాలి. అది ఇంకే దాకా దొడ్లో తువ్వాలు చుట్టుకుని తిరగమనాలి. ఈ కార్యక్రమం ఆదివారాల్లోనూ సెలవరోజుల్లోనూ ప్రారంభిస్తే మొగుడికి మొగుడు స్నేహితులకీ బుద్ధిచెప్పి నట్లవుతుంది. పేకాటకి తలంటు విరుగుడు.

తలంటుకి పిల్చి నూనె రాసుకొమ్మని పొయ్యిపగ్గర కూర్చుని వారపత్రిక చదువుకోవాలి. తంగొట్టి, చిన్న కంచుగ్లాసుడు పంచదార అప్పుకోసం వచ్చిన పిన్నిగారితో వాకిట్లో బాతాఖాని వేసినా తప్పులేదు. ఒకమాటు నూనె రాసుకున్న తరువాత పులుసు పోసి నీళ్ళు తోడిచ్చి వీపురుద్ది మళ్ళీ అపతారమూర్తిని ఇంట్లోకి తీసుకురావడానికి ఇల్లాలు ఎంత ప్రేమయినా తీసుకోవచ్చు. కళ్ళలో పులుసు పోసిన కోపం వీపు రుద్దేటప్పుడు గాజుల గలగలలకు పోతుంది. కళ్ళు మూసుకోండి అని నెత్తిమీద పులుసుగిన్నె పెట్టి షికారుకి వెళ్ళినా తప్పులేదు. 'తారా శశాంకం'లో తార చంద్రుడికి తలంటుతుంది.

అసలు మొగుడకి తలంటడం పెళ్ళాం జన్మహక్కు. ఇప్పుడు పియ్యూసీలు, బియ్యస్సీలు చదివిన అమ్మాయిలు మొగుళ్ళకు తలంటుతున్నారో లేదో నాకు తెలియదు కాని–అది చాల గమ్మత్తయిన సరదా. తలంటు ప్రారంభించాక మధ్యలో నీరసం రాకుండా కనీసం కాఫీయేనా ఇవ్వడం మన కనీస ధర్మం-సిగరెట్ కాల్చుకోనివ్వచ్చు.

ఆలా తలంటు సమయంలో ఏవేవో కబుర్లు చెప్పుకోవచ్చు. బజారుకి షాపింగ్ కెళ్ళడం సినిమాల లాంటివి ఫిక్సు చేయొచ్చు.

క్షణం వెనుక క్షణం అలా గడిచిపోతూనే ఉంటుంది. కాలం మనకోసం అడుగు వెనక్కు జరగదు కదా! కొంతమంది సెలవు రోజుల్లోనే చిరునవ్వులు నవ్వాలనుకుంటారు.

ప్రతి నిముషాన్ని ఉత్సాహంతో నిపి సరదాగా రోజుల్ని ఎందుకు గడిపేయకూడదు?

మూడు యాభైలు ఎవరూ బ్రతికేదిలేదు కదా-
అందుకే-
ఆనందం ఆర్ణవమైతే
అనురాగం అంబరమైతే
ఆనందపు లోతులు తీస్తాం
అనురాగపు టంచులు చూస్తాం.

రండి! ఇదిగో నూనె గిన్నె. అదుగో తువ్వాలు. ఆ తువ్వాలు చుట్టుకుని ఈ నూనె వంటికి రాసుకోండి. ఏదీ తలెత్తండి-నెత్తిమీద-

మీ అమ్మకడుపు చల్లగా
మీ అత్తకడుపు చల్లగా

[ఇల్లాలిముచ్చట్లు—ఆంధ్రజ్యోతి వారపత్రిక]

కీర్తి కండూతి 159

అచ్చు కండూతి

శ్రీ గో(పా)ల చక్రవర్తి

''ఈ రోజుల్లో యువతీ యువకులకు మూడే ఆశయాలు: సినిమాలలో నటించడం, రేడియో కార్యక్రమాలలో పాల్గొనడం, ఈ రెండూ కాకపోతే పేరు అచ్చులో పడేట్టు చూసుకోవడం–''

–ఇవే వాక్యాలు కావుగాని, ఈ అర్థంవచ్చే వాక్యాలు అన్నారు సుమారు పాతికేళ్ళ క్రితం, ఆరోజుల్లో పేరుపొందిన ఒక రచయిత్రి. (ఆధ్యాత్మిక గవేషణలో పడి రచనా వ్యాసంగానికి దూరమైపోయారు ఆమె. నేటి తరానికి బహుశా ఈ రచయిత్రి పేరు కూడా తెలియక పోవచ్చు.)

రెండున్నర దశాబ్దాల తర్వాత మూడో వ్యాధి, అంటే పేరు అచ్చులో పడేట్టు చూసుకొనే వ్యాధి- ఇంకా తీవ్రతరమైంది. ఆబాలగోపాలానికీ ఇవాళ ఒకటే ధ్యేయం. సొంతడబ్బా మోగించుకోవడం. పేరు అచ్చులో పడాలి! ఒకటే తహతహ! దీనికి అనే కానేక మార్గాలు.

ఆ ఊరిపేరు బూజుపాలెం అనుకుందాం. ఆ ఊళ్ళో రచకుల సదస్సు ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరుగుతాయి. ఇవాళ ఇదొక ఫ్యాషన్, కులాల వారీగా, మతాల వారీగా, ప్రాంతాల వారీగా రచకుల సంఘాలూ, సదస్సులూ.

బూజుపాలెం రచకుల సదస్సు ఈ నెలాఖరున జరుపబడుతుంది. తర తరాలుగా బూజుపాలెం వెనుకబడిన ప్రాంతంగా ఉండిపోయింది. ఇప్పుడు బూజు పాలెం ప్రజలు కదిలారు. వారిలో నవచైతన్యం తొణికిసలాడుతున్నది. బూజు

హాలీనికి సోషలిజం వచ్చేపరకూ వారు విశ్రమించరు. అందుకే ఈ సభస్సు, ఈ సదస్సులో కొమ్ములు తిరిగిన పండితులు, ఇప్పుడిప్పుడే తిరుగుతున్న ఉద్దండులు, తిరగబోతూన్న పండితమ్మన్యులు, ఇంకా ఇప్పుడిప్పుడే కొమ్ములు మొలుస్తూన్న మండితులు, రచయితలు, మాజీ రచయితలు, గుమాస్తా సంఘం ప్రతినిధులు, నిరుద్యోగులు- అంతా పాల్గొంటారు' అని ఒక ప్రకటన వెలువడుతుంది.

బయట నుంచి వచ్చేవారికి ఎటువంటి సమపాయాలు సమకూరుస్తారో తర్వాత ఇంకొక ప్రకటన వెలువడుతుంది. రెండు రోజుల కొకసారి సభస్సు గురించి ఏదో ఒక వార్త వెలువడుతూనే ఉంటుంది. "బూజుపాలెం రచయిత సదస్సుకు ప్రత్యేక మండపం నిర్మించబడుతున్నది. ఈ మండపం ప్రత్యేకత- ఎటుచూసినా సమృద్ధిగా బూజు కనిపిస్తూ ఉంటుంది" అని ఇంకో ప్రకటన.

సరే- సదస్సు జరిగే రోజు వస్తుంది. టిళ్ళో ఉన్న ఫొటోగ్రాఫరూ, బయట టూరివాళ్ళూ అంతా పోగవుతారు. ప్రయివేటు రంగంలో ఉన్నవారు ఫొటోగ్రాఫర్లు. పబ్లిక్ రంగంలో ఉన్నవారు ఫొటో ఆఫీసర్లట ! సదస్సు ప్రారంభకులు ఫలానా రాజా ఆఫ్ పిప్పిలినగర్‌తో కన్వీనర్- వంటశాలలో కన్వీనర్- నిద్రపోతూన్న డెలిగేట్లతో కన్వీనర్- అని ఫొటోలు తీయించి అన్ని పత్రికలకూ విడుదల చేస్తారు. కొన్ని పత్రికలవారు చప్పున ఈ ఫొటోలు ప్రచురించరు. అందుపల్ల తామే బ్లాకులు చేయించి సదరు పత్రికల వారికి సరఫరా చేస్తారు. ఆపైన ఫొటోలు పడడం పడకపోవడం వారివారి అదృష్టంమీద ఆధారపడి ఉంటుంది.

సభస్సు ఎలా జరుగుతుందో ఇప్పుడు వివరించను. సభస్సు ఐపోయాక అందరికీ ధన్యవాదాలు చెబుతూ ఓ ప్రకటన జారీ అవుతుంది.

ఇంకో పద్ధతి - ఇంకెవరైనా ఈ కార్యక్రమం తలపెడితే దాన్ని విమర్శిస్తూ పత్రికలో పడిపోవడం. "బూ. ర. సదస్సు ఒట్టి బూటకం. వీళ్ళ

భాషాలు మాంధాత కాలం నాటివి. ఈ సదస్సులో రచకులకంటే అరచకులే ఎక్కువ" అంటూ రంగంలోకి దిగడం.

మరికొందరు, దేశంలో పండు వృద్ధుల జాబితా ఎప్పుడూ దగ్గర ఉంచుకుంటారు. పండు వృద్ధులలో ఎవరిరయినా కాస్త జబ్బుచేస్తే వెంటనే ఒక ప్రకటన వచ్చేస్తుంది. ''ఫలానా పండు వృద్ధుడు దేశానికి ఎనలేని సేవ చేశారు. వీరు ఈ రుగ్మత నుండి కోలుకోవాలని మా ఆకాంక్ష. మా ప్రార్థన.''

ఈ లోపుగా కాలమూ, ధర్మమూ కలిసిరాక, లేదా కలిసివచ్చి, ఆయన గతించారను కోండి. వెంటనే మరొక ప్రకటన. "ఫలానా పండు వృద్ధుడూ మా నాన్నగారూ కలిసి కోతి కొమ్మచ్చి ఆడుకొనేవారు. ఏమి రోజులవి? అఖిల భారత కోతి కొమ్మచ్చి టోర్నమెంట్లలో ఎప్పుడూ ఆయన టీమే ఫస్టు వచ్చేది. అసలు ఆ ఆట ఆడుతుంటే వారిని చూసితీరాలి. అప్పట్లున ఆ మహానుభావుడు ఒక మనిషివలే, ఆటగాడుపలే కనిపించేవాడుకాదు. నూరు పైసలు మర్కటం లాగానే గెంతేవాడు. ఆయనలాగ మనం కాకపోతిమే అని ఎంతమంది ఎంతెంతగా కుమిలి కృశించిపోయేవారో. ఆ మాటకొస్తే ఆయన ఒక్క ఆటలోనేకాదు. నిజజీవితంలో కూడా మర్కట మహారాజులాగే ప్రవర్తించేవారు. వారికి జీవితమే ఒక కోతి కొమ్మచ్చి. ఆటుపంటి మహానుభావుడిక లేరు. ఆయన విడిచిపెట్టిన ఖాళీ?! ... (అదేదో ఆ భగవంతుడికే తెలియాలి!) ఆ ఖాళీ ఇంతలో త్వరగా భర్తీ కాదు.''

వెంటనే ఆ ప్రాంతంలో పని ముది కుర్రాళ్ళను పోగు చేయడం, సంతాప సభను పెట్టడం. ఒకవేళ జనం లేకపోతే సంతాప సభ పెట్టకపోయినా ఫరవాలేదు. న్యూస్ ఐటమ్ మాత్రం పత్రికలలో రావాలి.

సరే ఇంకో పద్ధతి మీకు తెలిసిందే–
రచయిత పోవడం!

11h)

కథలూ గట్రా పత్రికల్లో రాగానే బోల్డంత కీర్తి. రచయితలు ఏలా ఆవుతున్నారు అంటారా ?

మహానగరంలో రాయడం నేర్చుకోవడానికి కొత్తగా కార్ఖానాలు (Work Shops) పెడుతున్నారు. అక్కడ కొంచెం లంచాల పద్ధా, గుమాస్తాల పద్ధా పాఠాలు నేర్చుకోవచ్చు. పురో పడేళ్లలో మనకి ఇంకా ఎక్కువ మంది మహా కవులూ, ఆధునిక కవితా ప్రభువులూ, చక్రవర్తులూ, రచయితలూ వస్తారు. ఏ పొట్టలో ఏ పేగుముడి ఉందో ఎవరికెరుక !

[చివరి పోరీగ - ఆంధ్రజ్యోతి - 27-2-1972]

పతిదేవుడూ - పనిమనిషీ

శ్రీ పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

ఆమె సీత కానీండి సావిత్రి కానీండి - అరుంధతో అనసూయో ఎవరేనా కానీండి. వాణీ, రాణీ, వీణా, విద్యా అయినా ఫరవాలేదు. ఎవరైనా ఆమె ఒక మధ్యతరగతి మహిళామణి. పతితోడిదే లోకం ఆమెకి. ఆయనంటే అంతులేని గౌరవం, విపరీతమైన అనురాగమూను. ఇంతెందుకు ? ఆయన సాక్షాత్తూ తన పాలిట భగవంతుడు- ప్రత్యక్ష దైవం- ప్రణయమూర్తి-పతిదేవుడు.

అవునాండీ ! ఆలాంటి పతిదేవుడికి పేస్ట్ బ్రష్‌లు అందిస్తూ మేలు కొలుపులు పాడ్డం, శుచీ, రుచీ, వేడీ వెచ్చనా ఉన్న కాఫీని కావలసినన్ని పర్యాయాలు సరఫరా చెయ్యడం దగ్గర్నుంచి, సమస్త రాజోపచారాలూ సాగిస్తూ, హితవైన భోజనం ఇంపైన తాంబూలం అందించి, సకాలానికి ఆఫీసుకి సాగనంపే కార్యక్రమంలో కళ్ళతో వీధి మలుపు తిరిగేదాకా వీధి గేటుని పట్టుకుని ఆ మట్టునే నిలబడి పోవడం వరకూ ఎన్ని రకాల సేవలు చెయ్యాలి చెప్పండి ?

మరి ఈ సేవలన్నీ 'నేతి ప్రసార విశేషాల' తో ప్రారంభం అయి, 'ఉదయ ప్రసారం సమాప్తం' అయేలోగా ఒక్క చేతి మీదుగా జరగాలంటే మాటలా ? ఎన్ని చిల్లరపనులు అడ్డొస్తాయి ఈ సేవలకి ? అందువల్ల ఆ చిల్లర పనులు చేసిపెట్టి, తనకి పతి సేవ చేసుకునే అవకాశమిచ్చే, ఏ అసిస్టెంటో సర్వెంటో, సాధారణంగా దాసీ మనిషి రూపంలో పని మనిషి అనబడే ఒక పార్ట్‌టైము వర్కరో, విధిగా అవసరం మధ్య తరగతి మహిళామణికి.

అందువల్ల ప్రతి ఇల్లాలికి ఇంట్లో రెండు ముఖ్యమైన శాల్తీలు దలులు పడతాయన్న మాట. ఒకటి తను సేవలు చెయ్యవలసిన మగ దేవుడూ, రెండు

తనకి సాయం చేసిపెట్టే ఆడ పని మనిషి - వీళ్ళలో ఒకరు తనకి బాస్ - రెండో వాళ్ళు సబార్డినేట్. తనేమో వీళ్ళిద్దరి మధ్యా ప్రైవేట్ ఆఫీసరుగా పనిజేసే ఆఫీసు సూపరింటెండెంట్. పాఠక సౌలభ్యం కోసం ప్రస్తుతం మనము సూపరింటెండెంట్ ని సుబ్బాయమ్మ అని, బాస్ ని శ్రీనివాస్ అనీ, సబార్డినేట్ ని సింహాచలం అని వ్యవహరించుకుందాం - ఏం ?

రోజూ పాలవాడి సుప్రభాతం విని, హెచ్చరిక లాంటి పక్క మీంచి మేల్కొంటుంది సుబ్బాయమ్మ. ప్రక్కన పసివాడిలా నిద్రపోతున్న పతిదేవుడి పవిత్ర హస్తాన్ని తన నడుం మీంచి సుతారంగా తప్పించి నవ్వుకోడం కూడా మామూలే - తర్వాత రూల్ ప్రకారం నమస్కరించవలసింది పతి చరణాలకే కాని జీవితాన్ని మరీ తెలుగు సినిమా చెయ్యటం ఇష్టంలేకో ఏమో, చరణాల దాక స్థానికి పోదు. సాధారణంగా మెళ్ళో ఉన్న మంగళ సూత్రాల్ని కళ్ళ కద్దుకోవ డంతో సరిపెట్టుకుంటుంది.

మరి పాలోగా పాలవాడు ఊరుకుంటాడా ? "లెండి అమ్మగారూ పొద్దెక్కి పోతోంది" అంటూ వీధిలోంచి పెరటి దాకా వినిపించే లాగ కేక వెయ్యనే వేస్తాడు.

"ఏమిటా కేకలు ? అరవకు, అసలం అయ్యగారు నిద్రపోతున్నారు !" అంటూ ఈగ కొట్టినట్టు శబ్దం లేకుండా వాడిని మందలిస్తే మందలింపు గాక - "అమ్మగారూ - నిప్పు లెక్కడెట్టారు ?" అంటూ కయ్యిమని కెనెడియన్ ఇంజను లాగా కూసిన సింహాచలాన్ని ఏం చెయ్యగలదు సుబ్బాయమ్మ? ఊసకొడుతుందా? మందలిస్తుందా ? ఉహుం! అంతే సుబ్బాయమ్మ గారికి కేకలు ఇష్టం లేదని కూతలు ఇష్టమని అర్థమా ? అదేం కాదు - ఒక్కనాటికి రాదు.

దాని అర్థం ఏమిటంటే, పాల వాడికి పని మనిషికీ ఉన్న తేడాని ఆమె గ్రహించిందన్న మాట! పాలవాళ్ళు "ం" అంటే గోటి మందు. వీడు కాకపోతే మరోవాడు - దబ్బా పాలు కలపటం అంటూ పన్నాక, పాల వ్యాపారం లాభ

సాటిగా తయారయాక అందరూ పాలవాళ్ళే. అది వాడికీ తెలుసు - అందుపల్ల తిట్టినా పడతాడు - ఏమున్నా ఊరుకుంటాడు. ఊరుకోడూ ... ? పాలకేంద్రం ఉందనే ఉంది.

కాని, పని మనిషి అలా కాదే ? - లోకంలో పంచదారైనా దొరుకుతోంది కాని పని మనిషి దొరకడం లేదు. దొరకని పస్తుఫుని ఎంత ఒబ్బిడిగా వాడుకోవాలి? కబుర్లు చెప్పి కాఫీ ఇచ్చి మంచి చేసుకుని రోజులు నెట్టుకు రావాలి - 'గయ్' మంటూ లేస్తే ఎలా? ఒకటి అంటే పది అంటుంది- ఇంకా కోపం వస్తే "నా కిప్పుడు వంట్లో బాగోలే" దంటూ నుంచున్న పళాన వెళ్ళిపోతుంది. అప్పుడు ?...ఇంటెడు చాకిరీ ప్లస్ దాసీ పనీ మొత్తం మోపెడై తన తలకి. చుట్టుపుటుంది. నుదే చిరాకేస్తే పూర్తిగా పనిలోంచి మానేసినా మానెయ్యొచ్చు

అమ్మో !

అందుకే ముఖంలోకి సాధ్యమైనంత సౌమ్యతని తెచ్చుకుని మరీ మాట్లాడుతుంది సిమ్వాచలంతో. అందుకే చిరునవ్వు నవ్వడం "చీపురు పెరట్లో లేదా?" అని మెత్తగా అడగడమూను.

ఆమె మెత్తని ప్రశ్నకి సింవ్వాచలం దగ్గర్నుంచి ఎప్పుడూ కరుకు సమాధానమే వస్తుంది.

"ఉంటే ఎందు కడుగుతానండీ? ఎతికి ఇక్కడెయ్యండి. మళ్ళా వచ్చి వసపూడుస్తా" అంటూ దభీమని గేటు తీసుకుని పక్కింటి కెళ్ళిపోవడం కద్దు.

సుబ్బాయమ్మకి విజయా రాన్వేషణ తప్పదు. పెరడంతా వెదుకుతుంది. తిరుగుకింద చూస్తుంది. తలుపు వెనకాల తడుముతుంది. నీళ్ళ గదిలో గాలిస్తూండగా జ్ఞాపకం వస్తుంది స్టౌ మీద పాలు పెట్టివచ్చానన్న సంగతి. కానయితే సాధారణంగా పాలు మరుగుతాయి కాని పొంగవు, పాలవాడు మరచిపోయి

రెండు గ్లాసుల బదులు ఒక గ్లాసు నీళ్ళు పోస్తే తప్ప. ఏమో, ఖర్మ- ఏ రోజున ఆ పని జరుగుతుందో-

మెళకువ వచ్చీరాక, మత్తుగా బద్ధకంగా ఆ మట్టునే పడుకున్న శ్రీని వాస్‌కి వధూవైన కలలగ్గూ టుంది ఆ సమయంలో - చిత్రం ఏమిటంటే కల అని తెలిసిపోతూన్న కల-చిత్రమైన భలే కల. అందమైన అమ్మాయి - కవ్వించే నవ్వు - కసిగా తన చేతుల్లో నలిగి పోతూన్న కొద్ది మరీ కవ్విస్తూన్న నవ్వు - కదులుతూన్న చేతులూ - మత్తెక్కిస్తూన్న నవ్వూ...నవ్వూ- కళ్ళూ- చేతులూ-

"ఏవండీ ! పాలు పొంగుతాయేమో, కాస్త స్టౌ దగ్గర నిలబడండి." .. అది కేకా కాదు- అరుపూకాదు - రంకే కాదు..

కలల లోకంలోనే కాదు - మల్లోకాల్లోనూ ఎక్కడున్నా సరే- శ్రీనివాస్ చెవుల్లోకి ఖచ్చితంగా వచ్చి గింగురుమంటూ మారుమ్రోగి పోయే సుగ్రీవాజ్ఞ అది.

ఒక్క ఉదుటున మంచం మీంచి లేచిన శ్రీనివాస్ రెండో ఉదుటికి స్టౌ పక్కని నిలబడ్డాడు. క్షణం క్రితం మత్తెక్కిస్తూన్న అమ్మాయి దగ్గర-క్షణంలో మండిపోతూన్న స్టౌ ఎదురుగా.

"ఏం జీవితం పోనిద్దూ" అని విరక్తిగా నిట్టూర్చినా నిట్టూర్చవచ్చు. నిట్టూర్చిన తర్వాత "పాలు మరిగాయి, స్టౌ కట్టెయ్యనా ?" అంటూ ఊరికి ట్రంక్ కాల్ బుక్ చేసి, ఫోనులో మూతిపెట్టి అరిచినట్టు అరవడం తరువాయి జరుగుతుంది. అతని అరుపుకి పెరట్లోంచి సుబ్బాయమ్మ దగ్గర్నుంచి జవాబు "బాబ్బాబు. మీకు పుణ్యం ఉంటుంది. గ్లాసుడు నీళ్ళు స్టౌ మీద పెచ్చబెట్టి డికాక్షన్ తియ్యండి. వస్తున్నా" - అని - ఆ గొంతులో బస్ లోంచి కండక్టరు తోసేస్తూంటే 'ఒక్క సీటుంటే చూడు' అని కాళ్ళా వేళ్ళా పడే ప్రయాణీకుడి దైన్యం.

శ్రీనివాస్‌కి చిరాకు - తనక్కడ ఏం రాచ కార్యం వెలగ బెడుతున్నట్లు?

ఇంతలో మరో పురమాయింపు "అన్నట్లు గ్లాసుడు కాదు. మరో అర గ్లాసుడు ఎక్కువ తియ్యండి డికాక్షను. లేకపోతే తర్వాత మళ్ళీ సిమ్వాచలం కోసం ఇంకో మాటు స్టార్ట్ అంటించాలి''- అంటూ - ఈ మాటు గొంతులో బ్రతిమాలడం లేదు. ఒకరకమైన బెదిరించడం ఉంది.

ఆ తర్వాత పెరట్లోంచి సుబ్బాయమ్మ సిమ్వాచలాల మధ్య సంభాషణ వినిపిస్తుంది, పని మనిషితో సహా ముగ్గురి కోసం కాఫీ రెడీ చేస్తూన్న శ్రీనివాస్‌కి.

''ఇదిగో వీపురు. గబగబా కసువూడ్చేసి గుమ్మాలు కడిగెయ్! ఈ లోగా కాఫీపెట్టి ఇస్తాను. తర్వాత అంట్లు తోముదువుగాని'' - ఆ గొంతు పురమాయిస్తున్నట్లు ఉండదు. ''దయయుంచి ఈ విధముగా చేయగోర్తాను'' అని అర్జీ పెట్టుకుంటున్నట్లుంటుంది.

ఎంత అర్జీ పెట్టుకున్నా సిమ్వాచలానికి జాలీ దయా ఉండదు.

"నే నొచ్చేతలికి బాల్చీల్లో నీళ్ళు బారుగా వొంపేసి ఉంచుతారేంటి? నిన్న సాయంత్రం కొట్టెళ్ళిన నీళ్ళు తెల్లారే తలికి వొక్క సుక్క కూడా ఉండవేం?'' వంటి చిరాకేదోపడుతుంది.

నిజమే. ప్రొద్దుట పనిలోకి వచ్చేటప్పటికి బాల్చీలు పూర్తిగా ఖాళీగా ఉంటే సిమ్వాచలానికి నచ్చదు. భలే కోపం వస్తుంది. ఆ రోజల్లా రుసరుసలే- పలకరించడానికి వీల్లేదు. అగ్గిమీద గుగ్గిలంలా ఉంటుంది. అలాంటప్పుడు సుబ్బాయమ్మ ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని వణికిపోతుంది. ఆ రోజు స్టీలు మరచెంబుకి సొట్టలు పడొచ్చు. ఏ పింగాణీ కప్పో తనువు చాలించవచ్చు. నీళ్ళ పంపుకి ఉన్న వాషర్ పోవచ్చు. ఏ ప్రమాదమైనా జరగొచ్చు.

అలాంటి ప్రమాదం ఏం జరక్కుండా రోజూ లేస్తూనే సుబ్బాయమ్మ జాగ్రత్త పడుతుంది. సిమ్మాచలం రాకముందే బాల్చీల్లో నీళ్ళు ఉన్నాయో లేవో చూసుకుంటుంది. అవసరం అయితే శ్రీనివాస్‌ని లేపి మూడు బాల్చీలలోనూ మూడు సగాలకయినా నీళ్ళు కొట్టించి రెడీగా ఉంచుతుంది.

కాని ఒక్కొక్క రోజు మరిచిపోతుంది. అలాంటిరోజున కొంప ములుగుతుంది. తనో భర్తో ఆ సమయంలో ఒకటి రెండు బాల్చీల నీళ్ళు కొట్టి సిమ్మాచలం కోపాన్నీ చిరాకునీ తగ్గించవచ్చు. కాని అలా అది ఉండగానే మొహం చేస్తే మరీ దానికి భయపడిపోయినట్లు కనిపించేస్తుంది. అసి రాకుండానే ఆ పని పూర్తి చేస్తే అది వేరే మాట.

అలాంటి ఇబ్బంది ఏర్పడ్డ సమయంలో గమ్మత్తుగా "ఏమే ! ఇవ్వాళ పొద్దెక్కిపచ్చావు ? రాత్రి సినీమాకి గాని వెళ్ళావేమిటి ?ఇద్దరూ కలిసే వెళ్ళారా? అదే... అప్పన్నా నువ్వూ" అంటూ యోగక్షేమాలు అడుగుతుంది సుబ్బాయమ్మ.

నీళ్ళు కొడుతూ ఉన్న సిమ్మాచలం భగ్గుమంటూ లేస్తుంది. "రోజూ చినీమాలకి ఎల్లడానికి మాయేమైనా డబ్బున్నాళ్ళ మేమిటండి" అంటుంది.

సుబ్బాయమ్మకి ఏంతోచదు. సిమ్మాచలాన్ని ఎలా ప్రసన్నురాలిని చేసుకోవాలో అర్థం కాదు.

పని మనిషి ప్రాపకం కోసం భార్య ఆ పరసని ప్రాకులాడ్డం చూడలేక పోతే చూడలేకపోతాడు శ్రీనివాస్ - అలాంటి సమయంలో "ముచ్చట్లు చాలు గాని పేస్ట్, బ్రష్ తెచ్చిపెట్టు" అని అరిచినా అరుస్తాడు. అలా అరిస్తే మాత్రం సుబ్బాయమ్మకి తప్పకుండా కోపం వస్తుంది. "ఆక్కడే గూట్లో ఉన్నాయి తీసుకోండి" అంటుంది.

ముఖం చిట్లస్తూ ఓ చేత్తో బకెట్టూ మరో చేత్తో చీపురూ పుచ్చుకొని వీధి గుమ్మాలు - కడగడానికి వెళుతూ ఉన్న పని మనిషిని చూస్తే సుబ్బాయమ్మ గుండెల్లో రైళ్ళు పరిగెట్టడం తథ్యం. ఇంట్లగిన్నెలు పెరట్లో వేస్తున్నంతసేపూ పరిస్థితిని చక్కదిద్దడం ఎలాగా అని ఆలోచించి ఆలోచించి చివరకి ఒక ఉపాయం తోచి "సిమ్మాచలం! గుమ్మాలు కడిగేసి కళ్ళాపుజల్లి నువ్వు వచ్చేయి. ముగ్గు నేను పెడతాలే" అంటూ ఓ రాజీ ప్రతిపాదన చేస్తుంది.

బకెట్టతో నీళ్ళు లేనందుకు తనకు కోపం వచ్చిందనీ, ఆ కోపం పోగొట్టడానికే అమ్మగారు ఈ ముగ్గుపెట్టే రాజీమార్గం ప్రతిపాదించారనీ అర్థం కాదూ సిమ్మాచలానికి? అందుకే అవకాశం ఇవ్వదు, కాస్తకూడా చోటెట్టదు. "ఇన్ని సెబ్బుగాలేంది, ముగ్గెట్టడం కట్టం ఏటండి?" అంటుంది. సుబ్బాయమ్మ మాత్రం ఆంత చప్పున వదుల్తుందా? "అదికాదే ఈలోగా నువ్వు మొహం కడుక్కుంటే కాఫీ ఇద్దామని" అంటూ ఏవేవో సమ్మకం పుట్టించే మాటలు మాట్లాడాలి కదా-తనని ఏమార్చడానికి అంటున్న మాటల్లోకాదని నిజంగానే ముగ్గు పెట్టడానికి సుబ్బాయమ్మగారు ముచ్చట పడుతోందనీ సమ్మకం కుదిరాక అప్పుడు ఫట్టుదల సడలించి "అయితే సరే - తొసింత పొడరుసేతిలో ఎయ్యండి మరి" అనవచ్చు సిమ్మాచలం. "పొడరు కంటే పేస్ట్ పోలికి రాస్తేసరి - ఖరీదైన పేస్ట్ అయితే సిమ్మాచలం ముఖం వికసిస్తుంది" అని ఆలోచిస్తూన్న సుబ్బాయమ్మకి పంటిం ట్లోంచి ఖర్ గొంతు వినిపించడం చికాకే మరి!

"నేను కాఫీ తాగేస్తున్నా, మిగిలింది గిన్నెలో పోసి మూతెట్టనా?"

ఏవిటా బాధ్యతలేని వ్యాపారం?

గిన్నెతో ఉంటే చల్లారిపోదూ? అసలే సిమ్మాచలానికి కాఫీ బాగా వేడిగా ఉండాలి. గిన్నెలో పొయ్యటం ఏవిటి? ఫాస్కులో పొయ్యకూడదూ?

సుబ్బాయమ్మ పెడుతూన్న ముగ్గులు చూస్తూ అటూ ఇటూ పచార్లుచేస్తూ మధ్య మధ్య మెచ్చుకుంటూ పళ్ళు తోముకుంటూన్న సిమ్మాచలాన్ని చూస్తే

సుబ్బాయమ్మకి ముచ్చటవేయదూ ? హమ్మయ్య - కోపం రుసరుసలూ పోయి సిమ్హాచలం సరదాగా ఉంటే, బెంగ తగ్గి, గుండెలమీంచి బరువేదో తగ్గినట్లు ఎంత హాయిగా ఉంటుంది.

తర్వాత ఇద్దరూ ఇంచక్కా కబుర్లు చెప్పుకుంటూ ముఖాలూ కడుక్కుంటారు; నవ్వుకుంటూ కాఫీలూ తాగుతారు. అంట్లగిన్నెలు తోముతూన్న సిమ్హాచలానికి సాయం చేస్తుంది సుబ్బాయమ్మ.

ఇత్తడి గిన్నెలకి చింతపండు పట్టిగెళ్ళి ఇస్తుంది - బిడ్డు పోపడానికి మెత్తని రంపపు పొట్టు, స్టీళ్ళ సామాన్లకని గీతలు పడని తెల్లని పొడుం - ఇలా ఎన్నో...ఎన్నో...

ఇద్దరూ ఎంతో సహోధ్యగా కష్టం సుఖం చెప్పుకుంటూ చెరోపనీ చేసుకుంటూంటే, అట్టం తెమ్మనో, గెడ్డం గీసుకోవాలనో పేణ్ణిట్ట్ పెట్టమనో మధ్య మధ్య అరిచి, ఊరుకుంటూ ఉంటాడు శ్రీనివాస్ - లేకపోతే ఎలా ? ఊరుకోవాలి - ఇక్కడ భార్య ఊరికే కూర్చుందా ? ...

సిమ్హాచలం కడిగి ఇచ్చిన గిన్నెలు తొలుచుకోవడం, ఉతికి ఇచ్చిన బట్టల్ని ఆరేసుకోవడం, కొబ్బరినూనె చుక్క చేతిలో పెయ్యమంటే వేరే కొబ్బరినూనె లేకపోవడంవల్ల సెంటెడ్ హెయిర్‌ఆయిల్ సిమ్హాచలం చేతిలో పెయ్యడం, ఉడకేసుకోవడానికి లేపంటే సోలెడు బియ్యం కొంగులో పొయ్యడం, తలరుద్దుకోవడానికి కుంకుడు కాయలు పొట్లం కట్టి ఇవ్వడం, క్షణం తీరిక ఉంటుందా ?

మూడిన గిన్నె సిమ్హాచలం తోముడు.

ఇసుకా పీచూ వేసి జబ్బలు పడిపోయేలాగ సుబ్బాయమ్మే తోముకోవాలి!

సుబ్బాయమ్మకి లక్షపసులు-

ఆ పసుల్లో శ్రీనివాస్‌కి అన్నం పెక్కడ పెడ గలదు ?

అందుకే ప్రొద్దుటి పూట అతను అన్నం తినడు ఇంట్లో.

జేబులో రెండు రూపాయలు వేసుకునివెళ్ళి బజార్లో ఏ టిఫినో తినేస్తాడు.

నెలాఖరు రోజుల్లో ఒక్కొక్కప్పుడు ఆ రెండూ ఉండవు జేబులో అతనికి—

ఉన్నాయనుకుని బయలుదేరుతున్నప్పుడు చెబుతుంది సుబ్బాయమ్మ "మీ జేబులో డబ్బు తీశాను - సిమ్మాచలానికి రెండు రూపాయలు కావాలంటే ఇచ్చాను."

శ్రీనివాస్ నిట్టూర్చి ఊరుకుంటాడు.

అంతకంటే ఏంచేయగలడు ?

అతనో దేవుడు - ఏం మాట్లాడడు -

అతనొక్కడే అన్నమాటేవిటి ? ఏ ఇంటి యజమాని అయినా అంతే - ఎవరయినా అలా మాట్లాడకుండా నోరు మూసుకుని దేవుడిలా భరించి ఊరుకోవలసిందే !

అసలు పతిదేవుళ్ళే అంత !

పాపం, పగలంతా ఎక్కడ ఊరేగినా సాయంత్రానికి దేవాలయానికి చేరుకుంటారు పతిదేవుళ్ళు !

కాని, పని పుట్టుకల్లో అలాకాదే ?

అలిగి వెళ్ళారంటే తిరిగి ఈ యింటి మొహం చూడరు. అందుకే వారిని జాగ్రత్తగా చూసుకుంటారు- సుబ్బాయమ్మలూ, సావిత్రులూ, అనసూయలూ, అరుంధతులూ, వాణీ, రాణీ, వీణా, విద్యా మొదలగు సాధ్వీమ తల్లులంతా, మనస్సులో పతిదేవుళ్ళకో నమస్కారం పడేసి-

[విజయ - జనవరి 1977]

ఓటు దండకము

—గోల్కొండ పత్రిక సంపాదకులు

క॥ నీవే తల్లివి దండ్రివి
నీవే నా తోడునీడ; నిజముగ సఖుఁడా
నీవే గురుడవు దైవము
నీవే నా గతివి పతివి నిజముగ ఓటర్!

శా॥ లావొక్కింతయు లేదు; ధైర్యము విలోలంబయ్యె బ్రాణంబులున్
ఠావుల్దప్పెను మూర్ఛవచ్చె; తనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్
ఓటే తప్ప యితః పరం బెరుగ మన్నింపన్ దగున్ దీనునిన్
రావే ఓటర కావవే వరద సంరక్షించు భద్రాత్మకా-

దండకము

మహా భాగ్యనగరాన మా పూర్వపుణ్యాన మే మెన్నియో యేండ్లు మూడంగ చూడంగ మా బాల్యమున్ యౌవనత్వంబు మా ప్రాయముల్ మనో దార్ఢ్యముల్ క్రుంగుచున్‌పోయి వృద్ధాప్యమున్ పొంది వెంట్రుకల్ తెల్లనై ముప్ప యారేండ్లు అటు గడ్చి ఇటు గడ్చి ఈనాటికిన్వచ్చె యీ కొత్త ఖానూను[1] మా గోర్కె లీడేర మా జన్మముల్ ధన్యతన్ బొందె నో బల్దియా[2] శాసనంబో ఇదే నీకు వేవేల దణ్ణాలు దైకొమ్ము తల్లీ వినో ఓటరా-

మూడేండ్ల (ఐదేండ్ల) కోసారి నీ పాదపద్మంబులం గొల్చి నిన్ను నే తల పెదన్ నిన్ను నే పిలిపెదన్ నీ కటాక్షంబునన్ కాదవే దాతవై బ్రోవవే దగ్గి

1. చట్టము
2. కార్పొరేషన్

దన్ ఓల్గాదే సొమ్ము నిన్నెంచ నే నెంతవాడన్ దయా దృష్టి వీక్షింపవే నా ఓటు నాకిచ్చు మున్సిపాలిటీలన్ సభాయీకమేటీ[1]కి మెంబర్నుగా జేసినన్ జాలు నా వంశమున్ దేశమున్ ధన్యతం బొందు ఆ మీద నా పూర్వపుణ్యంబు నా దాన ధర్మంబు నా భావి భాగ్యంబు నా తంత్ర నాదంబు సత్యంబుగా నున్నచో ఆ నిప్పునంబట్టి ఎంతైన పై పైకి పెగ్రాకగా వచ్చు ఎన్ని హాద్ హోదాలైనన్ భుజింపంగ ఆడంకముల్లేవు రాజ మాన్యంబుగా వచ్చు పేసాదల్ భయంబంద ఓటు పెర్గ ఓటు తగ్గ నెంతెంత పేదైన నే పొందగావచ్చు కొద్ది యుద్యోగులన్ శక్తి యున్నంత పద్దించగా వచ్చు పీయగా నున్నచో కొద్ది మేల్జేసి షాబాసు షాబాసు అనిపించుకోవచ్చు ఏదైన లాభాలు సాధించుకోవచ్చు కాబట్టి యెట్లైన నీ ఓటుతో గూడ బంధుమిత్రాది వర్గంబు ఓట్లన్ని నాకు నిప్పింపుమా నన్ను రక్షింపుమా లేమి పోగొట్టుమా దీనునన్ బ్రోవగా దిక్కు నీవే గదా నీవేకులంబందు జన్మంబుగానీ నీ స్పర్శ నీ రూపు నీ తీరు మొదలైన నీదే సమస్తంబు అస్పృశ్యమౌ గాని సాక్షాత్ పరబ్రహ్మ రూపంబుగా నుండు నీ ఓటు మాత్రంబె నిత్య. సంపూతమై నెగడు లోకంబులన్ సంసారమున్ బాసి సౌఖ్యంబులన్ రోసి నిద్రాహారంబులన్ నీతి నియమంబులన్ నిత్యకృత్యంబులన్ మాని సర్వంబు వర్జించి యోగీశ్వరుంబోలి నీ దీక్షతో నుండి నీ ఓటు వాంఛించెదన్ నిన్ను యాచించెదన్ ఓటే సమస్తంబు ఓటే ప్రశస్తంబు ఓటే మహాముక్తి ఓటే పరబ్రహ్మ తద్ధారివైనట్టి ఓటర్ మహాదేవ. నమస్తే! నమస్తే! నమః

[నోటు:- కృష్ణా పత్రిక యొక్క ప్రాత సంచికనుండి కొద్ది మార్పులతో గైకొనబడినది- గోలకొండ పత్రిక సంపాదకుడు]

[గోలకొండ పత్రిక 24-5-1934]

---

1. పారిశుభ్య కమిటీ

ఇదీ ఒక కథే—
పేరులు దారులు గుర్తుంచుకోటం

శ్రీమతి సంవగిరి ఇందిరాదేవి

పేర్లు దారులు గుర్తుంచుకోటం ఎందుకు కళ, ఎట్లా కళ, అన్న ఆలోచన రాకపుండే. పేరు గురుతుకు రాక పడిన సరక యాతన కళ్ళకు కట్టినట్టు కనిపించింది. పచ్చిన చిక్కేమిటంటే మనలను పలకరించిన వాళ్ళ మొహం గుర్తుంటుండి. పేరు గుర్తుకు రాదు, ఎంత తన్నుకున్నా. అంత స్నేహంగా పలకరించిన వాళ్ళను ప్రబంధాల్లో మోస్తరు, "ఎప్పతె వీవు. భీత హరిణేక్షణ" అని సూటిగా అడిగితే ఏంబాగుంటుంది! అసలు ఆ అవస్థ అనుభవించిన వాళకే తెలుసుండి. సంగతి విపరించాలంటే - కొండరు, బోతూపోతూ ఏ దుకాణంలోకో-ఏ సినిమాలోనో "హలో" అంటారు. మనం కూడా పెద్దగా గుర్తు పట్టకపోయినా "హలో" అంటాము, ఎప్పుతో ఎక్కడో చూసి ఉంటాం అనుకొని. ఇహ దగ్గర కొచ్చి పలకరించినా మొహం నిండా నవ్వు పులుముకొని, కుశల ప్రశ్నలు వేస్తే కొట్టుకు పోతుండి. ఆ పలకరింపు ఇంకాసేపు సాగితేనే వస్తుండి తంటా. అప్పుడు మన బుర్ర అతివేగంగా పనిచేసి వెతుక్కుంటూ ఉంటుండి ఈ ఛాన్స్ ఎవరా అని. ఆ నవ్వు మాయం కాకుండా, మొహంతో రంగు మారకుండా, "అయితే ఏం చేస్తున్నారు? ఎక్కడ ఉన్నారు?" లాంటి చచ్చు ప్రశ్నలు వేసినా వాళ్ళు ఎవరయిండి అంతు పట్టదు. "ఆ-అక్కడే వున్నాము-అదేపని-" అని అన్నారో ఇహ మనకు చెమటలు పట్టటం ఒక్కటే తక్కువ. ఆ పేరు అప్పుడు గుర్తురాక పిల్లలకు కోప్పడుతున్నప్పుడో-పొంగే పాలు దించుతున్నప్పుడో పిండని పేరంటం లాగ గురుతుకు వస్తుండి. గుర్తు పట్టని సంగతి పైకి తెలియకుండా ఎంత-ఒడుపుగా మాట్లాడినా కొన్ని సార్లు

బండారం బయటపడి పెద్ది మొహం పడింది నలుగురిలో. ఒకసారి ఏమయిం దనుకున్నారు? ఒక పెళ్ళిలో ఒకావిడ వెనకనుంచి వచ్చి కళ్లు మూసి కొగలించు కుంది అతి చనువుగా. చేతులు తీసి పాత చెక్కీకు ఉపయోగించి, ''అరె! మీరా?'' అన్నారు, ఎక్కడ చూశానా అని ఆలోచిస్తూ. ఆ అనుమానం రాకుండా, ''మీ ఆయన, పిల్లలు, కులాసేనా?'' అని మాట సాగించేసరికి ఆమె వెంట వచ్చిన వాళ్ల కొంగు చాటు చేసుకుని నవ్వుకున్నారు. మహా గుర్తు పట్టినట్టు కుశల ప్రశ్న లేశాను కాని మనసులో తెగ మధన పడుతున్నది గమనించింది ఆ గడుసు ఘటం. ''అది సరే కాని, మీరు నన్ను గుర్తు పట్టలేదు.'' అనే బాంబు వేయనే వేసింది. ''అమ్మో, అదేమిటి?'' అని బుకాయించబోతే, ''అయితే నా పేరు చెప్పండి'' అని నిలవ తీసింది. ''పేరు—గుర్తుకు రావటం లేదు'' అని నీళ్లు నములుతుంటే-''పోనీ, మనం ఎప్పుడు—ఎక్కడ కలిసాం?'' అన్నది. ఇహ అప్పుడు తెల్ల మొహం లేసి, ''Sorry, మొహం గుర్తుంది... కాని—.'' అని అంటుంటే, ''సోదెమ్మ సోది-సోది చెబుతాను'' అన్నది. దానితో, ''ఓ! లలితా'' అన్నాను, పోయిన వస్తువు కనబడినంత సంతోషంతో. అమె మా స్కూల్లో నా కంటె రెండేళ్లు జూనియరు. పెళ్లి చేసుకోని ఆమె, ''నా కాబోయే మొగుడు, పుట్టబోయే పిల్లలు, అంతా కులాసా'' అన్నది, నన్ను బనాయిస్తూ.

అట్లా జ్ఞాపక శక్తి తగ్గటం పల్లనో లేక చూసి చాల కాలమయినందు పల్లనో, మనుష్యులలోని శారీరక మార్పుల పల్లనో ఈ గురుతుంచుకునే కళ కొంత కుంటుపడవచ్చు. కాని కొందరికి దారులు పేరులు తేదీలు కూడా గుర్తుంచుకోటం జన్మతః అబ్బిన కళ. అమెరికా ప్రెసిడెంటు రూజువెల్టు జ్ఞాపక శక్తి అమోఘమని చెపుతూ White House పరివారాన్ని పేరు పేరు పరసర జ్ఞాపకముంచుకొని పలకరించే వాడని, పదవీ విరమణ తరువాత కూడా మరచి పోలేదని, వ్రాశారు, అతని జీవిత చరిత్రలో. అట్లాగే మూతో నెహోలియను చక్రవర్తి తనను కలిసిన ప్రతివాని పేరు మనసులో మననం చేసుకునే వాడట. పేరు కఠినమయిన దయితే కాగితం మీద వ్రాసి మరీ వల్లించే వాడట. అంతంత

పెద్దవాళ్లు కూడా ఈ పేర్లు గుర్తుంచుకోటానికి కళగా మన్నించారంటే అది ఎంత గొప్ప కళో మనం అంచనా వేయవచ్చు.

అసలు మనిషికి తన పేరు అత్యంత ప్రియమయినది. ఎదుటివారిని ఆకట్టుకోవాలంటే వాళ్ల పేర్లు గుర్తుంచుకోవాలి. అప్పుడు వారి దృష్టిలో మన అంతస్థు పెరుగుతుంది. మంచి అనే ఓ మెప్పు లభిస్తుంది. అయితే జన్మతః అబ్బకపోయినా ఈ కళ కాస్త శ్రమ శ్రద్ధలతో సాధించవచ్చు; కాని మనుష్యుల ప్రకృతి రకరకాలు. కొందరు మంచి సంపాదించటానికి శ్రమపడితే మరికొందరు Contacts కోసం, అంటే తమ పనులు నెరవేర్చటం కోసం ఎందరి పేర్లయినా నాలుక చివర గుర్తుంచుకో గలుగుతారు. "మీ స్నేహితుని బావమరిది మూడో పిల్లాడి క్లాసుమేటు పక్కన మావాడి మామగారి తమ్ముడి ఫ్రెండుట — కాస్త కనుక్కుంటురూ—" అంటారు. చూశారా ఎంత పొడుగు లింకో ? ఈ లింకులో (link) ఉన్నవాళ్ల పేర్లు-వాళ్ల ఇళ్ల దారులు కనుక్కోవటంలో పెద్ద సిద్ధహస్తులన్నమాట. ఇతరుల ప్రేమాభిమానాల కోసం కాక ఈ కళను ఆరాధించే ప్రబుద్ధులు మరో రకం. "ఫలానా రాజారావుగారిల్లు ఇదేనా?" అని వస్తాడొక మేటి కళాకారుడు. ఆ యజమాని సంగతి అంతా పూర్తిగా తెలుసుకున్న అతను, "వారే పంపారు- మీ ఫాను బాగుచేయమని" అంటాడు. ఇంటివాళ్లు కాస్త పప్పులో కాలేశారా, అది కాస్త విప్పుకుపోయి, మళ్లీ అయిపు జాడ ఉండదు. అట్లాగే పెళ్లి సంబంధాల పేరిట తాటాకులు కట్టేవాళ్లు కోలెడుమంది! కాని వాళ్ల చేతుల్లో ఈ కళ రాణించక దుర్వినియోగం అయిపోతున్నది. సరే- వాళ్లకు మంచి మెప్పు సంపాదించి పెట్టడం మాట అటుంచి, పట్టుపడితే అదే కళ కటకటాల వెనక్కు తోస్తుంది.

పేరు గుర్తుంచుకోటం కళ - వినియోగ దుర్వినియోగాలు కాక - తమ పేరు - దాని వెనక ఉన్న అహం-అబ్బో ! ఇంతా అంతా కాదు.. ఎప్పుడన్నా గమనిస్తే తెలుస్తుంది. టెలిఫోను చేసిన కొందరు తమ పేరు అస్సలు చెప్పరు. గొంతు గుర్తుపట్టి తెలుసుకోలేకపోయామో మనకు పొగరెక్కిందని లెక్క!

ఆ అహాన్ని గాజు పాత్రను కాపాడినట్టు కాపాడుకోటం కొందరి ప్రత్యేకత ! అయితే అట్లా పేరు చెప్పకుండా వెళ్ళిపోయినవాళ్ళు - అంటే మనం ఇంట్లో లేనప్పుడు వచ్చిపోయినవాళ్ళ గొట్టాం పాంటు- పైటు బనియను తీసుకున్నా రంటేనో-కొంగు రోడ్లు ఊడుస్తున్న దంటేనో చప్పున పోల్చుకుంటాము. పేర్లు తెలియని వాళ్లను, ఇద్దరు పెళ్లాల ఆయన అనో, పిప్పళ్ల బస్తా అనో, ఆనవాళ్లతో గుర్తుంచుకుంటారు కొందరు. అసలు ఈ పేరు వెనక అహంతో పాటు ఎంత భాగోతం ఉందనుకున్నారు? పేరు పుట్టుకే కొందరిళ్లల్లో తగాదాలతో మొదలు. తాతలు, అమ్మమ్మలు, నాయనమ్మలు, చచ్చినవాళ్లు, బతికినవాళ్లు, దేవుళ్లు అంతా కలిసి ఓ నిర్ణయానికి వస్తే తప్ప ఆ పేరు బియ్యంలో పడదు. ఈ పేరు వినండి అతిశయోక్తి అనుకోకుండా. "శ్రీ సీతా రామాంజనేయ, వీర వెంకట లక్ష్మీ నరసింహ, హరి శంకర వాణీ వల్లభ, రాజరాజేశ్వర వరప్రసాద, కృష్ణమోహన రావు" అని పెట్టారండి ఒక పిల్లాడికి. ఇంతలో అబ్బాయి అమ్మమ్మకు సుబ్రహ్మణ్యస్వామి కలలో కనబడి, "ఔరా ! నా పేరు పెట్టక పోతివా ?" అన్నారట. ఇహ నాయనమ్మ తన ఆరాధ్య దైవం అయిన బాబా పేరు లేదని గమనించి, "కృష్ణ మోహన సత్యసాయి సుబ్రహ్మణ్య శర్మ" అని ఇంకాస్త పొడిగించిందట. పెద్ద వాడయిన ఆ పిల్లాడు నీ పేరు చెప్పవోయి అంటే, "వింటానికి బైముందా?" అంటాడు. అంత పట్టుదలగా ఇంత పొడుగు పేరు పెట్టిన ఈ అమ్మమ్మలు నాయనమ్మలు, ఇంగ్లీషు పొడి అక్షరాలతో "ఒరే కే-పి-యస్నా!" అని "ఒరే ఎల్లారే-" (L-R-K) అని పిలుస్తారు. శుభం ! ఎలా పిలిచినా పేరు పేరే- అది గుర్తుంచుకుంటే కళే !

వెనకటికి నైజాం రోజుల్లో మనపేర్లు వాళ్లకు నోరు తిరగక – రాసుకోటం చాతకాక గుర్తుండక పోయేవి. ప్రతివాది భయంకరాచారి – వల్లు — గురప్పలాచారి–అని ఉంటే ఆ పేరును నానా బీభత్సంచేసి "గుర్రపు పిల్లా చారి" అని వ్రాసుకున్నారట. (వల్లు అంటే Son of అని అర్థం). అదీకాక రాజు

తల్చుకుంటే చెబ్బలకు కొయవా అన్నట్టు ''ఆజసే–తేరానామ్ రామాచారి'' – అని మార్చేసే వారట. (ఈవాళటి నుండి నీ పేరు రామాచారి అని అర్థం).

ఈ గుర్తుంచుకునే కళ రాజుల చేతుల్లో అట్టా నలిగిపోతే వ్యాపారస్థుల చేతుల్లో చెలిగి పోతున్నది. సారా కొట్లకు, మంగలి షాపులకు, బట్టల దుకాణాలకు నాయకుల పేర్లు, దేవుళ్ల పేర్లు పెట్టేస్తున్నారు. పునం వాళ్ల పేర్లయితే చచ్చినట్టు గుర్తుంచుకుంటామని! ఇట్టా వాళ్లు తమ వ్యాపారాభివృద్ధికి వినియోగించు కోటం కళ కాచంటారా ?

అయితే ఈ పేర్లమీద కొన్ని జోకులు కూడా ఉన్నాయి. మచ్చుకు, ఒక ఆవ మగ ఒక చీకటి మొట్ట మీద ఢీ కొన్నారట. ఆవిడకు కోపంవచ్చి "ఇడియట్" అన్నదట. అతను హాటు తీసి "John" అన్నాడట తనపేరుతో పరిచయం చేసుకుంటూ.

మరోసారి ఒకాయన, "మీ నాన్న ఉన్నారా ?" అని అడిగాడట ఒక చిన్న పిల్లను. ''మానాన్న అపెండక్టమీ చేస్తున్నారు'' అన్నదట ఆ పిల్ల. ''అయ్యో బాబోయ్ నీకు అంత పెద్ద పేరుకు అర్థం తెలుసా ?'' అంటే, ''ఆహా — అపెండక్టమీ అంటే 500 రూపాయిలు అనెస్థిస్టుకు కాక –'' అన్నదట ఆ పిల్ల ఆ పేరు — దాని అర్థం గుర్తుంచుకుని.

కొన్ని పేర్లు ఉన్నాయి చూశారూ, అవి మనం అట్టే శ్రమ పడకుండా గుర్తుండి పోవాయి వాటి ప్రత్యేకత వల్ల. ఒక అమ్మాయిపేరు Sunlight అయితే ఆ పిల్ల చెల్లెలు Moonlight. అసలు వాళ్ల పేర్లు, సూర్యకాంతం, చంద్రకాంతం, అట. వాటికి ఇంగ్లీషు తర్జుమా అది. రష్యను పేరు "నటాషా'' అనే అమ్మాయి చెల్లెలు "మనిషా'' అట. ఆ కడసారి పిల్ల, ''నా పేరు తమాషా, మా అన్న బర్మాషా, మా తమ్ముడు రాంషా'' అంటుంది పైవాళ్లను వీడిపించే ధోరణిలో. ఇదికాక "ముద్దుల పేరుచెడె, ముద్దాపాల రూపుచెడె'' అన్నట్టు పింకి - డింకి - టింకి - నిక్కి - మిక్కి - బంటి - బుజ్జి - చిట్టి - బుచ్చి -

లాంటి పేర్లు కాక - బబ్బులు - జబ్బులు - పాపులు - బేబులు - లాంటి పేర్లతో లక్షణమయిన అసలు పేర్లు అటుగున పడిపోతాయి.

ఇదంతా పేరును గురించిన వ్యాఖ్యానం. పోతే-పేరు గురుతుంచుకోటం లాగానే దారి గురుతుంచుకోటం కూడా కళే! అసలు, పేరుకు దారికి అవినా భావ సంబంధం ఉన్నటనిపిస్తుంది. పేరు లేనిది దారి కనుక్కోటం కష్టం కనుక. అట్లా అనే ప్రతి కాలనీ పెలసిన కొద్ది రోజుల్లోనే ఆ రోడ్లకు పేర్లు ఆ యిళ్ళకు నంబర్లు ఏర్పాటు అవుతాయి. కాని అవి మునిసిపాలిటీ రికార్డులలోనో లేక పోస్టల్ పూ్యను మెదడులోనో ఉంటాయే తప్ప ఎక్కడా ప్రాసి ఉండవు. తప్పిదారి ఎక్కడన్నా ప్రాసి ఉన్నా కనుక్కోటం కష్టం. కనుకనే దారి గుర్తుంచుకోటం కళ అనటం. ఎట్లా కష్టం అంటే ఈ కాలనీలకు మనుష్యులకు మల్లేనే వాడుక పేరు ఒకటి–ముద్దు పేరు మరొకటి – ఉంటూ ఉంటాయి. "త్యాగరాయ నగర్" అన్నది మునిసిపాలిటీ పేరు. "ఇషాక్ నగర్" అన్నది వాడుక పేరు. మారేడుపల్లి అనునది వాడుక పేరు. నెహ్రూనగర్ అన్నది ముద్దు పేరు. ఈ రెండూ కాక "అడ్డగుట్ట" అన్నది మరో మురిపాల పేరు. ఇహ నంబర్లు చూద్దామా అంటే అవీ రెండేసి ఉంటాయి. ప్లాటు (Plot) నంబరు వేరే-మునిసి పాలిటీ నంబరు వేరే. పోనీ అవి అయినా పరుస వెంబడి ఉండవు. 123 తరు వాత 150 వెలుస్తుంది. అ నడుమ నంబర్లు ఎక్కడ ఆవిరయ్యాయో ఎవరికీ అంతు పట్టదు. ఇంటికి నంబరు ఉండదు. రోడ్డుకు పేరు ఉండదు. ఇంటి యజ మాని పేరు అసలే ప్రాసి ఉండదు. రైలు దిగినవాడు ఇట్లాంటి అడ్రెసు కాగితం పట్టుకొని పద్మవ్యూహంలో ప్రవేశించినట్టు ప్రవేశించి కాళ్ళరిగేట్టు తిరగాల్సిందే కాని ఎవ్వరి సాయం కూడా దొరకదు. ఏ నంబరు ఇంట్లో ఎవరు ఉంటున్నారో తెలుసుకునే ఓపిక తీరిక ఎవరికుంటుంది కనుక ఆ బాటసారికి సాయం చేయడానికి? ఇహ నంబర్లు పేర్లు ఎట్లాగూ తెలియవని కొందరు కొంత గుర్తులు చెపుతారు తమ యిళ్ళకు అడ్రసు చెపుతూ. వెనకటికి కథల్లో నీ ప్రాణం ఎక్కడుంది? అని అడిగితే చెప్పిన అడ్రసు-ఏడేడు సముద్రాల అవతల ఓ మర్రిచెట్టు - ఆ చెట్టు తొర్రలో బంగారు పంజరం. ఆ పంజరంలో ఓ చిలుక-అందులో ఉంటుంది

నా ప్రాణం - అన్నట్టు "అక్కడొక లారీ ఉంటుంది. ఆ ప్రక్కన ఓ డస్టుబిన్ ఉంటుంది. దాని దగ్గర ఓ కునుకుపాట్లు పడుతున్న కుక్క ఉంటుంది. దాన్ని అదిలిస్తే లేచి వెళ్ళిన పక్కయిల్లు మాది" అని చెప్పి "అతి సులువు" అనే మాట కూడా తగిలించేస్తారు చెప్పేవాళ్ళు. కనుక్కోలేకపోతే తెలివి తక్కువ నీదే సుమా అన్నట్టు. గంట తిరిగినా ఆ లారీ కాని ఈ కుక్క కాని కనబడవు. ఆ గురుతుంచుకునే కళను అలవరచుకున్న వాళ్ళే ఎక్కడా ఏమీ ఆసరాలేని అడ్రెసులు కూడా కనుక్కోగలరు.

దారి కనుక్కోటం గురించి మా స్నేహితుడొక కథ చెపుతాడు. కథేమిటి కాని ఒక అనుభవం తన బావమరిదికి అంటగట్టి ఆనందిస్తాడనుకోండి! కొత్తగా యిల్లు కట్టుకున్న ఆ బావమరిది, "ఇదుగో ఫలానా చోటునుండి, నాలుగు ఎడమలకు, రెండు కుడి సందులకు తిరిగి మూడో మలుపులో రెండో వరుసలో ఐదో యింటి పక్కన గేటులేని యిల్లు" అని అడ్రెసు చెపుతాడుట. ఇల్లు కట్టుకోగానే బదిలీ అయిందట అతనికి. భార్యా బిడ్డలను అందులో ప్రవేశపెట్టి బదిలీ ఊరులో ఉంటున్న అతను మిట్ట మధ్యాహ్నం బస్సు దిగాడట ఆ వూరునుండి. కుడి ఎడమ సందుల్లో ఎక్కడ లెక్కతప్పాడో కాని ఎంత తిరిగినా ఇల్లు కనబడలేదట. ఆ యెండకు అతని మెదడు ఎంత ఆవిరయిందంటే తన యిల్లు తానే గుర్తు పట్టలేక అలిసిపోయి, బజారుకని బయలుదేరిన ఒకామెను పలకరించి, "చూడండి-ఫలానా సుబ్బారావని- కొత్తగా యిల్లు కట్టుకున్నాడండీ- ఎక్కడ?" అని అడిగాడట. "అయ్యో-మీరేనా? ఇదేం కర్మ! పదండి యింటికి" అని తీసికెళ్ళిందట ఆయన భార్య. గుర్తించటం అంటేనే ఇదివరకు చూసింది అని అర్థం. ఆ దారి అతను ఇదివరకు చూసిందే అయినా గుర్తు పట్టడం అంచరికీ చేతకాదు కనుక అలా గుర్తుంచుకునే కళ చాల గొప్పది అని నిరూపించిందన్న మాట ఈ అనుభవం.

అయితే చూసిన దారి గుర్తు పట్టటమే కళ అయితే చూడని దారినీ గుర్తు పటడానికి ఏమనాలి? ఈ దారులనీ ఒక ఎత్తు - High way దారి మరొక

ఎత్తు. High way మీద వెడుతుంటే రోడ్డమీద బోర్డులు, మైలురాళ్లు, చంతెన ఎటు, మలుపు ఎటు, ఏ వూరు, ఎన్ని మైళ్లు తెలుసుకో టానికి సాయపడతాయి. అవి అందరికీ తెలిసే భాషలో కాక వారివారి ప్రాంతీయ భాషల్లో వ్రాస్తున్నారు. అంటే తమిళనాడులో తమిళంలో ఒరిస్సాలో, ఒరియా లాగా-దానితో మనదగ్గర మాపులు-గైడులు ఎన్ని ఉన్నా కనీసం ఎన్ని మైళ్లు వచ్చామో కూడా తెలియక పోతే కష్టం.

పోనీ ఎవరన్నా మాట తెలిసినవాళ్లు తటస్థపడి ఎటు వెళ్లాలి అని అడిగితే, తెలియకపోతే తెలియదనకుండా 'సరాసరి వెళ్లండి' అంటారు. ఆ మాట పట్టుకొని వెడితే హైవే తప్పించి సముద్రపు ఒడ్డుకు చేర్చింది ఆ దారి మమ్మల్ని ఒకసారి! సరే-మాటరాదని-బోర్డులు మైలురాళ్లు ప్రాంతీయ భాషల్లో ఉన్నాయని ఎవరూ ప్రయాణాలు మానుకోటం లేదు. చెప్పవచ్చిందేమిటంటే కొన్ని సులువు లుంటే ఈ దారులు గుర్తుంచుకునే కళ అలకంగా అలవరచుకోవచ్చు. ఎప్పుడూ వెళ్లని దారిని సాధించడానికి, వెళ్లిన దారిని గురుతుంచుకోటానికి అనువుగా వుంటుంది.

చివరకు ఒక్కమాట- పేర్లు దారులు అందరూ అలవరచుకోవాల్సిన ఓ గొప్ప కళ. దారి అంటే ఇళ్లకు దారులు హైవేలు కాక, జీవితపు దారిని సరి అయినది ఎన్నుకొని, దారి గుర్తుంచుకుని నడిస్తే-పేరు గుర్తుంచుకొని ఇతరులను ఆకట్టుకోగలిగితే జీవితం సుఖప్రదం-జయప్రదం అవుతుంది.

పనిలేని న్యాయవాది

శ్రీ ఒ. సీతారామచంద్రరావు

అటులనని నమ్మ నేను సత్య భాషణులలో పరిగణన చేసుకొని చెప్పి కొనుట మహా పాపమని తలచెదను. ఒకవేళ ఎవరయిన నన్నాక్షేణి కీడ్వ సాహసించెదరేని నేను వారిపై మాన నష్టపు టధియోగము దెచ్చి, నా పనిలేని దశకు కొన్ని నాళ్ళదాకనైన దూరముండు నాజ్ఞ నిచ్చెదను. న్యాయస్థాన మందొక వేళ నెప్పుడేని న్యాయాధిపతి మహాశయులందలును కృపాన్వితులగు సమయప్రాప్తి యగునేని—ప్రాతఫలిక వ్యవహారమున నాతో ప్రసంగించు సమయమే వచ్చునేని-ధగద్ధగాయమానమగు నా క్రొత్త దినపుస్తకము పుటలను నాలుగైదుసారులైన నన్ను తిరుగ మరుగ వేయనిది ప్రత్యుత్తర మీయను. అగును గాక! నా పసితనమున నాక తురక సామెత వింటిని. అది జ్ఞాపకము నందున్నది. 'యూకాన చోరీ—పీరానె దగాబాజీ' అని. దాని నిజమైన అర్థమేదియో కాని నాకు నా అనుభవమున పొడకట్టిన అర్థమేమనగ- న్యాయవాద వృత్తియందున్న వారికి మిత్రునితోనైన సబద్ధమాడనిది గోపలేదని - నేనాముక్కునే గణపాతముగా బెట్టుకొనియెద. కాని నేనిప్పట్టున అసత్యమాడుటకు పిలుపేమ. ఏమన—మీరు మిత్రులు. మీ వలన నెటులను డబ్బు పచ్చారు నాశింపమ. ఇక అబద్ధమాడినచో మీరును చేయిదాటి పోయెదరు. మీ కెప్పుడు కాని న్యాయవాదిలో పని కలుగదని నా నమ్మకము. ఈ కారణముననే — మీ యెడటనైనను సత్యమాడి దుర్లభమగు నా శ్రేయము నేల సంపాదింపరాదు ?

ఏ. బి.[1] ప్రారంభించినాడే నాకొక యుద్దేశ్యము కలిగినది. ఏ.బి. నుండి ప్రారంభించిన ఆంగ్లేయ విద్యాశిక్షను బి. ఏ. పరకు చెల్లి "ఇతిశ్రీ" చెప్ప వలయునను అభిప్రాయానుసార మీ పరమపదమును పొందునప్పటికి నా అవస్థ

---

1. ఆంగ్లేయ అక్షరములు.

ఇఱుపదియారు వర్షముల కయ్యెను. కావున నేను ప్రొవిన్షియాకోద్యోగము[1] కొఱకు వృద్ధుఁడనుగా పరిగణింపఁబడపలసిన వాఁడనైతిని. అయినను ధన్వంతరి మహాశయులు రజతరసాయనము ద్వారా నన్ను వయసువానిగా నొనరించెదరని నమ్మకము గలదు. కాని, చిన్నతనమునుండియు నా మనసులో స్వతంత్రతా భావము నిండియున్నది. ఉద్యోగము లభింపని దశను దేశసేవార్థ మీశ్వరదత్త వసరమని తలచితిని. దేశసేవా రథము కేవలము భావ చక్రములతో నడుపజాలదు; రజత మహారజత చక్రములతో గాని నడుపదు. అవి యుద్యోగికిగాక దొరుకునా? కనుక న్యాయవాదిగా నుండుటకే స్వీకరించితిని. ధనార్జన ముతోపాటు దేశసేపయు లభించును. పేరు ప్రతిష్ఠలను బడయపచ్చును. ఇప్పుడే "భారత న్యాయవాది" అను పత్రిక న్యాయవాదుల పేరులను ప్రకటించు చున్నది. నేనంతట స్వస్థాన పాఠశాలలలో నొకదానియందు తాత్కాలికముగా నైసను, ధ్రువముగా నుద్యోగ మార్జించితిని. అటులనే నైయాయిక కళాశాల నందు నైయాయి కోపన్యాసములను వినుట కారంభించితిని. అనగ నుపన్యాస సమయములను వినుటకాదు; సాక్షాత్కరించుట మాత్రమే. ముందు నేను న్యాయ వాదిని కాగలవాఁడను కావున నేను నైయాయిక కళాశాలలోని నా సాక్షాత్కర మొక న్యాయవాది ద్వారా పూర్తి చేయింపఁ దొడఁగితిని. ఎప్పుడైన నా న్యాయ వాదికి పనిబడి యింట నిలిచిపోవలసివచ్చును; అపుడు నేనాతని కీయపలసిన శ్రమ ఫణమునకు మా రాతని న్యాయవాదినై వెడలి ఆతని సాక్షాత్కరమును వ్రాయించి వత్తును. "పగలు రెండు పాళ్ళు: రాత్రి నాలుగు పాళ్ళు" అనిన మాట జ్ఞాపకమునకు వచ్చినది. నుదస ముఖముపలె న్యాయ చర్చ పెరిగి పెరిగి పోజొచ్చెను. హనుమంతుని వలె లఘురూపము ధరించుదాక దాని అంతము గోచరించుచున్నట్లు లేకుండెను. మా నైయాచార్యునకు "లఘుత" అను మాట తన గురుత్వమునకు లఘుత్వమని దోపజొచ్చెను.

నా న్యాయాచార్యుడును ప్రతినిధిత్వమును గురించి మిక్కిలి శ్రద్ధాళువు. కావునే నాకేలాటి శ్రమయు లేకుండ నొక సంవత్సరపు సాక్షాత్కరము పూర్తి చేయనిచ్చిరి. పరీక్ష రుసుము పంపనిచ్చిరి. కాని అభాగ్యవశమున

---

1. న్యాయమూర్తి.

పరీక్ష ప్రతినిధి వశమున న్యాయవాది వలన జరుపబడునదిగా కనుపడలేదు. ఈనాడు రేపు కార్యములన్నియు ప్రతినిధుల ద్వారా, పక్షీళ్ళద్వారా జరుపబడుచుండ నీ పరీక్షలేల ప్రతినిధుల ద్వారా జరుపరాదు అనుచట్టమును ఎందుకు స్వీకరింపలేదో తెలియదు. అంతగ నయితే ఈ రీతి ప్రతినిధుల ద్వారా పరీక్ష జరిపించుపట్టున రుసుము అధికపరచుకొనినచో సరిపోయెడిది. నా అభిప్రాయము ప్రపంచాభి ప్రాయమును మార్పజాలకుండెను. అగుగాక. పరీక్ష కొంచకు సన్నద్ధుడ గాపలసి యున్నది. అందుకు మూడు నెలల సెలవు గైకొంటిని. కాని సంవత్సర కాలములో ముగియవలసిన పని మూడు నెలలలో నెట్లు ముగియగలదు? అందులో నాపంటి ఆలస్య భక్తుల వలన? "అనువు లెంత పరకుండునో ఆశ యంత వరకుండు" నని సామెత. ఒక ఆరామమునందు కూర్చుండి మెల్లన పుస్తక మధ్యనమును ప్రారంభించితిని. కాని చదువుటకు కూర్చుండగనే పరీక్షా దినములను లెక్కింప బుద్ధి కలుగును.

పరీక్ష నిచ్చుటకు పట్టణమునకు వెళ్ళితిని. పరీక్షయం దుత్తీర్ణుడను కాక పోయినను పట్టణమును చూచుట తటస్థించెనని యుత్సాహముగనే యుండెను. అదియుగాక ఒకవేళ పరీక్ష పోయిన రెండవయేట కూర్చొండెదగాని ఈ యేటితో నా యీ యుపన్యాసములు వినుటకు విధిగా వెళ్లు పని తప్పెనని మాత్రమతి సంతసముగ నుండెను.

శకునము బట్టుమ పరీక్షాభవనమునకు వెళ్ళితిని. కొట్టియో గొప్పయో దేవతల నామములు సైతము జ్ఞాపకమునకు వచ్చెను. మొదటి దివసము పరీక్షా పత్రమతి సుగమముగా నుండెను. దేవతా నామ స్మరణ మహాత్మ్యమును తలచితిని. మజీ యొక దివస మటులనే గడచిపోయినది. కాని మేక తన పిల్ల నెంతకాలము రక్షించును? మూడవ దివసమున కొంప మునిగియే పోయెను! పరీక్షాపత్రము కఠినమైయుండెను. అయినను, ఆశాపాశము నుండి విముక్తుడను కాలేదు. పరీక్షకుల దయాశీలతను గురించిన ఆశ యెల్లప్పుడు నా కుండియే యుండెను. స్వార్థపరుడ నగు నా మనస్సున "పరీక్షకులు పరీక్షా పత్రములలో సగము

పత్రముల దీసి యొకచో నుంచెదరు. తక్కిన సగ మొకచో నుంచెదరు. ఒక సగము పత్రములపై "కృతార్థత" అనియును, తక్కిన సగముపై "అకృతార్థత" అని వ్రాసెదరని" యూహ పొడముచుండెను. నా యుత్తర పత్రములు మొదటి సగములో నుండకూడదా అనియు, అట్లయిన నేను కృతార్థుడ నగుదు ననియు ఆశ యుండెను. పరీక్ష ముగిసెను. పరీక్షా ఫలితాంశము ప్రకటింప బడియెను. "ఏడ్చుచు పోయినవాడు చావువార్త చెప్పు" నని ప్రతీతి.

పోనిండు. పాఠశాలయందలి యుద్యోగమైతే వీడిపోలేదు. ఇక భయమేమి? ముప్పియొక సంవత్సర మిటులనే మూడు మాసములు సెలవుగొని ప్రయత్నించితిని. గడచిన సంవత్సరము నందలి అనుభవము, ఈ సంవత్సరపు పరిశ్రమ ఈసారి కొంత కార్యకారియైనది. అనగ ప్రాక్తన విధానముగ కృతార్థుడనైతిని. ఇక పరిశిష్టము కొరకు ప్రయత్నించితిని. దాని యందును ఒక సంవత్సరము మునిగిపోయిన పిమ్మట కృతకృత్యుడనైతిని. మహాజనులారా ! నేలకు కాలు రాచక ముందడుగు వేయగలమా ? పోనిండు. ఇపుడేమి ? గడచిన సంవత్సరముల యందలి అసఫలతా విషయిక లజ్జ విడిపోయినది.

కలయందైన పోయి యెరుగని యింటికి రెండు మూడు చుట్లు చుట్టనలసి వచ్చినది. పాఠశాలోద్యోగమునకు "ఇతిశ్రీ" చెప్పితిని. ఇపుడు న్యాయవాది నటనల నేర్చుకొనవలసిన పని ముందుకు వచ్చినది. ఎక్కడ అభియోగముల విషయము వినవచ్చునో, ఎక్కడ దావాల వాసన వచ్చునో అక్కడ అనుభవ లాభము కొరకు నా మూర్తి ప్రత్యక్ష మగుచుండును. అభియోగ మూర్తులగు వారి వెంట ప్రభుత్వ కూటములకు వెళ్లుచుండును. ఊహా భంగ ప్రశ్నలకు శ్రద్ధతో విచుచుండును. "ఉరుము" నంచును పని పడునని న్యాయవాదము జరుపునంత వరకు యోగ్యత సంపాదించుకొంటిని. నా వంటివారి యెడల కనికరము జూపు నొక యుద్యోగి యోగ్యతా పత్రమును సైతమిచ్చెను. నమ్ము గిట్టని వారా యోగ్యతా పత్రి మాతని చరణ సమాశ్రయణ మొనరించి సంపాదించితిరని అపవాదు గల్పించిరి. అందువలన నష్టమేమి? ప్రయత్న హీనముగా

నగు కార్యమేది గలదు? శ్రేణీ బద్ధము కొరకు ప్రార్థనా పత్రమంప బడియెను. ప్రభుత్వము వారంగీకరించిరి. అపుడు నాకభియోగ లాభ చింత గలిగినది. మంగలి కుఱ్ఱవాని కభ్యాసము చేయించుట కెవడు తన తలను చెరచుకొనును? జ్యోతిశ్శాస్త్రవేత్తల నడిగితిని. మొదటి అభియోగ మెన్నడు తీసుకొనవలయునో వారు తెలిపిరి. ముహూర్తము మంచిదే కాని సమయమున కెవరు నా కభియోగము దెచ్చి యిచ్చెదరు? ఎవరును సాహసింప లేదు. ముహూర్తము దాటిపోవునేమో యను భీతి. ఒకానొక సహృదయుడగు న్యాయవాది ముహూర్త సమయమున కొక అభియోగములో తన పరార్థ వాదనా పత్రము (వకాలత్ నామా)తో పాటు నా పేరట యొక పరార్థ వాదనా పత్రమును కూడా న్యాయ స్థానము నందప్పగించెను. అభియోగము మా పక్షముననే తీర్పు గాంచెను. అయినను నా కంతెంత మాత్రమును యశోలాభము కలుగలేదు. ఏల? ఇతరుల ఛత్రచ్ఛాయ నున్న నాకు యశోలాభ మెక్కడ? ఆ న్యాయవాది నన్ను తనతోడి పొత్తున నుంచుకొనుటకు సంసిద్ధుడుగనే యుండెను. కాని నే నాతనికంటే ప్రతిభాశాలినని యెంచుచుంటిని. అతని యశస్సుకూడా పుష్కలమై యుండెను. యశస్వి తోడివారి తేజమును సహింపడు. "ఉత్తర రామచరిత్ర" మందు భవభూతి యథార్థము వ్రాసినాడు :

శ్లో॥ న తేజ స్తేజస్వీ ప్రసృత మపరేషాం విషహతే;
స తస్య స్వో భావః, ప్రకృతి నియతత్వా దకృతకః,
మయూఖై రశ్రాన్తం తపతి యది దేవో దినకరః
కి మాగ్నేయో గ్రావా నికృత ఇవ తేజాంసి వమతి?

నేను యశస్వినైతే కానుంటిని. కాని యశస్వి నగుటకు మహత్త్వాకాంక్ష గలిగియుంటిని. కావున అతని మార్గముననే నేను నడచుటకు అభిలషించితిని. ఈ కారణముననే పెద్ద న్యాయవాది కృపవలన లాభము స్వీకరించుట అపవిత్రమని తలచితిని. నా భావి జీవనమునకు[1] ఆత్మ విశ్వాసము, ఆత్మ సహాయ్యముల

1. విద్యార్థి జీవనమును.

పాఠములు నెక్కుపగా నధ్యయన మొనరించితిని. ఇతరుల ఛాయ యందు నిలిచి యుండుట లజ్జా జనకమని నాకు ప్రతీతమగుచుండెను. ఉపాధ్యాయ జీవన మేదైతే నా పలన సంగ్రహింపబడినదో ఆ సాముతో న్యాయవాదుల అంగడిని స్థాపింపవలయునని నిశ్చయించితిని. గుణముబండి మొదలగు వానినుంచుట నా అధికారమునకు మించి యున్నదని నా కెరుక. అందుచే నల్లని వస్త్రపర్మము దొడగికొని ప్రొక్కుడు బండిమీద న్యాయస్థాన యాత్రచేసి వచ్చుచుందును. నా ప్రాయసకాడు ఉత్తముడు. అతడు ఖాగుగ బండిపై న్యాయశాస్త్ర పుస్తకము లుంచుకొని న్యాయస్థానమునకు నాకంటె ముంచుపస్థితుడై వేపచెట్టు క్రింద అంగడి విప్పుచుండును. నేననినచో న్యాయస్థానమునకేగి న్యాయవాదులొనరించు వాదములను వినుచుందును. అథవా విసుగుగా నుండునపుడు న్యాయవాదుల గదిలోనికేగి కూర్చుండి వార్తాపత్రికను చదివెను. అథవా కాచపాత్రలయందు మంచునీరు ద్రావెద. పకీలునై ఒక రూపాయ సెలవు చేసినంత మాత్రమున న్యాయవాదుల గదిలో గూర్చుండుట, చల్లని మంచునీరు త్రాగుట, 'లీడర్' వార్తా పత్రికను చదువుట, విద్యుద్వ్యాజనము పలన గాలిగొనుట, ఇవి ప్రాప్తమగుట చేతను, పనిలేక పడియుండుటయు, నా నిరుద్యోగమును రక్షక శాఖకు నివేదించుటయు తప్పినందుకు నేనే ధన్యుడనని యెంచెదను.

'పకీలు' అని పేరిడుకొనుటయే తడవు, వాది ప్రతివాదులు దీపమునైకి వచ్చు పతంగముల లీల నా చుట్టు మూగికొని యెపలని తలంచుచుంటిని. కాని రెండు మూడు నెలలలో నా భ్రమ యెంతయు దుర్భరమయై పోయినది. అంతియే కాక అశనపసన[2] ప్రశ్న ఉపస్థితమైపోయినది. పట్టి కడుపునకు చల్లని నీరు, విద్యుద్వ్యజనము చాల వికారముగ నుండెను. నా బుద్ధియంతు నాకు పూర్ణమైన సమ్మకము గలదు. కని చేయగలదేమి? ప్రతి సంవత్సర మనేకులు న్యాయవాదులు సిద్ధపడుచున్నారు. అంతియేకాని ఒక స్థలమైనను రిత్తవగుట లేదు

---

1. న్యాయవాదుల నల్లకోటు.
2. కూడు గుడ్డలు

న్యాయవాదులు ఉపకార వేతనము తీసుకొనరు. అంతవరకు నిశ్చయమే. అందుచే వయోధర్మమనుసరించి తామై తాము విసిగి వృత్తి చాలించుకొనిసనేగాని స్థలము రిత్తది యగును.అథవా ఏ రెండు శతాబ్దులు చనిదో పనిచేసిన వారి స్థలము రిత్తమయ్యెపో, వారి స్థానమున వారి కుమారులు మనుమలు ఒకరికి పదుగురి లెక్క ప్రవేశింతురు. ఈ కఠిన విషయముల నన్నిటిని తెలిసియు నా ఆత్మ విశ్వాసము నా కుత్తర మీయలేదు. సింహమైనను పదవును పట్టుటకు కొంత యుద్యోగ మొనరింపవలయు కదా యని నేను చివరకు విచారించితిని. నేనేల యుద్యోగము చేయకూడదు? "యత్నేకృతే యదిన సిద్ధ్యతి కోత్రదోషం?"

నేను నా లేఖకుని అన్ని విధముల నుత్తేజితునిగా నొనరించితిని. ఇప్పటిని నేనొక విషయమయి విప్పి చెప్పుట ఆవశ్యకమని తలచెదను. నా లేఖకుడు నా వంటి సజ్జనుడు. పాపము, ప్రాతఃకాలమున వచ్చును. చావడి గదిని శుద్ధముగా నూడ్చి వేయును. అభియోగప్రదాతలై తే అభావము కదా! ఆ స్థానమందు నా సంతానమును కూర్చుండబెట్టుకొని చదువు చెప్పుటకు దొరకొనును. కాని నేను ప్రాతఃకాలమున చదువు జెప్పుట మాన్పించి సాయంకాలమును నియమించితిని. ఉదయకాలమున నా లేఖకుని తోలించి గ్రామమునందలి అభియోగైక జీవనుల నిద్దరను చుట్టపు పోరామి కొంచెము కలిసియున్న వారిని పిలిపించుచుందును. వారు ప్రాతఃకాలమే నా యొద్దకు వచ్చి అభియోగపు చర్చ జరుపుచుందురు. ఆ సమయమున నేను నా చావడి గది కిటికీలను ద్వారములను పూర్తిగా మూసి యుంచెదను. ఏల యనగ యాతాయాతమునకు[1] నా గది యందలి మేజా బల్లపై నున్న న్యాయశాస్త్ర గ్రంథములును, నాతో ప్రసంగించుచున్న కృత్రిమాభియోగ ప్రదాతలును ధారాళముగా కానరాపలయును. నా ప్రజ్ఞ వెల్లడి కావలయును.

ఆ మిత్రులలో నొక సజ్జనుడు సాయంకాల పుటి నిటు పట్టణములో దిరిగివచ్చుచుండెడు. అట్లు చేయుటచే మరచి తప్పి ఎవరయిన అభియోగార్థి

---

1. వచ్చే పోయే వారికి.

చేజిక్కునేమో యని అతని యాశ. ఎంత చేసినను ఇటుల చేయుట కొరకు అభియోగైక జీవనులకై సెలవు చేయుచుండు సొమ్ములో చతుర్థాంశమైనను రాబడిలేదు. సఫలతయును నా యెడల పక్షపాతము చూపలేదు. చూపియుండినచో నా యుద్యోగమున నేను పట్టణమున పెద్ద ఖ్యాతిగాంచి యుందును.

''పదిరెండు సంవత్సరములకు పేదలోని పురుగునకై నను భాగ్యమెత్తు కొను"నని పెద్దల నిర్వచనము. మహాత్మాగాంధీ యొక్క అసహాయోగ[1] వాయు వున్నట్టుండి రివ్వున వీచినది. అనేకులు న్యాయవాదులు వృత్తి మానుకొనిరి. ''నా చిన్నతనము నుండి నా హృదయము నండిల్లు కట్టుకొనియున్న దేశసేనా ప్రభావము ననుసరించి యిప్పట్టున నేనీ వృత్తిని మానుకొనవలయునా, లేక ఇన్నాళ్ళకు ఆవిర్భవించిన స్వర్ణమయమగు నవసరమున యేదో కొంత నాయుధ పూరణ గావించుకొనుటకు సాధన మొనరింపవలయునా?'' అను సమస్య ఉపస్థిత మైనది. అగుగాక. ఈ స్వర్ణమయమగు నవసరమును విడచుకొనుట భాగ్యము నెడల కృతఘ్నత యొనర్చినట్లని నేను తీర్మానించుకొంటిని.

అసహాయోగ దినములలో న్యాయవాది లెట్లు తగ్గిపోయిరో అభియోగ ములు నట్లే కొంతవరకు తగ్గిపోయెను. అయినను ఎన్నినాళ్ళు ఈ అసహాయోగ లహరి చలించెనో, కొంచెమో గొప్పయో నా లహరియు చలించెను. కాని భాగ్య మెంతో కాలము నా కాశ్రయ మీయలేదు. కొలది దినములలోనే న్యాయవాములు తమ తమ స్థానముల యందు విరాజమానులు కాజొచ్చిరి. శూన్య పీఠములు నిండిపోదొడగెను. నిరుద్యోగ కాలమందు తమకు సంభవించిన నష్టమును పూర్తి చేసుకొనుటకు భూతముల భాతి ధనార్జనకు గడంగిరి. ఈ కఠినమగు అహమ హమిక స్పర్ధలో నా పాదము తెగిపోవుచుండెను. నా మనస్సు డోలాయమాన మయ్యెను. విరుద్ధ పద సంభ్రమ ప్రతి స్పర్ధమునం దెపుడైన తల నొడ్డితిని. ఎపుడైన భాగ్యదర్శక పత్రముల కొరకు రూపాయలంపితిని. ఎపుడైన భాగ్యో దయ యోగమును దెలిసికొనుటకు అదృష్ట వక్తలను వెదికితిని. ఇంతటి పరామర్శ మేల యన లక్ష్మీదేవి కృపాపాత్రుడ నగుటకు రాజమార్గ మేదియు

1. అసహాయోద్యమము

దొరకకుండెను. పరామర్శించిన పిమ్మట కూడా లభించలేదు. ఇట్టి సందిగ్ధకాల మందు నా మిత్రుడొకడు నాతో వక్కాణించెను, "వ్యాపారే పసతే లక్ష్మీ" అని.

మొదటి నుండియు నేను దేశభక్తుడను. శ్రద్ధాళువును. అందుచే నాకు ప్రతి సంస్కృత శబ్దము వేద ప్రభావము గలదిగా దోచుచుండును. ఇంకేమి? నేను వ్యాపార చింతలో మునిగిపోయితిని. అభాగ్య వశమున నా ప్రక్కయింట నొకి వైద్యరాజు నివసించుచుండెను. అతడు దేశీ యౌషధ ప్రచారమొనరించి నచో దేశ హితమును, ధనోపార్జనమును జరుగునని చెప్పెను. "పాలనమ్మిట, పరమాత్మ దర్శనమగుట" ఏకక్రియాద్వ్యర్థకరీ అని నాకు మనస్కరించెను. ఒకరిద్దరు మిత్రులు కూడ నాకు నూరిపోసిరి. వారేమి చెప్పిరనగా- "దేశీ యౌషధముల వలననే వాస్తవముగా రసాయనములు సిద్ధములగుచున్నవి. పుటములు వేయుటచే సువర్ణము భస్మమగును. సద్వైద్యులు భస్మమును రసవాద బలముచే స్వర్ణము చేసెదరు. పిచ్చివాడైనను స్వర్ణమును భస్మము చేయగలడు. ప్రతి వైద్యుడు భస్మము నుండి బంగారము చేసుకొనజాలును."

నాకే పూర్వము నుండి నమ్మకముండెను. అందుపై మిత్రులు హితోప దేశ మొసరించిరి. వైద్యుడింటి ప్రక్కనే యుండె. ఇక ఆలస్యమేల? "లోక హిత ఔషధాలయము" అను పేరిట మరునాటి వరకొక ఔషధాలయము స్థాపితమై పోయెను. ఇంతలో ఒక పక్షము దినముల కొరకు నేను పట్టణమునకు- బంధుగుల యింటి శుభకార్యము జూత వెళ్ళవలసి వచ్చెను. నేను లేని సమయ మున నా మిత్రుడగు వైద్యరాజు అనేకానే కౌషధములకు సంబంధించిన విజ్ఞాపనా పత్రములను ప్రకటించెను. నేనిది లోకహితముతో పాటు తనకు హితమాచరించు చుంటినని వైద్యరాజు తలంచుచున్నాడు. ఇక నా విషయమనినచో "అగస్త్య భ్రాతృ స్నేహమున కంటె నగ్ని ద్వేషము మంచిది" అనునట్లున్నది. మా వైద్య రాజు ఏ ప్రమాణ వాక్యమునో సార్థకము చేయుటకుగాను యమ ధర్మరాజు సహోదరుడయ్యెను.

నేను పట్టణమునుండి వచ్చిన పిమ్మట రెండవనాడు నాభ్యర్థిపతి నన్ను పిలుపనంపెను—నేను వెళ్ళలని. ఆదర సత్కారము లొనరించి కూర్చుండ

జేసెను. ప్రసంగము ప్రారంభమయ్యెను. ప్రసంగ సందర్భమున న్యాయాధిపతి దేశీయౌషధముల ప్రసంస ప్రారంభించెను. నాకును దేశీయౌషధములను గురించిన అనుభవము పూర్ణముగాగలదు. కావున నేను డాక్టర్ పి.సి.రే. గారి హైందవ రసాయన శాస్త్రమును, విజ్ఞాన చంద్రికా గ్రంథమాల రసాయన శాస్త్రమును ప్రమాణములనుగా గైకొని, చక్కగా నుపన్యసించితిని. న్యాయాధిపతి నా ఔషధాలయమును - దాని యందలి ఔషధములను శ్లాఘింప దొడగెను. మాటలలో – ''మీ జీవన చంద్రిక గుణమత్యద్భుతము - అది మా ప్రధాన లేఖకుని తల్లి ప్రాణములను క్షణములో స్వస్థపరచినది'' అనెను. ఆత్మ ఖ్యాతి యొక్క మాయ వాగుర లతి దుర్భేద్యములు. వానినుండి విముక్తులగుట కతి నము. ఆ యాత్మఖ్యాతి మాయావాగురలో జిక్కి నేనంటిని - ''నిశ్చయము. నా ఔషధాలయము పనిచేసి సంసారమున[1] ఖ్యాతిగాంచి చూపును. ఇంతియగాక నా జీవనము యొక్క ఏకమాత్రోద్దేశ్యము దేశీయౌషధోద్ధరణమే'' అని. న్యాయాధిపతి ఈ వాక్యముల నన్నిటిని విని ప్రాసికొనియెను. నెల దినములు గడచెను. న్యాయస్థానమునుండి యొక పత్రము వచ్చినది - దాని యందిట్లు ప్రాసియున్నది: ''ఒక సంవత్సరము వరకు న్యాయవాద పదవి మీనుండి తొలగింపబడినది. ఈ అవధిలో న్యాయవాదసమువలన లోకహిత మొనరింపవచ్చునో, లేక ఔషధాలయము వలననో మీరు విచారించుకొనవచ్చును.'' ఎట్టయినను న్యాయవాద వృత్తిలో నధిక లాభము లేదు – లేకున్నను నిరోధము అయ్యెనను అపవాదము తొలగించుకొను సుద్దేశ్యముతో నున్నత న్యాయస్థానమునకు నివేదించుకొంటిని - కాని లాభము లేక పోయినది. ''న్యాయాధిపతియే చాలినంత కనికరించె''నని బదులు దొరికినది. న్యాయవాద పదవి ఒక సంవత్సరము వరకు చేయివిడిచి పోయినది. ఔషధములద్వారా వినిశ్చిత్యము గడపుచుండవలయునా లేక దానిని విడువవలయునా యను సమస్యవచ్చి ముందు నిలిచినది. ఔషధములనుండియు ఆర్థిక లాభమేమియు లేకుండెను. పిల్లల కేవలము చూర్ణము కావలసివచ్చినచో

---

1. లోకమున

నిర్మూల్యముగా లభించును. ఇంట నెవరికైన జబ్బు చేసినచో నిర్మూల్యముగా చికిత్స జరుగును. అతియే లాభము - ఏ తన్మాత్ర లాభము కొరకు న్యాయ వాద సహవాసమున లబ్ధమగు చల్లనిగాలి, స్వ్గికోదకమును విడచుకొనుట నాకు మనస్కరించుటలేదు. నిషేధింపబడి న్యాయవాదుల గదికి పోవుట అవమాన జనకము. అందుకు విచారించి నేనిపుడీ 'సత్యమండలి'లో సభ్యుడనైతిని. దీని వంటి సహృదయమండలి యిక లేదని చెప్పవచ్చును. పనిలేని సమయమున నాకు స్వాగతమిచ్చినది - శరణ్యమైనది. ఈ మండలిలో చేరిన పిమ్మట నాకమిత విశ్రాంతి చిక్కినది. న్యాయవాదన పత్రముపై సంతకము పెట్టమని నన్నెవరు సుఖ నిద్రనుండి లేపరు. నాకు న్యాయస్థానమునకు తురంత [1] మేగ వలయునను తొందరయు లేదు.

ఈ 'సత్యమండలి'కి జయమగుగాక ! ఇది నా పని లేని సమయమును నిశ్చింతగా గడపినది. మరల నేను న్యాయవాద వృత్తిని స్వీకరించుట కొక నెల దినముల వ్యవధి కలదు. అయినను నేనీ మండలి సభ్యత్వమును విడువజాలను. ఏలయన నాకు దుర్దశ ప్రాప్తించిన సమయమున చాల సాయ మొనరించినది. ఈ సభ్యత్వము నుండి నన్నెవ్వరు నిరోధింపరు. పనిలేని న్యాయవాదులకీ మండలి సభ్యత్వము చాల మంచిది. అయితే ఇది ''తిను''మని యొక రొట్టె ముక్క నియ్యదు. లాగికొనదు కూడ. అధికారులగు వారికి దప్ప ఈ మండలి యునికి గోప్యముగా నుంచుట సౌభాగ్యమయ్యెను. అట్లుంచ కున్నచో అంతకంత గాకున్నను సగము న్యాయవాది సంఘము ఈ మండలిపై విరుచుకొని పడు చుండెడిది. అప్పుడీ మండలి యందలి వాయుమండలి చట్టముల యొక్కయు దృష్టాంతముల యొక్కయు దుర్గంధముచే చెడిపోయి యుండెడిది. అధికారులనగా-నీ క్రింద వ్రాయబడిన సుగుణము లెవరి యందుండునో వారే యీ మండలిలో ప్రవేశింపజాలినవారు. ఈ మండలి కధికారులు గాగోరిన వారీ సుగుణములను ప్రయత్నతో నభ్యసించి పెంపొందించు కొనవలయును.

---

1. త్వరగా

1. మఱియు కలవాడు కావలయును. కాని లోపమొసరించరాదు. ఒకవేళ యేడ్చినను సవ్వుటలో గల ఆనందమును పొందవలయును.

2. తాను చప్ప బ్రపంచమందలి జనులందరు మూర్ఖులని తలంప వల యును. ధనమును సంపాదింపకొను కౌశలముప మూర్ఖత అని గాని, ధూర్తత యని గాని యెన్నపలయును.

3. ఉపవాసములతో జచ్చుచుండవలయును. కాని స్వాభిమానముచే భిక్ష కొరకు చేయి జాపరుాడదు. ఒకవేళ చావపలసి వచ్చినేని దాత యెదుట సింహ గర్జన నొనరించు చుండవలయునే గాని, దీనత్వము పరాడదు.

4. ధనికుడు కావలయుప. కాని కాం చెయి కవల్పసుండ సువర్ణ రజత మును కుప్ప తెప్పలుగా నుండవలయును. మరియు ఆ ధనమునకు సంబంధించిన లెక్కల నుంచుటలో తలనొప్పి గలిగియుండవలయును.

5. విద్వాంసుడు కావలయును. కాని ఆదర సత్కారముల బొందు వాడుగా నుండరాదు. అతడే విశ్వవిద్యాలయమునను పరీక్షకుడుగా నుండరాదు. అతని పుస్తకము లేపాఠశాలయం దేతరగతికిని పఠనీయములుగా నుండ కూడదు.

6. ఉద్యోగము పోయిన వారుగాని పోనున్న వారుగాని కావలయును. కాని వారికి ముందెన్నటికిని ఉద్యోగము దొరకదను నిరాశ కలవారుగా నుండ వలయును.

7. రోగి కావలయును. కాని భయ్యాసేవి కాగూడదు. కాని జీవించునను నాశయు నుండగూడదు.

8. ఇంటి పనులు చేసుకొననివాడు గావలయును. కాని ఎవరి ప్రేమ పాశముల యందును లగ్నము కాకూడు. అయినను దానికితోడుగా చతురంగము సొగటాలు[1] మున్నగు వానిని బాగుగ నాడనేర్చి యుండవలయును.

9. వైజ్ఞానికి గవేషణ మొనరించువాడుగా నుండవలయును. కాని భారత వర్ష శిక్షా విభాగమునకు మాత్రము సంబంధించి యుండగూడదు.

10. మాటకారి గావలయును. కాని ధనార్జన మొనరింప జాలిన ప్రసంగ మును అసభ్యమని తలంచువాడుగా నుండవలయును.

[సుజాత - సెప్టెంబరు 1929-శుక్ల సంవత్సర భాద్రపదము]

1. పచ్చీసు ఆట.

వదలవలసిన తెలుగుతనం

శ్రీ సోమంచి యజ్ఞన్నశాస్త్రి

ముప్ఫయి సంవత్సరాల క్రితం ఉద్యోగం వెదుక్కుంటూ పర రాష్ట్రాలకి వెళ్ళి, అక్కడ వ్యక్తులనీ, సంస్థలనీ చూసిన తరువాత, అప్పటినుంచి ఈ నాటిదాకా నన్ను కలత పెడుతూ ఉన్న అంశం, మనమూ, మన సంస్థలూ, మన శక్తి సామర్థ్యాలకి తగినంతగా అభివృద్ధి చెందకుండా ఉండిపోవడం. తెలుగు సంస్థలు కనుబొమ్మలమీద వెంట్రుకల్లా, ఎదుగూ బొదుగూ లేకుండా ఉంటాయని ఒకాయన చమత్కరించారు. బాగా పరిశీలిస్తే, అది, సత్యదూరమే ననిపిస్తోంది. కనుబొమ్మలమీద వెంట్రుకలు కత్తిరించి, సవరించుకుంటే, తిరిగి యథాస్థానానికి పెరిగిపోతాయి. తెలుగు సంస్థలకి ఆ మాత్రం ఎదుగూ ఉండకపోవడం చాలా మంది అనుభవంలో ఉన్న విషయమే.

కాని తెలుగువాడు చాలా మంచివాడు. స్నేహశీలి, పరోపకారి, ఆతిథ్యానికి అవధులు లేవు. జాలి కనక పుడితే, పెళ్ళాం పుస్తెలు అయినా అమ్మి సహాయం చెయ్యగలడు. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే, తెలుగువాడు 'చాలా గొప్పవాడు'.

అయినా పైకి రాడు!

పైకి రాకుండా ఎవరో ఆపేశారని ఎవరి మీదనైనా విరుచుకు పడతామో, లేకపోతే ఇంట్లోనే కూర్చుని అఘోరించడమో, అతనికి అలవాటు. మన అందరి నెత్తిమీద ఎక్కి కూర్చున్న బ్రిటిషువాడు ముప్ఫయి అయిదేళ్ళ క్రిందట తొలగిపోయాడు. ఇంట్లో భాగం ఆక్రమించుకుని, మనల్ని అవతలకి నెట్టేస్తున్నాడు అనుకున్న అరవ సోదరుడూ సుమారు ముప్ఫయియేళ్ళక్రితం తప్పుకున్నాడు. మనమే మిగిలాం; మరి మనం మమ్మల్ని మించుకోలేని పరిస్థితిలో ఉన్నాం. పరాయి రాష్ట్రాలకి వెళ్ళినప్పుడు ఇతరులకి ఎంత అవకాశం ఉందో మనకీ

అంతే ఉంది. నిజానికి ఇప్పుడు ఎవరిని తిట్టడం ? ఎవరి మీద కారాలూ మిరియాలూ నూరడం ?

భూతద్దం పెట్టి వెతికి, మన కర్మకి కర్తలెవరో వెతకడం, తెలివితక్కువ చేతకానితనం కాదూ? మనం పైకి రాకుండా ఉండటానికి కారణాలేమిటో మనమే శోధించి కనిపెట్టి దిద్దుకోవద్దూ ? మనల్ని వెనక్కి లాగుతున్న తెలుగు తనమేదో కనిపెట్టి పదుల్చుకోవద్దూ ? మన పెద్దలకి కాశీలో కొన్ని ప్రియమైన వస్తువులని వదిలేసి విసర్జించి రావడం పరిపాటి. అలా మనమూ కొంత తెలుగుతనాన్ని ప్రయత్నించి వదిలేస్తేనే మనకి మేలు. పెద్దలు కాశీలో పుణ్యానికి కొన్నివస్తువులు విసర్జిస్తే, మనం, తెలుగుతనంలో కొన్నిటిని ఇక్కడే పురుషార్థం సాధించడానికి వదులుకోవాలి.

మనం ముందుకి రాకుండా నిరోధిస్తూన్న అవరోధాల్లో మొదటిది, కొట్టొచ్చినట్టు కనిపించేది, కించిత్తు ముక్కుమీద కోపం.

కబుర్లు చెబుతూ సరసాలాడుతూ ఉంటాడు. చటుక్కున ఏ మాటో పట్టేస్తుంది. దానితో కట్. అహోరాత్రాలు నిద్రాహారాలు మాని ఉత్సాహంతో పేక ఆడుతూ ఉంటాడు, పెళ్ళాం నసుగుడుకూడా లక్ష్యపెట్టకుండా! ఏ మాటో, ఏ చేతో బెడిసికొడుతుంది. ముక్కలు కలిపేసి, పిడపట్లు పర్వానికి దారితీస్తాడు. తెలుగువాడితో ఆంతర్యం తెలిసి మెలగడం కొంచెం కష్టమని పరాయివాళ్ళు, నిజానికి మనలోమనవాళ్ళే అనుకుంటారు. 'తెలుగువాళ్ళతో అట్టే కలవమండీ' అని చెబుతూ, తప్పించుకుతిరిగే పెద్దలు, పర రాష్ట్రాల్లో చాల మంది ఉన్నారు. స్నేహం ఎప్పుడో అకస్మాత్తుగా తెగిపోవచ్చు. అంతటితో ఊరుకోము. కక్ష ప్రారంభమవడం చాలా సహజం. ఆ పరిస్థితిలో తాను స్వతహాగా క్షవరమయిపోయినా, అవతలవాడు సుందరాంగుడయితేగాని విశ్రమింపడుగదా తెలుగువాడు!

మన దోషాలన్నిటిలో ఓ భాగం, ముక్కుమీద కోపం గొంతుకలోకి తెచ్చుకుని వెంటనే కత్తియడం. మన జీవితంలో, అందే వ్యక్తుల జీవితం

లోనూ సంస్థల పురోగమనం లోనూ కూడా. ముప్పాతిక అనర్థాలకి ఇదే కారణం. కోపం దిగమింగుకుని కడుపులో దాచుకోవాలి. మరీ అవసరమై నప్పుడు కాని వెలికి రానివ్వకూడదు. శివుడు గరళం మింగి కంఠంలో దాచినట్లు మనసులూ, కోపం దిగమింగి వ్యవహరించడం అలవాటు చేసుకోవాలి. అప్పుడు కాని కలుగురితో కలిసి మెలిసి వ్యవహరించడం కుదరదు. బాగుపడాలంటే కదలవలసిన తెలుగు తనంలో ''ముక్కుమీద కోపం'' మొట్టమొదటిది.

తెలుగు నాట సన్మాన సభలు, బిరుదు ప్రదానాలు చాలా ఎక్కువ. ఏ శాఖలో ఎవరు కొంచెం ప్రతిభ చూపించినా, వారిని సమావేశాల్లో సత్కరించి మాటల ప్రవాహాల్లో ముంచెత్తి ఆకాశానికెత్తెయ్యడానికి వెనుదీయ్యరు. రంగ సూర్యులూ, అభినవ సరస్వతులూ, రచనా సార్వభౌములూ, తెలుగు రాష్ట్రంలో ఉన్నంతమంది మరే రాష్ట్రంలోనూ లేరు.

ఆహా! తెలుగువాడి ప్రతిభ కనిపెట్టి సత్కరించడంలో ఎంత ఉత్సాహం? తెలుగు గడ్డలో పుట్టిన మనిషికి ఎంత ప్రోత్సాహం లభిస్తుంది? ఎంత అదృష్ట వంతులు వాళ్ళు, అనిపిస్తుంది, పరాయి వాళ్ళకి. కాని మనకి తెలుసు! తెలుగు గడ్డలో పుట్టి పెరిగిన ఏ ఒక్కడూ పైకి రాలేడు. రాడు. తల కొంచెం ఎత్తగానే బొప్పెలు కట్టేలా మొట్టికాయలు తగులుతూ ఉంటాయి. ఆ మొట్టికాయలకి కిందకి అణగారిపోతూనే ఉండాలి. వాడు నిజంగా పైకి రావాలంటే, చచ్చి అన్నా పోవాలి. అథవా, రాష్ట్రం విడిచిపెట్టి పైకి పోవాలి. రాష్ట్రంలోనే పుట్టి రాష్ట్రంలోనే పెరిగి, ప్రతిభావంతుడై ఆ స్థానం నిలుపుకోడానికి ఎప్పుడూ నోచుకోడు. లోకం సృష్టించిన బహ్మ స్వయంగా దిగి వచ్చినా, తెలుగువాడై ఈ కార్యం సాధించలేడు.

ఈ పరిస్థితికి రెండో కారణం, తెలుగు వాడిలో కనికిని పర్యంతరం జీర్ణించి పోయిన, ఓర్వలేని తనం, ఈర్ష్యనని, నేనేకాదు, పెద్దలు చాలామంది సమ్మతున్నారు. సహృదయుడు, పరోపకారి, విశాల హృదయుడు, తెలుగువానికి ఈర్ష్యమిటి అని

అనిపించవచ్చును. కాని ఇది ప్రతివాడి జీవితంలోనూ సాక్షాత్కరించిన, కాదనలేని సత్యమే! తెలుగుదేశంలో అరమరికలు మినహాయింపులు లేకుండా, పూర్ణ హృదయంతో "ముందుకు రండి" అని ఆహ్వానించేది ఒక్క జట్కా బండి వాడేనని శతావధాని చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారు ఏనాడో చమత్కరించారు. ఇప్పుడు జట్కాలు పోయి సైకిలు రిక్షాలు రావడంవల్ల ఆ మాత్రం ప్రోత్సాహం అనేది కూడా కరువయిందా అనిపిస్తోంది. ఎవడైనా పైకి వస్తూ ఉంటే, 'ఏడిశాడు', 'వాడికేం తెలుసు' ఎవరినో వలలో వేసుకొని లేకపోతే 'మేపి' పైకి వస్తున్నాడని చప్పరించెయ్యటం ఈ అసూయతలో ప్రథమ ఘట్టం. ఒక మూల సన్మాన సభ జరుగుతూ ఉంటుంది. మధ్య మధ్య మాత్రం 'కొయ్యకు, ఏడిశావు, అఘోరించు' లాంటి వ్యాఖ్యానాలు వినిపిస్తూ ఉంటాయి!

'మనకంటె మన పక్కవాడు పైకి వెళిపోతే మనం కుంగి దిగజారి పోయినట్టే రోయ్' అని ఏడుస్తాడు, హాస్యబ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావు గారు వ్రాసిన 'ఎప్పుడూ ఇంతే' నాటికలో ఓ పాత్ర. ఇదే నిజమైన తెలుగు తెగులని ఆయన ఓ విధంగా సిద్ధాంతీకరించాడు. నిత్య జీవితంలో మనకి అనేక నిదర్శనాలు. వాడో పైకి వస్తున్నాడు. దానివల్ల మనకి ప్రత్యక్షంగా జరిగే హాని ఏమీలేదు. అయినా మనలో తహతహ పుట్టుకొస్తుంది. కడుపులో చెయ్యి పెట్టి కలిపేసినట్టు అవుతుంది. ఒళ్ళు ఉడికిపోతుంది. పక్కవాడు పైకొస్తే మనం ప్రమేయంగా దిగజారి పోయినట్టే ఒక ఊహ. లేని భ్రమ, నిజానికి సముద్రం కాదోయ్, మెరుభూటంలా పట్టుకుంటుంది. మరో రాష్ట్రంలో మనిషి ఇది వాడితోపాటు మనమూ పైకి రావాలన్న పట్టుదల పుట్టించి, పోటీ కల్పిస్తుందేమో కాని, ఈ భాగ్య తెలుగు దేశంలో మాత్రం అత్యాచారాలకే మనిషిని నడిపిస్తుంది తెలుగువాడికి. తను పైకి రావాలన్న ధ్యాసే ఉండదు అప్పుడు వాడికి. పక్కవాడిని తనకంటె నాలుగు అంగుళాలు కిందికి దిగలాగితే తను పైనే ఉన్నట్టుగా! అదే పురోగమనమేగా! కనుక మన పక్కవాడిని దిగలాగటానికే వినియోగపడుతుంది కృషి అంతా.

ఆంధ్రదేశంలో సాధారణంగా జరుగుతున్న మహా కృషి చాలవరకు ఇదే నని పిస్తుంది. ఎవరి మటుకు వారు శక్త్యనుసారం ఒకరినో ఇద్దరినో కిందికి లాగ డంలో నిమగ్నులై ఉంటారు. తాము స్వతహాగా పైకి రాపడానికి గాని, మరొ కరిని పైకి తీసుకురావడానికి గాని వ్యవధీ అవకాశమూ ఏదీ? ఇందుకు రాజ కీయాల్లోనేగాక, ఇతర రంగాల్లో కూడా కోకొల్లలుగా ఉదాహరణ లివ్వవచ్చును.

ఇది కేవలం వ్యక్తులకే పరిమితం కాలేదు. సంస్థలు కూడా ఈ పనికి పూనుకుని విచ్ఛిన్నమయి పోతున్నాయి. అసలే మనది ఒంటి పిల్లి రాకాసి తత్వం. నలుగురు కలిసి ఏ పనీ చెయ్యలేరు. పట్టాభి సీతారామయ్య గారు కాబోలు ఓ మారు "మనది ఒక్కొక్కడూ వ్యక్తిగతంగా గొప్ప వాడయే తత్వం కాని నలుగురు కలిస్తే సాధించేది హుళక్కే" నన్నారు. అది తత్వతహా నిజమే అయినా ఓ కోవలో మాత్రం లక్ష్యం సాధిస్తామనే చెప్పుకోవాలి. పరిశీలిస్తే కొందరు వ్యక్తులే కాదు. కొన్ని సంస్థలు కూడా పరులని కబళించడానికే పుట్టి పెరుగుతున్నాయని తేలుతుంది. నా ఎరికనే ఒకటి రెండు సంస్థలు అవిరళంగా కృషి చేస్తూ ఉండేవి. వాటి కార్యక్రమం అంతా మరో పెద్ద సభ ఏ రోజున మీటింగు పెడుతుందో, ఆ రోజునే మరో మీటింగు పెట్టడం, ఎవరినైనా ఆ పెద్ద సభ ఆహ్వానిస్తే, "ఆ సభ వట్టి వెధవ సభ - మీరు అక్కడికి వెళ్ళ కండి. వాళ్ళు గౌరవం చెయ్యలేరు. మీ మీటింగుకి మనుష్యులు రారు" అని ప్రచారం చెయ్యడమే.

ఇది మహా కలుషితమైన వాతావరణం. పై పైన అత్తరు పూస్తే బాగు పడే వాతావరణం కాదు. ఈ వాతావరణంలో ఏ పుష్పమూ వికసించదు. వాడి సహించవలసిందే. తెలుగు వాడి పురోభివృద్ధికి తెలుగు తనం లోని ఈ ఓర్వలేని తనం, ఈర్ష్యా, గొడ్డలి పెట్టు. దుంపనాశనం చేసే వేరు పురుగు. ప్రత్యేక కృషి చేసి దీనిని నిర్మూలించుకుంటే గాని తెలుగువాడికి ముందు భ్రతుకు, మంచి భ్రతుకు లేదు. తెలుగు సంస్థలకి ఎదుగు బొదుగు లేదు. ఓర్వలేని తనం పరులపలసిన రెండో తెలుగు తనం.

"తెలుగు అక్షరాలకి తల కట్టులు లేలు కొండెల్లా రేచి ఉంటాయి. పక్క-వాటితో కలవవు. రంగు నిలవదు" అన్నారు భమిడిపాటి కామేశ్వరరావు గారు. మకో సందర్భంలో. తలకట్టని అంటే మరం దాగుపతామేమోనని ఆశ వెలి బుచ్చారు. అక్షరాలద్వారా మనుష్యులని మార్చగల మన్న ఆశ లేదు గాని, తెలుగు మనిషి తెగులు లాంటి ఈ తెలుగు తనం ఒదులుకు తీరాలన్న సమ్మతం మాత్రం నానాటికి బలపడుతూనే ఉంది.

తెలుగు వాళ్ళందరూ ఉప్మా కారం విసర్జించి, ధర్మరాజులో సన్యాసులో అవాలని నా ఉద్దేశం కాదు. కాని అతి సర్వత్ర వర్జయేత్ అన్న సూక్తి అన్వ యించుకుని, మోతాదుని మించిన తెలుగు లాంటి తెలుగు తనాన్ని వదిలేసుకుని ముందుకు సాగిపోగల ధీరత నిబ్బరించుకోవాలని నా ఉద్దేశం.

[1972-ఆకాశవాణి ప్రసారితం]

బాబోయ్ ! వైజాగ్ సిటీబస్సులు -

శ్రీ వీరాజీ

అప్పుడ్ హార్బర్ కట్టిం తర్వాత విశాఖ పట్నం రేపు శోభ యినుమ డించింది. కొండలు - కొండల మధ్య సముద్రం - సముద్రం పక్కన కొండలు- ఇలా ఉన్న ఊరు ఇదే! ఆ కొండల మీద దేవాలయాలు - ఈ దేవాలయా లన్నీ మతాలకీ చెందినవీను - కాని ఈ ఊళ్ళో బ్రతికే జనం ముప్పాతిక వంతులు రోజూ ఊరు చుట్టు పక్కల ఉన్న గ్రామాలనుంచి ఈ కొన నుండి ఆ కొనకి, 'సిటీ బస్‌లనే' యమ వాహనాలతో తిరుగుతూ ఉండే కార్మికులు. ప్రతీ శాల్తీ కూడా రోజుకో రెండు మూడు గంటలు తమ ప్రాణాలని దైవాధీనం చేసి ఈ సిటీ బస్సు లనబడే పుష్పక విమానాల్లో ప్రయాణం చేసి, వంకలు మెలికలు తిరిగి పోయి, సొట్టలు పడ్డ పాత జర్మన్ సిల్వర్ తప్పేలాల్లాగ యిండ్లకు చేరుకుంటూ ఉంటారు. అంచేత గొంగళి పురుగులాంటి విశాఖ, సీతాకోక చిలుకలాగ విశాఖ పట్నంగా మారినవైనం ; పాపురాయి కొండకి, డాల్ఫిన్స్ నోస్‌కి మధ్యగల సౌందర్యరాశి, యారాడ కొండ మీద కర్మసాక్షిలాంటి లైట్‌హౌస్‌ను చూస్తుంటే తప్ప వీళ్ళు చూడలేరు, ఆనందించలేరు. సగభాగం వీళ్ళ బ్రతుకంతా నరక రూపమైన సిటీబస్సులలోనే గడిచి పోతుంది. ఇవి గ్రామాల నుంచి గ్రామాలకి తిరిగే పేసుగుర్రాలు - బస్సులు కావు.

అవేం సిటీబస్సులో ! వాటి కాపేరు తగదు. పెందుర్తి అనే గ్రామంనుంచి అరడజన్ గ్రామాలుదాటి, గాజువాక అనే గ్రామానికి అడ్డమైన 'ఛాక' లూ 'హైటెం'లూ దాటుకుంటూ, లంకమీద హనుమంతుడు వేసిన రీతి గెంతులు వేసు కుంటూ 'రొదరొద' గా మొత్తుకొని కిలోమీటర్ల దాకా పరిగెడుతూ ఉండే యీ బస్సుల్లో ప్రయాణం చేస్తూంటే చిన్నప్పుడు ఒకసారి చూసిన రెడ్డిండియన్ ట్రీ-డైవ్షనల్ పిక్చర్ 'రిటర్ ఆఫ్ నో రిటర్న్' జ్ఞాపకం వచ్చింది !

"పుండే పుండే, ఆర్రే ఆర్రే, ప్రహాహుం" అంటూ గోల గోలగా అరుస్తూ ఆ రెస్టింటియస్‌లు గుర్రాల మీద దాడిచేస్తూ ఈటెలు విసిరేస్తున్నట్లు, ఈ 'సోకార్డ్' సినీ బస్సులు పరిగెడుతూంటాయి. ఇందులో దీన్ని 'తోలే డ్రయివర్' అనే పిరయోధుడు కాక మరి ముగ్గురన్నా యోధులుంటారు. ఒకడు ర్రైట్ ర్రైట్ అంటూ ఈల గోలచేస్తూ 'బస్సు డ్రయివ' మీద డబ దబా వాయించేస్తూంటాడు. మరొకడు జనాన్ని హిప్నటైజు చేసి మరం క్యాంప్ బేగ్‌లో బట్టలు సర్దుతుంటాడే అట్లా మనల్ని లోపలికి క్రుక్కించి సర్దేస్తూంటాడు. ఇంకోడు అదా, మగా, పిల్లా జెల్లా అంతా రెడుగుసినీమా హ్యాలో మొపటికోజు నేలక్లాసు టికెట్లకోసం అతుక్కుపోయినట్లు అతుక్కు పోయినాకూడా ఇంకా అతుక్కోండి అంటూ మనుషుల దగ్గర్నించి, అపీలీలగా టికెట్ డబ్బులు పసూలు చేస్తూంటాడు - ఒక్కణ్ణికూడా వదలడు!

ఓవర్‌లోడ్ జన్మహక్కు!

ఈ బస్సులకి ఓవర్‌లోడ్ నియమం లేదు. కాలాతీతాలుకూడా. మార్చి మాతో వారంలో ట్రైమ్ కీపర్‌లని మాత్రం పెట్టారు... లేకపోతే జంక్షన్‌లలో గంటలు ఆగి; అనక గాలిలో కలిసిపోయి గమ్యం చేరుతాయి యీ బస్సులు! ఒక బస్సులో 152 మందిని లెక్కపెట్టాన్నేను! సీటుకీ సీటుకి మధ్య టూపుకీ జనాల తలకాయలకి మధ్యకూడా, మరమరాలతో బెల్లం పాకం కలిపి ఉండలు చేస్తారే - అట్లా మనుష్యుల్ని కలిపి పాకంపట్టి ఉడకేసి బస్సులో తోసేస్తాడు కండక్టర్ - దీనిక కాలు చెయ్యా ఊపుకుంటే, ఓ చెంపకీ సెంటు వాసనా మరో చెంపకి చేపల కంపూ: బొక్కాకి నూనె మరకలు; పట్టానికి నిర్వచనానికి అందని ఏవేవో వాగులు! పెదాలనించి దుప్పు! ఈ టూరి ప్రజానీకం నూటికి డెబ్భై మంది శ్రామికులు. చదితరులలో ఎక్కువ మంది విద్యార్థులు - ఈ రెండు జాతులకీ ప్రపంచంలో ఎక్కడైనా అన్యాయాలనీ ఘోరకృత్యాలనీ ఎదిరించే ధైర్యం ఉంటుంది. కాని ఇక్కడమాత్రం సముద్రమంత ఓపిక - కొండంత సహనం ఉన్నాయి. వీరికి జోహార్లు!

ముఖ్యమంత్రి నలభై కిలో మీటర్లు పరిగెత్తే 'మఫిసిల్ బస్సులకి' సిటీ బస్సులన్న పేరేమిటి ? అని ఇక్కడ నగర అధికారుల ఎవరూ ఆలోచించి నట్లులేదు. వాళ్ళకి మంచి ర్లబ్‌లూ కారులూ ఉన్నాయి.

సిటీ బస్సు సిటీకో విధంగాని - ఒకో ప్రాంతం ప్రయాణం గంటను మించ కూడదు. ట్రిప్పుకీ ట్రిప్పుకీ మధ్య ఆయా రూట్‌లలో ఉన్న రద్దీని బట్టి ఇంటర్ వెల్‌లు ఉండాలి. బస్సులో ప్రపంచంలో ఎక్కడా లేనంత మందిని పట్టించే ధైర్యం బస్సువాడికి తగ్గాలి. ఎగుడు దిగుడుగా ఉన్నాకూడా చక్కని ట్రాఫిక్ ఐలండ్‌లతో దారులు వేసుకున్నచోట బస్‌లలో ఎక్కేవారికి 'క్యూ' ల పద్ధతి - బస్సు రూట్లు తెలిపే బోర్డుల పద్ధతి ఉండాలి - అబ్బే ! ఇవేమీ లేదు - కొండ వీటి చాంతాడంత బారైన సిటీ (?) రూట్లను మంజూరుచేశారు - లోకల్ రైళ్ళు - మీటర్లున్న ఆటోలు, ఉండే అది వేరేసంగతి - కాని విశాఖపట్నానికి రైలు స్టేషన్ కూడా లేదు. (అలా లేని ఘనతకూడా మళ్ళీ దీని ఒక్కదానిదే). ఆటోల మీటర్ల మీద మనం ఆధార పడితే అవి రెట్టింపు వేగంగా తిరుగుతాయి. దివాళా తీస్తాం. ఇక సామాన్యుడేం చెయ్యాలి ? చక్రాల మీద నడిచే యములోకాల్లాంటి సిటీ బస్సుల్లో రోజూ ప్రాణాలకి తెగించాలి.షటిల్ సర్వీసులు పెంచితేతప్ప 'విశాఖపట్నం' వాసులకి మోక్షం లేదు. ఇక్కడ యాక్సిడెంట్‌ల పరస చూస్తే, ఇన్సూరెన్స్ కంపెనీలు బోర్డులు తిప్పెయ్యడానికి, యాక్సిడెంట్‌లలో ఇరుక్కున్న వారి కుటుంబాల భవిష్యత్తులు బాగుపడడానికి మనరులు బాగా సమృద్ధిగా ఉన్నాయనే అర్థం అవుతుంది. రూల్సు చాల చిన్నవిగా మార్చాలి లేకపోతే ప్రజాజీవితం చెక్కలయిపోయే ప్రమాదం ఉంది. ఆలోచించండి మరి !

(సామాన్యుడి సంఘర్షణ - ఆంధ్రసచివ్రత వారపత్రిక-ఏప్రిల్ - 1973)

వింతలూ ! వికారాలూ !

శ్రీ రావి కొండలరావు

మనుష్యులు రకరకాలుగా ఉన్నట్టే వాళ్ళవాళ్ళ చేష్టలుకూడా ఎన్నో రకాలుగా ఉంటూ ఉంటాయి. కొందరు చెయ్యి ఊపకుండా మాట్లాడలేరు. కొందరికి తలతిరగితే మరి కొందరికి కళ్ళు ఎగురుతాయి మాట్లాడేటప్పుడు. ఊత పదం లేకపోతే మూతపడుతుంది కొందరినోరు, పోతే, ఇకపోతే, అవునా, అన్నట్టు, చెప్పొచ్చే దేవిటంటే, సో, రైట్, యునో, యుసీ-ఇలా వందలు వేలు ఊత పదాలు. ఒక్కొక్కరికి ఒక్కొక్కటి ఊత.

ఊత పదం అతిగా వాడామో, ఉడికించారన్నమాటే అసలు వాళ్ళు. ఊత పదం ఉంటే ఉపాధ్యాయుడికి మరింత ఉపద్రవం తెచ్చిపెడుతుంది. పాపం మేష్టారికి ఊత పదమే ఉండక్కర్లేదు. ఏ వికారం ఉన్నా, వింత చేష్ట ఉన్నా చాలు. ఆయన అసలుపేరు తోసిపారేసి కొత్తపేరుని తెచ్చిపెడుతుంది. నిశిత పరిశీలనాశక్తి నిరంతర ఉత్సాహోపరక్తి ఉన్న విద్యార్థులింక అక్కడినుంచి పంతులుగారిని, కొత్తగా వచ్చిన ఆ పేరుతోనే పిలుస్తారు. గబగబా నడిస్తే 'మేల్', నెమ్మదిగా నడిస్తే 'స్నైల్', కలవించితే 'గాబ్లిపోతు' 'తల ఎత్తితే పొగరుబోతు', మంచిగా ఉంటే 'బుద్ధుడు', కేకవేస్తే 'క్రుద్ధుడు', ఇలా సాగి పోతాయి పాపం మేష్టర్ల పేర్లు. ఓ రోజు సాయంత్రం సరదాపడి పకోడీలు తిన్న పాపానికి జీవితాంతం 'పకోడీ'గా ఒకాయన స్థిరపడిపోతే, ఓ క్లాసులో 'అసలు' అనే మాటని సిసలుగా ఎనిమిదిసార్లు ఉపయోగించడం పల్ల అలుసయిపోయి అసలు మేష్టారయి సోయాడు మరొక ఆయన. మా తెలుగు మాష్టారుకి క్లాసు నిశ్శబ్దంగా ఉన్నాసరే, 'సైలెన్స్' అని ఓ పెద్ద కేక పెట్టకపోతే తోచేదికాదు. దాంతో ఆయన పేరు సైలెన్స్ అయి కూర్చుంది - ఊత పదాలూ, వికారాలూ,

వింత చేష్టలూ ఉపాధ్యాయులకి ఇలా ఎన్నో ఇక్కట్లు తెచ్చిపెడతాయి. ఉపాధ్యాయులే కానక్కర్లేదు. ఎవరికున్నా ఇవి ఇబ్బందే - వాళ్ళకీ వాళ్ళతో పాటు పక్క వాళ్ళకీ ఎదుటి వాళ్ళకీను.

నాకో మిత్రుడున్నాడు. మాట్లాడుతూ ప్రతి వాక్యం చివరా 'ఏమంటావ్?' అంటాడు. "నేనేమీ అనను మహాప్రభో" అని చెప్పలేము గాబట్టి "అవును నిజమే" అనాల్సివస్తుంది. అలా అనాలి. అనే వరకు పడలడు. అలా అనకపోతే ఉత్సాహం తగ్గిపోయి అబ్రప్టుగా ఆగిపోతుంది సంభాషణ. మరొక మిత్రుడున్నాడు. అతను మాట్లాడాలంటే మధ్యలో అతను ఆపినప్పుడల్లా నేను ఊ కొట్టాలి. ఊ కొట్టకపోతే "ఊ అను" అంటూ ముందు తట్టి అప్పటికీ అనకపోతే తిడతాడు. "ఊ అను" అంటూ అరుస్తాడు - గిల్లుతాడు - ఆలశ్యమైతే కరుస్తాడేమో అని భయమేస్తుంది. "నేను నిన్న సినీమాకు పోతుంటే-ఊఅను-దారిలో - ఊ అను - ఆ అమ్మాయి ఉంది చూశావ్ - ఊ అను... "ఇలా సాగుతుంది అతని సంభాషణ. "నేను చస్తే ఊకొట్టను. నీ ఇష్టం ఉంటే చెప్పు. లేకపోతే మానేయి" అని ఒక్కొక్కసారి అతనిపై అరిచినా కూడా - అతనితో మాట్లాడినప్పుడల్లా "ఊ" కొడ్తూనే ఉంటాను, తప్పదుమరి.

ఒక మాటను ఇలా అతిగా ఉపయోగించడం వల్ల వింత ఏర్పడి నవ్వు పుట్టిస్తుంది. అదే వింత మరోసారి ఎక్కువై తే 'ఆవులింత' పుట్టిస్తుంది. ఏ పదాన్నయినా అవసరం మేరకు వాడితేనే నవ్వొస్తుంది కాని-అసలే అది అతి-దాన్ని మరీ అతి చేసి వాడితే వచ్చేది ఏడుపే. నవ్వుకాదు. సినీమాల్లోంచి పుట్టుకొచ్చిన పదాల కన్నింటికీ - గిడిగిడీ, తస్సదియ్యా, తప్పు తప్పు, జింబలకడి జింబా వంటివి - ఈ సూత్రం వర్తిస్తుంది. మోతాదు మీరితే ఏదైనా అంతేకదా !

కొంచరు ఈ పదాలు వాడకపోయినా, 'వింత చేష్ట' ఏదో చేస్తారు. కనుబొమలు బాగా ఎగరేస్తూ ఉండడమో, కనురెప్పలు టపటపా కొట్టడమో, మ్చ మ్చ అంటూ ఉండడమో, పంకరగా పెదవి విరుస్తూ ఉండడమో, మీసాలు

ఉన్నవారు మీసాలు సవరిస్తూ ఉండడమో, మీసాలు నోటిలోనికి లాగుతూ ఉండడమో, అష్ట వంకరగా మొహం తిప్పడమో - ఇలా ఏదో ఒక వింత చేష్ట. ఇదీ కాస్త 'అతి'గానే కనిపిస్తుంది కాబట్టి, చూసే వాళ్ళకు అదోలా అనిపిస్తుంది. మరి కొందరైతే, మాట్లాడుతూన్నప్పుడు కళ్ళజోడు ఎగదోసుకుంటూ ఉంటారు- అది జారిపోయినా, ఒక్కొక్కప్పుడు అసలక్కడ కళ్ళజోడు లేక పోయినా సరే. మరి కొందరికి జుట్టు సవరించుకోవడం అలవాటు. కొందరు నిముష నిముషానికీ గడ్డం ఎంత పెరిగిందో చూసుకుంటున్నట్టుగా గడ్డం మీద చేత్తో రాసుకుంటూ మాట్లాడతారు. కొందరు గోళ్ళు కొరుకుతూ, మరి కొందరు స్వంత చొక్కా కాలరు, లేదా ఎదుటి చొక్కా కాలరు, అది దొరక్క పోతే, చొక్కా బొత్తాములు సరిచేస్తూ కాని మాట్లాడరు. అలా ఎదుటివాని కాలరునో బొత్తాములనో స్వాధీనం చేసుకుంటే, అవతలి వాడింక వచ్చినట్టు, పారిపోడానికి అవకాశం లేక చివరిదాకా విని తీరాలి. అందులో ఉన్న సౌకర్యం అదీ-

ఆడవాళ్ళలో కూడా వాళ్ళు మాట్లాడుతుంటున్నపుడు ఎదుటివారి జుట్టు సరిజేస్తూనో గాజులు సర్దుతూనో మాట్లాడుతారు. స్వగడియారాన్నో పర గడియారాన్నో లాగుతూ పీకుతూ అటూ ఇటూ తిప్పుతూ ఉంటేనే కాని కొందరికి మాట రాదు. అలాగే మరి కొందరికి వేలుకు ఉంగరం ఉంటే దాన్ని బొటన వేలుతో వేలు చుట్టూ కదుపుతూ ఉంటేనే గాని, పలుకు బంగారమై పోతుంది.

నవ్వడం ఒక కళ. కాని ఇందులోనూ వికారాలు కనిపిస్తాయి. కొందరు ఎంత గొప్ప జోక్ వేసినా నవ్వరు. చుట్టూ ఉన్న పదిమందీ నవ్వుతూ ఉంటే, అతను నవ్వకుండా గంభీరంగా కూర్చున్నపుడు అతని మొహం అదోరకమైన వికారంగా కనిపించి, నవ్వు పుట్టిస్తుంది. అందుచేత, నవ్వక పోవడంలో కూడా వికార ఛాయలు ఉన్నాయన్న మాట. కొందరు పెదవులు నోటికి అటూ ఇటూ నెమ్మదిగా లాస్తూ బలవంతంగా చిరునవ్వు నవ్వుతారు. కొందరు 'హుఁ హుఁ హుఁ' అని మూలిగినట్టుగా, నోరు విప్పకుండా లోలోపలే నవ్వుతారు. కొందరు 'హా హ్హా హ్హా' అంటూ భీషణంగా నవ్వుతారు. దగ్గుతూ నవ్వే వాళ్ళ

కొందరు. నవ్వుతూ దగ్గేవాళ్లుకొందరు; కొందరు నవ్వితే ఉరుము ఉరిమి నట్లుంటుంది. బండరాళ్ళు దొర్లుతున్నట్లు గులక రాళ్ళు గలగల మన్నట్లు నవ్వగల సామర్థ్యం కొందరిది. రుబ్బురోలులో పచ్చడి నలుగుతున్నట్లుంటుంది కొందరి నవ్వు.

కొందరు నవ్వుతూ మాట్లాడతారు. అది చూడ్డానికి బాగానే ఉంటుంది. మరి కొందరు ప్రతిదానికీ నవ్వుస్తూనే మాట్లాడతారు. అది వింతగా ఉంటుంది. (నవ్వుతూ) "నిన్న మీరు వచ్చారా- అప్పుడు నేనక్కడలేను. మాపిన్నమ్మగారి అబ్బాయికి సుస్తీగా ఉందంటే వెళ్ళాను" అని కొందరు నవ్వుని మింగుతూ మాట్లాడితే, మరికొందరు "ఇతను మా బావమరిది (నవ్వు) ఏలూరులో ఉద్యోగం చేస్తున్నాడు (నవ్వు) వాళ్ళ నాన్నగారు ఇప్పుడక్కడ లేరు లెండి (నవ్వు)" అని నవ్వులో కూడా వాక్యాలకి వారధికట్టుతూ మాట్లాడతారు.

సాధారణంగా నవ్వడాలలో కొందరి కొందరికి ప్రత్యేకత ఉంటుంది. అందరితోనూ కూర్చుని సినీమా చూస్తూ ఉంటే, అందరూ నవ్వే ఒకచోట, ఒక ప్రేక్షకుడు అందరికంటే మిన్నగా నవ్వడం వినిపిస్తుంది. అలాంటి నవ్వు వినిపించగానే అతనికి దగ్గర్లో ఉన్న ప్రేక్షకులందరూ అతని నవ్వు చేత ఆకర్షింప బడి అతనికేసి చూస్తారు. "ఇతనెవరో ఉద్దండ పిండంలా నవ్వుతున్నాడు" అనుకుని, అతని నవ్వుకు నవ్వుతారు. అతని నవ్వులో ఆ 'వింత' ఉందన్నమాట.

అయితే కొందరు అంతా నవ్వినప్పుడు నవ్వరు. కాస్సేపు ఆగి ఆ తర్వాత గట్టిగా నవ్వుతారు. నిజానికి 'నవ్వడం' అంటే ఆనందించడం అన్న మాట. ఈ ఆనందాన్ని మామూలు ధోరణిలో అనుభవిస్తూ ఉంటే ఇబ్బంది ఉండదు; కాస్త అతిగా అనుభవిస్తే మాత్రం ఆనందం వికారంగా రూపొందు తుంది. ఆ 'అతి' చూసినచో ఎదుటి వాళ్ళకి నవ్వొస్తుంది. ఆనందం మాటి ఇలా ఉండగా విషాదం మాటకూడా ఉంది. కొందరు ఏడుస్తున్నప్పుడు వాళ్ళ ముఖాలు వికారంగా ఉంటాయి. నిజ జీవితంలో అది పెద్దగా బాధించకపోగాని, నాటకాల్లో సినీమాల్లో అయితే ప్రకోపిస్తుంది. ఏడుస్తున్నప్పుడు ఆ ముఖం వికారంగా కనిపించడంతో- బస్-వాళ్ళు నవ్వేస్తారు. దాంతో రసం రసాభాసయి,

దృశ్యం రక్తి కట్టకుండా పోతుంది. అందులో ముఖ్యంగా నాయికా నాయకులైతే మరీ ప్రమాదం ఉంది. అందుకనే చిత్రంలో హీరోయిన్ ఏడ్చే దృశ్యం ఉన్నదంటే ఆ చిత్ర దర్శకుడు ఆమెచేత అందంగా ఏడిపిస్తాడు! ఈ సూత్రమే నాటకానికీ పనికొస్తుంది. అయితే నాటకాలలో, సినీమాలలో లా 'క్లోజప్' ల ప్రమాదం లేదు కాబట్టి అవి అంత ప్రమాదం కాకపోతే కాకపోవచ్చు గాని, మొత్తానికి అవీ ప్రమాదకరమైనదే!

చేష్ట లనుకొన్నప్పుడు అభినయాలు గుర్తుకొస్తాయి. మూగ్గాడుతూ న్నప్పుడు చేతులూపడం సహజ లక్షణం. అది అరి అయినప్పుడు వికారంగా అవుతుందని చెప్పినట్లే-అది తప్పుకైనా హితా అదోలాగానే ఉంటుంది. ఏమాత్రం చేతులూ తలా ఆడించకుండా ఎవరైనా మూగ్గాడుతూ ఉంటే అదీ వింతగానే ఉంటుంది. నడకల్లో కూడా రకాలున్నాయి. ఒక్కొక్కరి నడక ఒక్కోలా ఉంటుంది. కొందరు అడుగులు దగ్గర దగ్గరగా వేస్తూ నడిస్తే మరి కొందరు రోడ్డు అడుగులతో కొలుస్తూ ఉన్నట్లుగా నడుస్తారు. కొందరు అడ్డ దిడ్డంగా నడవడంకూడా కద్దు. నిలబడినప్పుడు కొందరు ఒక ప్రక్కకి వాలిపోయి, ఓ కాలి మీదనే నుంచుంటారు. మగాళ్ళు ఎలా నిలబడినా ఫరవా లేదేమో కాని ఆడవాళ్ళు వంకరగా నిలుచుంటే మాత్రం వికారంగానే కనిపిస్తుంది. వాళ్ళు హంసగమనలు కదా-సహజంగా!

కూచోడంలో కూడా వికారాలు లేకపోలేదు. కుర్చీలో కూర్చున్నప్పుడు కంటె- క్రింద కూర్చోవడంలో వికారం మోతాదు ఎక్కువ కావడానికి అవకాశం ఉంది. కూర్చోవడం ఒక తీరు. ఆడవాళ్ళయితే ఒకలాగా, మగ వాళ్ళయితే మరియొక లాగా కూర్చోవాలి. వారు వీరిలాగా, వీరు వారిలాగా కూర్చుంటే మాత్రం అది ఖచ్చితంగా వికారంగానే కనిపిస్తుంది.

ఇందాకా అభినయం అన్నప్పుడు చేతులు కదపడం, చేతులు ఊపడం అన్నానా? అలా ఎక్కువ కదిపినా ఊపినా కలిగే ప్రమాదాలు కొన్నైనలు.

నలుగురు పరసగా కూర్చున్నారనుకోండి. మధ్యలో కూర్చున్న వ్యక్తి "మా ఊళ్ళో ఇంతేసి చేపలు దొరుకుతాయం"టూ ఎడా పెడా రెండు చేతులూ విసిరా దనుకోండి. అప్పుడు కుడి వేపు వాడి దవడా ఎడమ వేపు వాడి ముక్కూ ఎగిరి పోయే ప్రమాదం ఉంది. ఓ రైలు ప్రయాణంలో ఒకాయన తన మిత్రుడికి తను చూసిన సినీమా కథ వివరిస్తూ ''హీరో విలన్‌ని ఇలా కొట్టాడ''ని చెప్పి విసిరి మిత్రుని కళ్ళ జోడు మీద కొట్టి కన్ను గాయపరిచాడు. ఓ మునుమరాలు బామ్మ గారి ప్రక్కన కూర్చుని రాజుగారి కథ వింటూ ఓ సన్నివేశంలో ఛీ...ఫో... అని ఎవడో అన్నాడని ఆ యాక్షన్‌లో కన్ను పొడుచుకుంది.

టెలిఫోనులో మాట్లాడుతున్నప్పుడు కొందరు యాక్షన్ చేస్తూ మాట్లాడ తారు. అది చూసిన వాళ్ళు నవ్వడం సహజం. ఎదుటి మనిషి ఎదురుగుండా లేడు కదా యాక్షన్ ఎందుకు చెప్పండి! ఓ పెద్దాఫీసరు దిగువ గుమాస్తాకు ఫోనుచేస్తే అతను ఫోను అందుకుంటూనే లేచి నిలబడిపోయి గుడ్ మార్నింగ్ కొట్టేసి కాళ్ళు ఎటెన్షన్‌లో పెట్టుకుని మాట్లాడుతూ ఉంటే వింతగా కనిపిస్తుంది. అలాగే ఆఫీసరు తన క్రింద అధికారితో ఫోనులో మాట్లాడుతూ కుర్చీలో వెనక్కి వాలి, కాళ్ళు రెండూ టేబిల్ మీద పారేసి, దర్జా వెలగబెడుతూంటే అదీ వింతగానే ఉంటుంది మరి. మరియొక ఆయన ఫోనులో మాట్లాడుతున్నప్పుడు తన ముంట్లో ఏదో వేడుక చేసుకుంటున్నాననీ దానికి లడ్డులు తయారు చెయ్యాలనీ చెబుతు న్నాడు. అవతలి మనిషి "లడ్డూలు ఏ సైజులో ఉండాలండీ?'' అని అడిగాడు. ఇతను చేతివ్రేళ్ళను దూరంచేస్తూ ''ఈ మాత్రం సైజులో ఉండాల''ని తేల్చాడు, అది విని అవతలి మనిషి నవ్వుకున్నట్లే, అతని యాక్షన్ చూసి ఇవతలి మనుష్యు లంతా నవ్వుకున్నారు.

మనలో కొందరు ఏదో విషయం గురించి ఆలోచిస్తూ ఏమీ తోచని పరిస్థితి ఏర్పడితే, టేబిల్ మీద వ్రేళ్ళతో తబలా వాయిస్తారు. సంతోషం వచ్చినప్పుడూ ఆ తబలా వాయింపే. అలాగే ఒకాయన బీటికి మాటికీ తబలా వాయిస్తూనే

మాట్లాడతాడు. చేబిల్ లేకపోతే తబలా వాయింపు గాలిలోనైనా జరగపలసిందే. బల్ల గుద్ది మాట్లాడం కొందరికి అలవాటు. ఆవేశంలో మరీ గట్టిగా గుద్దితే చేతికో, బల్లకో, కొండొకచో చుట్టూ ఉన్న వారికో అపాయం సంభవించే అవకాశం ఉంది.

అందుకే అన్ని తగు మోతాదులో ఉండాలి.

చేష్టలు ఎక్కువైతే ఎబ్బెట్టు- తక్కువైతే వో మెట్టు. రేజర్స్ ఎడ్జ్‌లా బేలెన్స్ చేసుకోవాలి.

వింత అలవాట్లకి వికారపు చేష్టలకి బలి కాకుండా ప్రతి వ్యక్తి జాగ్రత్త పడాలి.

పొరబాటున మొదలెట్టినది అలవాటై ఎదుటివాళ్ళకి వింతయి, తర్వాత వింతయి, విడ్డూరమయి కూర్చుంటుంది.

సో, ఐ వేక్ ఆఫ్ వింతలూ అండ్ వికారాలూ !

తస్మాత్ జాగ్రత జాగ్రత జాగ్రతః

[కళాసాగర్ వార్షికోత్సవ సంచిక 1977]

హలో ఓ ఫైవుందా ?

శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ

ప్రకృతి

ముసిరిరణాలతో లోకాన్ని జోకొడుతున్న చంద్రుడు, అరుణ కిరణుడు కనుచూపుమేరలో కానరాగానే తెల్లబోయి పాలిపోయాడు. రాత్రి, తెల్లవారి ప్లేటు తిరగేసి మోరచారబోయింది. అప్పులు తీర్చేసిన వాడి మనసులా లోకం ప్రశాంతంగా ఉంది. గాలి చల్లగా మెల్లగా వీస్తోంది. ఉషాదేవి తనలో ఉండి ఉండి నవ్వుకుంటోంది. పువ్వులు మెల్లిగా మేలుకుంటున్నాయి. తొలిసారి వికసిస్తూన్న మొగ్గలు పట్టపగ్గాలు లేకుండా మొదటి రోజున్న అక్కయ్య చీరకట్టుకున కన్నెపిల్లలా ఉన్న చోటునే పరవళ్ళు తొక్కుతున్నాయి. పక్షులు గుర్తుకొచ్చిన పాటలన్నీ పాడేస్తున్నాయి కవులు నిరుత్సాహ పడకుండా. కాఫీపొడి అప్పు దొరికేదాకా, పిల్లలూ ఆయనా నిద్రలేవకూడదని ఇల్లాళ్ళు ఆశపడుతున్నారు. అప్పులు ఇచ్చుకొన్న వాళ్ళు తెల్లవారుతోందని ఉప్పొంగి పోతున్నారు వీధుల్లోకి. తెచ్చుకున్నవాళ్ళు ఉప్పొంగి పోవటంలేదు గది అవతలకి.

యజమాని అడుగుల చప్పుడు విన్నా, రానీ చూదాం అని కూర్చున్న సేవకుడెలా మొత్తంమీద జగతి ఇంకా తటపటాయిస్తోంది. డ్యూటీలోపడదామా,కాస్సేపు ఆగుదామా అని సూర్యభగవానుడికి కోపం వచ్చింది. చాలా కాలం తర్వాత రావలసిన డబ్బుచేతికి రాగానే అప్పులవాళ్ళ మొహాన విసిరికొట్టేవాడిలా ఆయన దూకుడుగా కిరణాలను గుప్పించేస్తున్నాడు.

ఋణదత్తుడు

ఋణదత్తుడు అసాధ్యుడు. అప్పులనేవి ఉండగా కష్టపడి సంపాదించడమేమిటని నవ్వుకునేవ్యక్తి. పైగా అప్పు తీర్చడానికి అప్పుడబ్బే ముఖ్యమని అతని

నమ్మిక. అందుచ్లా కుడి ఎడం లేకుండా చిత్తంవచ్చినట్లు రెండుచేతులా అప్పు చేశాడు. రద్దీని బట్టి దగ్గరున్నవాళ్ళ చేతులు అప్పు పుచ్చుకొని వాటితో కూడా అప్పు చేశాడు.

అప్పు ఇవ్వగలవాడిని ఏరుకోవడంలో, ఏరుకున్నవాడిని ఎరవేసి పట్టుకోవడంలో, పట్టుకున్నవాడిని ఆకట్టుకోవడంలో, ఆనక వాడిచేత అప్పు (అసలా పాటికి వాడివ్వబోయే అప్పు ఇతగాడి దృష్టిలో వాడివ్వవలసిన బాకీగా తయారయి పోయి ఉంటుంది) కక్కించడంలో, అవి పుళ్ళి ఇవ్వకుండా చెల్లుపెట్టించడంలో అతనికి అతనే సాటి అనిపించుకున్నాడు. అతణ్ణి చూపించి విశ్వామిత్రుణ్ణి నక్షత్ర కుడూ, అతడిని ఇతడూ హేళన చేసుకునేవారు. బీద ఉపాధ్యాయులకూ గుమాస్తా లకూ వారి వారి ఇల్లాళ్ళు ఋణదత్తుణ్ణి ఆపర్యంగా చూపించేవారు. "ఋణదత్తుడు అప్పు అడగడంలో చూపే ప్రతిభలో సగమేనా నువ్వు కప్పాలూ, పన్నులూ, బాకీలూ వసూలు చెయ్యడంలో చూపిలే ఖజానా యింత బారుమని ఉండేదికాదు" అంటూ మహామంత్రులూ ఇతర రాజోద్యోగులూ ఆయా వసూళ్ళ ఉద్యోగులను చివాట్లేసేవారు.....

ఋణదత్తుడు మిత్రులతో కలిసి కులాసాగా అప్పుల గురించీ, ఇచ్చిపుచ్చు కోడాలలో ఒడుపుల గురించీ కబుర్లు చెబుతూ ఉండేవాడు. "అసలడిగేవాడికి తేజంలో కొంత ఉంటుంది. ఏదీ మాటపరసకి చెబుతా. మీరో పరహా ఇలా ఇవ్వండి చెబుతా...మీరోటి యివ్వండీ శ్రేష్ఠిగారూ! తమరు ఒక హస్తం దయ చేయండి కొత్వాలుగారి అల్లుడా! నువ్వో జోడు మంజూరు చేయించు" అంటూనే హవాపుడిగా వాళ్ళం చేస్తున్నారో వాళ్ళకే తెలిసేలోగా రెండు పుంజీల పరహాలు పుచ్చుకుని రొంటిన దోపుకుని కల్లబొల్లి కబుర్లు మరి నాలుగు చెప్పి, మీ పరహాలు మళ్ళీ నాట్రోజుల్లో పంపిస్తానంటూ చక్కాపోయేవాడు.

ఋణ హృదయం

ఏ విద్య అయినా – ముఖ్యంగా ఋణ గ్రహణ విద్య, సాధన చేస్తూ ఉంటేనే తప్ప పనిచెయ్యదు. తెలిసినవాడు మన వాతపడితే ఓ మాటు 'కులాసా?'

అని చూసేది. ఔసంటే ఆయిదో పదో అర్ధో పాపలో అడిగి జేబులో వేసుకొనేది. కాదంటే అదే పాయె. ఇంకోసారి దొరుకులాడు.

అప్పు! అప్పు అనగా నేమి? మన చేతిలో డబ్బుని కాస్సేపు మరొకడ్ని పట్టుకోనియ్యడం- అంతే'

హిందూ ఫిలాసఫీ, హిందూథాట్, ఒక్క హిందూ థాటే ఏమిటి హోల్ వరల్డు థాట్ అంతా కూడా గొంతు చించుకుని అన్ని భాషల్లోనూ ఘోష పెడుతున్నది ఏమిటి? "అబ్బీ- ఏ అప్పారావో గనక నిన్ను అప్పడిగితే వాణ్ణి ఉద్ధరించడం అనుకోకు. అప్పిచ్చే ఛాన్సును, అవకాశాన్ని, అదృష్టాన్ని యింత మంది సామాన్య జనులలోనూ నీకే ఇవ్వాలని నిన్నే ఎన్నికచేసి ఎడ్రసు కనుక్కుని వెతుక్కుని వచ్చిన మహనీయుడని తెలుసుకో. వాడిని చూచి ఆనంద పడి పొంగిపో. 'స్వామీ! తమకు ఎంత అప్పు ఇచ్చే మహదవకాశాన్ని నాకు ప్రసాదిస్తున్నారు. నేను బహుయోగ్యుణ్ణి అనీ, నేను అప్పిచ్చి మళ్ళీ ఎన్నాళ్ళకి అడగననీ లోకం కోడై కూస్తోంది. కాన కటాక్షించి నాకు కొంచెం పెద్ద కోటా దయచేసి, అప్పు ఎక్కువ తీసుకోవలసిందని వేడుకుంటున్నాను' అని ప్రార్థించు పదీ మరీ ఇవ్వాలి అప్పు. అప్పు ఇచ్చిన వాడి ఋణం ఎవరూ ఏ జన్మకి తీర్చలేరు. చర్మం చెప్పులు కుట్టి ఇచ్చినా ఆ ఋణం తీరదు. అయితే చర్మం చెప్పులు (మరీ మనిషి చర్మం గనుక) బాగుండవు. పల్చగా ఉంటాయి. బజార్లో అమ్మే చెప్పులే మంచివి, మన్నుతాయి, చౌక కూడా.

అప్పారావు

అప్పారావు కొత్త రూపాయినోటులా తెళతెళలాడుతూ ఉంటాడు. కాలదోషం పట్టినదస్తా వేజులాంటి మాసిన గుడ్డలూ, బడిపంతులు గారి చేబదుళ్ళులా చింపర వందిరగా ఉండే జుట్టూ, అప్పుతెచ్చిన విచ్చురూపాయిలా మెరిసే పచ్చి కాయ లాంటి కళ్ళూ, అప్పులివ్వగల వాళ్ళందరినీ చేపల్లా ఆకర్షించగల ఎర లాంటి చురుకైన చూపులూ అతనూ. బాకీల వాళ్ళకి కోపిష్టి వాడి జవాబులా పొట్టిగా టూకీగా ఉంటాడు.

అందరికీ తెలుసో తెలియదో గాని, ఇండియా గవర్నమెంటు వాళ్ళూ, ఇంకా రకరకాల రాష్ట్ర ప్రభుత్వాల వాళ్ళూ, రిజర్వుబేంకి వాళ్ళూ, దేశం మీదా విదేశాల మీదా అప్పులు నొల్లు కోవాలంటే, బేంకుల వాళ్లు డిబెంచర్లు ఫ్లోట్ చెయ్యాలంటే, ఓం ప్రథమంగా అప్పారావు గారిని ముందు సలహా అడిగికాని మరొక పని చెయ్యరట. ఫోర్డు, రాక్ ఫెల్లర్, జేబ్ టేలర్, సి. డి. దేశ్‌ముఖ్ వీళ్ళంతా అతనికి ఉత్తరాలు రాస్తారట. రెండో కంటికి తెలియకుండా అతని రూమ్‌కి వచ్చి సలహాలడిగి మరీ పోతారట !

అరగంట మాట్లాడి కూడా అర్ధణా అప్పు అడక్కుండా వెళ్ళిపోయి ఎదుటివాడిని అప్పారావు చితక్కొట్టేసిన సందర్భాలున్నట్లు చరిత్రలో దాఖలాలున్నాయి. అంతసేపూ మాట్లాడి కేవలం అర్ధణా మాత్రమే అప్పుచ్చుకుని అవతలి వాణ్ణి చితక్కొట్టేసిన రోజులూ ఉన్నాయి. అతను ఎప్పుడు ఎవర్ని ఎంత అడుగుతాడో, ఎవరిదగ్గర ఎంత ఎలా పుచ్చుకు చక్కాపోతాడో అతనికే తెలియాలి. అతనికీ తెలియదేమో కూడా. ఆ ముణలీల చూసి తీరవలయునే కాని వర్ణించనలవి కాదు. వర్ణించినా అర్థం కాదు. అభిమన్యుడు పద్మవ్యూహంలోకి జొరబడి ఒక్కొక్కణ్ణే ఒక హలో (రెండు రూపాయలు), హలో హలో(నాలుగు) హలో కులాసా (ఆరు) అంటూ పలకరిస్తూపోతే చివరికి అతని జేబునిండా పట్టనంత అప్పు పోగవుతుంది.

అవసరాన్ని బట్టి అప్పారావు మునోపదేశం చేస్తాడు. ''అప్పంటే ఏమనుకున్నావ్? మహా పవిత్రమైనది. పంచభూతాల్లో ఒకటి. పృథివి, అప్పు, తేజస్సు, వాయువు, ఆకాశం అన్నారు. ఇదీ వరస. ఏడాది పొడుగునా అప్పు పీల్చేసుకుంటాడు సముద్రుడు దగ్గర్నుంచి అబుణ కిరణాలవాడు. అందుకే ఏడాది తిరిగే సరికల్లా బాకీ తీర్చేస్తాడు పబుణుడు. ముణాలు తీర్చమని వబుణుడిని కోరేవే ముక్కులు. వీటితోటే వేదాలనే నాలుగు ముక్కులు రాశారట. నేనెపుడూ చూవలేదనుకో కాని మంచి పుస్తకాలే అవి ఉండాలి. లోకమంతా ఇలా ఇచ్చి పుచ్చుకోవడాల మీదే సాగిపోతోంది. అడిగితే ఇవ్వడం, ఇస్తేనే పుచ్చుకోడం

పుచ్చుకుంటే నే మళ్ళీ ఇవ్వడం- ఈ మూడూ లేకపోతే మూడ్ లేక జీవితం బోర్ కొట్టెయ్యదూ?

పుచ్చుకొనేవాడికి అప్పు అయినదే ఇచ్చుకొనేవాడి ప్రాణానికి దాకీలా కనిపిస్తుంది. నిజానికి ఆ మధ్య నున్నది కేవలం పది రూపాయలనోటే - దాన్నే కొందరు అప్పు అని పొరబడతారు. కొందరు బాకీ అని భ్రమపడతారు. ఈ భ్రమా భ్రమణం మధ్య అఖండ జ్యోతిలా వెలిగేది డబ్బు. భేషైన మాటన్నాను గదూ? ఇంకా బోల్డు అనగలను-'' ఇలా అనర్గళంగా సాగిపోతుంది అప్పారావు ఋణోపదేశం-

అంతా పూర్తి అయాక ఆఖరి సలహా కూడా వినాలి.

ఫలశ్రుతి

దీన్ని చదివిన వారికి అప్పులు చేసే ట్రిక్కులు కొన్ని తెలియును. ఎన్నో స్ఫురించును. కాని ఒక చదివిన వారి మీద ఇంకొక చదివిన వారు ఇందులో తాము ట్రిక్కులనుకొన్నవి ప్రయోగించడం గిట్టుబాటైన పని కాజాలదు. ఒక చదవని వాడు ఇంకొక చదవని వాడి మీద ఈ ట్రిక్కులు తెలిసి ప్రయోగించే అవకాశం ఉండదు. ఫనక చెప్పేదేం లేదు. ఒక చదవని వాడు ఒక చదివిన వాడి దగ్గర ప్రయోగించడమూ అంతే కాబట్టి ఒక చదివినవాడు ఇంకో చదవని వాడి దగ్గర (ఉంటే) ప్రయోగించవచ్చు. కాని, అవి చెల్లుబడి కాకపోవచ్చు. అందువల్ల ఒక చదివినవాడు ఇంకో చదివిన వాడితో చేరినపుడు దీన్ని గురించి, ఇంకా ఇతర ఋణ వాక్యాల గురించీ కాసేపు మాటాడి, ఫలోక్తులాడి, చివర్ని సూటిగా అడిగేస్తే మంచిది. అప్పు దొరకడం దొరక్కపోవడం వేరే సంగతి. ఇది చదివినవాడు ఒక సుబ్బరమైన అప్పారావు కేకేసుకొచ్చి 'హలో ఓ ఫైవుందా' అని అతనడక్కముందే ఓ అయిదు రూపాయలు ఋణ దక్షిణ ఇచ్చుకోవలెను.

[ఋణానందలహరి నుండి]

ఎక్కడ ? నటరాజెక్కడ ?

శ్రీ ఆదివిష్ణు

టిక్కట్టు కొని నాటకం చూడటమంటే నాకు చెడ్డచిరాకు. నా వంటి కొత్తిగా పడదు కూడాను ! రెండుగంటలు నాటకానికి అయిదో పదో తగలేయడ క్రిమినల్ వేస్టంటాను !

కళోద్ధరణ కోసం కంకణం కట్టుకున్న సంఘాలు చాలా నన్ను తమ సభ్యుడ్నిగా చేర్చుకోవాలని ముచ్చటపడ్డాయి. నెలకో అయిదు చొప్పున చంద కట్టమన్నారు. సంవత్సరానికి మీకు పదోపరకో నాటకాలు చూపెడతామన్నారు దేశంలో చలామణీ అవుతూన్న గొప్ప గొప్ప నాటకాలూ - ప్రఖ్యాత న నటులు మిమ్మల్ని ఉత్సాహ పరుస్తారని హామీలు కూడాయిచ్చేరు.

ఎంతైనా చెప్పండి - ఈ పద్ధతి నాకేం రుచించలేదు. అయినా, చందాల్ ఎన్నేళ్ళు బతుకుతాయట ఈ నాటకాలు ? రెండు రూపాయిలు మనవి కావనుకుం - ఎంచక్కా సిమ్లాలూ, కాశ్మీర్లూ, సినీమాల్లో చూసేసుకోవచ్చు. అక్కడ గ మీదా, కొండల మీదా హీరో హీరోయిన్లు ఒకరి వెంట ఒకరు పరుగెడుతూ, పడుతూ స్తూ, పాటలూ అవీ పాడుకుంటుంటే మనమే ఆ హీరోగా అనుకొని ఊరి ముకిసిపోవచ్చుకూడాను! అందులో ఉన్న థ్రిల్లు నాటకాల్లో ఎందుకుంటుం చెప్పండి ! అలాంటప్పుడు ఈవేలాది నాటకాలూ, వందలాది రచయితలూ, లక్ లాది నటీ నటులూ ఎవర్ని ఉద్ధరించను !

అందుచేత, డబ్బిచ్చి నాటకాలు చూడకూడదని గట్టిగా ఒట్టేసుకున్నాను. ఎపడైనా టిక్కెట్టు అంటగట్టడానికి పస్తే - వాడిఖర్చుమీద కాఫీ తాగేసి -

బాబ్బాబు, నీకు దణ్ణంపెడతాను, సన్నాదిలెయ్ - అంటూ బతిమిలాడి పంపుతున్నాను.

నిజం చెప్పాలంటే - నాటకం చూడాలనే ముచ్చట గుండెల్లో గుచ్చుకుంటూనే ఉంటుంది. నాటకం ప్రదర్శించే చివరిక్షణం వరకూ ఆశగా చూస్తాను- కాంప్లిమెంటరీ పాస్ కోసం! ఎవడైనా దయతలిచి యిచ్చేడా యిస్తాడు. లేకపోతే, గమ్మున నేనెట్లా ఊరుకుంటాను ?

తెల్లటి ఇస్త్రీ బట్టలు వేసుకుని, అకుచెప్పుల్తో-నోట్లో సిగరెట్టు పెట్టుకుని హాలు ముందర ఎవరెవర్తోనో అనవసరంగా మాటాడేస్తూ - ఓ కన్ను మాత్రం ప్రవేశద్వారంవైపు వేసిఉంచుతాను. ఛాన్స్ తగిల్తే - ఎవడో ఒకడు నా బుజ మ్మీద చేయివేసి చనువుగా లోపలికి తీసుకుపోతాడు. లేదూ, జానే దేవని మిరప కాయ బజ్జీలు కొనుక్కుని పంతెనెక్కుతాను! అంతకంటే కాలక్షేపం ఏమి కావాలి గనుక !

ఇట్లాంటి నిప్పులాంటి చరిత్రతో మండిపోతున్న నన్ను నా ఖ్రండు పద గొట్టేసాడు. మామూలుగా అయితే పడేవాడ్నిగాదు. వాడు నన్ను నానామాటలూ అన్నాడు. నాలాటి నాటక కళాద్రోహిని నడిరోడ్డుమీద ఉరితీయాలన్నాడు. ఇవాళ నాటకానికి టిక్కట్టుకొనకపోతే నా గొంతుపిసికి చంపుతానన్నాడు. నాకు పదీ పరకా అప్పు అపసరమై అడిగితే నా మెడపట్టుకు గెంటుతానన్నాడు. వాడు ఏపన్నా ఖాతరు చేయకుగానీ, అప్పు సంగతి అడ్డంపెట్టుకుని రెచ్చగొట్టినప్పుడు చచ్చినట్టు అంగీకరించవలసి వచ్చింది. సరే కానివ్వమన్నాను - కన్నీళ్ళు పెట్టు కుంటూ .....

థియేటరు దగ్గిర రిక్షాదిగి బుకింగ్‌వేపు నడిచేము. ఓడి పోయేసన్న దిగుల్తో అశాంతితో అన్నాను. "ఒరే, నాచేత ఇష్టంలేని పనిచేయిస్తున్నావు. ఆల్రైట్ ..... నా టిక్కట్టుకూడా నువ్వేకొను ! "

వాడు అదోలా చూశాడు !

''టిక్కట్టు కొనే దుస్థితికి నన్ను దిగచావు. అది చాలదూ? డబ్బంటావా ? మనలో మనకేమిటి - నువ్వు కొన్నా నేనుకొన్నా ఒక్కటే కదా ! '' అన్నాను అనునయంగా.

వాడేమనుకొన్నాడోగాని - నా టిక్కెట్టుకూడా వాడే కొనేశాడు. ఇద్దరం హాల్లోకి వెళ్ళి కూచున్నాం. తెర తొలగలేదు. ఫస్ట్ బెల్ కూడా కొట్టలేదు. హాలు జనంతో కిట కిటలాడి పోతోంది. ఒకటే రణ గొణ ధ్వని. నాటకం మీద ఇంతమందికున్న శ్రద్ధాసక్తులు గమనించి సిగ్గు పడ్డాను. ఇన్నేళ్ళూ నాటక కళ పట్ల నాకున్న నిర్లక్ష్యభావం గుర్తుకు రాగానే నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆడ పిల్లలా ఏడవ కూడదని దుఃఖం దిగమింగుకున్నాను.

ఆరగంట గడిచినా తెర తొలగలేదు. ప్రేక్షకుల సహనం సన్నగిల్లు తోంది. పిల్లీ కుక్కల అరుపుల్ని అనుకరిస్తున్నారు. జనం మీద నాకు కోపం వచ్చేసింది. ఎవరో నటీమణో నటుడో రావడం ఆలస్యం కావచ్చు. మేకప్ పూర్తి కాకపోవచ్చు. ఏవో లక్ష ఇబ్బందు లుంటాయి. అంత మాత్రానికే ఈ కారు కూతలెందుకు చెప్పండి ?

కాని - నేననుకున్నదంతా తప్పే ! వేషంలో ఉన్న ముఖ్యపాత్రధారి తెర తొలగించుకుని వచ్చి ప్రేక్షకులందరికీ నమస్కారం చేసి ఇట్లా సెల విచ్చాడు.

"హాలు కిటకిటలాడి పోతోంది. పెద్దమందికి పైగా అభిమానులు వచ్చి నందుకు ఆనందంగా ఉంది. ఈ నాటక ప్రదర్శనల ద్వారా వేలూ లక్షలూ సంపాదించాలనే దురుద్దేశం మాకు లేదు. కనీసం నాటకానికి పెట్టిన పెట్టుబడి వస్తే చాలనుకున్నాము. మా శ్రమని మేము పట్టించుకోకూడదనుకున్నాము. అల్లాంటిది హాజరైన వెయ్యిమంది ప్రేక్షకులలో ముగ్గురంటే ముగ్గురే టిక్కట్టు

కొన్నారు. నా చేతిలో దండలు మూడున్నాయి. టిక్కట్టుకొన్న ఆ ముగ్గురు నాటక కళాభిమానులూ వేదికమీదకి వస్తే – వారిని ఈ దండలతో అలంకరించి- మిగతా జనానికి దండ-పెట్టి రంగులు తుడుచుకొని పోతాం. అంతే కాని నాటకం ప్రదర్శించలేం. దయచేసి టిక్కట్టు కొన్న ముగ్గురు మహాశయుల్నీ వేదిక మీదకి రావలసిందిగా ప్రార్థిస్తున్నాను''

నేను నా ప్రెండుని ఉరిమి చూశాను. వాడి మొహంలో నెత్తురు చుక్క లేదు. టిక్కట్టు కొన్న కారణంగా మేమిద్దరం లేచి నిలబడ్డాం, వేదిక ఎక్కడానికి. ఆశ్చర్యం ! మాతో బాటు మరో నలభైమంది కూడా నిలబడ్డారు. మేమంతా వేదిక ఎక్కాలి. అక్కడ ఉన్నవి మూడే దండలు. టిక్కట్టు కొన్నది కూడా ముగ్గురంటే ముగ్గురే ! మరింతమంది లేచారెందుకు !

ఫ్రీగా పచ్చింది చాలక - దండలు కూడా వేయించుకొనేందుకు పోటీలు పడే ఈ రసకేటు హృదయం లింతమంది ఉన్నప్పుడు - ఇంకా నటరాజెక్కడ బతగ్గలడు ? గురూగారు జండాలేపేసి హిమాలయాల్లో చిందులు తొక్కుతున్నా డని రూపాయిన్నర స్టాంపుమీద రాసివ్వగలనని మనవి చేస్తూ ముగిస్తున్నాను.

[కళాసాగర్ పంచమ వార్షికోత్సవ సంచిక - 1977]

వాపూ ఒక బలుపే!

డాక్టర్ పోరంకి దక్షిణామూర్తి

ఛాంపియన్లు రెండు రకాలని చెబుతుంటారు: హెవీ వెయిట్ చాంపియన్, లైట్‌వెయిట్—కొండొకచో ఫెదర్ వెయిట్ చాంపియన్ అని. మంచి కండలు తిరిగిన వస్తాదుల్ని చూసి చిన్నప్పుడు మహా ముచ్చట పడేవాళ్ళం. దండేలూ, బస్కీలూ తీసి కండ ఏమాత్రం పెరిగిందో చూసుకుంటూ ఉండేవాళ్ళం, పుట్టలో పాలు పోసి పొట్ట తడుముకున్నట్టు! బస్కీలు తీసే ఐదు–పది నిమిషాలలే కండలు పెరిగితే ఇక లేనిదేముంది? ఒక్కొక్కడు ఒకో కింగ్‌కాంగో, దారా సింగో అయిపోయి ఒకళ్ళనొకళ్ళు కొట్టుకుంటూనే ఉండేవాళ్ళం. కొట్టుకుంటే దెబ్బలు తగిలేవి కాని మేము కాంగులూ కాలేదు, సింగులూ కాలేదు.

మాలో శంకరం మట్టుకు దిట్టంగా కుదిమట్టంగా ఉండేవాడు. 'పుట్టి' బ్రాండు మనుషుల మేత పుష్కలంగా పెట్టేదో ఏమో వాళ్ళమ్మ. వాణ్ణి చూస్తే కళ్ళుకుట్టేవి మా సుబ్బయ్యకి. వాళ్ళ నాన్నగారు పో గుప్పెడంతలా ఉన్నప్పటికి వీడు మట్టుకు లోటుకూరకాడలాగే ఉండేవాడు. చెయ్యి మడిచి, జెబ్బ బిగించి ఎన్ని తంటాలుపడ్డా వాడికి కండ చేతికి రాదు. ఒట్టి ఎండు పరడాయే! వాడి బాధ చూసి నాకు జాలేసింది. "ఒరే సుబ్బిగా, ఇది కాదు పద్ధతి, నీ జెబ్బ మీద 'కప్ప' తేలేట్టు చేస్తాను చూడు!" అంటూ నా ఆరి చెయ్యి అడ్డంగా తిప్పి వాడి జెబ్బ మీద ఒక్క దెబ్బ కొట్టాను. దాని అదురుకి నాచేతి ఎముక కలుక్కుమన్నా. వాడి జెబ్బమీద మాత్రం కప్ప తేలింది. కంత పైకి ఉబ్బుతుంది కనుక దాన్ని 'కప్ప' అంటాము గాని మాట. ఇక చూసుకోండి. వాడి మొహం చిన్నబుచ్చుకి చేటంత అయింది. ఆ రోజునుంచి వాడు తనకి తనే జెబ్బమీద కొట్టుకుని కంత చూసుకోడం మొదలెట్టాడు. చేత్తోనే కాదు, పచ్చడి బండలాంటి పరికరాలు కూడా ఉపయో

గించడం మొదలెట్టేసరికి కండ కమిలిపోయి ఉబ్బెత్తుగా వాచింది. ఆ సంగతి అప్పుడు మాకు తెలీదు. ఆ వాపు చూసి నిజంగా బలుపే ననుకున్నాం. ఆ చేతికి ఏమున్నా తగిలినప్పుడు పైకి వినిపించకుండా కుయ్యోమనేవాడే కాని టెన్నిస్ బంతిలా తేలిన కండ చూచుకుని ఎంతో మురిసిపోయేవాడు సుబ్బయ్య. 'ఆఫ్టరాల్, శంకరంగా డెంత, వాడి కండెంత!' అన్న ఈసడింపు కూడా పచ్చేసింది. టెన్నిస్ బంతిలాంటి కండకే వాడు ఇంత మురిసిపోతున్నాడు. రేపు ఫుట్‌బాల్ సైజు కండ తేలితే వీడికి పట్టపగ్గాలుంటాయా అనిపించింది. మొత్తానికి, 'కండ గలవాడేను మనిషోయ్' అన్న విషయం అప్పుడు కాని తెలిసింది కాదు. అది వాపు బాపతా, బలుపు బాపతా అన్న ప్రశ్నలేదు. కండ కండే! గొప్ప గొప్పే! ఎల్లా వచ్చిందన్న ఆరా ఎవడికి కావాలి? వచ్చిందా లేదా అన్నదే పాయింటు.

మా సుబ్బయ్యకి కండపస్తే మరో వెంకయ్యకి డబ్బు రావచ్చు. గొప్ప పదవి రావచ్చు; పేరు రావచ్చు! మరేవయినా రావచ్చు. వచ్చిందా లేదా అన్నది మాసి వాడి ప్రయోజకత్వానికి పర్మనెంటుగా ఒక సర్టిఫికెట్టు ఇచ్చి పారేస్తాం. మన మివ్వడం ఆలస్యమయితే వాళ్ళకి వాళ్ళే ఇచ్చేసుకుంటారు. ఆ తరువాత మనమే నాలిక కరుచుకోవాలి-ఆ అవకాశం చేజేతులా జారవిడుచుకున్నందుకు. చేసుకున్నవాళ్ళకి చేసుకున్నంత మహదేవా ! అంటే అర్థమేమిటి ? ఇదే నన్న మాట.

అందరి అదృష్టం ఒక్కలాగుండదుగా మరి. పేరో, డబ్బో, మరొకటో 'స్వయం' కృషివల్ల సంపాయించుకుంటారు తెలివైనవాళ్ళు. ఆ కోవలోకి రాలేని వాళ్ళూ ఉంటారు. అదృష్టవంతులూ ఉంటారు. వెంకట మా కనకయ్య ఒక కథ రాశాడు. దాని పేరు 'విపరీతరాజయోగం'. అందులో ఏపాపమూ ఎరగని ఒక పెద్ద మనిషిని బలవంతంచేసి తీసుకొచ్చి అతనికి బ్రహ్మాండమైన సన్మానం చేస్తారు. "ఫలానా పుస్తకం రాసింది నేను కాదర్రో ! మీరు పొగిడే కవిగారు నేను కాదు మొర్రో !" అన్నా ఆయన మొర ఆలకించే నాథుడు లేకపోయాడు. అయినా ఆయన వెర్రి కాకపోతే, పైరపీ బాధలు లేకుండా వాళ్ళంతట వాళ్ళు

పిలిచి సన్మానం చేస్తామంటే హాయిగా చేయించుకుకోక తెగ నీలుగు డెందుకు ? ఈయన నీలిగినా వాళ్ళ కార్యక్రమం వాళ్ళు కానిచ్చేసుకున్నారులెండి. ఈ అదృష్టం మాత్రం ఎంతవాళ్ళకీ పట్టేదు !

నిజం చెప్పొద్దూ –నాకూ కాస్త పట్టింది ఆ జాపత్తు రాజయోగం. మరీ అంత చిన్న సైజుదని కొట్టిపారెయ్యడానికి వీలులేదు. తెలుగు నేల నలు చెరుగులా మన పేరు మారుమోగిందనడానికి కాపలసినన్ని దాఖలాలున్నాయి. ఆ మధ్య ఒకసారి దేశంలోకి ఒక చెత్తాకానీ సినిమా విడుదలయింది. దాన్ని చూసిన వాళ్లలో కొందరు నామీద అభిసందనల వర్షం కురిపించేసరికి ఉక్కిరి బిక్కిరయి పోయాను. కారణం మరేం లేదు—అందులో నా పేరు మొట్టమొదటిసారిగా తెరకెక్కించట. తీరా చేసి సినిమా చూద్దునుగదా దానంత పరమ రోత మరొకటి ఉండదనిపించింది. డైలాగులు తొడిగిన అరడజను మంది పేర్లలోనూ నా పేరు తెరమీద ఉన్నమాట వాస్తవమే. ఎప్పుడో సరదాగా ఒక స్నేహితునితో కలిసి స్టూడియోకి వెళ్తే, ఏదో నాలుగు డైలాగులు రాసి పెట్టమన్నారు. పెట్టిన దానికి ముట్టిందేమిటంటే, ఒక్క పాత్రా మన డైలాగు తొడుక్కోకపోయినా, గుంపులో గోవిందా అని మన పేరు కూడా తెరకెక్కేసింది. పైగా అలాంటి చెత్త బొమ్మలకీ ప్రజాదరణ ఏం తక్కువ ?

ఆనగనగా ఓ మల్లయ్య ఉన్నాడు. ఆ మల్లయ్యా మరో ఎల్లయ్యా పూసుకు పూసుకు తిరుగుతారు.కాని ఆ ఎల్లయ్యమీద మల్లయ్య కెందుకో కన్నెర్ర.ఆ ఎల్లయ్య మీద ఒక పుకారులేవదీశాడు. ఆ సంగతి బయట పడితే-మళ్ళీ పూసుకు తిరగడం బాగోదని ఆ పుకారు కారుడు ఫలానా పుల్లయ్య అని ఎల్లయ్యని నమ్మించాడు. అది ఆ నోటా ఆ నోటా పాకింది. చివరికి నిజం బయట పడిందా లేదా అన్నది కాదు ప్రశ్న. పుల్లయ్యకి పేరు వచ్చిందా లేదా ?

మొన్న ఈ మధ్యనే విశాఖపట్నంలో ఒక మీటింగయింది. అందులో పురిపండా వారూ నేనూ కూడా మాట్లాడాం. తొలి తెలుగు కథానికా రచయిత

ఎవరన్న విషయం మీద ఇద్దరం చెరొకి అభిప్రాయం చెప్పాం. రెండు రోజుల తర్వాత మా అభిప్రాయాలు పేపర్లోకూడా వచ్చాయి. అయితే చిన్న తిరకా సొచ్చింది. నేను చెప్పినవి పురిపండా వారు చెప్పినట్టూ, పురిపండా వారు చెప్పినవి నేను చెప్పినట్టూ బాక్సు కట్టి అచ్చు వేశారట! దాన్ని చూసి మద్రాసు నుంచి వచ్చే ఒక తెలుగు పత్రిక వాళ్లు నిజమనుకుని దాన్ని దాదాపు అలాగే అచ్చు కొట్టారు. ఇంత పేరు వచ్చే అదృష్టం ఎంత మందికి ఉంటుంది? ఆ మధ్య ఒక ముసలాయన నన్ను తన ఈడువాడి కొకాయనికి పరిచయం చేస్తూ "ఆ మధ్య సెంట్రల్ గవర్నమెంటు ప్రైజు వచ్చిన 'ఏరువాక' నవల ఉందే—అది ఇతను రాసిందే!" అన్నాడు. "ఒహో అలాగా! నేనూ చదివాను. చాలా బాగుంది." అన్నాడు తొస్సి పళ్ళలోంచి ఆనందం ఒలకబోస్తూ. అలా ఒలక బోసేసుంటే, ఆ 'ఏరువాక' నాది కాదని అనడానికి నోరెలా వసుంది? పోసీ రాకపోయినా ముసలాయన అన్నందుకేనా ఒప్పుడు రాయొచ్చుకదా అనుకున్నాను. సవలయితే రాయొచ్చుగాని సెంట్రల్ గవర్నమెంటు వాళ్ళ దగ్గర్నించి ప్రయిజె లాగా కొట్టుకు రావడం? అంచేత ఆ ముసలాయన ముచ్చట పడ్డందుకేనా రాసి ఉండవలసింది. కాని వచ్చిన పేరు పోగొట్టుకోడం ఇష్టం లేక రాయడం మానేసు కున్నాను.

ఇల్లాటి అనుభవాలు వరుసగా వచ్చినవాణ్ణి ఎవర్ని కదిపినా చాలు — వాపూ ఒక బలుపేనన్న విషయం ఒప్పుకోక భస్తామా?

[15-12-1977 ఆంధ్రప్రభ దినపత్రిక]

ముడిపడని పేర్లు

శ్రీ నీలా జంగయ్య

ఆంధ్రప్రదేశంలో కొప్పరపు జంట కవులు, తిరుపతి వేంకట కవులు అవధానాల ద్వారా సాహితీ సామ్రాజ్యం పాలిస్తున్న రోజుల్లో దీపాల పిచ్చయ్య శాస్త్రిగారు, గుర్రం జాషువాగారు ఇద్దరు కలిసి జంట కవులుగా రూపొందాలని ఒకరోజు సమావేశమై సమాలోచించినారట. అయితే కొప్పరపు సోదర కవుల పోల్కగాని, తిరుపతి వేంకట కవుల పోల్కగాని వారి పేర్లు పూర్వోత్తరాలలోసూ ముడిపడడం కష్టమయింది.

పిచ్చి జాషువా అయినా కావాలి లేదా జాషువా పిచ్చి అయినా కావ్వాలి, అందుకని జంట కవులుగా మనడానికి పేర్లు కలపడంలో ఇబ్బంది వచ్చి మన పేర్లు పనికి రావని, ఎవరికి వారుగా వారి పేర్లతో లోక ప్రతిష్ఠ సమార్జించు కొన్నారుట.

అట్లాగే గ్రాంథిక భాషావాదం ఒకవైపున విద్యాలయాల్లో స్థిరపడడానికి ప్రయత్నిస్తుంటే మరోవైపున వ్యావహారిక భాషోవాదం వీధుల్లో బాగా కొనసాగుతున్న రోజుల్లో గ్రాంథిక భాషకు వారసునిగా కొక్కొండ వేంకటరత్నంగారు, వ్యావహారిక భాషకు వారసునిగా కందుకూరు వీరేశలింగం పంతులుగారు పట్టుదలలు వీడనివారై రచనలు చేస్తూ ఉండేవారని, ఒకరిని గురించి మరొకరు ప్రహసనాలు తరచు రచించుకొంటుండేవారని ప్రతీతి ఉన్నది. గ్రాంథిక భాషకు సంబంధించిన ఇతివృత్తం తీసుకొని కొక్కొండ వేంకటరత్నంగారు ఒక ప్రహసనం రచించి అందులో పేరిగానిపాత్ర నొకటి ప్రవేశపెట్టి వాడుకభాషలో వాని సంభాషణ రచించినాడట. ఆ నాటకం ప్రదర్శించే రోజున వీరేశలింగం గారికి

ఆహ్వానం పంపి తిలకించవలసినదిగా కోరినారట. వీరేశలింగం గారు నాటకాన్ని చూసి వీరిగాని పాత్ర తనను గురించేసని వాని భాష వ్యవహార భాషగురించేసని తానుతనను దెప్పి పొడిచినట్లు గ్రహించి వెళ్ళి ఆ మరునాటికే వీరేశలింగం గారు ఒక ప్రహసనం వ్యావహారిక భాషకు ఇతివృత్తంగా మలచి అందులో ఒక నత్తి పాత్ర ప్రవేశ పెట్టినారట. ఆ నత్తిపాత్రకు పేరు కొండిగాడు. ఆ ప్రహసనం ప్రదర్శించే రోజున కొక్కొండవారికి ఆహ్వానం పంపినారు. వేంకటరత్నంగారు వచ్చి ఆ నాటకాన్ని తిలకించినారు.

''వరే నీ పేరేమిరా?'' అని మతో పాత్ర అడిగినప్పుడు ఆ నత్తిపాత్ర ''కొ...క్కొ కొక్కొండగాడు'' అని పలికినాడట.

వ్యవహార భాషను వీరిగాడు మాట్లాడేదని కొక్కొండ వేంకటరత్నంగారు వీరేశలింగం గారిని మనసులో ఉంచుకొని విమర్శిస్తే గ్రాంథిక భాషను నోరు తిరగలేని నత్తివాడు మాట్లాడే భాష అని వీరేశలింగంగారు వేంకటరత్నంగారిని విమర్శించినారు అని లోక ప్రతీతి.

ఇట్లా నవ్వులిచ్చే కృత్యాలు అతుకని పేర్ల మధ్య వ్యక్తుల మధ్య అవతరిస్తాయి. అప్పుడప్పుడు మనం వీటిని జ్ఞాపకం చేసుకొని నవ్వుకొంటుంటాము. హాస్యము కూడా ఒక రసమే. మన తెలుగు సాహిత్యంలో హాస్యం రకరకాలుగా ఉంది. దాన్ని ఇంకా వెలికితీయవలసి ఉంది.

ఏమైనప్పటికీ ఈ ముడిపడనితనం పేర్లల్లో సంఘటనల్లో రూపాల్లో వాగ్ధోరణుల్లో ఉంటుంటుంది.

ఒక అధ్యాపకుడు వినయశీలురయిన విద్యార్థులకు పాఠం చెప్పి అర్థమయిందా అని ప్రశ్నించగా, ఒక నత్తి విద్యార్థి లేచి ''మీ అక్క కొప్పులో కిచకిచలు'' అన్నాడట. తరగతి మొత్తం గొల్లుమని నవ్వింది. అధ్యాపకుడు ఆ

మాటను విద్యార్థితో కాగితం మీద వ్రాసి చూపమన్నాడట. వెంటనే ఆ నత్తి విద్యార్థి "మీ కృపవలన కొంచెం కొంచెం" అని వ్రాయగా అందరూ నిశ్చేష్టులై పోయారట.

హాస్యం ఎన్నెన్ని కోణాల్లో తొంగి చూస్తుందో మనం గ్రహించవలసి ఉంటుంది. ఇతిహాసంలో ఇట్టాంటి ఇతిహాసాలు వెదకాలి మరి.

[ఆంధ్రప్రభ]

పాపం....మగవాళ్ళు !

శ్రీమతి పోలాప్రగడ రాజ్యలక్ష్మి

పురుషులందు పుణ్యపురుషులు వేరయా అన్నాడు మహాకవి మరి! మిగతా పురుషుల సంగతి మనం ఆలోచించ వలసిన విషయమే, అందుకు అనిపిస్తుంది కొందరి పురుషుల్నిచూస్తే. అవును ! నిజంగానే - పాపం ఈ మగవాళ్ళనిచూస్తే' జాలే వేస్తుంది. అన్నీ తమకే తెలుసుననుకొని గర్వంగా కాలరు ఎగరేసుకుని తిరుగుతూ ఉంటారు. ''కాదు మనకి చాలా విషయాలు తెలియవు'' అని వాళ్ళు తెలుసుకుంటే ఎంత బాగుండును ! ఈ సంగతి వాళ్ళకి తోచదు, ఆడవాళ్ళు చెబితే వినరు. ''ఆ...ఆడవాళ్ళు చెబితే మనం వినడమా'' అనే పౌరుషం ఒకటి.

నిజానికి ఆడవాళ్ళ సలహాలులేందే వాళ్ళు ఏపని చెయ్యగలరు ? ఆఖరుకి ఏ పేంట్‌మీద ఏ షర్టు మేచ్ అవుతుందో అనే చిన్న విషయం దగ్గర్నుంచి. పిల్లలకి ఏ మేచ్ నిర్ణయం చేద్దాము అనే విషయం దాకా అన్ని సందర్భాలలోనూ, పురుషునికి స్త్రీ సలహా వుంటూనే ఉండాలి. సమయానికి సరియైన సలహా ఆడది ఇవ్వకపోయినా, లేదా తీసుకోడానికి మగవాడు పౌరుషపడినా, ఆ పని అంతంత మాత్రంగానే కనిపిస్తుంది.

అయినా, అనవసరంగా పౌరుష పడడమేకాని, స్త్రీయొక్క ఆలంబనం లేకుండా, పురుషుడికి ఒక్క క్షణం గడుస్తుందా అని. నాలుగైదేళ్ళు పచ్చేదాకా జాగ్రత్తగా లాలిస్తూ కబుర్లు చెబుతూ బువ్వపెట్టి జోకొట్టకపోతే, ఏదో తిక్కపేచీ పెట్టుకుని అన్నమూ తినకుండా, సరిగా నిద్రపోకుండా, నానా అపస్థా పడతాడు, పాపం పసివాడు.

ఆ తర్వాతకూడా, అతనికి చెల్లెలురూపంలోనో అక్కరూపంలోనో ఆడది సహాయం చేస్తూనే ఉండాలి. పదిహేనేళ్ళు ఇరవై యేళ్ళు వచ్చినా అతనికి పాపం పదేళ్ళ ఆడపిల్లకి ఉండేపాటి గడుసుతనమేనా ఉండదు. తన సుఖం తనకి అర్థం కాదు. ఏదో వెర్రివాడిలా బతికేస్తూ ఉంటాడు. ''ఇంకా బట్టలు మాసిపోయాయి, చాకలికి వెయ్యి'' అనో, ''నీ నోట్సు ఆ అబ్బాయికి యిస్తానంటున్నావు, పరీక్షలలో మరి నీకో? వెతికాను కాని, కనిపించలేదు అని చెప్పిపంపెయ్యి'' అనో, ''అదేం కలరురా? అది నీకు బాగుండదు, ఈ షర్టింగు తీసుకో'' అనో, అహరహమూ దగ్గర ఉండి చెపుతూ ఉండాలి. ఈ పని అయిదేళ్ళ చెల్లెలయినా చెయ్యగలదుకాని, ఇరవైఏళ్ళు వచ్చినా పాపం ఆ అబ్బాయి తనకి ఏది బాగుంటుందో తెలుసుకోలేడు. తన బాగోగులు తను చూసుకోలేడు.

షర్టింగు ఎన్నుకోవడంలోనేకాదు, సతీమణిని ఎన్నుకోవటంలో కూడా ఏ అక్కచెల్లెలులాంటి వ్యక్తో అతనికి సహాయం చెయ్యాలి. పెళ్ళిచూపులికి వెళ్ళినప్పుడు, అలాంటి ఏ అక్కయ్యనో చెల్లెల్నో తనతో తీసుకవెళ్ళితే, అతను జీవితాంతం సుఖపడిపోతాడు. "ఈ అమ్మాయి నీకు బాగుంటుంది" లేక "బాగోదు" అనే సంగతి తక్కువగ్రహించి చెప్పేస్తుంది ఆమె. అలా సూక్ష్మంగా గ్రహించి చెప్పగలిగే నేర్పు ఆమెకి ఉంటుంది.

అలా కాదని, తను ఒక్కడే వెళ్ళి పెళ్ళి చూపులు చూసుకుని వచ్చాడో, తప్పకుండా నష్టపోతాడు. రెండు జడలు వేసుకోలేదనీ, కాస్త చాయ తక్కువనీ, శుభ్రమైన పిల్లని కాదని రావడమో, ఓ చిరునవ్వు విసిరిందని వన్నెల విసన కర్రని ఎన్నుకోపడమో చేస్తాడు. ఆమె విలాసాలూ వయ్యారాలూ చూసి ముగ్ధుడైపోతాడు. కాని, ఈమె అనుకూలవతియైన భార్య అవుతుందా కాదా, ఈమెవల్ల నా జీవితం నరకం అవుతుందా స్వర్గం అవుతుందా అని ఆలోచించడు.

అసలామాటకొస్తే ఆలోచించలేడు. ఆలోచించే శక్తి అతనికి ఉండదు. ఇలాంటి విషయాల్లో సూక్ష్మ గ్రహణ పారీణత స్త్రీల కున్నంతగా పురుషులకు

ఉండదు. యువతీ యువకుల ప్రేమల్లోకూడా అబ్బాయిని అమ్మాయి వల్లో వేసుకోవడం చూస్తూఉంటాము. కాని సాధారణంగా అబ్బాయి ఆ విధంగా అమ్మాయిని ఆకర్షించలేడు. తలుచుకుంచే ఎంతటి అసమానుడైన యువకుని అయినా ప్రేమించి తెలివిగా తనవాడిని చేసుకొంటుంది ఆడది. కాని పురుషుడు, ఇష్టంలేని స్త్రీని ఎన్ని తెలివితేటలు ఉపయోగించి అయినా తన దానినిగా చేసుకోలేడు. ప్రపంచంలో పుటకి కనిపించే ప్రేమ వివాహాల్లో నూటికి తొంభై, స్త్రీ చాకచక్యం, అన్ని విధాలా యోగ్యుడైన పురుషుని ఆమె, తన కైవశం చేసుకోవడమే కనిపిస్తుంది. అంటే తన జీవిత భాగస్వామిని ఎన్నుకోవడంలో స్త్రీయే పురుషుని కంటే తెలివైన దన్నమాట !

అందుకే ఈ ఎన్నుకోవడంలో అతడు ఏ చెల్లెలి సహాయాన్నో, అక్కగారి సలహానో తీసుకుంటే కొంతవరకూ తన బ్రతుకుని స్వర్గంచేసే స్త్రీని సంపాదించుకోవచ్చు. ఇలా పసితనంలో తల్లి ఆలంబనా, ఒక వయస్సు వచ్చేదాకా సోదరీమణుల సహాయం పొందితే, ఇంకా తరువాత ఆ పెద్దమనిషి బాగోగులు వచ్చిన అమ్మగారే చూసుకుంటారు.

భార్య అసుక్షణమూ ఆదుకొని సంరక్షించకపోతే, నూటికి డెభ్భై ఎనభై మంది భర్తలు భయంకరమైన పరిస్థితులకు గురికావలసి వస్తారు. అయితే దూబరా చేస్తారు. లేదా పిసినిగొట్టులుగా తయారవుతారు. "అయ్యో పాపం!" అంటూ ఇతరులకి అప్పులేనా ఇస్తారుకాని, వాస్తవాన్ని తెలుసుకొని మసులుకోరు. సరికదా, త్యాగాలూ, ఆదర్శాలు అంటూ ఏవో ఉపన్యాస ధోరణిలో ఉండడమే కాని, వాస్తవాన్ని తెలుసుకొని మసులుకోరు. కొందరు పురుషులైతే ఆఫీసులో ఎలా మసులుకోవాలోకూడా చెప్పాలి ఆడవాళ్ళు.

"మీకు అసలే కోపం. ఆఫీసరు ఓమాట అంటే అన్నాడు. ఆయన్ని ఎదిరించకండి" అనో, "మరీ బ్రతిమాలడించి రాకండి" అనో, "అతను ఎందుకన్నాడో! ఆ మాత్రం అర్థం చేసుకోరేమిటండీ." అనో, "పక్కవాళ్ళని చూడండి, వాళ్ళు ఎలాఉన్నారో" అనో అస్తమానూ అతన్ని రిపేరుచేస్తూ, పట్టాలనుంచి తప్పిన రైలుని, పట్టాలమీదికి తిరిగి చేర్చినట్లు, అతణ్ణి సక్రమమైన మార్గంలోకి తెస్తూఉండాలి. కొందరు ఆఫీసర్లయితే పూర్తిగా భార్య సలహామీదే

నడుచుకొంటూ ఉంటారు, కొన్ని జిల్లాల్ని, జిల్లాఅధికారుల భార్యలే పరోక్షంగా పరిపాలిస్తూ ఉంటారు. "ఆఫీసర్ల అంకుశాలు అంతఃపురాల్లో ఉంటాయి" అనే మాట ఊరికే పుట్టిందికాదు.

కొందరి పురుషులకెతే, "మీరు కాఫీ తాగే వేళెందండీ", "మీరు ఇవాళ కిటికీలు తీసుకొని పండుకోకండి జలుబు చేస్తుంది," "మరికొంచెం అన్నం వేసు కోండి" పంటి చిన్న విషయాలుకూడా చెప్పాలి. వాళ్ళు బొత్తిగా శరత్ నవలల్లో నాయకులులా ఉంటూ ఉంటారు పాపం !

కావ్యాలు పరిశీలించినా మనకు ఈ సత్యం గోచరిస్తుంది. నరకాసుర సంహారానికి "కాదూ కూడదు మీకు తెలియదు నేనూ వస్తానం" టూ సత్యభామకూడా కృష్ణుడితో బయలుదేరి వెళ్ళింది కనకే, అప్పుడా మర్యాద కృష్ణుడికి అలా దక్కింది. అలాగే కైకేయివల్ల దశరథుడికీను, సీత రాముడితో వాదించి అరణ్యాలకి అతనితో వెళ్ళకపోయినా, ద్రౌపది పాండవులను కర్తవ్యోన్ముఖుల్ని చెయ్యక పోయినా, దుష్ట శిక్షణ జరిగి ఉండేదికాదు.

ఇంతెందుకు ? స్వయంవరాలనేవి స్త్రీలకి ఉండేవి కాని పురుషులకి ఉండేవా? ఎందువల్ల! స్త్రీకి అనుకూలుడైన పురుషుని ఎన్నుకొనే తెలివి ఆలోచనా ఉండేది. అందుకే ఆమెకి స్వయింపర అవకాశం ఇచ్చేవారు. ఒకవేళ ఆ అవకాశం పురుషుడికికూడా ఇచ్చినా అతను సమర్థంగా ఆ అవకాశాన్ని ఉపయోగించుకొని ఉండేవాడా లేదా అన్నది అనుమానాస్పదమైన విషయమే!

ఏమైనా సగటున స్త్రీకి వున్న గడుసుదనం, లోకజ్ఞత పురుషుడివుండదు.

ఈ సత్యం చెబితే చాలామంది మగవాళ్ళు అంగీకరించరు. సరికదా కోపం పస్తుందికూడా. అందుకే అన్నాడు ఒక ఆంగ్ల రచయిత: ఓర్పయిన ఆడవాళ్ళు ఉండబట్టే మగవాళ్ళకి కోపం ఎక్కువ అయింది అని. అందుకే అనిపిస్తుంది పాపం అని —

(ఆకాశవాణి సౌజన్యంతో)

బడ్జెట్ ప్రతిపాదన

శ్రీ గొల్లపూడి మారుతీరావు

హార్దిక మంత్రిగారు బడ్జెట్ ప్రతిపాదిస్తున్నారు.
ప్రజా సంక్షేమానికి ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు.
''ప్రతి వ్యక్తీ సుఖంగా బ్రతకాలన్నదే మా ధ్యేయం.
అందరికీ సమానంగా సుఖాన్ని పంచాలన్నదే మా ఆశయం.
అందుకనే కొత్త ప్రతిపాదనల్ని చేస్తున్నాను.
సభ్యుల్ని వీటి గురించి మరీ మరీ ఆలోచించమంటున్నాను.
ఆలోచించాకే చేతులెత్త మంటున్నాను.
మనిషికి ఉండాల్సిన దానికంటె ఎక్కువ సుఖం ఉండకూడదు.
మసుగడ కప్పను మింగిన పాములాగ మాగన్ను పెట్టకూడదు.

సుఖం మరీ కొందరి దగ్గరే మురిగిపోతోందని మాకు రిపోర్టులు వచ్చాయి.

దాన్ని బయటికి లాగి నలుగురికీ పంచాలనే మా తాపత్రయం (ప్రయత్నం)

మనిషి చిరునవ్వుకి మరీ కొరత ఏర్పడింది.

అందుకని చిరునవ్వుల మీద సీరియస్‌గా కంట్రోలు అమలు పరుచ దలిచాం.

ఇకనుంచి వారానికి ఒకసారి కంటె మనిషి ముఖం మీద చిరునవ్వు ఖర్చుకారాదు.

ప్రత్యేకమైన కారణం చూపగలిగితే తప్ప రెండోసారి నవ్వుకోరాదు.

సుఖం ఎక్కువై తే బాధ్యతా బరువూ మొయ్యడం తగ్గిపోతుందని ముందే చెప్పాం గదా.

చీకటి బజారులో సుఖం విరివిగా చలామణీ అవుతోందని అభిజ్ఞ వర్గాలు చెబుతున్నాయి. ఇక ముందు అలా జరగకుండా గట్టిగా కట్టుబాట్లు చేస్తున్నాం.

చీకట్లో నైనా కలకంఠ వధూ కల కాకలీధ్వనులూ, శింజిత మృదుపద మంజీరాలూ, మధురాధర పానాలూ పూర్తిగా బహిష్కరిస్తున్నాం.

డబ్బుకి చిల్లరగా దొరికే చీకటి సుఖం లెక్కల్లోకి రావటంలేదు.

అనధికారంగా మనిషి సుఖపడే హక్కులేదు. నిబంధనలని పాటించడం లేదని రూఢిగా తెలిస్తే నేడో రేపో వారకాంత ఓరచూపుల్నీ, బట్టబయలు చేసే బజారు యౌవనాన్నీ, రంగులు పులిమినకిరాయి పెదవుల్నీ జాతీయం చెయ్యక తప్పదు.

చతుర్ముఖ పురాణ పారంగతుల మీదా, హయ మేధ యాగాన్ని గావించే సోమయాజుల మీదా, అర్ధరాత్రి మ్యునిసిపాలిటీ దీపం క్రింద చప్పుడయే గాజుల మీదా, ఆకలి కడుపుల్లో మెలిదిప్పుతున్నా విస్కీ వాసన కింద నలిగే అరవిచ్చిన పెదవుల మీదా, మదపతి నగ్న సౌందర్య పిపాసమీదా, ప్రేయసి స్నిగ్ధ కోమల దరహాసం మీదా, నమ్మకంగా సర్‌ఛార్జీలు విధిస్తున్నాం.

మధ్యాహ్నం నిద్రని మధ్యతరగతి ఉద్యోగులు బాగా మరిగారని ఈ మధ్యే అర్థమయింది. ప్రభుత్వం సహించరాని భరించలేని నేరం.

సుఖాన్ని పట్టపగలే దోచుకోవడం.

అందుకని లంచ్ బ్రైకుని రద్దుచేసి తంచన్‌గా పది గంటలు పనిచేసే కార్యక్రమాల్ని నిర్దేశిస్తున్నాం.

ప్రేమ కూడా ఈ మధ్య చట్టా వ్యాపారంలో పట్టుతప్పిపోయిందని మీ అందరికీ తెలుసు. కళ్లలేని ప్రేమ కుమ్మరుగై పోయింది.

అందుకనే ప్రేమించుకోడ్డానికి పెర్మిట్ల సిస్టం నిర్ణయించాం.

ప్రతి వీధి చివరనీ చౌక ప్రేమ దుకాణాలు తెరిపిస్తున్నాం.

సినీమాల్లో ప్రేమ విరివిగా ప్రవహిస్తోందని కేరళ సభ్యులు కస్సుమంటున్నారు. ఆచూకీలు తీసి అసలు రహస్యం తెలుసుకున్నాం. సినీమా ప్రేమకి ఫేస్ వాల్యూ అంతగా లేదని బేరీజు వేసుకున్నాం. అందువల్ల రిబేటు మీద ఆ ముడి సరుకుని సభ్యుల అనుమతితో వదిలి పెడుతున్నాం.

రస పిపాసువులకి పప్పులు మినహాయింపు చెయ్యాలని ఎంతగానో ఆలోచించాం. ఇది మైనారిటీ వర్గం కనుక ఎక్కువ చెల్లుబడి లేని సరుకు గనుక కొంతలో కొంత మినహాయింపు చేయవచ్చునని నిర్ణయానికి వచ్చాం.

సాహిత్యం చదివి ఆనందాన్ని సంపాదించుకొనే వారికీ, కర్ణాటక సంగీత శ్రోతలకీ, ఆధునిక నాటక ప్రేక్షకులకీ, రేడియో వినేవాళ్ళకీ, పత్రికలు చదివే వాళ్ళకీ ఆనందం మార్జిన్ తక్కువ కనుక అంతంత మాత్రంగా వదిలిపెడుతున్నాం.

ఇంకా మంచితనం మీదా, దైవచింతన మీదా
స్నేహశీలత మీదా, మనశ్శాంతి మీదా

విరివిగా రిబేటు ఇవ్వడానికే నిర్ణయించుకొన్నాం. ఎందుకంటే వీటివల్ల ఎక్కువ సుఖం దేశానికి నష్టం కాపడం లేదని దీనివల్ల రూఢి చేసుకున్నాం కనుక-

ప్రియురాలి వేలి గోళ్ళ మీదా, జవరాలి కళ్ళ కొసల మీదా, పెదవులకు రాసే రోజా రంగు మీదా, హృదయంలో రేగే మజా కోరికల మీదా, బీదవాడి ఆశ మీదా, రిక్షావాడి అరువు ఖాతామీదా, పర్సీరు మీదా, పళ్ళపొడి మీదా, అజీర్ణ వ్యాధి మాత్రల మీదా, సుఖవ్యాధి ఇంజక్షన్ల మీదా, దుక్కిపిండి విశ్వాసం మీదా, గుహస్తాగాడి ఆదుర్దా మీదా కఠినంగా పన్నులు వేస్తున్నాం.

పీటి ద్వారానే ఎక్కువ సుఖం లీక్ అవుతోందనీ, ఇవే ఈ లోకంలో పీక్ పాయింట్స్ అనడంలో సందేహం లేదు.

నిళ్ళ కొరతకీ మాకూ సంబంధం లేదు.

కన్నీళ్ళు విరివిగా ఖర్చు పెట్టుకోవచ్చు, మాకేం అభ్యంతరంలేదు. పోయిన దానికోసం ఏడిస్తే లెక్క రాసుకోం. లేని దాని కోసం కారిస్తే, కన్నీటి మీదా పన్ను వెయ్యక తప్పదు.

అన్నింటికీ అన్ని కట్టుదిట్టాలూ చేశాం.

ఈ దెబ్బతో మన దేశంలో 'సోషలిజం' పాగా కొయ్యాలాగా పాతుకు పోతోందనడంలో అతిశయోక్తి లేదు.

కాకపోతే, ఒక్కటే మా చేతికి అందనిది మిగిలిపోయింది.

మనిషిని రెచ్చగొట్టే అన్ని సుఖాల్నీ కట్టు దిట్టంలోపెట్టాం.

కానీ నిద్రపోయేటప్పుడు కనే కలల్ని ఎలా ఖాతాలో చూపాలో అర్థం కాలేదు.

అయితే సభ్యులకు ఒక హామీ ఇస్తున్నాం.

సుఖపడే అన్ని అవకాశాలూ మన చేతుల్లోనే ఉన్నాయి కనక

కలగనే అవకాశాన్ని ఒక్కదాన్నీ, తప్పనిసరి కావడం వల్ల, పన్ను-వెయ్యకుండా మినహాయిస్తున్నాం.

[కళాసాగర్ పంచమ వార్షికోత్సవ సంచిక-1977]

ప్రముఖుల ప్రేమలేఖలు !

శ్రీ శ్రీరమణ

ఈ క్రింద పేర్కొన్న ప్రముఖులలో ఎవరైనా వారి జీవితాల్లో ప్రేమ లేఖలు రాశారో లేదో, రాసిఉంటే మాత్రం బహుశా ఇలా ఉండి ఉండేవి :

గిరికుమారుడు

ఇది విశ్వనాథ సత్యనారాయణగారి కలం పేరు. వారి రచనా పాటవం వల్ల వారికి గల ఆత్మ విశ్వాసాన్ని స్వోత్కర్షగా అపార్థం చేసుకున్న వారున్నారు. విశ్వనాథవారు ప్రేమలేఖలో కూడా తనని తాను తగ్గించు కోవడం జరగదు.

బాలామణీ !

ఆశీ:. నిన్నుచూచితిని. తదావి ఆలోచనలన్నియు నీ చుట్టూ పరిభ్రమించు చున్నవి. పదలి పచ్చుటకవి మొరాయించుచున్నవి. నా పంటివాని మనస్సు సైతం బందీకృత మొనర్చిన నీపగు రూపలావణ్యములు అసామాన్యమే అయి ఉండపలె.

ముసుపే సరస్వతి నిన్ను వరించెననుట లోకవిదితమ్ము, అందులకై ఎందరు ఈర్ష్యపడిరో, బడుచుండిరో- అది వేరు విషయము. నేటివరకు రసభంగము కలుగకుండ నెట్లో కాలము వెళ్ళదీయుచుంటిని. సరస్వతికి రసభంగము వాటిల్లిన 'సపతి' యగును కదా ! సవతిపోరు కొనితెచ్చుకొనుటకు ఏ పురుషుడు మాత్ర మిచ్చగించును? నేను వెట్టివాడనుకాను. సాహిత్యమున సముద్రుడు లాంటివాడ నని లోకమంగీకరించినను లేకున్నను నేను సముద్రుడననే భావింతును. ఈపు కిన్నెరసానివి. ఇక నేమి గావలె?

నా మనసు నీపై నిడుట నీ యదృష్టము. కుంకుమ శోభితమైన నీ నొసట ... కుంకుమ యనిన జ్ఞప్తికి వచ్చును. కాశ్మీర దేశము కుంకుమ బూలకు ప్రసిద్ధి. పూలు మరల బలురకములు... అరుణములు, శ్వేతములు, పింగాక్షువులు. అందుకొన్ని సౌగంధికములు, మరికొన్ని తద్భిన్నములు- పూల విశేషములట్టిద. ఇంతకును కాశ్మీర దేశములోని పూల విషయము. పుష్పాడులు తెమ్మెరలపై దేలుచు అరుణోదయ మేనియో మధ్యాహ్న మేనియో పసిగట్ట నలవిగాకుండ సేయును.

'కుమ్' యను శబ్దము సేయుచు ఆ మొగ్గలు విచ్చుకొనును. అందుకే అది కుంకుమ అయినది. కాశ్మీరు కుంకుమలో పదియారు పన్నెలున్నవి. వన్నెకొక ప్రత్యేకత గలదు....

ఇలా సాగే వీరి ప్రేమ లేఖకు జవాబు వస్తుందంటారా ?

ముని-మాణిక్యం

మునిమాణిక్యం నరసింహారావుగారి కాంతం కథలు సంసారంలోని సరి గమల్ని వినిపిస్తాయి, పెళ్ళికి ముందు ప్రేములు వీళ్ళకి ఆట్టే తెలియవు. వీరిదంతా సంసారపక్షం—

ప్రియమైన కాంతానికి-

శుభాశీస్సులతో ప్రాయు లేఖాంశములు. ఉభయ కుశలోపరి. నవ్వు వ్రాయించిన జాబు అందినది. సంగతులు తెలిసినవి. ఎదురింటి మీనాక్షికి మళ్ళీ ఆడపిల్లే. ఈ విషయం నీకు సంతోషం కలిగించ గలదని తెలుపడమైనది. మీ జానకమ్మ పిన్నిగారింట్లో అంతా కులాసాగానే ఉన్నారు. కనకమహాలక్ష్మి నీ రాక కోసం ఎదురు చూస్తున్నది. వారి పెద్దమ్మాయికి సీమంతం చేస్తారట. నువ్వు చెప్పిన ప్రకారం పనిమనిషి దగ్గరున్న పెద్ద డబ్బాగిన్ని తెప్పించాను, పాత బాగీతాలవాడు అమ్మగారు ఎప్పుడు వస్తారని రోజూ వాకబు చేస్తున్నాడు. నువు

మడిగాకాక విడిగా చిన్నజాడిలో తీసివెళ్ళిన ఆవకాయ అయిపోయింది. నువ్వు వెళ్ళినప్పటినుంచీ అదే కదా ఆధరువు? మరి పెద్దజాడిలోంచి తీసుకోమంటావా? ఏ సంగతి జాబు వ్రాయించవలెను.

వచ్చే తదియా గురువారం దివ్యంగా ఉంది. ఒకవేళ నువ్వు బయలు దేరితే ప్రయాణంలో జాగర్త. మన బందరు రైలుస్టేషనులో నువ్వు కాపురానికి వచ్చినప్పటి నుంచీ గుర్తుగా ఉన్న రావిచెట్టుని మొన్నీమధ్య నరికి పోగులు పెట్టారు. మరి నువ్వు స్టేషను ఎలా గుర్తు పడతావో అని బెంగగా ఉంది. నీ నోట్లోమాట దాగనట్లే మన పెద్ద బాల్కీలో సీళ్ళు ఆగటం లేదు. నువ్వు రాగానే మాటు వేయిద్దాము.

తాపీ వ్రాతలు

ఏ విషయాన్నయినా సమగ్రంగా సోదాహరణంగా చర్చిస్తే కాని తాపీ ధర్మారావు గారికి తోచదు. వారిది భౌతిక వాదం.

సుభద్రా!

నిన్ను చూడగానే హృదయోల్లాసం కలిగిన మాట వాస్తవమే! అయినా కొన్ని విషయాలు ముందుగా చర్చించడం అవసరం. ఆనూపానూ తెలుసుకోకుండా అమాయకంగా ప్రవర్తించడమనేది నవీన శతాబ్దంలో కూడా జరగడం హాస్యాస్పదం. అందచందాలను పర్ణించుకుంటూ ఊహాలోకాల్లో విహరించడం స్త్రీ పురుషులిద్దరికీ శ్రేయస్కరం కాదు. జీవితాలను పరస్పరం పంచుకోబోయే ముందు ఇద్దరి మధ్యా సరియైన అవగాహన అవసరం. ఈ విషయాలను నా 'జాన్నకట్టి' అనే వ్యాసంలో సమగ్రంగా చర్చించాను.

మనుష్యులలోనే కాదు, అన్ని జీవరాసులకూ జతగూడడం అనే ప్రత్యేక గుణం ఉంటుంది. చివరకు సీతాకోక చిలుకల్లో కూడా ఈ జత కట్టడం అనేది ఉంది. ధ్రువ ప్రాంతంలో ఉండే పెంగ్విన్ పక్షుల పలపు సంకేతాలూ, ప్రేమ

భాషలూ విచిత్రంగా ఉంటాయి. (చూ॥నా॥''పెళ్ళి, దాని పుట్టుపూర్వోత్తరాలు''). జీవితం లౌకిక పరమైన విషయాలతోనూ లైంగిక పరమైన కోరికలతోనూ ముడిపడి ఉంటుంది. నేటి యువతీ యువకులు ప్రేమ అనేది ఓ అతీంద్రియ లౌకిక అనుభూతి అని భ్రమ పడుతున్నారు. కాని ప్రేమ అనేది పూర్తిగా కామ పరమైనది. కానప్పుడు పురుషుడు స్త్రీనే ఎందుకు ప్రేమించాలి? వివరాలకు నా 'కొత్తిమీర' వ్యాసం చదువు.

మెసపొటేమియాలో యువతీయువకుల కామ కలాపాలు చాలా వింతగా ఉంటాయి.

హలో! ఓ ప్రే ముందా!

జోకులాష్టమినాడు పుట్టిన ముళ్ళపూడి వెంకట రమణ పుట్లకొద్దీ రచనలు పండి వార్చలేదు. వార్చిన కొద్ది రచనలూ ఘుమఘుమలాడుతూ తాలింపు రుచులతో తరతరాలు నిలుస్తాయి. సాధారణంగా చెయ్యి తిరిగిన ప్రతి రచయితకూ ఒక స్వంతశైలి ఉంటుంది. కాని ముళ్ళపూడి వారు పాత్రోచితంగా శైలిని సాగించారు. అందువల్ల సరాసరి వెంకటరమణగారి ప్రేమలేఖ ఎలా ఉంటుందో ఊహించి రాయడం కష్టం. కనుక వారి రచనల్లో తారసపడే అప్పారావు, బుడుగు వగైరా పాత్రలు ప్రేమలేఖలు రాస్తే ఎలా ఉంటామో ఊహించాను. ముందుగా అప్పుల్రావు—

అప్పారావు సర్వాంతర్యామి. గొప్ప వేదాంతి. ఒడుపుగల ఋణవేత కూడా. సమస్త విషయాలను అప్పుమీదకు మళ్ళించి మానవుల దగ్గర మాత్రమే గాక పశుపక్ష్యాదుల వద్ద సహితము అప్పుపిండగల ఉద్దండ పిండము. అప్పారావుని ముందస్తుగా మనం ఇప్పుడు వదిలించుకోకపోతే- 'హలో ఓ ప్రేవుందా?' అని మనమీద విరుచుకుపడే ప్రమాదం ఉంది.

అ- ఋణ గారికి

ఋణాభినందనలతో-

మిమ్మల్ని చూడగానే అయిదు రూపాయల నోటుమీద జింక బొమ్మ ప్రాణం పోసుకుని అలా గెంతుకుంటూ వచ్చినట్లయింది. మీ చూపులు విచ్చు రూపాయలు. మీ ముక్కు బ్లేంక్ చెక్కు. మీ మొహం మూడు సింహాల మొహర్. మొత్తంగా మిమ్మల్ని చూసినపుడు వెగటుపుట్టేటంత అప్పు దొరికినట్లయింది.

చూడగా చూడగా ఈ ప్రపంచమే ఒక పెద్ద ఋణవలయంగా తోస్తుంది. ఇచ్చిపుచ్చుకొనేవి ఈ వలయంలో రెండే రెండు. మొదటిది అప్పు, రెండోది ప్రేమ. ఈ అప్పారావు ఎన్నడూ మొదటిదాన్ని తప్ప మరి దేన్నీ ఎవడినీ బదులుగానైనా అడిగి ఎరగడు. ప్రేమకూడా అప్పులాంటిదే! నిలవ ఉన్నకొద్దీ పెరిగి పేరుకుపోతుంది మరి. లేఖ రావడం ప్రేమకు సంబంధించినదయితే, లేక రావడం అప్పు సంబంధికం. ప్రేమలో అప్పులో లేని సౌలభ్యం ఒకటుంది. అప్పు లేదనవచ్చు. కనుక మీరు లేదనడానికి ఇది అప్పు కాదు. నా ప్రేమను కాదనేసి అప్పు ప్రాప్తమనోహరిగా మిగిలిపోవడం అఋణా, మీకు భావ్యం కాదు.

గంగా పాకీరధి మీ పామ్మగారిని ఒప్పించే బదులు బాధ్యతలు నేనే తీసుకుంటాను. మీరు సరే అంటే అరువు ముందుకు వేస్తాను. మన పెళ్ళి సందర్భంగా పదిమందికీ ఋణగ్రస్తుణ్ణి అయే అవకాశం ఇప్పించండి. ప్రస్తుతం కవరుకి స్టాంపులు అంటించలేదు. అది చెల్లించి స్వీకరించి నా లేఖను విముక్తం చేసుకోండి.

(అప్పారావు లేఖని ఇంతటితో ఆపకపోతే ఇది అప్పువైపు దారితీసే ప్రమాదం ఉంది)

బుడుగు రాతలు

బుడుగు ఒక గడుగ్గాయి. ప్రపంచంలో ఆ సైజు పిల్లలకు ప్రతినిధి.

పిల్లల్లో పెద్దగా, పెద్దల్లో పిల్లగా ఉంటాడు, జట్కా తోలాలని, వింజన్ నడపాలని కుతూహలం. బుడుగుకి కూడా చిన్ని ప్రేమించే హృదయం ఉంది.

సీ గాన పెసూ నాంబలు గారికు,

ఇది లవ్ లెటరు రాస్తున్నా సన్నమాట-బాబాయి ఇచ్చిరా అంటే 2 జడల సీతకి ఇచ్చానే అటాంటి దన్నమాట. బాబాయికి కూడా కుంచెం రాయడం వచ్చనుకో-నేను పచ్చినంత కాదనుకో-అయినా నేనేం చిన్నవాడినా! లేకపోతే చితకవాడినా !

నీ కసలేం కాదుకదా! నీకు బాహా రావటం కోసం కుంచెం కుంచెం రాస్తాను. లే పోతే బోలెడు ఇంకా చాలా రాసెయ్య గలను.

లౌ లెటరంటే ప్రేమించుకోవడంట, బాబయ్య చెప్పాడు. నాకు తెలియ దనుకో.

బామ్మ రామకోటి రాస్తుందీ. ఏమీ తోచక బాబాయి లౌ లెటరు రాస్తాడు. బాబాయికి పని దొరకలేదుట కదా-ఇలా అని నాన్న అన్నాడు. అయినా పని దొరుకుతుందేవిటి? గోళీలయితే దొరుకుతాయి గాని.

బామ్మ బొత్తిగా మతిమరపు మనిషి. అట్లా అని బామ్మే అంటుంది. అంటే మనం ఓకులు బొత్తిగా పెడతామే. అట్టాగన్నమాట, మరిచిపోకుండా రాసిన మాటే సాయంకాలం దాకా రాసుకుంటుంది. అందుకని రామకోటి అంటారు దాన్ని.

అంమ ఏమీ రాయదు. అంమకి పాపం గుడింతాలు కూడా రావు. అందుకని రోజూ నాన్న తలకి బొబ్బరి నూనె రాస్తుంది. నేను వద్దన్నా ''ఊహు'' వినదు, ప్రైవేటు చెప్పి అయినా రాస్తుంది. పాపం చదువు రాదు కదా అందుకని నేనూ ఊరుకుంటాను.

ప్రేమ గుడ్డిదని బాబాయి చెప్పాడు. బామ్మ కళ్ళజోడు నేను పెట్టుకునే టప్పుడు తీసికెళ్ళిపోతానే అప్పుడు బామ్మ గుడ్డిది అయిపోతుంది కదా. అట్టాంటి దన్నమాట. మనం ప్రేమించుకొనకపోతే నారాయణ కొట్టుచారి కూడా గుడ్డి దవుతుంది.

బాబాయి కాయితాలమీద రాస్తాడనుకో - నేను పలకమీద గుండ్రంగా రాయాలిట. ప్రేమించుకొనే ఉత్తరాలు వెనక్కి తీసుకోరట. ప్రేమంటే అచ్చంగా ఇచ్చేయ్యడంట. ఒకటికి కాదు. నిజంగా అన్నమాట.

ఇహ ప్రైవేటు మాష్టరు వచ్చినా పలక వుండదన్నమాట. నువ్వు అపక తవకగా రాసినా పలక ఇచ్చేకూడదు. సిన్మాలో లాగా త్యాగం యిచ్చేయడం అన్నమాట.....

(పలక రెండు వైపులా నిండిపోయిందోచ్ !)

[శ్రీ రమణ పేరడీల నుంచి]

చలవ మిరియాలు

రేడియో

మునిమాణిక్యం గారి 'కాంతా'న్ని చాలామంది కథకులు సంగ్రహించు కొని బజారుల వెంబడి త్రిప్పడం వల్ల, ఇకనైనా నరసింహారావుగారు రామె కథలకు స్వస్తిచెప్పి పరివ్రాజక ధర్మం స్వీకరించుట యుక్తమని వారి మిత్రులు హెచ్చరించుచున్నట్లు తెలుస్తోంది.

*　　*　　*　　*

ఆంధ్ర భారతీ తీర్థ పీఠస్థులు బుర్రా శేషగిరిరావు పి.హెచ్.డి. గారు 1936 లో ఇచ్చే బిరుద ప్రదానంలో నీ దిగువ పట్టిక గాంచదగును.

మోటూరి సత్యనారాయణగారు	-	అఖిలాంధ్ర-హిందీ తర్జుమాదార్
తల్లావఝుల శివశంకరశాస్త్రిగారు	-	భావకవి సంజాయిషీదార్
జొన్నలగడ్డ సత్యనారాయణగారు	-	గద్యైకమతినీ కరికలభ
శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ గారు	-	కవి మహోత్తృణావ్యర్త
కరణం శ్రీనివాసరావు గారు	-	హనుమద్వంశ పయఃపారావార రాకా సుధాకర
కొంపల్లి జనార్దనరావు గారు	-	చండప్రచండ గండశిలాభినవ కొక్కొండ
బొడ్డు బాపిరాజు గారు	-	కవన నవధాన్యాపణ
భమిడిపాటి కామేశ్వరరావు గారు	-	శారదా చరణాంగద చూరకార
కవికొండల వెంకట్రావు గారు	-	కవితా నిరోద్గార
ముద్దుకృష్ణ గారు	-	అపర మొపాసా
విశ్వనాథ సత్యనారాయణ గారు	-	ఆంధ్రాసావాదిత్యో కవిబ్రహ్మ
కాటూరి వెంకటేశ్వరరావు గారు	-	కవన కాషాయాంబర
దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు	-	బాష్పకవితా సయాగర
వేలూరి శివరామశాస్త్రి గారు	-	ఇబ్‌సన్ షా నిషా హమేషా
వేమల సత్యనారాయణశాస్త్రి గారు	-	రాహువిరహ ఖిల్లీ సరిష్ఠ.

[30 సంవత్సరాల నాటి కృష్ణాపత్రిక నుంచి]

కొత్త నాటకం

శ్రీ తంబు

ఫలానా రామకృష్ణయ్య గారు కృష్ణుడు వేషం వేస్తున్నారంటే ఊళ్ళో జనం అంతా నాటకం హాలు దగ్గరే ఉండేవారు.

గమేళా దగ్గర మేకలాగ, లైన్లో నిలబడి ఓట్లువేసి నాయకుల్ని నెత్తి కెక్కించుకొనే అమాయకపు ఓటర్ల లాగ జనం వేలం వెర్రిగా వెళ్ళి సవరు పౌరాణిక నాటకం చివరిదాకా టిక్కెట్లు కొనుక్కుని మరీ చూసేవారు. చంటి పిల్లాడు గుక్కపట్టినట్లు రామకృష్ణయ్య గారు పద్యం పాడుతూంటే ప్రేక్షకులకి గుండె తరుక్కు పోయేది. కృత్రిమంగా ఉన్నా కంఠతాపట్టినా అయన సంభాషణలు, రాజకీయ నాయకుల ఉపన్యాసాల్లా ఎన్నిసార్లు విన్నా మళ్ళీ వినాలనిపించేటంత తియ్యగా ఉండేవి. చిన్నప్పటినుంచీ పత్రికల్లో అవే దేశనాయకుల ఫొటోలు, అవే సినీమా తారల ఫొటోలు చూస్తున్నా విసుగుచెందని ప్రజలు రామకృష్ణయ్య గార్ని ఎన్నో ఏళ్ళు ఓపిగ్గా ఆదరించారు. అభిమానించారు. ఆరాధించారు. ప్రభుత్వం వారు కూడా వారిని అభినందించారు. సన్మానించారు. కళాప్రపూర్ణ చేశారు. అకాడమీలో స్థానం కల్పించారు.

ప్రజలకి విసుగు కల్గుతుందేమోనని కనిపెట్టిన రామకృష్ణయ్య గారు ఒక రోజు ఆయన గౌరవార్థం యేర్పాటు చెయ్యబడ్డ సన్మాన సభలో మంత్రి గారు రాపటానికి వీలుపడక వాళ్ళ అబ్బాయిని ముఖ్య అతిథిగా పంపిన శుభ సందర్భంలో పంచభూతాల సాక్షిగా పత్రికా విలేఖరుల కోరిక మీదట కృష్ణుని వేషం వెయ్యబోనని ప్రకటించారు.

''మీరు కృష్ణుడి వేషం వెయ్యనంటే మాగతేవిటి ?'' అని ప్రజలు వాపోయారు. కంట తడి పెట్టారు. కాళ్ళా వేళ్ళా పడ్డారు. రామకృష్ణయ్య గారు ససేమిరా అన్నారు. కొందరు అభిమానులు నిరాహార దీక్ష చేస్తామన్నారు. అయినా ఆయన చలించలేదు. మంత్రులు వచ్చి "ఇది ప్రజా సమస్య. మనం శాంతియుత వాతావరణంలో శిఖరాగ్రచర్చలు జరిపి పరిష్కార మార్గం ఆలోచిద్దాం'' అన్నారు.

"ఆటలు ఆడేవాళ్ళకి ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహంలో కనీసం అయిదో వంతు నాటకాల వాళ్ళకి ఇస్తే బావుంటుంది. కాలేజీలో సీట్లు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, స్పెషల్ క్యాజుయల్ లీవులు, చికెన్ బిరియానీలు, ఫస్టుక్లాసు పాసులు ఇవ్వకపోయినా మా నాటకాల వాళ్ళని ఆఫీసులో వెధవ నాటకాలాడొద్దు అని తిట్టకపోతే చాలు'' అని బాధపడి రామకృష్ణయ్య గారు కళ్ళు తుడుచుకున్నారు.

మంత్రులంతా సానుభూతితో విచారించారు. "నిజం చెప్పాలంటే మేం అంతా చిన్నప్పుడు నాటకాలాడ్డంవల్లే ఇలా ఇప్పుడు పైకి వచ్చాం. నాటకాల వాళ్ళంటే మాకు సానుభూతి ఉంది. కానీ ఎరువు తెచ్చుకున్న ఆటల కోసం సంపెంగనూనె రాసుకుర్నట్లు ప్రజలు క్రికెట్ వగైరాల మీద మోజు చూపిస్తున్నారు. అది మన సంస్కృతి సంప్రదాయం కాకపోయినా, ప్రతి ఆటలోనూ మనం ఓడిపోతున్నా వాటిపై అంత డబ్బు ఖర్చుపెట్టక తప్పడం లేదు. మన సంస్కృతికీ సంప్రదాయానికీ చిహ్నాలయిన నాటకాలని నమ్ముకున్న మీ లాంటి వాళ్ళకి న్యాయం చెయ్యలేక పోతున్నాం. కావాలంటే వచ్చే ఎన్నికల్లో మీకో టిక్కెట్టు ఇప్పిస్తాం. మీరు మా పార్టీ తరఫున తప్పక గెలుస్తారు. మీరు నాటకాలు మానేసి ప్రజల్ని నియంత్రించకండి. కృష్ణుడు కాకపోతే బుద్ధుడు-లేదా ఇంకొకటి - ఏదో వేషం వేసి వాళ్ళ నామం దింప జేయండి'' అని ముక్త కంఠంతో విన్నవించుకున్నారు.

"సరే" నని మర్నాటి నుంచీ రామకృష్ణయ్య గారు కృష్ణుడు వేషం మానేసి అర్జునుడి వేషం వెయ్యసాగారు. మరి కొన్నాళ్ళకి అది కూడా మానేసి దుర్యోధనుడి వేషం చేపట్టారు.

ఈ లోగా ప్రజలు కూడా కొంచెం అభిరుచుల్ని మార్చుకున్నారు. రామకృష్ణయ్య గారు మురళి పట్టుకుని కృష్ణుడి లాగ, విల్లంబులు పట్టుకుని అర్జునుడి లాగ, గద పట్టుకుని దుర్యోధనుడిలాగ, ఇలా ఏయే పాత్రలో నటించినా, ప్రేక్షకుల కంటికి మాత్రం ఆయా పాత్రల్లో కృష్ణుడూ, అర్జునుడూ, దుర్యోధనుడూ వీరెవరూ కనిపించకుండా కేవలం రామకృష్ణయ్య గారే కనిపించ సాగారు. అదే గొంతు వినిపిస్తోంది. అన్ని పాత్రలూ ఒక్క లాగే, నటనంతయు ఒక్కలాగే అనిపిస్తోంది. కాబట్టి కష్టపడి ప్రతి నాటకం చూడక్కర్లేదు అనుకొని బద్ధకించసాగారు.

క్రమంగా రామకృష్ణయ్య గారి నాటకాలకి గిరాకీ తగ్గింది. ఇసుక వేస్తే రాలని జనం కనిపించక, ఇసుకే మిగిలిపోయింది. వేషాలు మార్చినా జనాన్ని ఆకట్టుకోలేక రామకృష్ణయ్య, పార్టీలు మార్చినా ఓడిపోయిన రాజకీయ నాయకుడిలా బాధపడ సాగారు.

జండాని బట్టి గుర్తుపట్టాలే గాని, నాయకుణ్ణి మరే విధంగానూ గుర్తించ లేని జనంలాగ, ప్రేక్షకులు రామకృష్ణయ్య గారిని, ఏ పాత్ర వేస్తున్నారో పోల్చుకోలేని అయోమయస్థితిలో పడ్డారు. మురళి పట్టుకొస్తే కృష్ణుడనీ, బుజాన్న అంబుల పొదీ చేతిలో బాణం ఉంటే అర్జునుడనీ, గదని బుజం మీద మోసుకుని వస్తున్నాడు కనుక దుర్యోధనుడయి ఉంటాడనీ, ఆయా ఆయుధాల్ని పార్టీ జండా వతుగా పోల్చుకుని మనస్సు సర్దుకునేవారు. అయినా ప్రేక్షకులికి ఆయనంటే అభిమానం పోలేదు. ఆయనకీ ప్రజలంటే ప్రేమ పోలేదు. భారతనారి ఒకేసారి మనసిస్తుంది అని సినిమాల్లో అన్నట్లు. పాతనటుల్నే పట్టుకుని వేళ్ళాడటం పాత నాయకులకే పట్టాభిషేకం చెయ్యడం అలవాటూ ఆనవాయితీ అయిపోయిన ప్రజలు ఆయన్ని మరో పాత్రలో చూడ్డానికి రాజీపడి పోయారు.

ఇది కనిపెట్టిన రామకృష్ణయ్య గారు, 'కొత్త నాటకం' వేస్తున్నానని, మురళి, విల్లంబులు, గదలు చేతిలో లేకుండా పాత్రపోషణ చేస్తానని, నటనలో క్రొత్తదనం సాధిస్తాననీ ప్రకటించారు. ప్రదర్శనకి రావడానికి టిక్కట్లు లేవని కూడా చెప్పేసరికి జనం ఇసుకవేస్తే రాలకుండా హాజరయ్యారు.

కొత్త నాటకం ప్రారంభమయింది. అరగంటయింది. ఏ పార్టీలో ఉన్నా రాజకీయ నాయకుడి వ్యక్తిత్వంలా, ఏ పాత్ర ధరించినా ఆయన నటనలో మార్పు కన్పించలేదు. కొందరు నాయకులు ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో చెప్పడం ఎలా కష్టమో, అలాగే ఆ సమయంలో రామకృష్ణయ్య గారు ధరించిన పాత్ర ఏమిటో తెలుసుకోవడం అంత కష్టం అయింది ప్రేక్షకులకి. ఆయన వేస్తున్నది ఏ పాత్ర? ఛస్తే అర్థం కాలేదు ఒక్కరికీ.

వెళ్ళిపోదామని మెల్లిగా ఒక్కొక్కరు లేవసాగారు. లోనికి రావడానికి టిక్కట్టు లేదు కానీ బయటికి వెళ్ళడానికి టిక్కట్టు పెట్టారు. ఉచితంగా లోపలికి వచ్చినవాళ్ళు టిక్కట్టు కొనుక్కుంటే గాని బయటికి పోవడానికి వీల్లేకపోయింది.

బ్రతికుంటే బయసాకు తినొచ్చని టిక్కట్టు కొనుక్కుని ప్రజలు బ్రతికి బయటపడ్డారు.

నీతి :— నాటకంలో నటుల్ని తప్పించుకోవచ్చు. నిత్యజీవిత నాటకంలో ఉత్తములై రోజుకొక వేషం వేస్తున్న రాజకీయ నటుల్ని మాత్రం తప్పించుకోలేం.

[స్వగతంబు – ఆంధ్రజ్యోతి వారపత్రిక 4-5-1979]

ఉపశ్రుతి :- కొన్నాళ్ళు, ఆంధ్రజ్యోతిలో తంబు వారం వారం నిర్వహిస్తూన్న స్వగతంబు శీర్షిక కనిపించలేదు. అలా కనిపించనందుకు కారణాన్ని ఇలా 13-10-73 దసరా సంచికలో ఒక ప్రకటన వేసి, దసరాని సరదాగా మార్చారు :-

కనబడుటలేదు

నాయనా చంద్రశేఖరం! దసరా మామూలు వాళ్ళకు భయపడి, నువ్వు పారి పోయిన నాటినుంచీ, నీ కోసం నీ భార్యా పిల్లలూ, మరియూ, దసరా మామూలు వాళ్ళూ, బెంగ పెట్టుకొని మంచం పట్టారు. ముక్కూ మొహం తెలియని అడ్డ మయిన వాళ్ళూ వచ్చి, వాళ్ళకు నువ్వేదో అచ్చున్నట్లు అడుక్కుతింటూ ఉంటే, క్రిందటి జన్మలో నువ్వుచేసిన అప్పులు, సులభ వాయిదా పద్ధతిలో దసరా మామూళ్ళ పేరిట చెల్లిస్తున్నాను అనుకోవాలి. అంతేకాని అలా భయపడి పారి పోతే ఎలా ?

అసలు అడుక్కోవడం, ధర్మం చేయడం అనేవి మన సంప్రదాయం - మరియూ సంస్కృతి – అందులో దసరా మామూలు అనేది ఎన్నో ఏళ్ళుగా వస్తున్న ఆనవాయితీ.

అన్నట్లు ఎక్కడ పడితే అక్కడ ప్రత్యక్షమయ్యే ఈ దసరా మామూలు దేవతల నుంచి, నువ్వు తప్పించుకోలేవు. నువ్వు ఎన్ని మారు వేషాలు వేసుకుని తిరిగినా, ఎక్కడో ఏదో డిపార్టుమెంటు పేరిట నిన్ను వాళ్ళు వెంటాడి మామూలు వసూలు చెయ్యక మానరు.

ఎన్ని యుద్ధాలు జరిగినా, ఎన్ని ఎమర్జెన్సీలు వచ్చినా, ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ దసరా మామూలు వ్యవస్థని మాత్రం ఎవ్వరూ మార్చలేరు. ఇదొక సమిష్టి ముష్టి వ్యాపారం. అనేక డిపార్ట్‌మెంటుల పేరిట విశ్వరూపం ధరించిన ఈ దసరా మామూలు తప్పించుకోలేవు.

కాబట్టి నువ్వు అర్జంటుగా తిరిగి వచ్చి చెంబూ, తపేళా తాకట్టుపెట్టి దసరా మామూలు వాళ్ళకు, ఈ ఏడాదికి పదిలించుకో. కనీసం వచ్చే ఏడాది ఈ బాధ తప్పాలని ప్రభుత్వాల్నీ, ప్రజల్నీ ప్రార్థిస్తూ, ప్రేమతో-

నీ

తంబు

చిల్లర దేవుళ్ళ సభ

శ్రీ పన్నాల సుబ్రహ్మణ్యభట్టు

నేను కాలు పెట్టేసరికి-

తిరుపతి చాలా కోలాహలంగా ఉంది. వీధి వీధినా కాషాయం, నలుపు, కుంకం రంగు వస్త్రాలు తానుల్లా సాగదీసి నినాదాలు తెల్ల అక్షరాల్లో రాసారు. "అమ్మవార్లకి, వెలకబడిన దేవుళ్ళకీ ప్రత్యేక సదుపాయాలు కావాలి. పెద్ద దేవుళ్ళ మిగులు భూములు చిల్లర దేవుళ్ళకి పంచాలి. గ్రామ దేవతల సంఘం వర్ధిల్లాలి. కర్పూరం, దీపం, మా కనీస హక్కు. పెద్ద దేవుళ్ళ దౌర్జన్యాలు నశించాలి. దీపారాధన వెలుగులో అందరూ సమానమే. బంగారు గుడిలో దేవుళ్ళు దిగిరావాలి. కొండమీద దేవుడూ కదలిరా. చిల్లర మల్లర దేవుళ్ళు ఐక్యంగా ఉండాలి" అంటూ పతాకాలు బిగుసుకుని ఊగుతున్నాయి ఊరంతా.

గోవిందరాజ స్వాముల గుడి ముందు ఓ పతాకం ఎగురుతోంది. "గాలి గోపురం మా జన్మహక్కు" అని ఉంది. "నిత్య ప్రసాదానికి నిధి ఏర్పాటు చేయాలి. భక్తుల దృష్టిలో దేవుళ్ళందరూ సమానమే. ఆడంబరాలు గల దేవుళ్ళు డవున్, డవున్ - ఇట్లు ప్రహారీ దేవుళ్ళ శాఖ" - అని ప్రకటన కనబడింది. ప్రత్యేక రైళ్ళలో దేశం నలుమూలల నుంచి ఏడువేల మంది చిల్లర దేవుళ్ళ ప్రతినిధులు దిగారు. విశ్వవిద్యాలయం ప్రక్కన మెట్టసాగు పరిశోధనా కేంద్రములో విడిది చేశారు. పశుగణాభివృద్ధికి కేటాయించిన బహిరంగ స్థలంలో దేవీ దేవతల కార్యదర్శకులూ, అర్చకులూ, ఎగ్జిక్యూటివు ఆఫీసర్లూ హడావుడిగా తిరుగుతున్నారు. కాళహస్తి, దాక్షారం, అన్నవరం, మంగళగిరి, యాపగిరి, సింహాచలం స్వామి వారలు, ఏం గుళ్ళు మునుగుతాయో అని పరిశీలనా సంఘాలను పంపారు.

అయ్యప్ప దేవస్థానం నుండీ, కాశీనుండీ కూడా ప్రతినిధులు వచ్చారు. ''దేవుళ్ళ కిచ్చిన వేలాదెకరాల భూములు పోయాయి. గండ పెండేరాలు మోసిన అర్చకులు తిరగని రిస్టువాచీల రిస్టులతో వీధిన పడ్డారు. దేవుళ్ళకు సహితం ఇంత దరిద్రం దాపురిస్తుందని కల్లో కూడా అనుకోలేదు'' అన్నారు ఓ ప్రతినిధి.

ఓ మూల నుంచి ఉపన్యాసం వినబడుతోంది. "పాపాలు పెరిగాయి - కాదనం లేం. భక్తి పెరిగింది - కాదనలేం. దేవుళ్ళకీ ఆదాయం పెరిగింది. అయితే ఈ భక్తుల సొమ్మంతా ఏ కొద్దిమంది దేవుళ్ళకో పరిమిత మవుతోంది. ఇది ఘోరం. ప్రక్క సందులో దేవుడి గుళ్ళో దీపం వెలుగుతోందో లేదో చూడ లేనివారు వందలమైళ్ళ దూరం వచ్చి వేలాది ప్రజల క్యూలో నిలబడి గంటల కొద్ది వేచి దేవుళ్ళని చూస్తున్నారు. ఇదో భారీ పరిశ్రమ అయిపోయింది. దీనికి ఆదాయపు పన్ను లేదు. క్యూ మీద పన్ను వేస్తే రెండు కోట్లయినా కనీసం సంపాయించవచ్చు. ఆ డబ్బు చిల్లర దేవుళ్ళ హారతికి వినియోగించవచ్చు.

సాలుకి 12 కోట్లో 14 కోట్లో ఒక్క దేవుడికే పరిమితం కావడం నేరాతి నేరం. సాటి దేవుళ్ళకి నైవేద్యానికి వడపప్పు లేదు. కట్టుకోడానికి బొద్దింకలు కొట్టని పస్త్రాలు లేవు. విగ్రహాలకు నగల మాట ఆఫీసరెరుగు. కాళ్ళు చేతులూ పెచ్చులూడి పోయాయి.

భక్తులు లేక, దక్షిణలు రాక పూజారి అయ్యవార్లు అంకెలాటకి పోతున్నారు. జరీపాగా కాపలాదాసు ఉండాల్సిన చోట రోగిష్టి కుక్క రక్షణకి కుని రింది. మధ్య తరగతి దేవుళ్ళు బాగా దెబ్బతిన్నారు. శివరాత్రికీ శ్రావణ పూర్ణిమకీ వచ్చిన డబ్బు, మాగాణి మీద రావలసిన మూడు వేలు - దేవస్థానం అధికారుల జీతాలకీ నిర్వహణకీ చాలటం లేదు.

హారతి కర్పూరం అరువుగానైనా దొరకదు. తడిసిన అగ్గిపెట్టె వెలగదు. మహానివేదనకి బదులు బతానీ గింజల నివేదన జరుగుతోంది. పంద ఎకరాల

వైభోగం నాలుగు వడలకి దిగిపోయింది. ఇంత గర్భగుడి దరిద్రం ఏ దేశం లోనూ లేదు.

నిన్నటి మతాల దేవుళ్ళూ, మొన్నటి తరాల దేవతలూ మనకేవిటి అన్నట్లు వేసి వెయ్యిమంటూ ఉన్నారు. వాళ్ళకి విదేశాల నుంచి వీశెల లెక్కల్లో విరాళాలు వస్తున్నాయి. ఇక్కడున్న సాటి దేవుళ్ళకి దిక్కులేదు. కొందరు దేవుళ్ళు అమెరికాలో బ్రాంచి పెట్టుకున్నారు. టోక్యో వైష్ణవాలయాలు వెల్లకి నోచుకోలేదు; వెస్ట్ జర్మనీలో వైష్ణవ సంస్కృతికి విరాళాలు సేకరిస్తున్నారు. ఇంత అరాజకం ఎక్కడా ఉండదు. జరుగుబాటుకీ లేదు; తిరుగుబాటుకీ వీల్లేదు. అందుకే ఈ సభ ఏర్పాటయింది. కొందరు మహిమల్ని సైతం గుత్తకి పుచ్చుకున్నారు. ప్రచార సాధనాల్ని కూడా ఏ కొద్ది దేవుళ్ళో తమ ప్రక్కని పెట్టుకున్నారు. ఎక్కడ చూసినా వీరి మహిమలే - ఎక్కడ చూసినా వీరి ఫోటోలే - ఎద్దుకాడికీ ఉంగరం వేలికీ వీరి ఫోటోయే. ఇంత గుత్త దేవాధిపత్యం ఎక్కడా వినలేదు. అందుకే ఈ సభ'' అంటూ మాట్లాడ సాగాడు.

కొందరు కొన్ని కరపత్రాలు వెదజల్లారు. "ఈ అన్యాయాన్ని అరికట్టండి. వేద పండితుల్నీ వ్యాపారస్తుల్నీ టోకునా చిల్లరనా కొనేస్తున్నారు. సంగీత సభల్నీ సత్తు కర్మాగారాల్నీ కొనేశారు. సంతల్నీ సంతర్పణల్నీ తమ పేరుతో తాళి కట్టారు. భయ పెట్టారు. కల్లో కరపడ్డారు. సామదానాదులు ఉపయోగించారు. సోమ పానాదులకు సైతం తమ పేరు వాడుకోనిచ్చారు. పేరు కోసం పేరున్న దేవతలే ఇలా ప్రాపులాడతారని ఎన్నడూ అనుకోలేదు.

పాదుకలు తాకట్టు పెడితేకాని కొందరికి రోజు గడవడం లేదు. పసిడి కిరీటాలు పెట్టుకుని కొందరు ఊరేగుతున్నారు. ఈ అసహనత్వం ఆట్టే కాలం భరించలేం. ఉన్న దేవుళ్ళు లేని దేవుళ్ళను ఆదుకోవాలి. కలిగినవాడు లేనివాడికి గోపురం కట్టించాలి. సాటి దేవుళ్ళ సేవే తన సేవ అనుకోవాలి. లేని దేవుళ్ళ కళ్యాణమే తన నిత్య విధి అనుకోవాలి. ఈ సామాజిక మార్పు గమనించక

పోతే ఊహించని విప్లవం ఉప్పెనగా వచ్చేస్తుంది" అని చిల్లర దేవుళ్ళ సంఘం, విప్లవ సంఘం, బెదిరించింది కర పత్రాలలో.

సాటి మేటి దేవుళ్ళతో కలిసి ఓ మహా మేటి దేవుడు ఈ చిల్లర దేవుళ్ళ సభని విఫలం చేయడానికి ప్రయత్నించి ఓరుకున్నాడని నాకు ఒక విదేశీ విలేఖరి చెప్పాడు. ఏ పుట్టలో ఏ సెక్యులర్ సోప్రు ఉన్నదో అని ఓరుకున్నాను.

సభలో చేసిన తీర్మానాల కాపీ, కొంత ప్రసాదం సాయంకాలానికి మేము బసచేసిన గదిలోకి వచ్చాయి. ప్రసాదాలు సేవించి తీర్మానాలు చదువుకున్నాం.

సాలుకి పది లక్షల రూపాయల పైబడి ఆదాయం ఉన్న ప్రతి మహా దేవుడూ, శివుడుతో సైతం గ్రామ దేవతలకి భరణంగా లక్ష రూపాయలు చెల్లించాలి.

దేశం నలు మూలలా చిన్నా చితకా దేవుళ్ళందరికీ నిత్య దీపారాధన జరిగే విధంగా ఒక దేవారాధన సంస్థ దీపాలకు లోబడి ప్రసాదాలకు మించకుండా పని చెయ్యాలి. ప్రతి గుడికీ గోపురం కట్టించడానికీ, కట్టించిన గోపురం నిలబడడానికీ నిలకడ స్థాయీ సంఘం ఏర్పరచాలి. ప్రతి రోజూ హుండీలో పడ్డే ఆదాయంలో నూటికి ఏభై పంతులు చిల్లర దేవుళ్ళ హుండీకి జమ చెయ్యాలి.

ప్రసాదం ధర ఏక పక్షంగా పెంచకూడదు. పెంచిన ధరలో 25 శాతం చిల్లర దేవుళ్ళకి అర్పించాలి.

ప్రతి చోటా రథోత్సవాలు జరిగితేనే కాని బ్రహ్మోత్సవాలు జరగడానికి వీలులేదు.

నగలూ బంగారు వస్తువులూ చేయించుకొనే ముందు చిల్లర దేవుళ్ళ అనుమతి పొందాలి. వేద పాఠశాలలు వికేంద్రీకరణ జరపాలి.

సంస్కృత విశ్వ విద్యాలయంలోని విభాగాలు చిల్లర దేవుళ్ళ పీఠాలకు తరలించాలి. రెండు గోవింద నామాలతో కాని, రెండు నమో వెంకటేశ నినాదాలతో గాని ఒక చిల్లర దేవుని పేరు విధిగా జపించాలి. అలాగే ప్రతి అయిదు నామాలకీ గ్రామదేవత పేరు కూడా జత పరచి జపించాలి.

మహా దేవుళ్ళ మహిమలు చూపే పటాలతో బాటు చిల్లరదేవుళ్ళ మహిమలు చూపే పటాలు కూడా విధిగా ప్రదర్శించాలి. గోవిందా! గోవిందా! సఖిలేశ్వరా!

ఏడుకొండలవాడా! వడ్డీకాసులవాడా! వెంకటేశా! వెంకట రమణా! గోవిందా! నూకాలమ్మా!

[వినాయకుడి విన్యాసాలు]

వార్ధక్యానికి సార్థకం

శ్రీ పుచ్చా పూర్ణానందం

వృద్ధుడు అనగా ఎవరు? మాజీ యువకుడు. కాగి చల్లారిన పాలు. జీవితంలో ధక్కామొక్కీలు తిన్నవాడు. లోకంపోకడ చూచినవాడు. అనేక యుద్ధములల్లో ఆరియుతేరిన వృద్ధమూర్తి, సరసుడు, రసికుడు, అనుభవశాలి. అరక దున్ని పొలిమేరలో కేకేస్తే ఇంటివద్ద జనం హడలు. మద్రాసులో బయలుదేరితే పలాసాలో అత్తారింట్లో నేలకంపించేది! 'అదుగో ద్వారక' అని కంఠమెత్తితే హాలు రేకులు ఊడి గాలికి కొట్టుకు పోయేవి. ఇంటర్ స్పోర్ట్సులో మైలు రేసులో పరుగెత్తిన క్రీడాకారుడు. పాటవం తప్పేసరికి నడుస్తూ నడుస్తూ మొగ్గలు వేస్తున్నాడు. ఎవరూ తోయకుండానే తొంభైచోట్ల పడుతున్నాడు. నేడు అవయవాలన్నీ ఏకపక్షమై స్ట్రైక్ చేస్తున్నాయి. ఎపరన్నా నవ్వితే ముసళ్ళకు పౌరుషం పొడుచుకువచ్చి "బ్రహ్మాండమైన కౌరవ సైన్యానికి ఫస్ట్ కమాండర్ ఇన్ చీఫ్ ఎవరు? భీష్మాచార్యులు. యుద్ధసమయంలో బ్రిటిష్ ఎంపైర్‌కు ప్రైమ్ మినిష్టరు ఎవరు? ముసలి విన్‌స్టన్ చర్చిల్. ఆంధ్రాకు ప్రథమ ముఖ్యమంత్రి ఎవరు? ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు. విశ్వవిఖ్యాత ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య సెంచరీకొట్టి అధిగమించాడు. ప్రముఖ మేధావులు ఐన్‌స్టీన్, రస్సెల్ సహస్ర మాసజీవులు. మాలో కొందరు సజీవ నిఘంటువులు- సంచార విజ్ఞాన సర్వస్వాలు- రెడీ రిఫరెన్సర్లు కలరు. ఓల్డ్ ఈజ్ గోల్డు! వృద్ధుల వాల్యూ బంగారంతో పోల్చారు. గ్రేహేర్ మస్ట్ బి రెస్పెక్టెడ్-వెండి జుట్టును గౌరవించాలి"- సంతోషమే- మరి రోల్డుగోల్డు కాకిబంగారము, ఛలామణీలో ఉన్నాయిగా... రెల్లుపుష్పాల్లాంటి జుట్టుకు కొందరు నల్లరంగు పులుముతున్నారుగా ? దేశాటనానికి, దైవధ్యానానికి, దేహదార్ఢ్యత ఉండాలి. అందుకే మధురకవి ధూర్జటి ఏమని శెలవిచ్చాడంటే.....

దంతంబుల్ సడనప్పుడే తనువునందారూఢి యున్నప్పుడే
కాంతాసంఘము రోయనప్పుడె జరా క్రాంతంబు గానప్పుడే
వింతల్ మేన జరింపనప్పుడె కురుల్ వెల్వెల్లగానప్పుడే
చింతింపన్వలె నీ పదాంబుజములన్ శ్రీ కాళహస్తీశ్వరా ॥

వార్ధక్యం వచ్చేసరికి దక్షిణపు గదిసుంచి షిఫ్టు. అడ్రస్ కేరాఫ్ వరండాస్. పెద్దలమాటలు చద్దిమూటలు. పెద్ద తలకాయ లేకపోతే గొట్టె తలకాయ పెట్టమన్నారు. ఇంటికి పెద్దదిక్కు ఉంటే దొంగ భయంలేదు. తాలూకా గంటలు, రైలు కూతలు, మార్కెట్ సైరనులు, లారీల హారన్లు, గూర్ఖా కేకలు వింటూ మసులుతూనే ఉంటారు. ఆల్సేషియన్ డాగ్ కావాలా అని ఒకాయనని అడిగితే, నిక్షేపం లాంటి వృద్ధ సింహం మా తాతగారుండగా గ్రామ సింహం ఎందుకన్నాడు.

శైశవేభ్యస్త విద్యానామ్ యౌవనే విషయేషిణాం
వార్ధకే మునివృత్తీనాం యోగేనాన్తే తనుత్యజామ్.

మనిషియొక్క సప్తదశలూ షేక్స్పియర్ కేవలం వర్ణించాడే కాని కర్తవ్యం బోధించలేదు. వృద్ధాప్యం- ద్వితీయ బాల్యం అన్నాడు. జగన్నాటక రంగం మీద నీ పార్ట్ కాగానే నిష్క్రమిస్తావు అన్నాడు. కాళిదాసేమో ఓల్డు పీపుల్‌కి ముని వృత్తి రికమెండ్ చేశాడు.

ముసలితనం బాధాకరం అంటారు కొందరు. ఏతనమేనా అంతే, ఆలోచిస్తే.

"జన్మదుఃఖం, జరాదుఃఖం, జాయాదుఃఖం పునఃపునఃసంసారసాగరందుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రత."

అని జ్ఞానులు కూడాతెగేసి చెప్పారు.

కాలం నాడు భూమ్మీద ఆగాడా? రేపన్న రోజు తెలుసా? కుప్ప తగల బెట్టుకుని పేలాలు వేయించు కుంటే, మరి ఏమౌతుంది? చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవా అని ఇంట్లోవాళ్ళే దెప్పిళ్ళు; బయటవాళ్ళ హేళన. ఆఫీసు

నుంచి ఇంటికి వస్తే లోపల జేబులో కరెన్సీ, వెలుపలి జెబులో కాయిన్సూ, సైడ్‌పోక్‌ట్‌లో చిల్లర డబ్బులు- అడుగులకి మడుగు లొ త్తేవారు - కోడళ్ళు కాళ్ళకి సీళ్ళు, కూతుళ్ళు తుండుగుడ్డలు, పెళ్ళాం పలహార ప్పళ్ళెంతో ప్రత్యక్షం. పైరు రిపైరయ్యాక ''ఇదిగో ముసలాయనా ! ఎందుకయ్యా ప్రతిదాంట్లో కల్పించుకుంటావు? కృష్ణా రామా అంటూ ఓ మూల పడి ఉండరాదూ? కొ త్తవాడె వడైనా ఇంటికి రాగానే పేరు, ఊరు, ప్రపర అడిగి, పెళ్ళెందుకు చేసుకోలేదు ? చేసుకుని ఉంటే పిల్లలా? లేరంటే సంతానం ఎందుకు పుట్టలేదు? వెనకటికాలంలో గ్రామరు గట్టి; స్పెల్లింగ్ స్ట్రాంగ్; అన్నీ భట్టిమం. క్రికెట్ కంటే బిళ్ళంగోడు, బిలియర్డ్స్ కంటే గోళీలు థ్రిల్లింగ్; బోయర్ వార్, జర్మన్ యుద్ధాలు, బందరు తుఫాను చూశావు. బి. సి. నాటి చెత్త కబుర్లెందుకు; సోది. జట్కారోజులు కావివి. జెట్ యుగం. నీ బోరంతా వింటానికి నో టైమ్...'' అని మాటలు పడ కూడదు. మౌనం పాటిస్తే పెద్దరికం నిలబడుతుంది. కాలంతోపాటు మారాలి. అయినా నీవు నాటి హీరోవి. నేటి జీరోవి.

తాతల్నిపసి పిల్లలు లాగ చూసుకోవాలి. భావి పౌరులు పాత పౌరులకు గార్డియన్లు. వీళ్ళు వాళ్ళకు గైడ్లు, స్నేహితులు, వేదాంత బోధకులు. ముసళ్ళు చలికి ఆకలికి తట్టుకోలేరు. మొదటిముద్ద వాళ్ళకి- అనే భావన ప్రదర్శిస్తే బోసి నోటితో వరహాల నవ్వులు కుమ్మరిస్తారు. అల్పసంతోషులు. కుడుము చేతికిస్తే పండగ. వాళ్ళు నవ్వితే జయం. దుఃఖిస్తే ఉసురు కొడుతుంది. తాతకిచ్చిన చిప్పే తరతరాన. బివేర్ ! తల్లిపండ్రులే ప్రత్యక్ష దైవాలు. అయితే కొందరు పెడకట్టెలు, పెంకిఘటాలు ఉంటారు. నలుగురిలో ఇమడలేరు. సంతానమే వాళ్ళని కనికరంతో కనిపెట్టి ఉండాలి. తాను హర్టక హర్టింపబడక ఎస్కేపయి తిరుగు వాడు ఎక్స్‌పర్ట్ సుమతీ- అన్నట్లు లౌక్యులకు రోజులు బాగానే వెళతాయి. ముసళ్ళకూ చిల్లర ఖర్చులుంటాయి- నశ్యానికో, చుట్టముక్కకో. నిన్నటి దాకా ఆర్జనపరులుగా? నోరు తెరచి అడగలేరు. కుటుంబ నిర్వాహకులు గ్రహించాలి. వీలినామా సీల్డు కవరులో పెడితే అందరూ ఉపచారం చేస్తారు. చంతులు పోయి

మాచ్చరు. మాతాపితరులసేవకు ధర్మవ్యాధుడు, నారాయణుడు, సత్యవంతుడు ఆదర్శ మూర్తులు. అలాంటి పుత్రరత్నాలుంటే వృద్ధాప్యంలో ఏ సమస్యాలేదు. వాళ్ళ నేగతీ పట్టించకూడదు కన్నబిడ్డలుండి.

ప్రతి వాడికీ శతమానం బ్రతకాలని కోరిక. తనభార్యమీద కూడా ఆ భారంవేస్తాడు కంఠ సూత్రం బిగిస్తూ. ''మాంగల్యం తంతునానేన మమజీవన హేతునా కంఠం బధ్నామి శుభగేత్వమ్ జీవశరదిశ్శతమ్'' అంటాడు. నూరేళ్ళు కోరుకున్నా, చావు నిక్కంబు బ్రతుకు బ్రతుకుట సంశయంబు.

ఉడుముండదె నూరేండ్లును, బడియుండదె బేర్మి బాము పదినూరేండ్లున్, మడువున గొక్కెర యుండదె, కడునిల పురుషార్థపరుడుగావలె సుమతీ. అది ముఖ్యం కాని, కొందరు భూమ్మీద పర్మనెంట్‌గా తిష్ఠవేద్దామని. అశ్వత్థామ, బలి ర్వ్యాసో, హనుమాంచ, విభీషణః, కృపః, పరశురామశ్చ, మార్కండేయ దాష్టకమ్, జీవద్వర్షశతం, అపమృత్యు వివర్జితః అంటూ దినదినమూ స్మరిస్తారు. నాలుగు యుగాలమీదా ఆ ఎనిమిదిమంది మహానుభావులు చిరంజీవులు. ఎక్కడో ముక్కుమూసుకుని వాళ్ళ తంటాలు వాళ్ళు పడుతూ ఉంటారు. ఆయుఃపరిమితి ద్వాపరంలో వెయ్యి, త్రేతా యుగంలో పదివేలూ ఉన్నా, కలియుగంలో బ్రహ్మ శాంక్షను చేసింది నూరేళ్ళు మాత్రమే సుమా !

కొందరికి యౌవనం మీద మోజు పోదు. కాయకల్ప చికిత్స చేయించు కుంటారు. మల్టీ విటమిన్ టాబ్లెట్లు మణుగులకొద్దీ తింటారు. కాని దాని దుంప తెంచ, యౌవనం తిరగ బెట్టదు. చ్యవనుడికి అశ్వనీ దేవతలు చ్యవనప్రాశతో వృద్ధాప్యం పోగొట్టారంటే ఆ మెడికల్ సైన్సు వేరు. పెట్టుడు పళ్ళు, తోప జుట్టు, అట్టలమర్చిన చెస్టు, ఎన్నిస్పేరు పార్ట్సు వేసినా అతుకు అతుకే. ఒరిజినల్ మిషన్ అవుతుందా? లోగడ ఒక్క సిట్టింగ్‌లో అరవై అరిశలు బాదావు. వయసు మళ్ళింది. తత్త్వం ఫీలాయించింది. ఏమందూ జవాబివ్వదు. పైగా వస్తుగుణదీపిక పల్లెవెయ్యడం ఒకటి. పంచాయవేడి, బెంకాయ దగ్గు, దోస కోత, సొర శైత్యం

ఐచ్ఛలివాతం, చిక్కుడుపైత్యం, కాకర అతికాక, కారం హానికరం- అన్నిట్లోనూ కఠిన పత్యం. వయసు ముసలి ఎద్దు-మనసు కోడెదూడ అయితే ఎలా ? సమ గతిలో నడవాలి.

రిటైరయితే తోచి చావదు. అన్నీ ఆదివారాలే. కాలం గడవదు అని కొంద రంటారు. లక్షణంగా చదువుకోవచ్చు. భరద్వాజుడు చదువు కోసం రెండుసార్లు జీవితం పొడిగించుకున్నాడు. ఏక ఘంటాన ఆంగ్ల నిఘంటువు కూర్చిన జాన్సన్ పండితుడు చూపుబాగా ఉండగా కొన్ని గ్రంథాలు చదవక పోతినే అని విల పించాడు. అన్నీ తెలుసు అనుకున్న వారు స్వీయ చరిత్ర వ్రాయవచ్చు. లేదా గీతకు సరిక్రొత్త టీక ఇవ్వవచ్చు. మంచి హాబీలు ఉంటే వృద్ధాప్యం హాయిగా గడుస్తుంది. స్వర్గీయ విశ్వనాథ ఎనభయ్యో యేట సంగీతం చెప్పుకున్నాడు.

లేదా నలుగురి తోటివాళ్ళు ఒకచోట చేరి పాతస్మృతులు నెమరు వేసు కోవచ్చు. తగుమోతాదుల్లో ఆత్మస్తుతి పరనింద చెయ్యవచ్చు- లేదా కర్రపోటి వేసుకుని చాంద్రాయణం చెయ్యవచ్చు, వయస్సు అడక్కూడదు. చెప్పకూడదు... గోప్యం... 'ఆయుర్విత్తం గృహచ్ఛిద్రం మంత్ర మౌషధం సంగమం దానం అవమానావయోగీ'- ఇవన్నీ గుప్తంగా ఉంచాలి. అందుకే కొందరు తమ దెబ్బయ్యో ఏట షష్టిపూర్తి జరుపుకుంటారు. స్త్రీలను వయస్సు అసలు అడ్డకూడదు. బేడ్ మేనర్స్.

'కాశ్యాం మరణాన్ముక్తిః అధవాపుత్రసన్నిధౌ'. దశరథుడు ఆ అదృష్టా నికి నోచుకోలేదు. అంచేత తెలివైన ఈ కాలపువాళ్ళు ఒక కొడుకుని అమెరికాకు, ఇంకోణ్ణి ఆస్ట్రేలియాకు, మరోణ్ణి ఆఫ్రికాకు పంపి, ఒక్కకుమారుడినయినా ఇంటి వద్ద ఉంచుకుంటారు తల కొరివి పెట్టడానికి.

ఒకాయన్ని "మీ వాళ్ళంతా గాంధీగారి ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొ న్నారు కదా- మీరు చేరలేదేమిటి?" అంటే, జైల్లో భోజన వసతి సరిగా ఉండ

దన్నాడు. 'సన్యాసం స్వీకరిస్తారా' అంటే, ఇంకా టైము ఉంది; అయినా సన్యాసానికి కాలదోషం లేదు. అదీకాక భిక్షలు కరువైనాయి. మరిన్నీ తనకింకా మిరపకాయ బజ్జీల మీద భ్రాంతి పోలేదన్నాడు. నాలుగు ఆశ్రమాలూ ఇంట్లోనే పోదూ అన్నాడు. ఎవరైనా వేళాకోళానికి 'తాతా, పెళ్ళి చేసుకుంటావా' అంటే, 'నాకిచ్చే చవట ఎవడ్రా' అంటాడు కాని, 'వృద్ధస్య తరుణీ విషం' అని తెలుసుకోడు. 'తాతా' అనే పదం తన హృదయానికి అంపపు కోత అంటాడు.

వృద్ధులకు నవ్వోపాసన దివ్యౌషధం. సర్వాన్నీ నవ్వెయ్యగల వాడే మానవుడు. లార్డు మౌంట్ బాటన్ అన్నాడు ''జీవితంలో ఉండే మాధుర్యాన్ని అంతా అనుభవించాను; ఇహ మరణంలో ఉండే మాధుర్యాన్ని రుచి చూడాలి. నా అంత్యక్రియలు జోరుగా జరగాలి. వాటికి నేను స్వయంగా హాజరు కాలేను కదా అన్న విచార మొక్కటే. నాకు తెలిసిన మహామాయగాణ్ణి నేనే''. యోగిలాగ శలవిచ్చాడు ఆ పెద్దమనిషి. బ్రిటిష్ సామ్రాజ్యంలో పూర్వపు ప్రధాన మంత్రి 'పిట్' నామధేయుడు చాలా ఉత్తముడు. చావగానే సరాసరి స్వర్గంలోకి ప్రవేశించ బోయాడు. గేట్ కీపరు అటకాయించి అర్హత లేమిటో చెప్పమన్నాడు. త్యాగుడు, ఔదారం, వ్యభిచారం, లంచగొండితనం చేయలేదని జవాబిచ్చాడు. అప్పుడా గేటు కీపరు 'నీవు ఏమి చేయలేదో కాదయ్యా మాకు కావలసింది. నీవు ప్రపంచానికి ఏమి చేశావు' అని తిరిగి ప్రశ్నించాడు. కనుక జీవితం కొలతడ్యూతే షన్ కాదు, డొనేషన్. మూడు డాక్టరేట్లు పొందాలి. Dr. Diet; Dr. Quiet; Dr. Piet.

మానవుడు గోచీ లేకుండా పుడతాడు. అడ్రస్ చెప్పకుండా పోతాడు. పొద్దు వాటిల్లి అస్తమయం సమీపిస్తూన్న వృద్ధుడు కోరికలని నరికేసి నిరాశా దురాశలను పారద్రోలి, ఈర్ష్యాకుత్సితాలను పాతేసి, మౌనం పాటిస్తూ సాక్షీభూతంగా చూస్తూ, అహం నెత్తిన మొట్టికాయలు వేస్తూ, ఉత్తమాశయం కోసమే జీవిస్తూ ఉంటే ప్రాబ్లమ్ సాల్వ్‌డు- సమస్యలు ఏమీ ఉండవు- బరువు బాధ్యతలు ఏమీ ఉండవు- బరువు బాధ్యతలు పదలుకోవాలి. Less luggage - more comfort.

సామానులు తగ్గించుకుంటే సుఖప్రయాణం.
కవి చౌడప్ప చిన్న ఛందంలో అందంగా చెప్పాడు,

తన సతి యిడగా మనుమలు
తనయులు తల్లిదండ్రు లన్నదమ్ముల్ బంధుల్
దినదినమును భుజియించుట
ఘన విభవము కుందవరపు కవి చౌడప్పా.

వార్ధక్యానికి సార్థకం అంతకంటే ఏం కావాలి?

[ఆకాశవాణి ప్రసారితం - వాణి, మార్చి 1981 సంచిక]

హాస్యరసం:

హాస్య మివ్వగలదు ఆయురారోగ్యముల్
ఎడదవగల బిగువు సడలజేసి;
క్షణములోన పొందు సద్యఃపర సమాధి
యోగియగుచు నవ్వుచున్నవాడు-

ఆత్మనిష్ఠమైన అవహేళనము కంటె
జీవ చిహ్నమేది? సృష్టియందు?
అన్ని రోగములకు అమృతౌషధము - నవ్వు
అంతరంగమునకు ఆటవిడుపు

సానుభూతిగలిగి సంస్కరింపగ గోరి
వేడి కంటినీరు వెనుకదాచి
హాస్యమాడవచ్చు అనురాగమున్నచో
విసము గ్రక్కరాదు వెక్కిరించి

జగతి మిథ్యగాక సత్యమైనను గూడ
ఏడ్వదగినదేది? యెచటగలదు?
వికట లోకమందు సుకుమార హాస్యమే
గుండె పండినట్లు గొప్ప గుర్తు

మెరపు తీగ్రతాడు మిరుమిట్లు కవ్వంబు
పెరుగుగాదు! కవిత నురుగు గాదు
హాస్యరసముతోడ అమృతమ్ము కురియగా
రాజయోగు లగుడు రసికులార!

-ప్రగతిగీత-

డా॥ నండూరి రామకృష్ణమాచార్య.

సూచిక:-

వరుస సంఖ్య	రచయిత	రచన	మొదట ప్రకటించిన పత్రిక లేక గ్రంథము	చిరునామా	పుట
1.	పశువుల సంత - స్వప్నము	శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావు	ఆంధ్రపత్రిక	—కీర్తిశేషులు	
2.	భామనే సత్యభామనే	శ్రీ దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి	కళాసాగర్ వార్షికో త్సవ సంచిక 1977	—కీర్తిశేషులు కు॥ బుజ్జాయిగారు 4 జగదంబాస్ట్రీట్ Madras-17	
3.	సిసింద్రీ పత్రిక	శ్రీ నందివాడ చిదంబరం	భారతి-అక్టోబరు-1980	— ?	
4.	రంగస్థలంపై సమయస్ఫూర్తి	శ్రీ స్థానం నరసింహారావు	కృష్ణాపత్రిక-వజ్రోత్సవ సంచిక	—కీర్తిశేషులు	
5.	బలరామయ్యగారి ఇంగ్లీషు తమ్ముడు	శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు	మాటపరస 21-1-1931	—కీర్తిశేషులు కు॥ రాధాకృష్ణగారు 8-సరోజినిస్ట్రీట్ Madras-17	
6.	ప్రౌఢ సరస్వతి కుమారస్వామి	శ్రీ సురవరము ప్రతాపరెడ్డి	గోలకొండ పత్రిక 30-7-1984	—కీర్తిశేషులు	

వరుస సంఖ్య	ర చ యి త	ర చ న	మొదట ప్రకటించిన పత్రిక లేక గ్రంథము	చి రు నా మా	పుట
7.	వారాంగనా వీరాంగణము	శ్రీ చిదిరెమఠము వీరభద్రశర్మ	నీలగిరి 23-9-1926	—కీర్తిశేషులు	
8.	యశోవిమానం	శ్రీ విశ్వామిత్రుడు	గోలకొండ పత్రిక 17-2-1936	—	?
9.	నాకా షష్టిపూర్తి!	శ్రీ భోగరాజు పట్టాభిసీతారామయ్య	కృష్ణాపత్రిక 10-2-1940	—కీర్తిశేషులు	
10.	పన్నీటి జల్లు	? ? ?	కృష్ణాపత్రిక 14-2-1964	—	?
11.	ధనార్జనకి దగ్గరమార్గం	శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రి	బారిష్టర్‌గారి బాతాఖానీ	—కీర్తిశేషులు కు॥ సుబ్బారాయుడు గారు, ప్రిన్సిపాల్ A.M.A.M. College, Anakapalli	
12.	సాహిత్య రచన	శ్రీ కె.కె.రావు (శ్రీ కొడవటిగంటి?)	ఆంధ్రజ్యోతి మాసపత్రిక ఫిబ్రవరి 1946	—కీర్తిశేషులు	
13.	హాస్య రచనలో సాధకబాధకాలు	శ్రీ నిరంజన్	భారతి-మార్చి-1948	—	?
14.	యంత్రా స్పెషల్స్!	శ్రీ శిల్పశ్రీ	ఆనందవాణి 17-12-1950	—	?

15.	ఉపాధ్యాయ ఉవాచ !	శ్రీ మునిమాణిక్యం నరసింహారావు	ఉపాధ్యాయుడు గ్రంథం నుంచి	—కీ శేషులు wife M. కాంతం గారు, 5-9-807 గన్‌ఫౌండ్రి-Hyd-1
16.	బ్రహ్మచారీ లిమిటెడ్	శ్రీ బృహస్పతి	తెలుగు స్వతంత్ర 17-6-1949	— ?
17.	కృష్ణాపత్రికా దర్బార్	శ్రీ చెఱుకువాడ వెంకటనరసింహం	కృష్ణాపత్రిక-వజ్రోత్సవ సంచిక	—కీ శేషులు
18.	న్యూ సిలబస్	శ్రీ దేవరకొండ బాలగంగాధరతిలక్	ఆనందవాణి-తిలక్ సంచిక	—కీ శేషులు
19.	తుమ్మెదా ఒకసారి...	శ్రీ తురగా కృష్ణమోహనరావు	ఆంధ్రసచిత్రవారపత్రిక ఆగస్టు 1955	—కీ శేషులు w/ శ్రీమతి తురగా జానకీరాణీ, A.I.R. Hyd.
20,	నదీజలములు	శ్రీ అనంతం	ఆంధ్రప్రభ 8-11-1961	—శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య 15/16 Third Line Brodipet, Guntur-2

వరుస సంఖ్య	రచయిత	రచన	మొదట ప్రకటించిన పత్రిక లేక గ్రంథము	చిరునామా పుట
21.	అమ్మకడుపు చల్లగా అత్తకడుపు చల్లగా	శ్రీమతి పురాణం సీత	ఆంధ్రజ్యోతి వారపత్రిక	c/o శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ Editor:ఆంధ్రజ్యోతి weekly, vijaya-wada-10
22.	అచ్చు కండూతి	శ్రీ గో(పా)ల చక్రవర్తి	ఆంధ్రజ్యోతి 27-2-1972	శ్రీ N.V.గోపాలశాస్త్రి 1 J.3 Irramanzil colony, Hyd-4
23.	పతి దేవుడూ-పని మనిషీ	శ్రీ పోలాప్రగడ సత్యనారాయణమూర్తి	విజయ-1977	6, Municipal St. Bapatla-522101
24.	పనిలేని న్యాయవాది	శ్రీ ఒ. సీతారామచంద్రరావు	సుజాత - సెప్టెంబరు 1929	— ?
25.	ఓటు దండకము	గోలకొండ పత్రిక సంపాదకులు	గోలకొండపత్రిక 24-5-1934	— ?

26.	పేరులు - చారులు	శ్రీమతి నందగిరి ఇందిరాదేవి	ఆకాశవాణి-Hyd. 24-5-1934	126-A, East Maredupalli Sec-26
27.	వదల వలసిన తెలుగుతనం	శ్రీ సోమంచి యజ్ఞన్న శాస్త్రి	ఆకాశవాణి-1972	42—A, Presidency Co-op Society Road 8, J.V.D. Scheme Bombay-49.
23.	బాబోయ్ ! వైజాగ్ సిటీ బస్సులు	శ్రీ వీరాజీ	ఆంధ్ర సచిత్ర వార పత్రిక-ఏప్రిల్ 1978.	C/o ఆంధ్ర పత్రిక విజయవాడ-3
29.	వింతలూ వికారాలూ	శ్రీ రావికొండల రావు	కళాసాగర్ వార్షికోత్సవ సంచిక-1977	C/o Vanitha (Monthly) Madras-26.
30.	హలో ఓ హైవుందా ?	శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ	ఋతానందలహరి	-1, C- C. P. Ramasway Iyer Road, Madras-18

వరుస సంఖ్య	రచయిత	రచన	మొదట ప్రకటించిన పత్రిక లేక గ్రంథము	చిరునామా
31.	ఎక్కడ? నటరాజెక్కడ?	శ్రీ ఆదివిష్ణు	కళాసాగర్ వార్షికోత్సవ సంచిక-1977	Personnel Officer A.P.S R.T.C Musheerabad, Hyd.
32.	వాపూ ఒక బలుపే	డా॥ పోరంకి దక్షిణామూర్తి	ఆంధ్రప్రభ డైలీ 15-12-1977	Researeh Officer Telugu Akademi Himayatnagar Hyd-29
33.	ముడిపడని పేర్లు	శ్రీ నీలా జంగయ్య	ఆంధ్రప్రభ	శ్రీ నీలా జంగయ్య M. O. L. Research Asst. Telugu Akademi Hyd-29
34.	పాపం...మగవాళ్ళు	శ్రీమతి పోలాప్రగడ రాజ్యలక్ష్మి	ఆకాశవాణి	6, Municipal St. Ranatla-522101

35.	బడ్జెట్ ప్రతిపాదన	శ్రీ గొల్లపూడి మారుతీరావు	కళాసాగర్ వార్షికోత్సవ సంచిక 1977	A.I.R. కడప
36.	ప్రముఖుల ప్రేమలేఖలు	శ్రీ శ్రీరమణ	శ్రీ రమణ పేరడీలు	C/o ఆంధ్రజ్యోతి విజయవాడ-10
37.	చలవ మిరియాలు	రేడియో	30 సం॥ నాటి కృష్ణాపత్రిక	—
38.	కొత్త నాటకం	శ్రీ తంబు	ఆంధ్రజ్యోతి వీక్లీ 4-5-1979	C/o. Medical Officer Andhra University Visakhapatnam-3
39.	చిల్లర దేవుళ్ళ సభ	శ్రీ పన్నాల సుబ్రహ్మణ్యభట్టు	వినాయకుడి విన్యాసాలు	A. I. R. Vijayawada
40.	వార్థక్యానికి సార్థకం	శ్రీ పుచ్చా పూర్ణానందం	వాణి-మార్చి 1981	Advocate Ramarajyanagar Vijayawada-12

వరుస సంఖ్య	రచయిత	రచన	మొదట ప్రకటించిన పత్రిక లేక గ్రంథము	చిరునామా పుట
41.	హాస్యరసం	డా॥ నండూరి రామకృష్ణమాచార్య	ప్రగతిగీత	-Dr. N.V.R. Krishnamachary కపిలతీర్థం రోడ్డు Tirupathi.

BLANK PAGE

Check List

Book Number	CP03107	Date	24.6.20
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	1, 268, 269		
Missing Pages	NO		
Prepared	Srivastava	Scanned	JEEVA
PS		Pages	~~304~~ 305

BOOK SIZE:-

H: 8.2

W: 5.5